సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 25

గురువారం 17-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '



ఢిల్లీ 'సూపర్' విక్టరీ

'సూపర్ ఓవర్'లో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ -14లో



పసిడి మరో కొత్త రికార్డు

రూ.98,100 స్థాయికి
ఒకే రోజు రూ.1,650 ర్యాలీ -15లో



చైనాపై సుంకాలు 245 శాతం

అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం భీకరంగా మారుతోంది. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను అమెరికా 245 శాతానికి పెంచింది.

వివరాలు 6లో ▸



స్టైపెండ్‌తోపాటు విమాన టికెట్

'సెల్ఫ్-డిపోర్ట్' ఆప్షన్ ఎంచుకునే వారికి విమాన టికెట్లతోపాటు డబ్బివ్వాలని యోచిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు.

వివరాలు 6లో ▸



ఏటీఎం ఆన్ వీల్స్

దేశంలోనే మొదటిసారిగా ఏటీఎం సౌకర్యం కలిగిన రైలుగా ముంబై-మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్ చరిత్ర సృష్టించింది.

వివరాలు 6లో ▸



అల్లర్ల కుట్రలో కేంద్ర సంస్థలు

వక్ఫ్ (సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్‌లో జరిగిన ఘర్షణల వెనుక కేంద్ర నిఘా వర్గాల హస్తముందని సీఎం మమతా బెనర్జీ అన్నారు.

వివరాలు 6లో ▸



నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్

- కేంద్ర న్యాయ శాఖకు సిఫార్సు చేసిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా
- వచ్చేనెల 14న 52వ సీజేఐగా ప్రమాణ స్వీకారం చేయనున్న జస్టిస్ గవాయ్
- రెండో దళిత ప్రధాన న్యాయమూర్తిగా రికార్డుకెక్కనున్న కొత్త సీజేఐ
- బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్, కంచ గచ్చిబౌలి భూముల కేసును విచారిస్తున్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం

6 లో

'కంచ'లోనే లోపలేస్తాం!

కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతకు అనుమతులు తీసుకున్నారా? లేదా?

ఒకవేళ తీసుకోకుంటే అక్కడే తాత్కాలిక జైలుకట్టి అధికారులను 6 నెలలు జైలుకు పంపుతాం



- ఈ కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం
- 1996 నాటి తమ తీర్పునకు భిన్నంగా ప్రవర్తించిన అధికారులంతా బాధ్యులవుతారని హెచ్చరిక
- సీఎస్‌ను తీవ్ర చర్యల నుంచి కాపాడాలనుకుంటే పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని ఆదేశం
- ఫేక్ వీడియోలు సర్క్యులేట్ చేశారన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం
- వందలకొద్దీ బుల్డోజర్ల వల్ల జంతువులు భయభ్రాంతులకు గురయ్యాయని వెల్లడి
- పరుగులు తీసిన వాటిని కుక్కలు కరిచిన వీడియోలు చూసి చలించిపోయామని వ్యాఖ్య
- భూములపై యథాతథ స్థితి కొనసాగింపు.. తదుపరి విచారణ మే 15కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: 'అభివృద్ధి పేరుతో మూడు రోజుల్లోనే వందల బుల్డోజర్లను ఉపయోగించి 100 ఎకరాల్లో చెట్లను తొలగించారు. చెట్ల నరికివేతను ఏ రకంగానూ సమర్థించుకోవాలని చూడొద్దు. చెట్ల నరికివేతకు అసలు అనుమతులు తీసుకున్నారా లేదా? ఈ ప్రశ్నకు మాకు సూటిగా సమాధానం చెప్పండి. ఒకవేళ అనుమతులు తీసుకోకపోయి ఉంటే మాత్రం అందుకు బాధ్యులైన అధికారులందరినీ జైలుకు పంపుతాం. వారి కోసం అదే ప్రాంతంలో తాత్కాలిక జైలు నిర్మించి మరీ ఊచలు లెక్కబెట్టిస్తాం'అంటూ కంచ గచ్చిబౌలి భూముల కేసులో రాష్ట్ర ప్రభుత్వంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జార్జ్ అగస్టీన్ మసీలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో 1996లో తామిచ్చిన తీర్పునకు విరుద్ధంగా ప్రవర్తించిన అధికారులే బాధ్యులవుతారనే విషయాన్ని మర్చిపోవద్దని హెచ్చరించింది. వంద ఎకరాల్లో అటవీ సంరక్షణ కోసం చట్ట ప్రకారం తీసుకున్న చర్యలేమిటో

మిగతా 2వ పేజీలో ▶

హెచ్‌సీయూ పరిధిలోనే 'కంచ' భూమి

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకు సీఈసీ నివేదిక

- వివరాలు 2లో



కూల్చే కుట్ర కేసీఆర్‌దే

రూ.5-6 వేల కోట్లతో మా ఎమ్మెల్యేలను కొనే ప్లాన్

కేసీఆర్ కుటుంబం ఎన్ని స్కెచ్‌లు వేసినా మా ముందు చెల్లవు

ధరణి చట్టమే బీఆర్ఎస్‌కు ఉరి తాడైంది

మేం బాగా పని చేస్తున్నందుకే మోదీ విమర్శిస్తున్నారు

- ➤ భూభారతి పైలట్ మండలాల్లో నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ➤ మే 1 నుంచి భూ సమస్యల పరిష్కారం
- ➤ జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలు పరిష్కరిస్తాం
- ➤ జీపీవోలు వచ్చిన తర్వాతే సర్వేమ్యాప్ నిబంధన అమలు
- ➤ ఈ ఏడాది చివరికల్లా కొత్త భూభారతి పోర్టల్
- ➤ జూన్ 2న సీఎం చేతుల మీదుగా పేదలకు భూ పట్టాలు

5 లో

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వాటిని వక్ఫ్ ఆస్తులుగా భావిస్తాం

వక్ఫ్ ఆస్తుల్లో కొన్ని దుర్వినియోగమైన మాట వాస్తవమే. దాన్ని సాకుగా చూపి 'వక్ఫ్ బై యూజ్' నిబంధనను తొలగిస్తామంటే కొత్త సమస్యలొస్తాయి. వక్ఫ్ బై యూజర్‌ను కోర్టులు గతంలోనే ధ్రువీకరించాయి. కోర్టు తీర్పులు, నిర్ణయాలను ప్రభుత్వాలు నిర్ణయించకూడదు. మీరు కేవలం ప్రాతిపదికను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. -కేంద్రాన్ని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్య

ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వదలిచాం: సుప్రీంకోర్టు

- గతాన్ని మీరు మార్చలేరు..
- వక్ఫ్ బై యూజర్ నిబంధనను తొలగించలేం..
- ఇప్పుడు జామా మసీదు డాక్యుమెంట్లు తీసుకురమ్మంటే ఎలా?
- హిందూ ట్రస్టుల్లో ముస్లింలను నియమిస్తారా? అంటూ కేంద్రానికి ప్రశ్న
- వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్ల తొలిరోజు విచారణలో సుప్రీం వ్యాఖ్య
- చట్టాన్ని సవాల్‌చేస్తూ పిటిషన్ దాఖలుచేసిన వైఎస్సార్‌సీపీ
- మరో 71 పిటిషన్లూ దాఖలు

2 లో

వాటిని వక్ఫ్ ఆస్తులుగా భావిస్తాం

వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్ల తొలిరోజు విచారణలో సుప్రీంకోర్టు వ్యాఖ్య

చట్టాన్ని సవాల్‌చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన వైఎస్సార్‌సీపీ.. మరో 71 పిటిషన్లూ దాఖలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర వివాదాస్పదమైన వక్ఫ్(సవరణ) చట్టం,2025ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ తొలిరోజే సర్వోన్నత న్యాయస్థానం పిటిషనర్లకు కాస్తంత ఊరట కల్గించేలా వ్యాఖ్యానించింది. సుదీర్ఘకాలంగా ముస్లిం మత, దాతృత్వ కార్యక్రమాలతో సంబంధముండి వక్ఫ్ అధీనంలో ఉన్న ఆస్తులను(వక్ఫ్ బై యూజర్) ఇకమీదటా వక్ఫ్ ఆస్తులుగానే పరిగణించాలని భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని యోచిస్తున్నట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఆ దిశగా ఉత్తర్వులు, ఆదేశాలు ఇవ్వడానికంటే ముందు ఈ పిటిషన్లపై పూర్తిగా విచారణ చేపట్టాలని ప్రభుత్వం కోరింది. '' ఆస్తులు ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా వక్ఫ్ అధీనంలో ఉన్నాయా? రిజిస్ట్రర్ డాక్యుమెంట్లతో వక్ఫ్‌కు దఖలుపడ్డాయా? అనేది తేలకుండానే 'వక్ఫ్ బై యూజర్' అనే నిబంధనను తొలగించలేం. ఎక్స్–అఫీషియో సభ్యులు మినహా వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లలో అందరూ ముస్లింలే సభ్యులుగా ఉండాలి'' అని ధర్మాసనం స్పష్టంచేసింది. వక్ఫ్(సవరణ)చట్టం చట్టబద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన డజన్లకొద్దీ పిటిషన్లను బుధవారం విచారించడం మొదలెట్టాక తొలుత వీటిని హైకోర్టుకు బదలాయించాలని సుప్రీంకోర్టు భావించింది. అయితే ఈ ఆలోచనపై పిటిషన్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబల్, హుజేఫా అహ్మదీ, వైఎస్సార్‌సీపీ తరఫున వాదించిన ఎస్.నిరంజన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా తీవ్ర ప్రభావంచూపగల ఈ కేసులను సుప్రీంకోర్టులోనే విచారించాలని కపిల్ సిబల్ గట్టిగా వాదించారు. తర్వాత కోర్టు కేసును గురువారం మధ్యాహ్నానికి వాయిదావేసింది.

ఆనాటి ఆస్తులకు పత్రాలుంటాయా?

వక్ఫ్ ఆస్తిగా నమోదుచేయాలంటే వాటి డాక్యుమెంట్లు కచ్చితంగా సమర్పించాలంటూ చట్టంలోని సెక్షన్ 2ఏలో పేర్కొనడంపై సీజేఐ జస్టిస్ ఖన్నా అభ్యంతరం వ్యక్తంచేశారు. '' ఢిల్లీలోని జామా మసీదునే ఉదాహరణగా తీసుకుందాం. వందల ఏళ్లుగా వాళ్ల అధీనంలో ఉన్న ఇలాంటి పాత ఆస్తులకు రిజిస్టర్ చేయాలంటే ఇప్పుడు డాక్యుమెంట్లు తీసుకురమ్మంటే ఎలా?. అలాంటి ఆస్తులకు డాక్యుమెంట్లు వాళ్ల దగ్గర ఉంటాయా? '' అని సీజేఐ.. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించారు. గతాన్ని మీరు మార్చలేరు అని కేంద్రానుద్దేశించి వ్యాఖ్యానించారు. '' వక్ఫ్ ఆస్తుల్లో కొన్ని దుర్వినియోగం అయిన మాట వాస్తవమే. అంతమాత్రాన దాన్ని సాకుగా చూపి 'వక్ఫ్ బై యూజ్' నిబంధనను తొలగిస్తామంటే కొత్త సమస్యలొస్తాయి. వక్ఫ్ బై యూజర్‌ను కోర్టులు గతంలోనే ధృవీకరించాయి. కోర్టు తీర్పులు, ఉత్తర్వులు, నిర్ణయాలను ప్రభుత్వాలు నిర్ణయించకూడదు. మీరు కేవలం ప్రాతిపదికను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి'' అని కేంద్రాన్ని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. వక్ఫ్ చట్టం తమకొద్దని చాలా మంది ముస్లింలు చెబుతున్నారని తుషార్ మెహతా చెప్పగా కోర్టు కలుగజేసుకుని '' అయితే మీరు హిందూ దాతృత్వ ట్రస్టుల్లోనూ ముస్లింలను సభ్యులుగా చేరుస్తామని చెప్పదల్చుకున్నారా?'' అని సూటి ప్రశ్న వేసింది. '' వక్ఫ్ చట్టంపై ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ 38 సార్లు సమావేశమైంది. ఏకంగా 98.2 లక్షల మెమోరాండంలను కమిటీ పరిశీలించింది. తర్వాతే పార్లమెంట్ ఉభయసభల్లో బిల్లు ఆమోదం పొందింది'' అని మెహతా చెప్పుకొచ్చారు. దీంతో సీజేఐ స్పందించారు. '' ఇక్కడ రెండు విషయాలు తేలాలి. ఈ కేసులన్నింటినీ హైకోర్టుకు బదలాయించాలా? లేదంటే అసలు మీరు సుప్రీంకోర్టు ద్వారా ఏం ఆశిస్తున్నారు? ఏం వాదించాలనుకుంటున్నారు? అంటూ కేంద్రంతోపాటు పిటిషనర్లకు నోటీసులు ఇచ్చారు. వాటికి సమాధానం చెప్పాలని ఆదేశించారు. '' చట్టంపై ఆందోళనల్లో హింస చోటుచేసుకోవడం ఆందోళనకరం. ఓవైపు ఈ అంశం కోర్టుల పరిధిలో పరిశీలనలో ఉండగా మరోవైపు ఆందోళనలు,హింస చెలరేగడం తీవ్ర ఆందోళన కల్గిస్తోంది'' అని అన్నారు. వెంటనే తుషార్ మెహతా కలుగజేసుకుని ''ఇలా ఆందోళనలు చేయడం ద్వారా వ్యవస్థపై వాళ్లు తీవ్రమైన ఒత్తిడిని తేద్దామని చూస్తున్నారు'' అని వ్యాఖ్యానించారు. '' ఎవరు ఎవరిపై ఒత్తిడి తెస్తున్నారు? మాకైతే అర్థంకావట్లేదు'' అని సిబల్ బదులిచ్చారు. '' సానుకూల అంశాలపైనా చర్చిద్దాం'' అని సీజేఐ వ్యాఖ్యానించారు.



వక్ఫ్ పిటిషన్లపై విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు బయట వేచి ఉన్న ముస్లింలు

ఏ ప్రాతిపదికన ముస్లింగా నిర్ధారిస్తారు?

పిటిషనర్ల తరఫున కపిల్ సిబల్ వాదించారు. '' నేను ముస్లింనా కాదా అనే విషయాన్ని ఏ రకంగా కేంద్రం నిర్ధారిస్తుంది?. ఇతను వక్ఫ్‌కు ఆస్తిని, ఇతరత్రాలను దానంగా ఇవ్వడానికి అర్హుడు అని కేంద్రం ఎలా నిర్ధారించుకుంటుంది?. గత ఐదేళ్లుగా ఇస్లాంను ఆచరిస్తున్న వాళ్లే దానం ఇవ్వాలని చెప్పే హక్కు కేంద్రానికి ఎక్కడిది?'' అని కోర్టులో సిబల్ వాదించారు. దశాబ్దాలుగా ఆచరణలో ఉన్న 'వక్ఫ్ బై యూజర్'ను ఏకపక్షంగా తొలగించకూడదని లాయర్ హుజేఫా అహ్మదీ కోరారు. వైఎస్సార్‌సీపీ, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్, జమియత్ ఉలేమా–ఇ–హింద్ అధ్యక్షుడు అర్షద్ మదానీ, సమస్త కేరళ జమియతుల్ ఉలేమా, అంజుమ్ ఖదారీ, తయ్యబ్ ఖాన్ సల్మానీ, మొహమ్మద్ షఫీ, మొహమ్మద్ ఫజుల్‌రహీమ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝా, డీఎంకే, కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, మొహమ్మద్ జావేద్, ఢిల్లీ ఆప్ ఎంపీ అమానతుల్లా ఖాన్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ తదితరులు మొత్తంగా దాదాపు 72 పిటిషన్లను వక్ఫ్ చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలు చేశారు. దీంతో ఈ అంశంలో సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు జారీచేయకుండా ముందస్తుగా కేంద్రం ఏప్రిల్ 8వ తేదీన కెవియట్ పిటిషన్ దాఖలుచేసింది. దీంతో పటిషన్ల విచారణ మొదలుకాకుండానే సుప్రీంకోర్టు నుంచి ఎలాంటి తాత్కాలిక ఉత్తర్వులురాకుండా అడ్డుకోగలిగింది.

కేంద్రానికి సుప్రీంకోర్టు సంధించిన కీలక ప్రశ్నలు

- ముస్లిమేతరులూ వక్ఫ్ బోర్డుల్లో ఉండేందుకు కొత్త చట్టం అనుమతిస్తోంది. మరి హిందూ ఆలయాల నిర్వహణ బాధ్యతలు చూసే ట్రస్టుల్లో ముస్లింలను సభ్యులుగా కేంద్రప్రభుత్వం అనుమతిస్తుందా?
- బ్రిటిషర్లు రానంతవరకు భారత్‌లో భూములకు రిజిస్ట్రేషనే లేదు. కొన్ని మసీదులను 14వ, 15వ శతాబ్దంలో నిర్మించారు. వాటికి సేల్‌డీడ్ లాంటివి తేవడం అసాధ్యం. శతాబ్దాలుగా వక్ఫ్ ఆస్తులుగా కొనసాగుతున్న మసీదులు, ఇతర ఆస్తుల హక్కుల పత్రాలు, డాక్యుమెంట్లను ముస్లింలు ఇప్పుడెలా తీసుకురాగలరు?
- విచారణ, దర్యాప్తు పూర్తిచేసి అధీకృత అధికారి నిర్ధారించనంతవరకు సంబంధిత ఆస్తి వక్ఫ్‌ది కాదు అని ప్రభుత్వం చెబుతోంది. అలా నిర్ధారణ సాధ్యంకాని ఆస్తులన్నీ ప్రభుత్వానికి చెందుతాయా?
- వక్ఫ్(సవరణ)చట్టం,2025 అమల్లోకి రాకముందు వరకు వక్ఫ్ బై యూజర్ నిబంధన అమల్లో ఉంది. ఇప్పుడు అది మనుగడలో లేదంటారా?
- గతంలో కొన్ని ఆస్తులు వక్ఫ్ ఆస్తులేనని కోర్టు తీర్పులే స్పష్టంచేస్తున్నాయి. కొత్త చట్టంలోని సెక్షన్ 2ఏతో ప్రభుత్వం ఆ తీర్పులను చెల్లనివిగా మారుస్తోందా?

కంచ గచ్చిబౌలి భూములపై బీజేపీ, బీఆర్‌ఎస్ విష ప్రచారం

మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూములపై బీజేపీ, బీఆర్‌ఎస్ విష ప్రచారం చేస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఆ భూములు ప్రభుత్వానివని స్పష్టత ఇచ్చిందే సుప్రీంకోర్టు అని వెల్లడించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కొందరు ఉద్దేశపూర్వకంగా అన్ని వ్యవస్థలను తప్పుదోవ పట్టించే పరిస్థితికి తెచ్చారని విమర్శించారు. కేంద్ర మంత్రులు కూడా సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు పోస్టు చేశారని, ఆ తర్వాత మళ్లీ వాటిని డిలీట్ చేశారన్నారు. ఒకవేళ వాళ్లు చెప్పిన అంశాలు నిజమైతే ఆ వీడియోలను ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. కోర్టు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతామన్నారు. కడియం శ్రీహరి సీఎల్పీ సమావేశానికి రాలేదని తెలిపారు. ఆయన ఏ పార్టీలో ఉన్నారో ఆయన్నే అడగాలని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. స్పీకర్ చెప్పిన లెక్క ప్రకారం తమ ఎమ్మెల్యేల సంఖ్య 65 అని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా దాసోజు ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్సీగా ప్రమాణం చేస్తున్న దాసోజు శ్రావణ్. చిత్రంలో కేటీఆర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుల కోటాలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున శాసనమండలికి ఎన్నికైన దాసోజు శ్రవణ్ బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చాంబర్‌లో జరిగిన దాసోజు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, మహమూద్ అలీ, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారితో పాటు పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు గన్‌పార్కులోని అమరుల స్తూపానికి దాసోజు నివాళి అర్పించారు.

'కంచ'లోనే లోపలేస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పాలని ఆదేశించింది. తాము చేపట్టబోయే తీవ్ర చర్యల నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, ఇతర కార్యదర్శులను కాపాడాలనుకుంటే 100 ఎకరాల్లో పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని తేల్చిచెప్పింది. పునరుద్ధరణకు సంబంధించిన ప్రణాళికతోనే మా ముందుకు రావాలని స్పష్టం చేసింది. కంచ గచ్చిబౌలి వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీం ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సుమారు అరగంటపాటు సాగిన వాదనల అనంతరం కేసు విచారణను మే 15కు వాయిదా వేసింది. అప్పటివరకు స్టేటస్ కో కొనసాగుతుందని తెలిపింది. చెట్ల తొలగింపుపై తమ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పర్యటించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) సమర్పించిన నివేదికపై తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసేందుకు 4 వారాల గడువు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, మేనక గురుస్వామి, 'బీ ద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ'పిటిషన్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, పి.మోహిత్‌రావు, మరో పిటిషన్ తరఫున ఎస్.నిరంజన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వం తరఫున సొలి సిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

అభివృద్ధి చేసేందుకే..

అంతకుముందు అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు ప్రారంభిస్తూ అన్ని అనుమతులతోనే ఆ భూముల్లో చెట్లను (పొదలు) తొలగించామన్నారు. చెట్ల నరికివేతకు అనుమతులు తీసుకున్నారా అని ఈ సందర్భంగా ధర్మాసనం ఎదురు ప్రశ్నించింది. తెలంగాణలో వాటర్ అండ్ ట్రీ (వాల్టా) యాక్ట్ ఉందంటూ అమికస్ క్యూరీ పరమేశ్వర్ జోక్యం చేసుకొని ధర్మాసనానికి వివరించగా ఈ చట్టం కింద అనుమతులు తీసుకోకుంటే అందరిపై చర్యలు తీసుకుంటామని ధర్మాసనం బదులిచ్చింది. ఆ భూములను రూ. 10 వేల కోట్లకు తనఖాపెట్టి ప్రభుత్వం అప్పు తెచ్చుకుందని అమికస్ క్యూరీ పేర్కొనగా ఆయన వ్యాఖ్యలను ధర్మాసనం తోసిపుచ్చింది. 'ఆ భూములను మార్టిగేజ్ చేశారా లేదా అమ్ముకున్నారా అనేది మాకు అనవసరం. అక్కడ చెట్ల నరికివేతకు అనుమతి తీసుకున్నారా? లేదా అనేది మాత్రమే మాకు సూటిగా జవాబు చెప్పండి'అంటూ సింఘ్వీని ప్రశ్నించింది. ఆ ప్రాంతంలో కొన్ని షెడ్యూల్డ్ జంతువులు ఉన్నాయని.. అక్కడ పనులు జరిగేటప్పుడు ప్రభుత్వం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదని 'బీ ద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ 'తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, మోహిత్‌రావులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో జేసీబీలు ఉన్నాయని చెప్పారు. హెచ్‌సీయూకు 25 వేల ఎకరాల భూమి ఉందని.. అందులో 400 ఎకరాల భూవివాదం 2004 నుంచి కొనసాగుతోందని సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. దీనికి సంబంధించి కోర్టు తీర్పులు, 20 ఏళ్లలో ఆ పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి ఎంతో జరిగిందన్నారు. ఈ స్థలంలో ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మందికి జీవనోపాధి, ఉద్యోగాలు కల్పించబోతున్నట్లు చెప్పారు. సీఎస్ ఒక మహిళ అని, ఆమె నెల రోజుల్లో రిటైరవనున్నారని సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు.

జేసీబీలు వచ్చిన విషయం సీఎస్‌కు తెలియదా?

ఈ సందర్భంగా ధర్మాసనం మళ్లీ స్పందిస్తూ 'మేం పదేపదే చెట్ల నరికివేతకు అనుమతులు తీసుకున్నారా లేదా అని అడుగుతున్నాం. ఈ ప్రశ్నకు మాకు సూటిగా మీ సమాధానం కావాలి'అంటూ వ్యాఖ్యానించింది. 'సీఎస్ నెల రోజుల్లో రిటైరవుతున్నారంటే ఎలా సింఘ్వీజీ? ఆ ప్రాంతంలో జేసీబీలు వచ్చిన విషయం సీఎస్‌కు తెలియదా? రాష్ట్రంలో జరుగుతున్న విషయాలకు సీఎస్ బాధ్యత వహించాలి కదా?'అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. 'అడవి అనే పదానికి నిర్వచనం ఇస్తూ 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా చెట్ల నరికివేత జరిగి ఉంటే మాత్రం మేం ఊపేక్షించం. చెట్ల నరికివేతకు అనుమతులు తీసుకోవాలనే విషయం కూడా ప్రభుత్వానికి తెలియదా? అంటూ ధర్మాసనం నిలదీసింది.

మహానగరాల్లో అటవీభూములు కాపాడుకోకపోతే ఎలా?

'చార్‌ధామ్ యాత్ర కోసం రోడ్డు నిర్మాణానికి చెట్లు తొలగిస్తామంటేనే మేం అనుమతించలేదు. మహారాష్ట్రలో సచివాలయ నిర్మాణం కోసం పర్యావరణానికి నష్టం కలిగించిన కేసు రెండు దశబ్దాలుగా సుప్రీంకోర్టులోనే పెండింగ్‌లో ఉందనే విషయాన్ని మర్చిపోవద్దు. ముంబై, చెన్నై, హైదరాబాద్ లాంటి మహానగరాల్లోని అటవీ భూముల్ని కూడా కాపాడుకోలేకపోతే ఎలా? అంటూ ప్రశ్నలు సంధించింది. మంత్రులు ఏది చెబితే అధికారులు అది చేసేస్తున్నారంటూ అమికస్ క్యూరీ పరమేశ్వర్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా 'పర్యావరణానికి వ్యతిరేకంగా పనిచేసిన వాళ్లను జైళ్లకు పంపించాల్సి వస్తుంది జాగ్రత్త. చెట్లను కొట్టేసిన దగ్గరే తాత్కాలిక జైలు నిర్మిస్తాం. సంబంధిత అధికారులను అదే జైలులో 6 నెలలపాటు ఊచలు లెక్కబెట్టిస్తాం'అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారు? చెట్లు కొట్టేసిన ప్రాంతంలో పర్యావరణ పునరుద్ధరణ కోసం తీసుకున్న చర్యలేంటి? ఆ భూముల్లో వన్యప్రాణుల్ని ఎలా రక్షిస్తారు? అక్కడి నష్టాన్ని ఎలా పూడుస్తారు?'అంటూ సింఘ్వీపై ధర్మాసనం ప్రశ్నలవర్షం కురిపించింది.

విధ్వంసం చేస్తే ప్రేక్షక పాత్ర పోషించాలా?

ఆ ప్రాంతంలో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు సిద్ధపడిందని.. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నందునే ఆ ప్రాంతమంతా దట్టమైన పొదలతో అడవిలా తయారైందని సింఘ్వీ వాదించారు. ఆ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసి ఎందరో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించనుందని ధర్మాసనానికి చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'అభివృద్ధి, ఉద్యోగాల కల్పన పేరుతో మీరు పర్యావరణాన్ని విధ్వంసం చేస్తుంటే మేం ప్రేక్షక పాత్ర పోషించాలా?. మీకు మీరే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఏమిటి? మూడు రోజుల్లో 100 ఎకరాలు ధ్వంసం చేశారంటే ఎన్ని బుల్డోజర్లు అక్కడ ఉన్నట్లు? మీరు సృష్టించిన రణరంగానికి అక్కడి జంతువులు ప్రాణభయంతో పరుగులు తీయగా వాటిని కుక్కలు కరిచాయి. ఆ వీడియోలను చూసి చలించిపోయాం'అని పేర్కొంది. అయితే ఆ భూముల్లో జంతువులు లేవని.. కావాలనే కొందరు నకిలీ వీడియోలు సర్క్యులేట్ చేశారని సింఘ్వీ బదులివ్వగా ధర్మాసనం ఆక్షేపించింది. అక్కడ జంతువులు పరుగులు తీసిన వీడియోలను తాము చూసి చలించిపోయామని తెలిపింది. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని సింఘ్వీ ధర్మాసనానికి బదులిచ్చారు. దీనిపై తదుపరి విచారణను ధర్మాసనం మే 15కు వాయిదా వేసింది.

హెచ్‌సీయూ పరిధిలోనే 'కంచ' భూమి!

టీజీఐఐసీ హక్కులపై సమగ్ర సమీక్ష చేపట్టాలి

- చెట్లను నరికిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతిని రద్దుచేయాలి
- కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకు సీఈసీ నివేదిక



కంచ గచ్చిబౌలి వివాదాస్పద భూమిలో పర్యటిస్తున్న కేంద్ర సాధికార కమిటీ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రాథమికంగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) యాజమాన్య పరిధిలోనే ఉన్నట్లు కనిపిస్తోందని కేంద్ర సాధికార కమిటీ అభిప్రాయపడింది. అయితే, టీజీఐఐసీకి హక్కులున్నాయా? లేదా? అనేది నిర్ణయించడానికి చట్టపరంగా సమగ్ర సమీక్ష చేపట్టాల్సి ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు సదరు భూమిపై ఎవరికీ ఎటువంటి హక్కులు, ప్రయోజనాలు ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై సిద్ధాంత దాస్ ఆధ్వర్యంలో అత్యున్నత న్యాయస్థానం నియమించిన కేంద్ర సాధికార కమిటీ (సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ– పర్యావరణ మదింపు కమిటీ) బుధవారం న్యాయస్థానానికి ఈ మేరకు నివేదిక అందజేసింది. కొన్ని ప్రతిపాదనలను కోర్టు ముందు ఉంచింది.

కమిటీ ప్రతిపాదనలు

- అటవీ ప్రాంతాల గుర్తింపును నిర్ధారించడానికి అటవీ అధికారులు, వన్యప్రాణుల నిపుణులు, పర్యావరణ వేత్తలు, ఐటీ, రిమోట్ సెన్సింగ్ నిపుణులు, సర్వే ఏజెన్సీలతో కమిటీని పునర్నిర్మించవచ్చు.
- వన్ (సంరక్షణ్ ఏవం సంవర్ధన్) అధినియం– 2023 లక్ష్యానికి అనుగుణంగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయవచ్చు.
- గాలి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం– 1981, నీరు(కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం – 1974 ప్రకారం అనుమతి కోసం టీజీఐఐసీ దరఖాస్తు చేసుకుంది. కానీ, పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ), పర్యావరణ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయడం (ఈఎంపీ) కింద అనుమతి కోరలేదు. దీనికి సంబంధించి టీజీఐఐసీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలి. టీజీఐఐసీకి అనుకూలంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు జనవరి 30న జారీ చేసిన అనుమతిని వెంటనే రద్దు చేయాలి.
- ఈ ప్రాంతంలోని జీవవైవిధ్యం, వన్యప్రాణుల ఉనికి, పర్యావరణపరంగా చెరువుల ఉనికిని కాపాడేందుకు పర్యావరణ సున్నిత జోన్‌గా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసి పర్యవేక్షించవచ్చు.
- వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సమగ్ర పర్యావరణ అంచనా నిర్వహించే వరకు తదుపరి చర్యలు, అభివృద్ధి కార్యకలాపాలను నిరోధించవచ్చు.
- పలు రకాల, జాతుల చెట్లను నరికివేసి వృక్ష సంపదను, పొదలను నాశనం చేసిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుని, యంత్రాలను జప్తు చేయాలి.
- భూమి వినియోగం, చట్టబద్ధతను న్యాయస్థానం తేల్చేవరకు టీజీఐఐసీ ఆ భూమిని తనాఖా పెట్టడం, లీజుకు ఇవ్వడం, వాణిజ్యపరంగా అప్పగించడం, ఇతర ప్రతిపాదనలను నిలిపివేయవచ్చు. తద్వారా తదుపరి ఆర్థిక, చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టవచ్చు.
- జీహెచ్‌ఎంసీ.. హెచ్‌సీయూ క్యాంపస్ వెలుపల మురుగు శుద్ధి కేంద్రాలు ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేయాలి. 12 నెలల్లోగా హెచ్‌సీయూలో ప్రవహించే అన్ని మురుగునీటి అవుట్‌లెట్‌లను మూసివేయాలని నిర్ణయించాలి.
- ఈ మొత్తం భూ వివాదంపై ఏదైనా ప్రత్యేక సంస్థతో స్వతంత్ర దర్యాప్తునకు న్యాయస్థానం ఆదేశించవచ్చు.
- ప్రాథమికంగా కంచ గచ్చిబౌలి గ్రామంలోని 2,374.02 ఎకరాలు 'కంచ అస్తబల్ పోరంబోక్ సర్కారీ'గా నమోదు చేయబడి హెచ్‌సీయూకు కేటాయించినట్లు ఉంది. ఇందులో వివాద భూమి అడవిలా కనిపిస్తోంది. అయితే ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా పరిశీలన చేసి న్యాయస్థానానికి సిఫార్సు చేయవచ్చు.
- రాష్ట్రంలోని వివిధ అధికారుల నుంచి కోరిన అనేక పత్రాలు, సమాచారం ఇంకా సీఈసీకి అందలేదు. కాబట్టి విచారణకు మరో నాలుగు వారాల వ్యవధి మంజూరు చేయాలి.

సీఎం రేవంత్‌రెడ్డిపైనా చర్యలు తీసుకోవాలి

- కంచ గచ్చిబౌలి విషయంలో ప్రధాని చెప్పిందే సుప్రీంకోర్టూ చెప్పింది
- ఇప్పటికైనా ప్రభుత్వం చేసిన తప్పును ఒప్పుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపైనా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సంబంధం లేకుండా, కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్లు నరికివేసేందుకు సీఎం ఆదేశాలు ఇచ్చారు కాబట్టి.. ఆయనపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సీఎంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసిందని గుర్తు చేశారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఏదైనా ఇంట్లో ఉన్న చెట్టును కొట్టాలన్నా వాల్టా చట్టం ప్రకారం అనుమతి తీసుకోవాలని సుభద్ర అనే మున్సిపల్ అధికారి చెప్పారని గుర్తుచేశారు. అయితే వంద ఎకరాల్లో చెట్లను కొట్టేందుకు అధికారులు ఏ రకంగా..ఎలా అనుమతి ఇచ్చారు అని ప్రశ్నించారు. భూముల్లో చెట్లు నరకడం తప్పని ఇటీవల ప్రధాని మోదీ చెప్పిందే.. బుధవారం కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టూ చెప్పిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేసిన దుందుడుకు చర్యలను, చేసిన తప్పును ఒపుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూములను విచ్చలవిడిగా అమ్మేసిందన్నారు. అయితే.. ఇప్పుడు ఆ పార్టీ నేతలు సుద్దపూస ముచ్చట్లు చెబుతున్నారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో బీజేపీ తరఫున అన్నిరకాల ప్రయత్నాలు చేశామని, ప్రకృతిని కాపాడే బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపైనా ఉందని సూచించారు. నేషనల్ హెరాల్డ్ విషయంలో విచారణ జరిపితే కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ధర్నాలు చేయడం సిగ్గుమాలిన చర్య అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న ధర్నా, ప్రదర్శనలను రాష్ట్ర బీజేపీ ఖండిస్తోందన్నారు.

సింగరేణి చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టం

నైనీ బొగ్గు బ్లాకులో 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్న సింగరేణి తొలిసారి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం ఆ సంస్థ చరిత్రలో ఒక చరిత్రాత్మక ఘట్టం అని కిషన్‌రెడ్డి బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. సింగరేణి సంస్థ తన విజయ పరంపరను ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు.

రేవంత్‌కు ఇకనైనా జ్ఞానోదయం కలగాలి

రూ.10 వేల కోట్లు దోచుకోవాలని అనుకుంటున్నాడు

కంచ గచ్చిబౌలి భూములపై 'సుప్రీం' ఆదేశాలను స్వాగతిస్తున్నాం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూములను ప్రైవేట్ సంస్థకు తాకట్టు పెట్టడంలో ఆర్థిక మోసం జరిగిందని తాము చేసిన ఆరోపణలకు..సుప్రీంకోర్టు ఆదేశాలు మరింత బలం చేకూర్చాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కంచ గచ్చిబౌలి అడవిని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం ఆదేశాలతోనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్న వన్యప్రాణులను సంరక్షించాలని చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌ను సుప్రీంకోర్టు ఆదేశించడం పర్యావరణ ప్రేమికుల విజయంగా పేర్కొన్నారు. రూ.10 వేల కోట్ల తెలంగాణ సంపదను దోచుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారనే బీఆర్‌ఎస్ వాదనలో వంద శాతం నిజం ఉందని తెలిపారు.

విధ్వంసమే విధానంగా పాలన: హరీశ్‌రావు




రాష్ట్రంలో విధ్వంసమే విధానంగా సీఎం రేవంత్ పాలన సాగుతోందని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ విధ్వంసానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రపంచానికి తేటతెల్లమైందన్నారు. సుప్రీం వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని చెప్పారు. న్యాయస్థానాల మీద ఉన్న గౌరవంతో తమ వంతు బాధ్యతగా బీఆర్‌ఎస్ తరఫున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి ఆధారాలతో సహా నివేదిక ఇచ్చామని హరీశ్‌రావు చెప్పారు. రేవంత్‌కు బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఇదండీ జాతర



మన మీద అనుమానపడటం ఇదేం కొత్తకాదుగా.. లైట్ తీస్కోండి!

'వక్ఫ్ చట్టం'పై 20 నుంచి బీజేపీ జన జాగరణ అభియాన్



బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి మే 5 వరకు జన జాగరణ అభియాన్ కార్యక్రమం చేపట్టనున్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై వచ్చిన కొన్ని అపోహలు తొలగించడానికి, దీనికి సంబంధించిన వాస్తవ సమాచారాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రారంభిస్తారని, జాతీయ నేతలు శివప్రకాశ్, అర్వింద్ మీనన్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పాల్గొంటారని వెల్లడించారు. బుధవారం మనోహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత వక్ఫ్ చట్టంలోని లొసుగులను తొలగిస్తూ, మెరుగైన చట్టాన్ని తీసుకురావడమే ఈ సవరణల ఉద్దేశమని తెలిపారు. మోదీ ప్రభుత్వం వక్ఫ్‌చట్టంలో మార్పులు తీసుకొచ్చి, జవాబుదారీతనంగా ఉండేలా, పారదర్శకంగా ఆస్తుల నిర్వహణ జరిగేలా సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దీన్ని మతపరమైన అంశంగా మలిచి ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని మనోహర్‌రెడ్డి ఆరోపించారు.

'టీఆర్‌ఎస్' లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదు

కాంగ్రెస్‌కు మోసం చేయడం కొత్తకాదు: కవిత



జగిత్యాల: అప్పటి టీఆర్‌ఎస్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని, తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో ముందుకెళ్లి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులకు బెదిరింపులు, మోసం కొత్త కాదని, గతంలో ఒక సారి తెలంగాణ ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఇప్పుడు అధికారంలోకొచ్చిన తర్వాత మళ్లీ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేశామంటున్నా, ఇప్పటివరకు అతీగతీలేదని, ఎంపీ అర్వింద్ పిచ్చిమాటలు తప్ప ప్రజల గురించి ఎప్పుడూ మాట్లాడబోరని అన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ అన్నారని, అవి ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలుంటే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రూ.8 కూడా రాలేదన్నారు.

ఆరుబయటే పంట.. శ్మశానంలో తంటా



రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఐకేపీ కేంద్రాలకు చేరుతోంది. ఈ సమయంలో అకాల వర్షాలు తిప్పలు పెడుతున్నాయని తల్లడిల్లుతున్నారు. నిర్దేశిత తేమశాతం వచ్చేందుకు ఎండలో ఆరబోస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరం కావడంతో.. ధాన్యం పెద్దఎత్తున కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక శివారులో రహదారిపైనే రైతులు ఇలా ధాన్యం ఆరబోస్తుండడంతో.. రాత్రివేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు వాపోతున్నారు

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పాల్వంచ రూరల్: యాసంగి సీజన్‌లో వరి సాగు చేసిన కొందరు రైతుల పరిస్థితి మరీ దైన్యంగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సోములగూడెం, దంతలబోరు, సంగం, కారెగట్టు తదితర గ్రామాల రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు.. ఏటా ప్రభుత్వం సోములగూడెం శ్మశానవాటిక సమీపంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేది. ఈ ఏడాది కూడా అక్కడే ఏర్పాటు చేస్తారనే ఉద్దేశంతో రైతులు తమ ధాన్యాన్ని శ్మశానవాటికలోనే ఆరబోశారు. పదిహేను రోజులు దాటినా ఇప్పటికీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోగా.. ఇటీవల నిత్యం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు రాత్రిపూట ధాన్యం కుప్పచేసి, ఉదయం మళ్లీ ఆరబెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.2,320 మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500 లభిస్తాయనే ఆశతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించడం లేదు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుందనే భయంతో 15 రోజులుగా రైతులు శ్మశానవాటికలో ధాన్యం రాశులపైనే నిద్రిస్తున్నారు. అయితే రాత్రి పూట అక్కడ పడుకోవాలంటే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని కోరుతున్నారు.



శ్మశానవాటిక వద్ద ధాన్యం రాశుల వద్ద నిద్రిస్తున్న రైతు

క్లుప్తంగా...

నేడు జేఈఈ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. రెండు సెషన్లు పూర్తవ్వడంతో ర్యాంకులు కూడా ఇవ్వనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. తొలి సెషన్ జనవరిలో జరిగింది. రెండో విడత ఏప్రిల్ 2 నుంచి 9 వరకు నిర్వహించారు. జేఈఈ మెయిన్‌కు దేశవ్యాప్తంగా 12 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షల మంది ఈ పరీక్ష రాశారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఈనెల 23 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుంది. అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 18న ఉంటుంది.



జస్టిస్ రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న చిత్రా రామచంద్రన్

జస్టిస్ రాజశేఖర్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు

సాక్షి, హైదరాబాద్: రెరా అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డికి సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. జస్టిస్ రాజశేఖర్‌రెడ్డిని ఇటీవల లోకాయుక్తగా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం తెలిసిందే. దీంతో ఆయన రెరా పదవి నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ట్రిబ్యునల్ జ్యుడీషియల్ సభ్యుడు పి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ సభ్యురాలు చిత్రా రామచంద్రన్ పాల్గొన్నారు. ట్రిబ్యునల్ చైర్మన్‌గా కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గోవిందరెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



జపాన్ పర్యటనలో భాగంగా బుధవారం టోక్యోలో భారత రాయబారి షిబూ జార్జిని సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

165 మంది స్పౌజ్‌ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 165 మంది స్పౌజ్‌లను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ బుధవారం ఆదేశాలు జారీచేసింది. 317 జీవో అమలులో భాగంగా భార్యాభర్తలను గతంలో వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన వినతులపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. సంఘం ఇచ్చిన నివేదిక ప్రకారం మిగిలిపోయిన స్పౌజ్‌లను బదిలీ చేశారు. జనవరిలో మొత్తం 834 మందిని బదిలీ చేసిన సంగతి తెలిసిందే. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంతమంది మిగిలిపోయారు. తాజాగా బదిలీ అయిన వారు ఏప్రిల్ 22న ప్రస్తుత స్థానం నుంచి రిలీవ్ అవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫస్టియర్ ప్రవేశాలకు ఈ నెల 16 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి బి.సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఏ, బీఎఫ్‌టీ కోర్సుల్లో 9,260 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సొసైటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ గురుకుల సొసైటీలో ఇంటర్ చేసిన వారు కాలేజీ ప్రిన్స్‌పాల్ ద్వారా దరఖాస్తును ఫార్వర్డ్ చేయించాలన్నారు. మరిన్ని వివరాలకు https://mjptbcwreis.telangana.gov.in,https://tgrdccet.cgg.gov.in/TGRDCWEB/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా 040-23328266 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

టీచర్లు ఏం చేస్తున్నారు?

ప్రభుత్వ టీచర్ల సమగ్ర సమాచారం సేకరణకు థర్డ్ పార్టీ

- ఏప్రిల్ 21 వరకు సమగ్ర సర్వే
- క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోవడమే లక్ష్యం
- యూడైస్ వివరాలపైనా సమగ్ర ఆరా
- మే 15 కల్లా పాఠశాలలకు కార్యాచరణ ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల సమగ్ర సమాచారం సేకరించేందుకు థర్డ్ పార్టీతో సర్వే చేయిస్తున్నారు. ఆయా జిల్లాల్లోని డైట్ కాలేజీ విద్యార్థులకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 15 నుంచి సమగ్ర సర్వే మొదలైంది. 21వ తేదీ వరకూ కొనసాగుతుంది. ఈ ప్రక్రియనంతా రాష్ట్ర విద్యాశాఖ పర్యవేక్షిస్తోంది. అయితే విద్యాశాఖ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ మాత్రం టీచర్ల అనుమానాల్లో అర్థం లేదని చెబుతోంది.

ఉద్దేశం ఏమిటి..?

రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ స్కూళ్లున్నాయి. వీటిల్లో మౌలిక వసతులపై కేంద్రం డేటా సేకరిస్తుంది. యునైటెడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్) ద్వారా ఈ సమాచారం అందిస్తారు. ఇదంతా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. స్కూల్ హెచ్‌ఎం ఈ డేటా క్రోడీకరిస్తారు. దీని ఆధారంగానే స్కూళ్లకు కేంద్రం నిధులు వస్తాయి. రాష్ట్ర స్కూళ్లల్లో సరైన మౌలిక వసతులు లేవని కేంద్రం కొన్నేళ్లుగా చెబుతోంది. టాయిలెట్స్, డిజిటల్ తరగతి గదులు, తాగునీటి సదుపాయం, విద్యుత్, వంటగది, ఫర్నిచర్ ఆశించిన మేర లేవనేది కేంద్రం వాదన. మౌలిక వసతులు కల్పించినా, వాటిని యూడైస్‌లో నమోదు చేయడం లేదనేది విద్యాశాఖ వాదన. దీనివల్ల నష్టం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకునే సమగ్ర సర్వే చేపట్టినట్టు పాఠశాల విద్యా డైరెక్టరేట్ చెబుతోంది. యూడైస్‌లో వివరాలు నమోదు చేయని హెచ్‌ఎంలపై చర్యలు తీసుకునే యోచనలో విద్యాశాఖ ఉంది.

వివాదంగా మారిన సర్వే.

ప్రతీ జిల్లాలోనూ దాదాపు 700కుపైగా స్కూళ్లల్లో సర్వే చేపడుతున్నారు. ప్రతీ స్కూల్‌కు పది మందితో ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. వీరు స్కూల్‌కు వెళతారు. ఎంఈవో ఆఫీసులో యూడైస్ రికార్డులు పరిశీలిస్తారు. హెచ్‌ఎంలను ప్రశ్నించే అధికారం కూడా ఇచ్చారు. వీరికి పాఠశాల విద్య శాఖ ప్రశ్నావళి ఇచ్చింది. మౌలిక వసతులు, పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫాం వంటి వాటి వివరాలు ఇందులో ఉన్నాయి. స్కూళ్లల్లో ఉన్నవన్నీ యూడైస్‌లో నమోదు చేశారా? అనే అంశాన్ని పరిశీలిస్తారు. ఇవన్నీ ఒక ఎత్తైతే... అంతర్గతంగా మరికొంత సమాచారం కోరినట్టు టీచర్లు చెబుతున్నారు. స్కూళ్లలో పనిచేసే వారి వ్యక్తిగత సమాచారం కూడా సేకరిస్తున్నారనే ఆందోళన టీచర్లలో ఉంది. దీంతో సమగ్ర సర్వే వివాదాస్పదమైంది.

ఆందోళనలో అర్థం లేదు



యూడైస్ సమాచారంలో వాస్తవాలు తెలుసుకోవడానికి మాత్రమే సమగ్ర సర్వే చేయిస్తున్నాం. థర్డ్ పార్టీ చేత సర్వే చేస్తే అన్ని కోణాల్లో సమాచారం వస్తుంది. దీనిని చూసి టీచర్లు ఆందోళన చెందడం అర్థరహితం. ఇది ఎంతమాత్రం వారిని అవమాన పర్చడం కానేకాదు. కేంద్రానికి వెళ్లే యూడైస్ సమాచారంలో అన్నీ నమోదు కావడం లేదు. అందుకే అప్‌డేట్ కోసమే ఈ సర్వే.

– ఈవీ నర్సింహారెడ్డి, పాఠశాల విద్య డైరెక్టర్

ఎడిట్ ఆప్షన్ ఇస్తే సరిపోతుంది



ఏళ్ల క్రితం యూడైస్‌లో మౌలిక వసతుల సమాచారం నమోదు చేశాం. కాలానుగుణంగా వచ్చిన మార్పులు చేర్చడానికి యూడైస్‌లో ఎడిట్ ఆప్షన్ లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేయాల్సిన పనులకే ఈ సర్వే ఉపయోగపడుతుంది. ఇందులో టీచర్ల భాగస్వామ్యం కూడా ఉంటే బాగుంటుంది.

– రాజాభాను చంద్రప్రకాశ్, ప్రభుత్వ గెజిటెడ్ హెచ్‌ఎం సంఘం పూర్వ అధ్యక్షుడు

ఇది సందేహించడమే



డైట్ కాలేజీల విద్యార్థులతో సర్వే చేయించడం టీచర్లను అవమానించడమే. డేటా నమోదులో టీచర్లు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటారు. ఒకవేళ అలాంటిది ఉంటే.. వారి దృష్టికి తేవాలి. వాస్తవ పరిస్థితులు ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

– చావా రవి, టీఎస్‌యూటీఎఫ్, రాష్ట్ర అధ్యక్షుడు

సరికొత్త ఆవిష్కరణల కోసం స్టార్టప్ కాంక్లేవ్

- సంయుక్తంగా నిర్వహించనున్న ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్జీఆర్ఐ



సమావేశంలో ప్రకాశ్ కుమార్, వినయ్‌కుమార్ నందికూరి, శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పరిశోధన, సాంకేతిక రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలను, స్టార్టప్‌లను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ నెల 22, 23 తేదీల్లో స్టార్టప్ కాంక్లేవ్–2025ను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా పరిశోధనలు సాగిస్తున్న ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్జీఆర్ఐ తెలిపాయి. క్యాటలైజింగ్ ఇన్నోవేషన్, కనెక్టింగ్ ఎకోసిస్టమ్స్ అనే థీమ్‌తో ఐఐసీటీలో ఈ కాంక్లేవ్ జరుపుతున్నట్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎంబీ డైరెక్టర్ వినయ్‌కుమార్ నందికూరి, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. స్టార్టప్ ఇండియా–స్టాండప్ ఇండియా అనే ప్రధాని మోదీ పిలుపునకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభిస్తారని.. ముగింపు కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిన స్టార్టప్‌లు ప్రత్యేకించి హైదరాబాద్‌లోని మూడు సంస్థలకు చెందిన ల్యాబ్‌లను ఆధారంగా చేసుకొని ఏర్పాటైన 80 స్టార్టప్‌లు ఈ కాంక్లేవ్‌లో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయన్నారు. భూకంపాలు, భూగర్భ జలాలు, జియో థర్మల్ ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో పరిశోధనలకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

యాంటీ వైరల్ మిషన్‌పై పరిశోధన

కొత్త వైరస్‌లను ఎదుర్కొనేందుకు వీలుగా ఔషధాలు, రోగ నిర్ధారణ పరికరాల అభివృద్ధి కోసం 'యాంటీ వైరల్ మిషన్'పై సంయుక్తంగా పరిశోధనలు చేస్తున్నట్లు సీఎస్ఐఆర్–ఐఐసీటీ, సీఎస్ఐఆర్–సీసీఎంబీ డైరెక్టర్లు తెలిపారు. ప్రస్తుత యాంటీవైరల్ ఔషధాలను తిరిగి ప్రయోజనకరంగా మార్చడమే కాకుండా కొత్త మాలిక్యూళ్లను అభివృద్ధి చేయడం ద్వారా మెరుగైన చికిత్సల దిశగా ముందడుగు వేస్తున్నట్లు చెప్పారు. తమ సంస్థల సంయుక్త పరిశోధన ఫలితంగానే సికిల్ సెల్ అనీమియా చికిత్సకు ఉపయోగపడే ఔషధాలను పునర్వినియోగించడంలో విజయం సాధించామన్నారు. అలాగే సీసీఎంబీలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఎంఆర్ఎన్ఏ టీకా సాంకేతికతను కేవలం కరోనా వైరస్ (సార్స్ కోవ్–2)కు మాత్రమే కాకుండా టీబీ, చికున్‌గున్యా, జపనీస్ ఎన్సెఫలైటిస్ లాంటి ఇతర అంటువ్యాధులకు కూడా ఉపయోగపడేలా పరిశోధనలు చేస్తున్నట్లు వారు వివరించారు.

జీపీవో నోటిఫికేషన్‌పై మీ వైఖరి తెలపండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జీపీవోల నియామకానికి జారీ చేసిన నోటిఫికేషన్‌పై వైఖరి తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే నోటిఫికేషన్ ప్రకారం బుధవారంతో దరఖాస్తుకు గడువు ముగియగా దాన్ని ఈ నెల 26 వరకు పొడిగిస్తున్నట్లు స్పష్టం చేసింది. తదుపరి విచారణ జూన్ 18కి వాయిదా వేసింది. జీపీవోల నియామకం కోసం జారీ చేసిన జీవో నంబర్ 129ని సవాల్ చేస్తూ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జేఏసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విద్యార్హత, జీరో సర్వీస్ నిబంధనలు, టెస్ట్ క్లాస్ వారికి అవకాశం లేకపోవడాన్ని తప్పుబట్టింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పీవీ కృష్ణయ్య పేర్కొన్నారు. అవి పెండింగ్‌లో ఉండగానే జీపీవోల నియామక ప్రక్రియ చేపట్టడం సరికాదని, నోటిఫికేషన్ చట్టవిరుద్ధమన్నారు. అయితే జీపీవోల నియామకం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందులో జోక్యం చేసుకోవద్దని స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదించారు.

ఉస్మానియా, గాంధీల్లో 63 మంది చిన్నారుల్లో టైప్-1 డయాబెటిస్

గుర్తించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ • దేశంలో 291 కొత్త కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: దేశంలో టైప్–1 డయాబెటిస్‌తో బాధపడుతున్న 291 మంది పిల్లలను తాజాగా గుర్తించారు. అందులో హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ హాస్పిటళ్ల నుంచి 63 మంది ఉండటం విశేషం. దేశవ్యాప్తంగా టైప్–1 డయాబెటిస్‌తో బాధపడుతున్న పిల్లల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థ 'చేంజింగ్ డయాబెటిస్ ఇన్ చిల్డ్రన్' పేరిట 8 రాష్ట్రాల్లో 14 ఎక్సలెన్స్ కేంద్రాలు (సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్) ఏర్పాటు చేసి సేవలందిస్తోంది. ఈ కేంద్రాల ద్వారా 2025 జనవరి నుంచి మార్చి వరకు జరిపిన పరీక్షల్లో 291 కొత్త టైప్–1 డయాబెటిస్ కేసులు గుర్తించారు. కౌన్సిలింగ్ కోసం 3,779 ఫాలో–అప్ విజిట్స్ నిర్వహించారు. మొత్తం 4,070 మంది బాధితులు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ప్రధానంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కాశ్మీర్, అస్సాం, కర్ణాటక, తమిళనాడు, ఆగ్రా (ఉత్తరప్రదేశ్)లో ఉన్న 14 ప్రసిద్ధ వైద్య సంస్థల్లో ఏర్పాటు చేశారు. వీటిలో బెంగళూరులోని కర్ణాటక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎండోక్రినాలజీలో అత్యధికంగా 36 కొత్త కేసులు గుర్తించగా, హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ అత్యధికంగా 537 ఫాలో–అప్ కేసులతో నిలిచింది. కొత్తగా 35 టైప్ 1 డయాబెటిస్ కేసులు వెలుగు చూశాయి. తరువాత స్థానాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ (చెన్నై)– 35 కొత్త కేసులు, 416 ఫాలో–అప్స్, గాంధీ మెడికల్ కాలేజ్ (హైదరాబాద్) 28 కొత్త కేసులు, 542 ఫాలో–అప్స్, ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ (బెంగళూరు) 28 కొత్త కేసులు, 503 ఫాలో–అప్స్‌తో ఉంది. ఇవి కాకుండా నోయిడా, జమ్మూ, ఢిల్లీ, గువాహటి, శ్రీనగర్‌లలో కూడా కేసులు వెలుగు చూశాయి. డయాబెటిస్‌తో బాధపడుతున్న ప్రతి పిల్లవాడికి చికిత్స అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తున్నట్లు డాక్టర్ విజయ్ తెలిపారు.

ఎగ్ కాంట్రాక్టు.. మరో నెల లేటు

అంగన్‌వాడీలకు కోడిగుడ్ల సరఫరా టెండర్ల గడువు పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడి కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో నెలపాటు పొడిగించింది. టెండరు విధానంలో నిర్దేశించిన నిబంధనలు కొంతమందికే అనుకూలంగా ఉన్నాయనే అంశంపై 'సాక్షి' దినపత్రికలో ప్రత్యేక కథనం రావడంతో స్పందించిన ప్రభుత్వం మొదట ఒకసారి గడువును పొడిగించింది. అలాగే, పౌల్ట్రీ రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అధికారుల వైఖరిపై ఫిర్యాదులు చేయడంతో తాజాగా మరోసారి గడువును పొడిగించారు. 37,500 అంగన్‌వాడి కేంద్రాలకు ఏడాదిలో 36.96 కోట్ల గుడ్లు సరఫరా చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ.. ఆ మేరకు రాష్ట్రంలోని ఏడు జోన్ల పరిధిలో ఏడుగురు కాంట్రాక్టర్ల ఎంపికకు టెండర్లను పిలిచి, ఈ నెల 11న టెండర్లు తెరవాలని నిర్ణయించుకుంది. అయితే టెండరు నిబంధనలు పాత కాంట్రాక్టర్లకు అనుకూలంగా, కొత్తవారికి ప్రతిబంధకంగా ఉన్నాయనే అంశాలను ప్రస్తావిస్తూ ఈ నెల 6న 'సాక్షి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ.. టెండరు నిబంధనల్లో సవరణలు చేస్తూ గడువు తేదీని ఐదు రోజులు పొడిగించింది. అయినప్పటికీ ప్రధాన నిబంధనల్లో సవరణలు చేయలేదంటూ పౌల్ట్రీ రైతులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన టెండర్ల గడువును పొడిగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో శిశుసంక్షేమ శాఖ.. మే 15 వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, 16న కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తామని ప్రకటిస్తూ సవరణ నోటిఫికేషన్ జారీచేసింది. కాగా, టెండర్ నిబంధనలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. పలువురు పౌల్ట్రీ రైతులు హైకోర్టులో ప్రజాప్రయోజనవ్యాజ్యం వేసినట్లు తెలిసింది.

పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు నోటీసులు



గచ్చిబౌలి: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో చేసిన రీట్వీట్‌కు సమాధానం ఇవ్వాలని రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీచేశారు. కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో టీజీఐఐసీ చేపట్టిన చదును పనులపై అనేక మంది సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు ప్రచారం చేశారని ఇప్పటికే పలువురిపై గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో వరుసగా ఉన్న జేసీబీల ఎదురుగా నిలబడి ఉన్న జింకలు, నెమళ్లు ఉన్న ఫొటోను ఆమె రీట్వీట్ చేశారు. మార్చి 31న చేసిన ఈ రీట్వీట్‌పై స్మితా సబర్వాల్‌కు ఏప్రిల్ 12న గచ్చిబౌలి పోలీసులు బీఎన్ఎస్ఎస్ 179 సెక్షన్ కింద నోటీసులు జారీచేశారు. నోటీసుకు సమాధానం ఇవ్వాలని మాత్రమే నోటీసులిచ్చామని పోలీసులు తెలిపారు.

ఏఐ కంపెనీలతో కలిసి రైతులకు మేలు చేస్తాం



సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వాడుకుంటాం:మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయం చేసే రైతుకు అండగా ఉండేందుకు ఏఐని విస్తృతంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పంటలలో చీడపీడలను ముందుగానే గుర్తించి అలర్ట్ చేయడం నుంచి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటనష్టం అంచనా వేయడం, పంట దిగుబడులు అంచనా వేయడం వరకు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. సచివాలయంలో బుధవారం ఆయన వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపితో పాటు వివిధ సాంకేతిక కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నమోదైన సాగువిస్తీర్ణాలను ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా లెక్కించే అధునాతన సాంకేతికతను కూడా వ్యవసాయ శాఖ వినియోగించుకుంటుందని తెలిపారు. ప్రతి అంశంలో ఏఐని వాడుకుంటూ రైతులకు మేలు చేసేలా వివిధ కంపెనీలతో తమ ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని తెలియజేశారు. సమావేశానికి హాజరైన ఇక్రిశాట్, అగ్రివాస్ కంపెనీ ప్రతినిధులు వివిధ రాష్ట్రాలలో సాంకేతికతను వినియోగించి వారు అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు.



సమావేశంలో జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, తెలంగాణ చలనచిత్రాభివృద్ధి సంస్థ ఎండీ ఎస్.హరీశ్

గద్దర్ అవార్డుల జ్యూరీ భేటీ

- జయసుధ అధ్యక్షతన 15 మందితో జ్యూరీ ఏర్పాటు
- మొత్తం నామినేషన్లు 1,248.. వ్యక్తిగత కేటగిరీలో వచ్చినవి 1,172
- 14 ఏళ్ల తరువాత మళ్లీ చలనచిత్ర అవార్డులు
- నిష్పక్షపాతంగా పరిశీలించాలని జ్యూరీకి ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు సూచన

సాక్షి, హైదరాబాద్: చలనచిత్ర అవార్డుల ఎంపిక కోసం ప్రముఖ నటి జయసుధ చైర్‌పర్సన్‌గా ఏర్పాటైన జ్యూరీ తొలిసారి బుధవారం చలనచిత్రాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సమావేశమైంది. జయ సుధ అధ్యక్షతన మొత్తం 15 మంది సభ్యులతో ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది. జ్యూరీ సమావేశం సందర్భంగా చలనచిత్రాభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ.. అవార్డుల కోసం వచ్చిన నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సభ్యులను కోరారు. తెలుగు చలన చిత్ర రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. 14 ఏళ్ల తరువాత అవార్డులు ఇస్తున్న నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో కంటే అధికంగా నామినేషన్లు వచ్చాయని ఆయన తెలిపారు. జ్యూరీకి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సవాల్‌గా తీసుకుని ఎంపిక ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు జయసుధ తెలిపారు. తెలంగాణ చలనచిత్రాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.హరీశ్ మాట్లాడుతూ.. ప్రముఖ నటి జయసుధ నేతృత్వంలో 15మందితో ప్రభుత్వం జ్యూరీని నియమించిన విషయాన్ని వివరించారు. గద్దర్ అవార్డులకు అన్ని కేటగిరీల్లో కలిపి మొత్తం 1,248 నామినేషన్లు అందగా, వ్యక్తిగత కేటగిరీలో 1,172 నామినేషన్లు వచ్చాయని చెప్పారు.

టీజీటీఎస్ ద్వారానే ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు.. ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ విభాగాలు తమకు అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను 'తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్' (టీజీటీఎస్) ద్వారానే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్ అన్ని ప్రభుత్వ శాఖలను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్ కొనుగోలు, వెబ్ డిజైన్ల లాంటి 17 సేవలను 'నోడల్ ఏజెన్సీ'గా ఉన్న తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్‌కు మాత్రమే అప్పగించాలని అన్ని ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. 'ప్రభుత్వ పాలనా వ్యవహారాలన్నింటినీ కంప్యూటరైజేషన్ చేసినందున ఏ శాఖకు ఆ శాఖ సొంతంగా కొనుగోళ్లు జరపడం, సాఫ్ట్ వేర్‌ను వినియోగించడం వల్ల నాణ్యతకు సంబంధించిన సమస్యలు, ధరల్లో తేడాలు ఉండే అవకాశం ఉంది. డేటా భద్రత లాంటి సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. ఈ కొనుగోళ్లు, సేవలపై టీజీటీఎస్ నిర్దేశిత సర్వీసు రుసుం వసూలు చేస్తుంది. దీనివల్ల వేతనాలు, నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వంపైన ఆధారపడకుండా తన రాబడి తనే సృష్టించుకుంటోంది. గత రెండు దశాబ్దాలకు పైగా ఐటీకి సంబంధించిన అన్ని ఉపకరణాల కొనుగోలు టీజీటీఎస్ ద్వారా జరుగుతోంది. పాత జీవోను పట్టించుకోకుండా కొన్ని శాఖలు సొంతంగానే కొనుగోళ్లు చేస్తున్నాయి. ఇకపై కొత్త ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటించాలి' అని జయేశ్ రంజన్ ఆదేశించారు.



నువ్వు అర్థం చేసుకున్నదే నువ్వు అవుతావు.
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 17 ఏప్రిల్ 2025

హార్వర్డ్ ప్రతిఘటనా స్వరం!

అంతటా ఒక అనిశ్చితి, దాన్ని మించిన సందిగ్ధత అలముకున్నవేళ నిశ్చయంగా, నిర్భయంగా వినబడిన గొంతు ఇప్పుడు అమెరికాలో సర్వత్రా ప్రతిధ్వనిస్తోంది. ఆ గొంతు ప్రపంచంలోనే అత్యుత్తమశ్రేణి విద్యాసంస్థల్లో ఒకటైన హార్వర్డ్ విశ్వవిద్యాలయానిది. ఆ విశ్వవిద్యాలయం ఇంతవరకూ లక్షలాది విద్యార్థులకు పాఠం చెప్పివుండొచ్చు. కానీ తనతో ఏకీభవించనివారిని ససేమిరా సహించని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వంటి నేతకు పాఠం నేర్పాలని చూస్తే భారీ మూల్యం చెల్లించాల్సివుంటుంది. అది తెలిసి కూడా హార్వర్డ్ దృఢంగా నిలబడటం ఈ కాలంలో అతి పెద్ద వార్త. పాలస్తీనా అనుకూల ఉద్యమకారుల్ని పట్టించి ఇవ్వాలనీ... వైవిధ్యత, సమానత, సమ్మిళిత (డీఈఐ) విధానాల ద్వారా 'అందరికీ అవకాశాలిచ్చే' పేరిట ప్రతిభపై వివక్ష ప్రదర్శిస్తున్న వైఖరి విడనాడాలనీ ట్రంప్ కొంతకాలంగా హెచ్చరిస్తున్నారు. ఒప్పుకోకుంటే నిధులు ఆపేస్తామని హుకుం జారీచేశారు. దేశంలోని 60 ప్రధాన విశ్వవిద్యాలయాల్లో చాలా భాగం ఆయన ఆదేశాలకు తలొంచాయి. కానీ హార్వర్డ్ నిర్భయంగా నిలబడింది. 'మా వ్యవహారాల్లో మీకేం పన'ని ఎదురు ప్రశ్నించింది. వర్తమాన పరిస్థితుల్లో ఈ చర్య చిన్నదేం కాదు. మొన్న జనవరిలో అధికార పగ్గాలు చేపట్టింది మొదలు ట్రంప్ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. కోర్టులనే ధిక్కరిస్తున్నారు. అక్రమ వలసదారుగా పొరబడి, ఒక పౌరుడిని ఎల్‌సాల్వెడార్ జైలుకు పంపిన వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. పొరబడ్డామని ఒప్పుకుంటూనే అతన్ని వెనక్కితేలేమని కోర్టులో ప్రభుత్వం మొండికేసింది. ఆరు నూరైనా తేవాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించగా మౌనమే జవాబైంది. మర్నాడు అమెరికా సందర్శించిన ఎల్‌సాల్వెడార్ అధ్యక్షుడు 'అతన్ని అప్పగించేది లేద'ంటూ సాక్షాత్తూ వైట్‌హౌస్‌లో ప్రకటించారు.

విశ్వవిద్యాలయాలు కళాశాలల కన్నా భిన్నమైనవి. అవి ప్రశ్నించడాన్ని ప్రోత్సహిస్తాయి. కొత్త ఆలోచనల్ని స్వాగతిస్తాయి. భిన్న ధోరణులపై పరిశోధనకు అవకాశమిస్తాయి. అందుకే అవి జ్ఞానకేంద్రాలు. ఎంతమందికి పట్టాలు పంపిణీ చేశామన్నది కాక, ఎటువంటి విశిష్ట వ్యక్తులను సమాజానికి అందించగలిగామన్నది లెక్కేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం అమెరికా సర్కారు విశ్వవిద్యాలయ పరిశోధనలకూ, సృజనాత్మక ఆవిష్కరణలకూ భారీయెత్తున ఖర్చుచేసింది. ఫలితంగా అపారసంఖ్యలో ఆవిష్కరణలు సాధ్యమయ్యాయి. అనేక కొత్త ఉపకరణాలు అందుబాటులో కొచ్చాయి. చికిత్సకు లొంగని ఎన్నో వ్యాధులు చిత్తగించాయి. ఆయుఃప్రమాణం పెరిగింది. కంప్యూటర్లు మొదలుకొని రోబోటిక్స్, కృత్రిమ మేధ వరకూ అన్నిటికన్నీ కేవలం ఈ పరిశోధనల పర్యవసానమే. లైబ్రరీలు, లేబొరేటరీలు దాటుకుని పరిశ్రమల్లో పురుడు పోసుకున్న ఉత్పత్తులు ఎన్నెన్నో! వాటివల్ల అసంఖ్యాకంగా ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పర్యవసానంగా ఇదంతా సమాజ ఆధునికతకు తోడ్పడింది. గత నెలలో విడుదలైన ఒక నివేదిక ప్రకారం జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్ఐహెచ్) నిరుడు పరిశోధనలకు వ్యయం చేసిన 3,690 కోట్ల డాలర్ల సొమ్ము 9,450 కోట్ల డాలర్ల విలువైన ఆర్థిక కార్యకలాపాలకు తోడ్పడింది. సరుకుల తయారీ, పంపిణీ, వినియోగం, ఇతర అనుబంధ సర్వీసులు ఈ కార్యకలాపాల్లో భాగం. 4,08,000 ఉద్యోగాల కల్పన సాధ్యమైంది.

కానీ ట్రంప్ సర్కారు దీన్ని అంగీకరించటం లేదు. అవి ఏం చేయాలో, చేయకూడదో నిర్దేశిస్తున్నారు. సాష్టాంగపడమంటున్నారు. అందుకు సిద్ధపడినా కనికరించటంలేదు. పేరుప్రఖ్యాతులున్న కొలంబియా విశ్వవిద్యాలయ దుస్థితే అందుకు ఉదాహరణ. ఆ క్యాంపస్‌లో కొంతకాలం క్రితం జరిగిన పాలస్తీనా అనుకూల ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులను గుర్తించి, వారి అరెస్టుకు సహకరించాలనటంతో మొదలుపెట్టి ప్రభుత్వం అనేక డిమాండ్లు పెట్టింది. మూడు డజన్లమంది 'ప్రత్యేక అధికారుల'ను తక్షణం నియమించడం అందులో ఒకటి. ఆ ప్రత్యేకాధికారులకు పాలస్తీనా అనుకూల విద్యార్థులను గుర్తించి అవసరమైనప్పుడు అరెస్టుచేసే అధికారాలున్నాయి. విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ అధ్యయనాల విభాగాన్ని పర్యవేక్షించే అధిపతిని నియమించాలన్న ప్రభుత్వ తాఖీదును సైతం ఆమోదించింది. ఆ విభాగం సిలబస్‌ను నిశితంగా పరిశీలించి మార్పులు చేర్పులూ సూచిస్తుంది. ఇన్ని చేసినా ఆ విశ్వవిద్యాలయానికి విడుదల చేయాల్సిన 40 కోట్ల డాలర్ల నిధులనూ నిలిపివేసింది. విశ్వవిద్యాలయ తాత్కాలిక అధ్యక్షురాలు కత్రినా ఆర్మ్‌స్ట్రాంగ్ ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. తాను తీసుకుంటున్న చర్యలను నిరసించిన విశ్వవిద్యాలయ ఆచార్యులకు ఇవి చిన్న చిన్న సర్దుబాట్లు మాత్రమేనని కత్రినా వివరించారు. అయినా నిధుల విడుదల జాడ లేకపోవటంతో కొలంబియా యాజమాన్యం ఆమెకు ఉద్వాసన పలికింది.

హార్వర్డ్ విశ్వవిద్యాలయం సంగతికే వస్తే, తిరుగుబాటుకు తక్షణ మూల్యం 220 కోట్ల డాలర్ల గ్రాంటు, 6 కోట్ల డాలర్ల కాంట్రాక్టులు నిలిచిపోవటం. ఇవిగాక పన్ను మినహాయింపులు కూడా ఆపేస్తామని సర్కారు బెదిరిస్తోంది. నిజానికి మొదటే ప్రధాన యూనివర్సిటీలన్నీ ప్రభుత్వ బెదిరింపులను ముక్తకంఠంతో నిరసించాల్సింది. కానీ ఇప్పటికి కూడా ఎవరికి వారు ట్రంప్ కంట్లో పడకుంటే చాలన్నట్టు ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికీ చాలా సంస్థలు గోడమీది పిల్లివాటంగా ఉంటున్నాయి. విశ్వవిద్యాలయాలపై సర్కారువారి సంపూర్ణ పెత్తనాన్ని అంగీకరించాలన్నది ట్రంప్ ఆంతర్యం. యూదు వ్యతిరేకత, వివక్ష విధానాల అమలు వంటి ఆరోపణలన్నీ పైకి చెబుతున్న కారణాలు. దీన్ని ఎంత త్వరగా గ్రహిస్తే అమెరికా విశ్వవిద్యాలయాలకు అంత మంచిది. ఇన్నాళ్లూ తాము బోధించిన విలువల కోసం నిలబడితేనే వాటి గౌరవమర్యాదలు కాస్తయినా నిలబడతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, తిథి: బ.చవితి ప.12.01 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: జ్యేష్ఠ తె.5.12 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి మూల, వర్జ్యం: ఉ.9.14 నుండి 10.58 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.55 నుండి 10.45 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, అమృత ఘడియలు: రా.7.30 నుండి 9.15 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

గనులకై యుద్ధం

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

మధ్యభారత అరణ్యాలలో ఆదివాసుల మీద, ఆదివాసుల జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ పోరాటానికి మద్దతు ఇస్తున్న మావోయిస్టుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కత్తి గట్టడం, ఆ ప్రాంతంలోని అపారమైన, సంపన్నమైన ఖనిజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే వ్యూహంలో భాగమే అని దాదాపు ఇరవై సంవత్సరాలుగా పరిశీలకులు, విమర్శకులు ఎందరో రాస్తున్నారు. సల్వాజుడుం పేరుతో 2005లో పాలకులు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టిన ఆదివాసుల మధ్య అంతర్యుద్ధం నుంచి, ఇప్పుడు 2026 మార్చ్ 31 నాటికి మావోయిస్టు రహిత ఛత్తీస్‌గఢ్ తయారు చేస్తామని ముహూర్తం నిర్ణయించి మరీ సాగిస్తున్న ఆపరేషన్ కగార్ దాకా మధ్య భారత అరణ్యాలలో చాలా నెత్తురు ప్రవహించింది. చివరి యుద్ధం అని చెప్పుకొంటున్న ప్రస్తుత దశ మొదలైన 2024 జనవరి 1 నుంచి గడచిన పదహారు నెలల్లో 400 మందికి పైగా ఆదివాసులను, మావోయిస్టులను భద్రతా బలగాలు చంపివేశాయి.

ఖనిజ వనరుల కోసమే!

ఈ మారణకాండ అంతా ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేసి, స్వస్థలాల నుంచి వారిని నిర్వాసితులను చేసి, వారి కాళ్లకింది నేలలో నిక్షిప్తమైన సంపన్న ఖనిజ వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టడానికే అని విమర్శకులు చేస్తున్న అభియోగం నిజమేనని చూపే పరిణామాలు జరుగుతున్నాయి.

కార్పొరేట్ సంస్థల రక్షణ కోసం లెక్కలేనన్ని భద్రతా బలగాల క్యాంపులు నిర్మాణమవుతున్నాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సశస్త్ర సీమా బల్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ వంటి సరిహద్దులను రక్షించవలసిన బలగాలు ఇప్పుడు మధ్య భారతంలో ఉన్నాయి. ఆ బలగాలను తీసుకుపోవడానికీ, తవ్విన ఖనిజాన్ని బైటికి తీసుకురావడానికీ నాలుగు లైన్ల, ఆరు లైన్ల రహదారుల నిర్మాణం బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వేగంగా జరిగిపోతున్నది. ఈ 'అభివృద్ధి' కార్యక్రమానికి అడ్డు వస్తారనే అనుమానం ఉన్నవాళ్ల మీదికి డ్రోన్లతో నిఘా, వైమానిక బాంబు దాడులు, వేలాది కాల్బలాలతో జల్లెడ పట్టి, చుట్టుముట్టి, ఎటువంటి ప్రతిఘటన లేకపోయినా కాల్చి చంపి ఎదురుకాల్పుల కథనాలు విడుదల చేయడం జరుగుతున్నది.



ఆ వరుసలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆ ప్రాంతంలో భూగర్భంలో నిక్షిప్తమై ఉన్న అత్యుత్తమ స్థాయి ఇనుప ఖనిజం (హెమటైట్) గనులను వేలం వేయడానికి శరవేగంతో ప్రయత్నిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఖనిజ వనరుల శాఖ 2025 జనవరి 15న సరిగ్గా ఈ హత్యాకాండల వార్తలు వస్తున్న దంతెవాడ, కాంకేర్ జిల్లాలలోని ఇనుప ఖనిజం గనుల బ్లాకులు నాలుగింటిని వేలం వేసే ప్రక్రియ ప్రారంభించింది. వీటిలో బైలదిల్లా గనులుగా ప్రఖ్యాతమైన ఖనిజ వనరుల కొండలు దంతెవాడ జిల్లా కిరండుల్ నుంచి బీజాపూర్ జిల్లా గంగలూరు దాకా వ్యాపించి ఉన్నాయి. బైలదిల్లా డిపాజిట్ 1ఎ, 1బి, 1సి, కాంకేర్ జిల్లాలోని హాహాలొద్ది అనే ఈ నాలుగు బ్లాకుల వేలం ప్రక్రియ ఫిబ్రవరి 28 దాకా సాగి, 58 ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పోటీ పడ్డాయి. చివరికి మూడు గనులను ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఇండియా, ఒక గనిని రూంగ్టా స్టీల్ దక్కించుకున్నాయి. ఈ రెండు కంపెనీలు కూడా ప్రభుత్వ వేలంపాటలో ప్రతిపాదించిన కనీస ధర కన్నా 154 శాతం, 160 శాతం ఎక్కువకు పాడుకున్నాయంటే, అక్కడ వారికి ఎంత లాభం చేకూరే అవకాశం ఉందో ఊహించవచ్చు. ఈ గనుల లీజు యాభై సంవత్సరాల పాటు ఉంటుంది గనుక ఇది రేపో మాపో వట్టిపోయే ఆవు కూడా కాదు, కామధేనువు!

> దంతెవాడ, కాంకేర్ జిల్లాలలోని ఇనుప ఖనిజం గనుల బ్లాకులు నాలుగింటిని వేలం వేసే ప్రక్రియ ప్రారంభమైంది. దండకారణ్యంలో ఏడువేల ఎకరాల అడవి నేల మట్టమై 'అభివృద్ధి' జరగబోతున్నది.

ఇప్పటివరకూ బైలదిల్లా గనుల్లోకి ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) తప్ప ప్రైవేటు కంపెనీలు ప్రవేశించలేదు. ఇప్పటివరకూ ఆర్సెలార్ మిత్తల్ తనకు అవసరమైన ఖనిజాన్ని ఎన్ఎండీసీ నుంచి తీసుకుని పైప్ లైన్ ద్వారా విశాఖపట్నం పంపుతుండేది. ఇప్పుడీ వేలంతో ఆ కంపెనీకి సొంత గనులు వచ్చాయి.

వీటిలో బైలదిల్లా 1ఎ, 1బి ఒక్కొక్కటీ 2,100 ఎకరాలు, 1సి 1,976 ఎకరాలు, హాహాలొద్ది 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ నాలుగు బ్లాకులతోనే దట్టమైన దండకారణ్యంలో దాదాపు ఏడు వేల ఎకరాల అడవి నేలమట్టమైపోయి 'అభివృద్ధి' జరగబోతున్నది. ఈ నాలుగు బ్లాకులూ కలిసి దాదాపు ముప్పై కోట్ల టన్నుల ఉత్తమశ్రేణి ఖనిజం తవ్వబోతున్నారు. ఇటువంటి లెక్కలలో తాము కాగితాల మీద పొందినదానికన్న ఎక్కువ విస్తీర్ణపు గనులు తవ్వి, మరింత ఎక్కువ ఖనిజాన్ని దోచుకుపోవడం అందరికీ తెలిసిందే. వేలం ప్రక్రియలో చెప్పిన మేరకే తవ్వుతారని అనుకున్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారమే ఈ నాలుగు గనుల ఖనిజం విలువ ఒక లక్షా ఇరవై వేల కోట్ల రూపాయలు. కాగా, ప్రభుత్వానికి దక్కే ఆదాయం ఇరవై వేల కోట్ల రూపాయలు మాత్రమే!

ఈ రాష్ట్రంలో ఇంతకుముందే ఎన్ఎండీసీ, రాష్ట్ర ప్రభుత్వ ఛత్తీస్‌గఢ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సీఎండీసీ)తో కలిసి సంయుక్త సంస్థను ఏర్పరచి, గనులకు పర్యావరణ అనుమతులు సంపాదించి, ఆ గనులను తవ్వకం, ఖనిజాభివృద్ధి కార్యకలాపాలకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు ఇచ్చింది. ఖనిజ సంపన్నమైన ఈ రాష్ట్రంలో ఇప్పటికే అంబుజా, బిర్లా, ఎస్సార్, జిందాల్, జె కె లక్ష్మి, లఫార్జ్, ఎల్ అండ్ టి, వేదాంత వంటి కార్పొరేట్ దిగ్గజాలన్నీ ఉన్నాయి.

ఇది పలు రకాల సమస్య

ఇది ఆదివాసులకో, మావోయిస్టులకో సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది ముహూర్తాలు నిర్ణయించి మనుషులను చంపవచ్చునా అనే మానవతా సమస్య, నాగరికతా సమస్య. పర్యావరణ సమస్య, దేశ సంపద ఎవరికి చెందాలనే సమస్య, అటవీ హక్కుల చట్టం, పంచాయత్ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం వంటి చట్టాల ఉల్లంఘన సమస్య. రాజ్యాంగ ఆదర్శాలు, ప్రజల హక్కులు అమలవుతున్నాయా అనే సమస్య. మనందరి సమస్య!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

చర్చలే మార్గం

అభిప్రాయం



పాణి

రాజకీయాల కొనసాగింపే యుద్ధం. ప్రజా రాజకీయాలకైతే శాంతి కూడా ఒక గొప్ప కొనసాగింపే. ప్రజా యుద్ధానికి ప్రాధాన్యం ఉన్నట్లే, ప్రజలకు మేలు చేసే అర్థవంతమైన శాంతికీ ప్రాధాన్యం ఉంటుంది. అయితే తరచూ 'శాంతి' విపరీత అర్థాలకు దారి తీస్తుంది. ప్రజలను నిష్క్రియాపరులుగా మార్చే ప్రక్రియగా శాంతి మారిపోయే ప్రమాదం ఉంటుంది. శాంతి కోసం చేసే ఏ ప్రయత్నమైనా అర్థవంతమైన, చైతన్యవంతమైన సామాజిక సాంస్కృతిక క్రమంగా మారాలి. సారాంశంలో శాంతి కోసం చేసే యత్నం ప్రజా ఆకాంక్షలను తీర్చే రాజకీయ ప్రక్రియ అవుతుందా, లేదా? అనేదే గీటురాయి.

చర్చల వాతావారణం లేదా?

యాభై ఏళ్లుగా ప్రజల్లో ఉన్న మావోయిస్టులకు ప్రజా యుద్ధం మీద గురి ఉన్నట్లే శాంతి పట్ల కూడా ఉన్నది. శాంతి చర్చలు విప్లవకారులకు ఎత్తుగడల వ్యవహారం కాదు. అదొక రాజకీయ విధానం. మావోయిస్టుల ఉద్యమానికి తీవ్రమైన సవాళ్లు ఎదురైనందువల్ల వాళ్లు శాంతి చర్చలకు సిద్ధపడ్డారనే వాదన వినిపిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 'అంతిమ యుద్ధం' వల్ల బలహీనపడి చర్చలకు అంగీకరించారనే వాదనా ఉన్నది. శాంతి చర్చలకు గతంలో ఉన్న సానుకూల వాతావరణం ఇప్పుడు లేదనే అభిప్రాయం కూడా కొంత మందిలో ఉన్నది. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాంతి చర్చలు జరగడానికి ఆనాడు విప్లవోద్యమం శక్తిమంతంగా ఉండటమే కారణమని విశ్లేషిస్తున్న వాళ్లూ ఉన్నారు.

ఇలాంటి పరిశీలనలు ప్రధానంగా గణాంకాల మీద ఆధారపడి ఉంటాయి. పోలీసులు వీటికి ప్రాధాన్యం ఇస్తుంటారు. అంత మాత్రాన గణాంకాలను విస్మరించాల్సిన పనిలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 2004 ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'నేను కావాలో, నక్సలైట్లు కావాలో' తేల్చుకోమని ప్రజల ముందుకు వెళ్లారు. తిరుపతిలో ఆయన మీద పీపుల్స్‌వార్ దాడి చేశాక, అర్ధంతరంగా అసెంబ్లీని రద్దు చేసి సానుభూతి ఓట్ల కోసం ఎన్నికలకు వెళ్లారు. ఘోరంగా ఓడిపోయారు. ఇంకోపక్క ప్రతిపక్ష కాంగ్రెస్ తాను అధికారంలోకి వస్తే నక్సలైట్లతో శాంతి చర్చలు జరుపుతానని ఎన్నికల ఎజెండాలోనే ప్రకటించింది.

నిస్సందేహంగా ఇప్పుడు అట్లాంటి పరిస్థితి లేదు. కానీ ఆ తర్వాతి సంవత్సరం నుంచి 'మావోయిస్టు సమస్య'ను కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోకి తీసుకుంది. ఎన్‌కౌంటర్ల నుంచి సైనిక బలగాలతో, వైమానిక దాడులతో తీవ్ర యుద్ధ రూపంలోకి నిర్బంధం వెళ్లిపోయింది. విప్లవకారులు కూడా అంతకు ముందెన్నడూ లేని విధంగా పదుల సంఖ్యలో చని పోతున్నారు. ప్రతి సంఘటనలో విప్లవకారులతోపాటు అంతకంటే ఎక్కువ మంది సాధారణ ఆదివాసులు ప్రాణాలు కోల్పోతున్నారు. రాజ్యం తన ప్రజల మీద యుద్ధం చేస్తున్నదని విప్లవోద్యమంతో ఏకీభావం లేని వాళ్లు కూడా అనే పరిస్థితి ఏర్పడింది. ఈ యుద్ధం ప్రభుత్వ అభివృద్ధి నమూనాకు కొనసాగింపు అని ఇప్పుడు చాలామంది అంటున్నారు. ప్రధాన స్రవంతి పత్రికలు కూడా మధ్యభారతదేశంలో సహజ వనరుల కోసం జరుగుతున్న కార్పొరేట్ యుద్ధంగా దీన్ని ప్రస్తావిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా మావోయిస్టులందరినీ చంపేస్తామని కేంద్ర హోంమంత్రి పదే పదే అంటున్నారు. ఒక రాజకీయ సిద్ధాంత పోరాటాన్ని నిర్వహిస్తున్న విప్లవకారులందరినీ నిర్మూలించడం సాధ్యమా? అనేది అటుంచితే, ఆ పేరుతో ఆదివాసులందరినీ చంపేసే ప్రమాదం ఉందని ప్రజాతంత్ర శక్తులు ఆందోళన పడుతున్నాయి.

> యాభై ఏళ్లుగా ప్రజల్లో ఉన్న మావోయిస్టులకు ప్రజా యుద్ధం మీద గురి ఉన్నట్లే శాంతి పట్ల కూడా ఉన్నది. శాంతి చర్చలు విప్లవకారులకు ఎత్తుగడల వ్యవహారం కాదు. అదొక రాజకీయ విధానం.

మారిన పరిస్థితులు

ఇంత ఉద్రిక్త స్థితి గతంలో శాంతి చర్చల ప్రతిపాదనలు వచ్చినప్పుడు లేదు. అంతర్యుద్ధం మధ్యలో ప్రజాస్వామికవాదులు నిలబడి శాంతి చర్చల ప్రతిపాదనలు చేస్తున్నారు. చరిత్ర ఎన్నడూ ఒకేలా పునరావృతం కాదు. చరిత్రలోని ఏ ఒక్క అంశం పాత అనుభవానికి నకలుగా ముందుకు రాదు. అదీ తీవ్రమైన సంక్షోభం నడుస్తున్న సమయంలో సమస్యలూ, పరిష్కారాలూ చాలా గతిశీలంగా ఉంటాయి. అనేక తలాల్లో భిన్న శక్తులు తలపడుతున్నప్పుడు అణచివేత, దోపిడీ గతంలాగే ఉండవు. వాటిని పరిష్కరించడానికి చేసే ప్రయత్నాలూ ఒకప్పటిలాగే ఉండవు. 2004తో పోల్చితే ఇప్పుడు దేశమే ఒక కొత్త చారిత్రక దశలోకి చేరుకున్నది. 2004 కంటే, 2014 కంటే కూడా, ఇది భిన్నమైనది. అంతర్జాతీయంగా కూడా సంక్షోభాలూ, పరిష్కారాలూ కొత్త చారిత్రక రంగస్థలం మీద తలపడుతున్నాయి. దేనికి ఎంత బలం ఉంది? దేనికి ఎంత సానుకూలత ఉంది? అనే విశ్లేషణ ఎంతయినా చేయవచ్చు. మొత్తంగా అంతర్జాతీయంగా కూడా యుద్ధంలో కూరుకుపోయిన ప్రజలు తిరగబడుతూనే ప్రతిఘటనలో భాగంగా శాంతిని కోరుకుంటున్నారు. అంతర్యుద్ధంలో చిక్కుకుపోయిన మధ్యభారత ప్రజలూ కూడా సుమారుగా అంతే!


కార్పొరేట్ ఇండియా స్థాపనకు మావోయిస్టు ఉద్యమం ఆటంకంగా ఉన్నందువల్లనే ఆపరేషన్ కగార్‌ను నడుపుతున్నామని చెప్పడం ద్వారా కేంద్రం ఈ విషయాన్ని జనాంతికంగా మార్చేసింది. మన సమాజం నిద్రాణంగా ఉందని, ఎవరికీ ఏదీ పట్టదనే అభియోగాలు వినిపిస్తున్న తరుణంలో అది పూర్తి నిజం కాదని గత పదిహేను రోజులుగా వినిపిస్తున్న శాంతి చర్చల ఆకాంక్షలు రుజువు చేస్తున్నాయి. ఈ అవసరానికి తగిన అనుకూల వాతావరణం కల్పించడానికి ప్రజాస్వామిక శక్తులు ముందుకు వచ్చాయి. ప్రజా ప్రయోజనాల పట్ల స్పష్టత ఉన్నందు వల్లే మావోయిస్టులు శాంతి చర్చలకు సమ్మతిని తెలియజేశారు. దీంతో శాంతి చర్చలకు ఒక వైపు నుంచి పూర్తి సానుకూలత ఏర్పడింది.

మరి ప్రభుత్వాలు కూడా ప్రజా ప్రయోజనాలే తమ లక్ష్యమని చెప్పుకుంటూ ఉంటాయి కదా! రాజ్యాంగబద్ధతను ప్రకటించుకుంటూ ఉంటాయి కదా! వాటి ప్రకారం తన ప్రజల మీదనే యుద్ధం చేయడాన్ని ఎట్లా సమర్థించుకుంటాయనేది పూర్తిగా వేరే సంగతి. కానీ ఆ ప్రజల ప్రయోజనాల కోసమే శాంతి చర్చలు జరగాలని కోరుకుంటున్న పౌర సమాజపు ఆకాంక్షనైనా మన్నించాలి కదా! ఆ దిశగా ప్రభుత్వం ఎట్లాంటి అడుగులు వేస్తుందో వేచి చూడాల్సిందే.

వ్యాసకర్త విరసం కార్యవర్గ సభ్యుడు । 98661 29458

మార్పు మంచిదే... ఆత్మనే మార్చకూడదు కదా!

కామెంట్



కరణ్ థాపర్

'డూన్' స్కూల్‌లో బాలబాలికలు కలిసి చదువుకోవడాన్ని (కో–ఎడ్యుకేషన్) ప్రవేశపెట్టాలా? ఇది కొత్త ప్రశ్నేం కాదు. 2010లో చివరిసారి దీనిపై చర్చ జరిగింది. అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ స్కూల్ 75వ ఫౌండర్స్ డే కార్యక్రమంలో ఈ అంశం ప్రస్తావించారు. ఆమె ప్రతిపాదన విని మగపిల్లలు ముసిముసిగా నవ్వుకున్నారు. ఈ ఆలోచన వారి గుండెల్లో వెచ్చదనం నింపివుంటుంది. పెద్దవారికి మాత్రం ఇదేం రుచించలేదు. కేవలం మగపిల్లల కోసం నెలకొల్పిన డూన్ స్కూల్ ఇండియాలోనే ప్రతిష్ఠాత్మక ఆశ్రమ పాఠశాల (బోర్డింగ్ స్కూలు) అని యాజమాన్యం భావిస్తుంది.

సమాజంలో లింగ సమానత్వం ఉండాలన్న భావనతో ప్రతిభా పాటిల్ ఈ వ్యాఖ్య చేసి ఉంటారని ఆహూతులు భావించారు. 'వెల్హామ్ గరల్స్' లేదా 'మహారాణి గాయత్రీ దేవి' లేదా ఇండియాలో ఉన్న అనేక 'లొరాటో కాన్వెంట్స్' స్కూళ్లు 'గరల్స్ ఓన్లీ' (బాలికల) పాఠశాలలుగానే కొనసాగుతున్నాయి. అందుకు లేని అభ్యంతరం డూన్ స్కూల్ విషయంలో ఎందుకు?

తొలుత ఎలా ప్రారంభమయ్యాయో అలాగే కొనసాగే హక్కు స్కూళ్లకు ఉండాలి. ఇది కో–ఎడ్యుకేషన్‌కు వ్యతిరేక వాదన అని పొరబడకండి. స్కూళ్ల హక్కుకు సంబంధించిన సమర్థన మాత్రమే. వాస్తవానికి, మనకు కో–ఎడ్యుకేషన్ విద్యాసంస్థలు ఉండి తీరాల్సిందే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అదే విధంగా, కేవలం బాలురకు, అలాగే కేవలం బాలికలకు మాత్రమే ఉద్దేశించిన పాఠశాలలూ ఉండాలి.

15 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ ప్రశ్న మీద చర్చ మొదలైంది. 2010లో మాదిరిగా ఏదో యథాలాపంగా కాకుండా, ఈ అంశం మీద ఇప్పుడు పకడ్బందీగా చర్చ జరుగుతోంది. ప్రపంచం మారుతోంది. సమతుల్యం, సమ్మిళితం, వైవిధ్యం ... వీటితో కూడిన విద్యాభ్యాస వాతావరణాన్ని కో–ఎడ్యుకేషన్ అందిస్తుంది. బాయ్స్ ఓన్లీ స్కూళ్లలో సాంప్రదాయిక పురుషత్వ భావనలతో కూడిన వాతావరణం నెలకొని ఉంటుంది. సహవిద్యే దీనికి విరుగుడు. పరస్పరం ఎలా గౌరవించుకోవాలో, ఒకరి నుంచి మరొకరు ఎలా నేర్చుకోవాలో బాల బాలికలు ఉభయులకూ కో–ఎడ్యుకేషన్ వ్యవస్థ నేర్పిస్తుంది. ఇదీ ప్రస్తుతం డూన్ స్కూల్ సహవిద్యకు అనుకూలంగా సాగుతున్న వాదన. వీరు లేవనెత్తుతున్న ఈ అంశాలతో ఎలాంటి పేచీ లేదు. ఇవి మంచి వాదనలు. అయితే, వీటిని తోసిపుచ్చేందుకూ ఇంతే బలమైన, ముఖ్యమైన ఇతర కారణాలు ఉన్నాయి.

డూన్ స్కూల్‌కు ఒక గుర్తింపు ఉంది. అది దాదాపు వందేళ్ల పురాతనమైంది. ఎవరెన్ని చెప్పినా, సంప్రదాయం ముఖ్యమైంది. 'మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలి' అంటూ సంప్రదాయాన్ని గాలికి వదిలేయ కూడదు. సహవిద్యా విధానం అనేది డూన్ స్కూల్ అస్తిత్వాన్నీ, వ్యవస్థాపకుడి ఆశయాన్నీ మౌలికంగా మార్చివేస్తుంది. కాబట్టే, ఇంగ్లండులో అనేక వందల ఏళ్ల సుప్రసిద్ధ చరిత్ర కలిగిన ఈటన్ కాలేజీ, హ్యారో పాఠశాలలు మారలేదు.

స్కూల్ సంస్కృతినీ ఈ సందర్భంగా మనం పరిగణనలోకి తీసుకోవాలి. దాదాపు శతాబ్ద కాలం నుంచీ డూన్ కొన్ని విలువల ప్రాతిపదికగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. అక్కడ



విద్యార్థుల ఆలనాపాలన; గురువులతో, పాత విద్యార్థులతో విద్యార్థుల స్నేహపూర్వక సాన్నిహిత్యం ఎన్నదగినవి. కో–ఎడ్యుకేషన్ అయినా, కాకున్నా కొన్ని ఇతర ప్రముఖ పాఠశాలలకూ ఇలాంటి ఔన్నత్యం ఉంటుంది. కాదనడం లేదు.

మరో ముఖ్యమైన వాస్తవం ఏమిటంటే, కో–ఎడ్యుకేషన్ విద్యాసంస్థగా అవతరించడానికీ, అందుకు అవసరమైన వసతులు కల్పించడానికీ, ఇతర మార్పులు చేయడానికీ డూన్ క్యాంపస్ ఎంతమాత్రం సరిపోదు. అయినా సరే బాలికలకు ప్రవేశం కల్పించాలీ అంటే బాలుర సంఖ్యను కుదించాల్సి వస్తుంది. నిజంగా ఇది అవసరమా?

మేయో కాలేజీని సహవిద్యాభ్యాస సంస్థగా మార్చక పోవడానికి బహుశా ఇదే కారణమై ఉంటుంది. బదులుగా, 'మేయో గరల్స్ స్కూల్'ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. డూన్ స్కూలుకు కూడా ఈ అవకాశం ఉంది. నిజానికి, ఇలా చేయడం మరింత అర్థవంతంగా ఉంటుంది.

డూన్ స్కూల్ విషయంలో ఈ చర్చ కంటే ముఖ్యమైంది... స్కూలు పనితీరు విద్యాపరంగా మెరుగుపడాలి. క్రీడా సదుపాయాలు పెరగాలి. అలాగే ఇతర మౌలిక సదుపాయాలు పెంచాలి. ఇవన్నీ సమకూర్చుకోవడమే స్కూలు ప్రథమ ప్రాధాన్యం! కో–ఎడ్యుకేషన్ కాదు!!

డాస్కోస్ (డూన్ స్కూల్ బాయ్స్ తమకు తాము పెట్టుకున్న పేరు)కు అమ్మాయిల ప్రపంచం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీన్ని ఎవరూ కాదనరు. దగ్గర్లోనే ఉన్న వెల్హామ్ వంటి గరల్స్ స్కూల్స్‌తో డూన్ భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. వెల్హామ్‌లో డాస్కోస్ అక్కలు, చెల్లెళ్లు, కజిన్స్ చాలామంది చదువుతుంటారు. ఉభయులూ కలిసి అనేక విద్యా, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి చేపట్టడం సాధ్యమే. కో–ఎడ్యుకేషన్ కంటే ఇది సరైనది. అర్థవంతంగానూ ఉంటుంది.


మార్పు అనేది ఇతర సంస్థలకే పరిమితం కాదు. డూన్ స్కూల్ కూడా ఎప్పటికప్పుడు మార్పును అందిపుచ్చుకోవాలి. అంటే దాని మౌలిక స్వరూపమే మారాలని కాదు. మార్పును స్వాగతించడం నిర్మాణాత్మకమైనది. పరిపూర్ణత్వం కోసం పొరపాటు లక్ష్యాన్ని నిర్ణయించి, ఏదో మంచి జరుగుతుందనే నమ్మకంతో అసలు ఆత్మనే మార్చాలనుకోవడం విధ్వంసాత్మకం. అమూల్యమైన, గౌరవనీయమైన ఒక బాయ్స్ స్కూల్‌గా కొనసాగే హక్కును డూన్ స్కూల్ ఇప్పటికే సాధించింది. అలా కొనసాగనిద్దాం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

యద్భావం తద్భవతి

నీ సమస్యలను గురించి నీవు ఎంత ఎక్కువగా ఆలోచిస్తే లేక ఇతరులకు వివరిస్తే, వాటికి అంత ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినట్లు అర్థం. వాస్తవంగా, సమస్యలు వాటంతట అవి లేనే లేవు. కేవలం నీ మనస్సు వాటికి గుర్తింపు ఇచ్చి, ప్రాణం పోస్తున్నది. నీ నిజ తత్త్వం ఆనందమే... అనగా నీవు ఆనంద స్వరూపుడవు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

కాబట్టి నీవు నిరాశ, నిస్పృహలకు గురి కాకూడదు. ఇందుకు భిన్నంగా 'నేను చాలా ఆనందంగా ఉన్నాను' అన్న ధోరణిని అలవరచుకోవాలి. నీవు నోట ఏమి పలుకుతావో అది నీ లోనికి వెళ్తుంది. అది నీపై ప్రభావాన్ని కలిగి ఉంటుంది. 'యద్భావం తద్భవతి' అనే సూత్రాన్ని అనుసరించి నీ వైఖరి ఏ విధంగా ఉంటుందో అదే విధంగాగా నీవూ ఉంటావు. కాబట్టి నీవు సంతోషంగా ఉండాలంటే ఎల్లప్పుడూ సంతోషంగా ఉన్నట్లు భావించుకోవాలి. అదే విధంగానే పలకాలి. ఇది ఆత్మవంచన కాదు. భగవంతుడు సచ్చిదానందుడు. అతని ప్రతిరూపమే నీవు. కేవలం అజ్ఞానం వలన నీవు దుఃఖాన్ని గూర్చి లేక బాధను గూర్చి ఆలోచిస్తావు. కాబట్టి ఈ క్షణం నుండి నీవు సద్భావపూరితమైన ప్రవర్తనను అలవరచుకోవాలి. ఇందువలన సమస్యలు, దుఃఖం అనే అంశాలు ఏ విధంగా పారిపోతాయో చూడు!

గురువును ఏ విధంగా సంతోష పెట్టవచ్చు? నీవు 'అహా'న్ని విడచిపెట్టడానికి చేసే 'సాధన', 'భక్తి' వంటి వాటి వల్ల గురువు సంతోషపడతాడు. గురు – శిష్య సంబంధం వ్యాపారపరమైనది కాదు. ఇందుకు భిన్నంగా... ఆ సంబంధం శ్రద్ధ, భక్తి, సేవలపై ఆధారపడి ఉంటుంది. ఈ లక్షణాలు భక్తునిలో ఉంటే, అవే గురువుకు శ్రేష్ఠమైన అర్పణలు అవుతాయి.

క్లుప్తంగా...

తాగునీటి కోసం ప్రజల గోస: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: మిషన్ భగీరథ పథకం నిర్వహణలో వైఫల్యంతో పాటు నల్లాల ద్వారా కనీసం తాగు నీరు కూడా సరఫరా చేయలేని దీన స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాగునీటి కోసం ఇన్నాళ్లూ రైతులు ఇబ్బందులు పడగా, ప్రస్తుతం గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు గోస పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లే రాష్ట్రం ఎడారిగా మారింది. పొలాలు తడారి ప్రజల బతుకులు ఎడారిగా మారాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాజెక్టుల్లో నీటిని ఒడిసి పట్టలేదు. చెరువులు నిండకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ పథకం ద్వారా నీళ్ల సరఫరా చేయడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, బిందెలు, డ్రమ్ములు మళ్లీ రోడ్లపై కనిపిస్తున్నాయి. తెలంగాణ ప్రయోజనాలు పట్టని పాపాత్ముడిలా సీఎం వ్యవహరిస్తున్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి, మంత్రులు అబద్ధాల ప్రవాహాన్ని పారించడం మానేసి, ప్రజల ఇళ్లకు తాగునీటిని అందించాలి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

'కృష్ణా జలాలపై త్వరలో కేసీఆర్ కార్యాచరణ'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు దక్కాల్సిన నదీ జలాలను ఏపీ ప్రభుత్వం దోపిడీ చేస్తున్నా సీఎం, మంత్రులు మాట్లాడటం లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాటాడుతూ, కృష్ణా జలాలు తెలంగాణకు దక్కేలా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తారన్నారు.'కృష్ణా జలాల్లో 74 శాతం నీళ్లను ఏపీ ప్రభుత్వం వాడుకుందని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ధ్రువీకరించింది. బీఆర్‌ఎస్ హెచ్చరించిన తర్వాత కూడా ఏపీ 65 టీఎంసీల కృష్ణా జలా లను వాడుకుంది. కమీషన్లు దండుకోవడానికి సీఎం, మంత్రులు ప్రాధాన్యమిస్తున్నారు. తాగునీటికి కూడా కటకట ఏర్పడే పరిస్థితులున్నా మంత్రులు సమీక్షించడం లేదు. మరో పెద్ద పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. తెలంగాణకు ద్రోహం చేసిన సీఎం, మంత్రులు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి' అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

కోనో కార్పస్ మొక్కల తొలగింపు సరికాదు


- రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



సాక్షి, హైదరాబాద్: గతంలో నాటిన కోనో కార్పస్ మొక్కలపై లేనిపోని అపోహలు సృష్టించి వాటిని తొలగించడం సరికాదని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి అన్నారు. కొన్నేళ్లుగా ఈ మొక్కలపై వృక్ష శాస్త్రవేత్తలు ఏఆర్ రెడ్డి, మోహన్‌రావు, బి.యస్.రెడ్డి, లక్ష్మణరెడ్డి పరిశోధనలు చేసి వీటి వల్ల మానవ మనుగడకు ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టం చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొక్కలు మిగతా మొక్కల కంటే ఎక్కువగా కార్బన్‌డైఆక్సైడ్‌ను తీసుకొని మానవ మనుగడకు ఆధారమైన ఆక్సిజన్‌ను ఎక్కువ మోతాదులో అందిస్తాయని వివరించారు. భూగర్భ జలాలను అధికంగా తీసుకుంటుందని, ఆక్సిజన్‌ను తీసుకొని కార్బన్‌డైఆక్సైడ్‌ను విడుదల చేస్తుందనే కృత్రిమ అపోహలను ఎవరు నమ్మొద్దని లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు.

మహావీరుడి విగ్రహానికి ముప్పు

- చరిత్ర పరిశోధకుడు శివనాగిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లోనే పెద్దదైన 9 అడుగుల ఎత్తున్న మహావీరుడి అతి పురాతన విగ్రహాన్ని కాపాడాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. సిద్దిపేట పట్టణం సమీపంలోని నంగునూరు శివారులో గుట్టమీద.. రక్షణ లేకుండా భూమిలో కూరుకుపోయిన విగ్రహాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ భారీ విగ్రహం మోకాలి లోతు వరకు భూమిలో కూరుకుపోయి ఉందని చెప్పారు. ఈ అపురూప విగ్రహం చుట్టూ ఉన్న రాతిని తొలగిస్తున్నారని, దీంతో విగ్రహానికి ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే స్థానికంగా క్వారీ పనులు ఆపి ఈ జైన కేంద్రాన్ని కాపాడాలని కోరారు.

కూల్చే కుట్ర కేసీఆర్‌దే

రూ.5–6 వేల కోట్లతో మా ఎమ్మెల్యేలను కొనే ప్లాన్

కేసీఆర్ కుటుంబం ఎన్ని స్కెచ్‌లు వేసినా మా ముందు చెల్లవు

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలన్న ఆలోచన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌దేనని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నోటి వెంట వచ్చినవి కేసీఆర్ మనసులోని మాటలేనని ఆరోపించారు. రూ.5–6 వేల కోట్లు ఖర్చు చేసైనా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని కుట్ర చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన సందర్భంగా ఆ చట్టం తీరుతెన్నులు, రెవెన్యూ శాఖలో చేపడుతున్న సంస్కరణలు, రాష్ట్ర రాజకీయాలపై బుధవారం 'సాక్షి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. 'భూభారతి చట్టంపై బీఆర్‌ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. అసలు వారికి ఉరితాడు అయింది ధరణినే. అది గ్రహించకుండా మూర్ఖంగా మాట్లాడుతున్నారు. వారికి గత ఎన్నికల్లో వచ్చినన్ని సీట్లు కూడా ఈసారి రావు. 15 నెలలకే ప్రభుత్వాన్ని కూలుస్తామని కొందరి ఆత్మలు మాట్లాడుతున్నాయి. కేసీఆర్ మనసులోని మాటలనే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. రూ.5–6 వేల కోట్లు ఖర్చుపెట్టి అయినా ఎమ్మెల్యేలను కొనాలని అనుకుంటున్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు తనకు కావాల్సిన బిల్డర్లకు వేలాది ఎకరాలు కట్టబెట్టారు. ఇప్పుడు వారంతా భయభ్రాంతులకు గురై, ఫామ్‌హౌస్‌కు వెళ్లి మాజీ సీఎంకు మొరపెట్టుకున్న మాటలను ప్రభాకర్‌రెడ్డితో చెప్పించారు. ప్రభుత్వ భూములను చెరపట్టిన వారు ఏడేడు లోకాల ఆవల ఉన్నా వదిలిపెట్టం. ప్రతి ఇంచు భూమిని బరాబర్ తీసుకుని పేదలకిస్తాం. మాజీ సీఎం, ఆయన కొడుకు, అల్లుడు, కూతురు వేసే స్కెచ్‌లు, కుట్రలకు ఎలా చెక్‌పెట్టాలో కాంగ్రెస్ పార్టీ పులులకు తెలుసు. సమయం వచ్చినప్పుడు ఆ పులులు స్పందిస్తాయి' అని స్పష్టంచేశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ప్రభుత్వానికి స్పష్టత ఉందని, కోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని తెలిపారు. 'పండ్లు ఉన్న చెట్టుకే రాళ్లు వేస్తారు. మేం మంచిగా పనిచేస్తున్నందుకే కంచ గచ్చిబౌలిపై మోదీ కూడా మమ్మల్ని విమర్శిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు.

నేటి నుంచే భూ సమస్యల పరిష్కారం

రాష్ట్ర ప్రజల కోరిక మేరకే ధరణిని బంగాళాఖాతంలో కలిపేశామని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. జూన్ 2వ తేదీ నాటికి వ్యవసాయ భూముల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో వీలైనన్ని పరిష్కరిస్తామని వెల్లడించారు. భూభారతి చట్టం ద్వారా వ్యవసాయ భూముల సమస్యలను పరిష్కరించే పనిని గురువారం నుంచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 'పైలెట్ ప్రాజెక్టుగా లింగంపేట, నేలకొండపల్లి, మద్దూరు, వెంకటాపూర్ మండలాలను ఎంచుకున్నాం. ఈ మండలాల్లోని అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తాం. ఈ సదస్సుల్లో రైతుల నుంచి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తాం. ఈ దరఖాస్తు ఫార్మాట్‌ను ఇప్పటికే క్షేత్రస్థాయికి పంపాం. ప్రతి గ్రామంలో తహసీల్దార్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం పర్యటించి, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సదస్సులు నిర్వహిస్తుంది. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే కంప్యూటరైజ్ చేస్తాం. ఈ నెలాఖరుకల్లా ఆ 4 మండలాల్లోని అన్ని గ్రామాల్లో సదస్సులు పూర్తవుతాయి. ఆ 4 మండలాలతోపాటు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు రైతులతో సదస్సులు నిర్వహిస్తారు. అక్కడ కూడా దరఖాస్తులు తీసుకుంటాం. మే మొదటివారంలో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని మోడల్‌గా తీసుకుని, ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహించి, రైతుల సమస్యలను పరిష్కరిస్తాం. జూన్ 2వ తేదీకల్లా అన్ని జిల్లాల్లో వీలైనన్ని ఎక్కువ సమస్యల పరిష్కారమే మా లక్ష్యం. ఈ సదస్సుల ద్వారా పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కూడా జరుగుతుంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన పేదలను గుర్తించి వారికి పట్టాలిస్తాం. జూన్ 2న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పట్టాల పంపిణీ జరుగుతుంది. జూన్ 2 తర్వాత రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది' అని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

జీపీఓలు వచ్చాకే సర్వేమ్యాప్‌లు

రాష్ట్రంలో గ్రామ పాలనాధికారులను నియమించిన తర్వాతే సర్వే మ్యాప్‌లను అమల్లోకి తెస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. 'రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆ భూమి హద్దులతో కూడిన సర్వేమ్యాప్ కూడా అందించాలన్న నిబంధనను ఇప్పటికిప్పుడు అమల్లోకి తెచ్చే ఉద్దేశం లేదు. రాష్ట్రంలోని 10,956 రెవెన్యూ గ్రామాలకు గ్రామ పాలనాధికారులు (జీపీఓ) వస్తారు. 6 వేల మంది లైసెన్సుడ్ సర్వేయర్లు కూడా వస్తారు. ఆ తర్వాత సర్వే మ్యాప్ నిబంధన ప్రారంభమవుతుంది. ఈలోపు రైతులు ఎవరైనా స్వచ్ఛందంగా కోరుకుంటే వారి పాస్‌పుస్తకంలో సర్వే మ్యాప్ ముద్రిస్తాం. కర్ణాటకలో 9 ఏళ్లుగా ఈ సర్వే మ్యాప్ నిబంధన అమలవుతోంది. ఇప్పటివరకు 75 శాతం భూములకు మ్యాప్ అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలో అంతకంటే తక్కువ సమయంలో ఎక్కువ భూములకు సర్వే మ్యాప్‌లు వస్తాయి. జీపీఓల నియామకం విషయంలో ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశం మాకు లేదు. ఏం చేసినా ప్రజల సౌలభ్యం కోసమే. వ్యవస్థ కోసం అందరూ సహకరించాలి. పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు గూగుల్ ఫామ్ ద్వారా ఆప్షన్లు ఇచ్చే గడువును పొడిగిస్తున్నాం' అని ప్రకటించారు.

కొత్త పోర్టల్ తెస్తాం

ఇప్పుడు తెచ్చిన భూభారతి పోర్టల్ తాత్కాలికమేనని మంత్రి పొంగులేటి తెలిపారు. 'భూ సమస్యల శాశ్వత పరిష్కారం ఈ పోర్టల్‌తో కాదు. అందుకే శాశ్వత పోర్టల్‌ను తీసుకురాబోతున్నాం. మరో వందేళ్ల పాటు భూభారతి పోర్టల్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. త్వరలోనే టెండర్లు పిలుస్తాం. కొత్త పోర్టల్ తయారీకి 7–9 నెలలు పడుతుంది. ఈ ఏడాది చివరికి లేదంటే వచ్చే ఏడాది ప్రారంభం నాటికి పోర్టల్ అందుబాటులోకి వస్తుంది' అని తెలిపారు.

భూ సమస్యలపై ప్రత్యేక దరఖాస్తులు

- నేడు మద్దూరు మండలంలో ప్రారంభించనున్న పొంగులేటి
- దరఖాస్తుల పరిష్కారానికి అధికారులకు డెడ్‌లైన్

సాక్షి, హైదరాబాద్: భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మోడల్‌గా ఎంచుకున్న 4 మండలాల్లో రైతుల నుంచి ప్రత్యేక ఫార్మాట్‌లో దరఖాస్తులను తీసుకోనున్నారు. ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో నిర్వహించే సదస్సుల ద్వారా భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని మద్దూరు మండలంలో ఈ సదస్సులను గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. మే 1వ తేదీ నుంచి పరిష్కార ప్రక్రియ ప్రారంభం కావాలని, జూన్ 2వ తేదీ నాటికి ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని ఆదేశించింది.

దరఖాస్తుతోపాటు ఇవ్వాల్సింది ఇవే

భూభారతి అవగాహన సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించే దరఖాస్తులో రైతు తన వివరాలు, భూమికి సంబంధించిన వివరాలను, భూ సమస్యలను వెల్లడించాల్సి ఉంటుంది. ఇప్పటికే ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని ఉంటే, ఆ వివరాలు (మాడ్యూల్ పేరు, దరఖాస్తు సంఖ్య) కూడా దరఖాస్తుల్లో పేర్కొనాల్సి ఉంటుంది. దీంతోపాటు పాత పాసుపుస్తకం, ధరణి పాసు పుస్తకం, రిజిస్టర్డ్ డాక్యుమెంటు, కోర్టు ఉత్తర్వులు, ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు ఏవైనా ఉంటే జతపర్చాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. దరఖాస్తుదారుడు స్వదస్తూరితో దరఖాస్తులను పూరించి ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించాయి.

'యువ వికాసం' గేమ్ ఛేంజర్

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం గేమ్ ఛేంజర్‌గా మారనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం ఆయన ప్రజాభవన్‌లో ఈ పథకంపై బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'రాజీవ్ యువ వికాసాన్ని' సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దని బ్యాంకర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద రూ.6 వేల కోట్లు ఖర్చు పెట్టనుందని, బ్యాంకర్లు రూ.1,600 కోట్ల లింకేజీ రుణం ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. యువ వికాసం పథకం కింద లబ్ధిపొందే యువతకు వ్యాపారం చేసుకోవడం, లాభాలు సాధించడంపై అధికారులు శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. వ్యాపారంలో ఇబ్బందులు ఏర్పడితే శిక్షణ సంస్థలు మద్దతు ఇస్తాయని ఆయన బ్యాంకర్లకు వివరించారు. పథకం పకడ్బందీ అమలుకు జిల్లా స్థాయిలో కలెక్టర్లు.. బ్యాంకర్లతో త్వరలో సమావేశాలు నిర్వహించాలని భట్టి ఆదేశించారు. అర్హులకు మంజూరు పత్రాలు అందజేశాక రాష్ట్రస్థాయిలో మరోసారి బ్యాంకర్ల సమావేశం నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ వాటా విడుదల చేయగానే, బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు.

చివరి 50 మీటర్లు సంక్లిష్టం.. ముందుకెళ్లాలా.. వద్దా?

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయ చర్యల కొనసాగింపుపై సాంకేతిక కమిటీ ఏర్పాటు
- కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం ప్రమాదంలో మిగిలిన ఆరుగురు కార్మికుల జాడను గుర్తించడానికి చేస్తున్న ప్రయత్నాలు అత్యంత క్లిష్టంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి సాంకేతిక కమిటీని నియమించింది. ఎన్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, జీఎస్ఐ తదితర జాతీయ సంస్థలతోపాటు పలు ప్రభుత్వ విభాగాలతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాదం జరిగిన సొరంగంలోని చివరి 50 మీటర్లలో కార్మికులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగించాలా? సహాయ సిబ్బందికి ప్రాణహాని కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై వెంటనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫిబ్రవరి 22న జరిగిన ఈ ప్రమాదంలో మొత్తం 8 మంది ఆచూకీ గల్లంతవడం తెలిసిందే. సుమారు 50 రోజులుగా సహాయ చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ ఇప్పటివరకు కేవలం ఇద్దరి మృతదేహాలను మాత్రమే వెలికితీయగలిగారు. సహాయ చర్యల్లో మిగిలిన చివరి 50 మీటర్ల ప్రాంతం అత్యంత ప్రమాదకరమని.. మరింత ముందుకు వెళ్తే పైకప్పుతోపాటు రాళ్లు ఊడిపడే ప్రమాదం ఉందని జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రభుత్వానికి నివేదించింది.

గ్లోబల్ కంపెనీగా సింగరేణి

- ఇకపై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో సంస్థ విస్తరణ
- ఒడిశాలోని నైనీ గని ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ.. ఇకపై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో విస్తరిస్తుందని, త్వరలో గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్ నుంచి బుధవారం ఆయన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తిని వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. ఈ గని ప్రారంభంతో సింగరేణి సంస్థ తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. 136 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో సంస్థ తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమన్నారు. ఇది యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆనందకరమని తెలిపారు. సమస్యలతో తొమ్మిదేళ్లుగా నైనీ గని ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, తాను.. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులు సాధించామన్నారు. ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోవడం ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని చెప్పారు. దీనికి సహకరించిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీకి, అక్కడి స్థానిక ఎమ్మెల్యే అగస్తీ బెహరాకి ధన్యవాదాలు తెలిపారు.

నైనీ వద్ద 1,600 మెగావాట్ల విద్యుత్ కేంద్రం

ఒడిశాలోని అంగూల్ ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన హామీని త్వరలోనే సింగరేణి అమలు చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి ప్రభుత్వ సంస్థ అని, కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని, సామాజిక స్పృహతో అక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు. అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడానికి 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీకి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, భూ కేటాయింపుల విషయంలో ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

ఇది చరిత్రాత్మకమైన రోజు



బొగ్గును పట్టుకుని ఆనందం వ్యక్తం చేస్తున్న బలరాం

నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభించడం చరిత్రాత్మకం. అనేక అవరోధాలు, అవాంతరాలు దాటుకుని ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషంగా ఉంది. మరో 15 రోజుల్లో ఈ ప్రాజెక్టు ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రారంభమవుతుంది. జీ–10 గ్రేడ్ బొగ్గుకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. తమిళనాడు థర్మల్ సంస్థలు, జిందాల్ కంపెనీ, ఎన్టీపీసీ సంస్థలు బొగ్గు కోసం పోటీపడుతున్నాయి. బొగ్గు నిల్వలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేస్తాం.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

'గొర్రెల పథకం' కేసులో ఏడీని విచారించిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావును విచారించారు. ఈ సందర్భంగా ఆయన పథకానికి సంబంధించిన పలు రికార్డులను ఈడీ అధికారులకు అందించారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీ పథకం ద్వారా రూ.700 కోట్ల ప్రభుత్వ నిధులు పక్క దారి పట్టినట్టు ఇప్పటికే ఏసీబీ ప్రాథమిక ఆధారాలు సేకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మాజీ ఎండీ రాంచందర్‌నాయక్, మాజీ మంత్రి తలసాని మాజీ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్ తదితరులకు నోటీసులు ఇచ్చేందుకు ఈడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సురానా సంస్థల్లో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న సురానా గ్రూప్ కంపెనీల కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. సురానా అనుబంధ సంస్థలు సాయిసూర్య డెవలపర్స్, భాగ్యనగర్ ప్రాపర్టీస్‌లలో, మాదాపూర్, జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లిలో కంపెనీల గ్రూప్ చైర్మన్ నరేందర్ సురానా, మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ సురానా ఇళ్లు, కార్యాలయాల్లో ఈ సోదాలు జరిగాయి. ఈ గ్రూప్.. బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేదని, నిధులను ఇతర కంపెనీల్లోకి మళ్లించారన్న ఆరోపణలపై చెన్నై, బెంగళూరు, హైద రాబాద్‌లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వ హించారని సమాచారం. ఈ సోదాల్లో ఈడీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను సీజ్ చేసింది. అలాగే కంపెనీల చైర్మన్, ఎండీ ఆఫీసుల్లో పలు హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకుంది.

లోక్‌సభలో తెలం'గానం'

- ప్రశ్నల్లో బీజేపీ ఎంపీ ఈటల.. హాజరులో కాంగ్రెస్ ఎంపీ చామల టాప్
- 73 ప్రశ్నలతో మూడోస్థానంలో డీకే అరుణ
- 8 ప్రశ్నలతో చివరి స్థానంలో కుందూరు రఘువీర్
- 21 చర్చల్లో పాల్గొని అగ్రస్థానంలో నిలిచిన ఒవైసీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు హాజ రు శాతం.. ప్రశ్నలు అడగడంలో ఒకరితో ఒకరు గట్టిగా పోటీపడ్డారు. 2024 జూన్ 24వ తేదీ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 4వ తేదీ వరకు 18వ లోక్‌సభ నాలుగు సెషన్లలో ఎంపీల హాజరు, ప్రశ్నలు, చర్చలు, ప్రైవేట్ మెంబర్ బిల్లుల గురించి పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ గణాంకాలను అందుబాటులో ఉంచింది. ఈ జాబితా ప్రకారం తెలంగాణ ఎంపీల హాజరులో చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రశ్నలు అడగడంలో ఈటల రాజేందర్, చర్చల్లో పాల్గొనడంలో 21 చర్చలతో అసదుద్దీన్ ఒవైసీలు అగ్రస్థానంలో ఉన్నారు. కాగా ఈ 3 అంశాల్లో కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ చివరిస్థానంలో నిలిచారు. అయితే బీజేపీ ఎంపీలు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కేంద్ర మంత్రులు కావడంతో వారికి సంబంధించిన గణాంకాలు అందుబాటులో ఉంచలేదు.

- రాష్ట్రానికి, దేశానికి సంబంధించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ 80 ప్రశ్నలు అడిగి అగ్రస్థానంలో నిలిచారు. అదే సమయంలో 91.1% లోక్‌సభ సమావేశాలకు హాజరైన ఈటల 9 చర్చల్లో పాల్గొన్నారు.
- 79 ప్రశ్నలు అడిగి, 17 చర్చల్లో పాల్గొని రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరులో 100%తో మొదటి స్థానంలో నిలిచారు.
- 95% హాజరుతో బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. కొండా 18 ప్రశ్నలు అడగడంతోపాటు 6 చర్చల్లో పాల్గొన్నారు.

ఎంపీల హాజరుశాతం వివరాలు సాక్షిప్లస్ ఈ పేపర్‌లో

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- విద్యార్థినికి గాయాలు



పాఠశాలలో ఊడిన పైకప్పు



విద్యార్థిని కాలికి అయిన గాయం

ధారూరు: పాఠశాల పైకప్పు పెచ్చులూడి విద్యార్థినికి గాయాలయ్యాయి. వికారాబాద్ జిల్లా మున్నూరు సోమారంలో బుధవారం జరి గిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన ఆనందం, అనురాధల చిన్న కుమార్తె శిరీష స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. ఉదయాన్నే పాఠశాలకు వెళ్లిన విద్యార్థిని.. ఉపాధ్యాయిని కుర్చీ పక్కన నిల్చుని ఉండగా.. ఒక్కసారిగా పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. వీటిలో కొన్ని బాలిక తల, చెవులు, కాళ్లకు తగిలిగాయాలయ్యాయి. వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆమెను వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న డీఈవో రేణుకాదేవి పాఠశాలకు చేరుకుని, బాలికతో పాటు తల్లిదండ్రులను పరామర్శించారు. పెచ్చులూడిన గదితో పాటు మరో రెండు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టొద్దని హెచ్‌ఎం సరస్వతిని ఆదేశించారు. కాగా చిన్నారికి సరైన చికిత్స చేయకుండా.. ఇంటి వద్ద వదిలి వెళ్లారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్

కేంద్ర న్యాయ శాఖకు సిఫార్సు చేసిన సీజేఐ సంజీవ్ ఖన్నా

- వచ్చేనెల 14న 52వ సీజేఐగా ప్రమాణ స్వీకారం చేయనున్న జస్టిస్ గవాయ్
- రెండో దళిత ప్రధాన న్యాయమూర్తిగా రికార్డుకెక్కనున్న కొత్త సీజేఐ

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా(సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. 52వ సీజేఐగా ఆయన పేరును ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా బుధవారం కేంద్ర న్యాయశాఖకు సిఫార్సు చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం వచ్చే నెల 13వ తేదీన ముగి



యనుంది. ఆయన తర్వాత సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ గవాయ్ తదుపరి సీజేఐగా ఎంపిక కావడం లాంఛనమే. మే 14వ తేదీన నూతన సీజేఐగా జస్టిస్ గవాయ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా సేవలందించనున్నారు. ఈ ఏడాది నవంబర్ 23న ఆయన పదవీ కాలం ముగుస్తుంది. తెలంగాణకు సంబంధించిన బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌తోపాటు కంచ గచ్చిబౌలి భూముల కేసును జస్టిస్ గవాయ్ ధర్మాసనం విచారిస్తుండడం గమనార్హం. సుప్రీంకోర్టులో రెండో దళిత సీజేఐగా ఆయన రికార్డుకెక్కబోతున్నారు. తొలి దళిత సీజేఐగా జస్టిస్ కేజీ బాలకృష్ణన్ 2010లో చరిత్ర సృష్టించారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా ప్రస్థానం

జస్టిస్ బి.ఆర్.గవాయ్ 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. 1985 మార్చి 16న బార్ అసోసియేషన్‌లో చేరారు. నాగపూర్ మున్సిపల్ కార్పొరేషన్, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్, అమరావతి విశ్వవిద్యాలయ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరించారు. 1992 ఆగస్టు నుంచి 1993 జూలై వరకు బాంబే హైకోర్టు నాగపూర్ బెంచ్‌లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, అదనపు గవర్నమెంట్ ప్లీడర్‌గా సేవలందించారు. 2000 సంవత్సరం జనవరి 17న నాగపూర్ బెంచ్‌కు ప్రభుత్వ ప్లీడర్‌గా, ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 14న బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. పలు కీలకమైన తీర్పులు ఇచ్చిన రాజ్యాంగ ధర్మాసనాల్లో జస్టిస్ గవాయ్ భాగస్వామిగా ఉన్నారు.

ప్రధాన తీర్పులివే..

- జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370లోని నిబంధనలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని 2023 డిసెంబర్‌లో ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఒకరు.
- రాజకీయ పార్టీలకు అవసరమైన నిధుల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకాన్ని జస్టిస్ గవాయ్‌తో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది.
- 2016లో పెద్ద నోట్లను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో సమర్థించిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు.
- షెడ్యూల్డ్ కులాల్లో ఉప వర్గీకరణలు చేయడానికి రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధమైన హక్కు ఉందంటూ 6:1 మెజారిటీతో తీర్పు ఇచ్చిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ ఉన్నారు.
- ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఏ ఆస్తిని కూడా కూల్చడానికి వీల్లేదని జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. కనీసం 15 రోజులు ముందుగా నోటీసు ఇవ్వాలని ఆదేశించింది.
- అడవులు, జంతుజాలం, పర్యావరణం, చెట్ల పరిరక్షణకు సంబంధించిన పలు కేసులను జస్టిస్ గవాయ్ విచారించారు.

చైనాపై సుంకాలు 245%

బోయింగ్ విమానాల కొనుగోలు నిలిపివేసినందుకు అమెరికా ప్రతీకారం

- టారిఫ్ వార్‌ను ముగించే విషయంలో బంతి చైనా కోర్టులోనే ఉంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ
- అమెరికాతో చర్చల కోసం నూతన ప్రతినిధిని నియమించిన చైనా





వాషింగ్టన్/బీజింగ్: ప్రపంచంలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం నానాటికీ భీకరంగా మారుతోంది. బోయింగ్ విమానాల డెలివరీపై నిషేధం విధించినందుకు చైనాపై అమెరికా ప్రభుత్వం వెంటనే ప్రతీకార చర్యలకు దిగారు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను ఏకంగా 245 శాతానికి పెంచుతున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఫ్యాక్ట్‌షీట్ విడుదల చేసింది. అరుదైన ఖనిజాలు, వాటి ఉత్పత్తుల కోసం విదేశాలపై విపరీతంగా ఆధారపడడం వల్లే తలెత్తే భద్రతాపరమైన ప్రమాదాలపై విచారణకు ఆదేశిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారని వెల్లడించింది. అమెరికా ఆర్థిక వ్యవస్థను మరోసారి అత్యున్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'అమెరికా ఫస్ట్ ట్రేడ్ పాలసీ'ని మొదటి రోజే ప్రారంభించారని గుర్తుచేసింది. నూతన వాణిజ్య ఒప్పందాలు, సుంకాలపై 75కు పైగా దేశాలు అమెరికాతో చర్చలకు ముందుకొచ్చాయని పేర్కొంది. అందుకే ఆయా దేశాలపై సుంకాలను వాయిదా వేసినట్లు వెల్లడించింది. చైనాపై మాత్రం ప్రతీకార సుంకాలు కొనసాగుతాయని తేల్చిచెప్పింది. చైనా ఉత్పత్తులను ఇకపై అమెరికాలో విక్రయించాలంటే 245 శాతం సుంకాలు చెల్లించాల్సి ఉంటుందని ఫ్యాక్ట్‌షీట్‌లో స్పష్టంచేసింది. చైనా–అమెరికా మధ్య కొంతకాలంగా టారిఫ్‌ల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. చైనా ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 145 శాతం టారిఫ్‌లు విధించింది. అమెరికా నుంచి బోయింగ్ విమానాల కొనుగోలుపై నిషేధం విధించిన మరుసటి రోజే టారిఫ్‌లను అదనంగా 100 శాతం పెంచడం గమనార్హం. బోయింగ్ విమానాలు కొనుగోలు చేయవద్దని చైనా నిర్ణయించడం పట్ల డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒప్పందం నుంచి మధ్యలో విరమించుకోవడం సరైంది కాదంటూ మంగళవారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రత్యర్థులతో జరుగుతున్న వాణిజ్య యుద్ధంలో అమెరికా ప్రయోజనాలు కచ్చితంగా కాపాడుకుంటామని ఉద్ఘాటించారు. టారిఫ్ వార్‌ను ముగించే విషయంలో చైనాతో ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం తమకు లేదని చెప్పారు. ఆ అవసరం చైనాకు మాత్రమే ఉందన్నారు. ప్రస్తుతం బంతి చైనా కోర్టులోనే ఉందని వెల్లడించారు.

చర్చల సంధానకర్తగా లీ చెంగాంగ్ నియామకం

టారిఫ్ యుద్ధాన్ని విరమించే విషయంలో బంతి చైనా కోర్టులో ఉందని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో చైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాతో చర్చలకు మొగ్గుచూపింది. చర్చల కోసం సంధానకర్తగా లీ చెంగాంగ్‌ను నియమించింది. వాంగ్ షౌవెన్ స్థానంలో లీ చెంగాంగ్‌ను నియమిస్తున్నట్లు చైనా వాణిజ్య శాఖ బుధవారం ప్రకటించింది. 2020లో అమెరికా, చైనా మధ్య జరిగిన వాణిజ్య చర్చల్లో చెంగాంగ్ పాల్గొన్నారు. ఆయన గతంలో ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)లో చైనా రాయబారిగా సేవలందించారు.

స్టైపెండ్‌తో పాటు విమాన టికెట్

'సెల్ఫ్ డిపోర్ట్' ఆఫర్ ప్రకటించిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలోని అక్రమ వలసదారుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్తంత మెత్తబడ్డారు. 'సెల్ఫ్–డిపోర్ట్'ఆప్షన్ ఎంచుకునే వలసదారులకు విమాన టికెట్లు కొనివ్వడంతోపాటు స్టైఫండ్‌గా కొంత డబ్బు కూడా అందజేయాలనే యోచన ఉన్నట్లు ట్రంప్ తెలిపారు. ఇది అన్ని దేశాల వలసదారులకూ వర్తిస్తుందన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనీ విషయం వెల్లడించారు. ప్రస్తుతం హంతకులను మాత్రమే దేశం నుంచి పంపించివేస్తున్నామంటూనే ఆయన.. అక్రమంగా ఉంటున్న ఇతరులకు సాయపడేందుకు 'సెల్ఫ్–డిపోర్టేషన్ ప్రోగ్రామ్'ను అమలు చేయనున్నామన్నారు. సొంత దేశాలకు వెళ్లాక వీరిలో సత్ప్రవర్తన కలిగి ఉన్న వారిని తిరిగి అమెరికాకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. అయితే, ఈ పథకాన్ని ఎప్పటి నుంచి వర్తింపజేస్తారు, ఇతర వివరాలను ఆయన వెల్లడించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ట్రంప్ జనవరిలో అధ్యక్ష బాధ్యతలను చేపట్టినప్పటి నుంచి అక్రమ వలసదారులను నిర్బంధించి, వారిని బలవంతంగా సొంత దేశాలకు పంపిస్తున్న విషయం తెల్సిందే. ఇంటర్వ్యూ సందర్భంగా ఫాక్స్ న్యూస్ యాంకర్ రాచెల్ కంపోస్–డఫీ మెక్సికో వాసి వీడియో క్లిప్‌ను ప్రదర్శించారు. 'నేను ట్రంప్‌కు ఓటేయలేదు. అయినప్పటికీ నా మద్దతు ట్రంప్‌కే. నేరాలకు పాల్పడిన వారిని, నాతో సహా ఎవరినైనా సరే సొంత దేశాలకు పంపించడంలో తప్పులేదు'అని ఆ వ్యక్తి తెలిపాడు. ఇరవయ్యేళ్ల క్రితం వచ్చిన ఈ వ్యక్తి ఇప్పుడు అమెరికా పౌరుడు..భార్య, పిల్లలు కూడా ఉన్నారని యాంకర్ డఫీ వివరించారు. ఇది చూసిన ట్రంప్..తమకు కావల్సింది ఇలాంటి వాళ్లేనన్నారు. అతడికి డిపోర్టేషన్ ముప్పు ఉన్నట్లు భావించడం లేదన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించుకునే అవకాశం ఇవ్వడం ద్వారా హోటళ్లు, వ్యవసాయ క్షేత్రాల యజమానులకు సాయం చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న వాళ్లు సొంత దేశాలకు వెళ్లిపోయి, తిరిగి చట్టబద్ధంగా అమెరికా రావాలన్నదే తన ఉద్దేశమన్నారు. అయితే, ఇందుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నదీ ఆయన వెల్లడించలేదు.

వీసాల రద్దు అన్యాయం

ట్రంప్ ప్రభుత్వంపై భారత విద్యార్థి దావా

న్యూయార్క్: అధికారులు తమ స్టూడెంట్ వీసాలను అన్యాయంగా రద్దు చేశారంటూ భారతీయ విద్యార్థి సహా నలుగురు అమెరికా కోర్టులో కేసువేశారు. అధికారులు తమను నిర్బంధించి, సొంత దేశాలకు బలవంతంగా పంపించే అవకాశముందని వారు ఆరోపించారు. వీసాలను పొడిగించి, చదువులు పూర్తయ్యే వరకు ఇక్కడే ఉండనివ్వాలని భారత్‌కు చెందిన చిన్మయ్ డియోరా, నేపాల్ వాసి యోగేశ్ జోషి, చైనా విద్యార్థులు జియాంగ్‌యున్ బు, క్వియువి యంగ్ కోరారు. వీరిలో చిన్మయ్ డియోరా.. వేన్ స్టేట్ యూనివర్సిటీలో చదువుకుంటున్నారు. హోంల్యాండ్ డిపార్టుమెంట్(డీహెచ్ఎస్), ఇమిగ్రేషన్ అధికారులు తమకు ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే ఆన్‌లైన్‌లో స్టూడెంట్ అండ్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఎస్ఈవీఐఎస్)లో స్టూడెంట్ ఇమిగ్రేషన్ స్టేటస్‌ను రద్దు చేశారని ఆరోపించారు. ఎలాంటి కారణం చూపకుండా, నోటీసు ఇవ్వకుండా ప్రభుత్వం వీసా రద్దు చేయడంపై వీరి తరఫున తాము మిషిగన్ కోర్టులో కేసు వేశామని అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్(ఏసీఎల్‌యూ) తెలిపింది. వీరిపై ఎలాంటి కేసులు లేవని, వలస చట్టాలను వీరు ఉల్లంఘించలేదని పేర్కొంది. ఎఫ్–1 వీసాల రద్దు కారణాలపై సంబంధిత వర్సిటీలకు ఎలాంటి వివరణ కూడా అధికారులు ఇవ్వలేదని తెలిపింది. ట్రాఫిక్ చలాన్లు, రాంగ్ పార్కింగ్, గతంలో అధికారులతో గొడవ పడిన ఘటనలను సాకుగా చూపుతూ విద్యార్థులను బలవంతంగా పంపేయడం తగదని పేర్కొన్నారు. ఇదే అంశంపై న్యూహాంప్‌షైర్, ఇండియానా, కాలిఫోర్నియా రాష్ట్రాల్లోనూ పిటిషన్లు దాఖలయ్యాయి.

సీఈసీ, ఈసీల నియామకంపై మే14న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: 2023 చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్ల(ఈసీల) నియామకాలను చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మే 14వ తేదీన విచారించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ అంశంపై సత్వరం విచారణ చేపట్టాలంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వినతి మేరకు బుధవారం జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. మార్చి 19న సుప్రీంకోర్టు ప్రకటించిన విధంగా వాస్తవానికి ఈ పిటిషన్లపై బుధవారమే విచారణ చేపట్టాల్సి ఉంది. అయితే, భూ సేకరణకు సంబంధించిన కీలకమైన అంశాలున్నందున వాయిదా వేయాల్సి వచ్చిందని ధర్మాసనం తెలిపింది. మే 14వ తేదీన తప్పక విచారిస్తామంది.

జేఈఈ–మెయిన్ ఫైనల్ కీ కోసం వేచి ఉండండి: ఎన్‌టీఏ

వదంతులను నమ్మవద్దని సూచన

న్యూఢిల్లీ: జేఈఈ–మెయిన్ ఆన్సర్ ఫైనల్ కీని విడుదల చేసే వరకు వేచిచూడాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) బుధవారం ఇంజనీరింగ్ విద్యార్థులను కోరింది. ప్రొవిజనల్ కీలో ఇచ్చిన సమాధానాల ఆధారంగా అప్పటివరకు ఎటువంటి నిర్ణయానికి రావొద్దని సూచించింది. జేఈఈ–మెయిన్ ప్రొవిజనల్ కీలో ఇచ్చిన సమాధానాల్లో పలు తప్పులు దొర్లాయంటూ విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందుతున్న ఈ మేరకు ఎన్‌టీఏ స్పష్టతనిచ్చింది. 'పరీక్షా విధానంలో ఎన్‌టీఏ పూర్తి పారదర్శకతను పాటిస్తుంది. ఇందులో భాగంగానే ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. దీనిపై వచ్చిన అన్ని రకాల సందేహాలను పరిగణనలోకి తీసుకుంటుంది. విద్యార్థుల ఆందోళనలను, సందేహాలను నివృత్తి చేస్తుంది. అందరికీ న్యాయం దక్కేందుకు తగు చర్యలు తీసుకుంటుంది. ఫైనల్ ఆన్సర్ కీని ఇంకా వెల్లడించలేదు. ఫైనల్ ఆన్సర్ కీ ఆధారంగా మాత్రమే స్కోర్ నిర్ణయమవుతుంది. ప్రొవిజనల్ కీ ఆధారంగా ఆన్సర్లపై ఎటువంటి నిర్ణయానికి రావద్దని ఎన్‌టీఏ సూచిస్తోంది. అనవసరమైన సందేహాలకు, ఆందోళనలకు కారణమయ్యే వార్తలను నమ్మవద్దని విద్యార్థులను కోరుతోంది'అని పేర్కొంది. కాగా, జేఈఈ–మెయిన్ రెండు దశల్లో జనవరి, ఏప్రిల్‌లలో ఎన్‌టీఏ నిర్వహించింది.

వాన్స్ భారత పర్యటన ఖరారు

21 నుంచి 24 దాకా

న్యూఢిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన భార్య, తెలుగమ్మాయి ఉషా వాన్స్ వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. ఉన్నత స్థాయి అధికారుల బృందంతో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారని ఆయన కార్యాలయం బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా 21న ప్రధాని మోదీతో సమావేశమవుతారని పేర్కొంది. ఆర్థిక, భౌగోళిక రాజకీయ అంశాలను చర్చించనున్నారని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ తెలిపింది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపింది. ట్రంప్ యంత్రాంగం టారిఫ్‌ల మోతెక్కిస్తూ ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన నేపథ్యంలో జరుగుతున్న ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. వాన్స్, సెకండ్ లేడీ ఉష తమ పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్‌లతో కలిసి జైపూర్, ఆగ్రాలోని ప్రముఖ ప్రాంతాలను సందర్శించనున్నారని వెల్లడించింది. వాన్స్ పర్యటనలో అధికారిక కార్యక్రమాలున్నా వ్యక్తిగత అంశాలకే ఎక్కువ ప్రాధాన్యముంటుందని సమాచారం. ఉష వాన్స్ తెలుగమ్మాయి అన్నది తెలిసిందే. ఈమె తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబార్డ్ ఇటీవలే భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే.

ఏటీఎం ఆన్ వీల్స్

- దేశంలోనే మొట్టమొదటిసారిగా ట్రెయిన్‌లో ఏటీఎం
- ముంబై–మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ట్రయల్ సక్సెస్
- మిగతా రైళ్లలోనూ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు

ముంబై: దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏటీఎం సౌకర్యం కలిగిన రైలుగా ముంబై–మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్ చరిత్ర సృష్టించింది. ఈ రైలు ఏసీ కోచ్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏటీఎం ట్రయల్ విజయవంతంగా పూర్తయింది. ప్రయాణికులు రైలు కదులుతుండగానే ఏటీఎం నుంచి నగదును సులువుగా విత్‌డ్రా చేసుకోవచ్చు. అంతేకాదు, చెక్ బుక్ కోసం అభ్యర్థన చేయవచ్చు. అకౌంట్ స్టేట్‌మెంట్‌లను కూడా పొందొచ్చు. ప్రయాణంలో ఉండగా నగదు అవసరమయ్యే ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇండియన్ రైల్వేస్ ఇన్నోవేటివ్ అండ్ నాన్–ఫేర్ రెవెన్యూ ఐడియాస్ స్కీం(ఐఎన్ఎఫ్ఆర్ఐఎస్)లో భాగంగా దీనిని ఏర్పాటు చేసినట్లు సెంట్రల్ రైల్వే తెలిపింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, భుసావల్ డివిజన్ రైల్వే విభాగం కలిసి ఈ ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చాయంది. ప్రజల నుంచి వచ్చే డిమాండ్ ఆధారంగా త్వరలోనే మిగతా రైళ్లలోనూ ఇలాంటి సేవలను అందుబాటులోకి తెస్తామని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి స్వప్నిల్ నిలా వివరించారు. ఈ నెల 10వ తేదీన చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతమైందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

ఎక్కడుంటుందంటే..

కోచ్ వెనుకవైపు టెంపరరీ ప్యాంట్రీ ఉండే చిన్న గదిలో ఈ ఏటీఎంను నెలకొల్పారు. దీనిని ఆపరేట్ చేయడం చాలా సులువు. భద్రత కోసం ఏటీఎం గదికి వేరుగా షట్టర్ డోర్ ఉంది. నిఘా కోసం 24 గంటలూ పనిచేసే సీసీటీవీ కెమెరాలున్నాయి. రైలు కుదుపులకు లోనైనప్పుడు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఏటీఎంను రబ్బర్ ప్యాడెడ్ బోల్టులతో బిగించారు. ముందు జాగ్రత్తగా ఆ పక్కనే రెండు అగ్ని మాపక యంత్రాలను సైతం అమర్చారు. రైలులోని మొత్తం 22 బోగీల్లోని ప్రయాణికులు సైతం ఇక్కడికి వచ్చి ఈ సేవలను ఉపయోగించుకునే వీలుంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సమకూర్చిన ఈ ఏటీఎంను ఏర్పాటు చేయడానికి అనువుగా మన్మాడ్ రైల్వే వర్క్ షాప్‌లో బోగీకి తగు మార్పులు చేసినట్లు సీపీఆర్‌వో స్వప్నిల్ చెప్పారు.

నిరంతరాయ కనెక్టివిటీ కోసం..

ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్(సీఎస్ఎంటీ)నుంచి నాసిక్‌లోని మన్మాడ్ జంక్షన్‌కు పంచవటి ఎక్స్‌ప్రెస్ నిత్యం రాకపోకలు సాగిస్తుంటుంది. ప్రయాణ సమయం మొత్తం నాలుగు గంటలా 35 నిమిషాలు. వేళకు ఠంచన్‌గా, వేగంగా వెళ్లే రైలుగా దీనికి పేరుంది. ప్రయాణికులు ఎలాంటి సమస్యా లేకుండా నగదును సులువుగా విత్ డ్రా చేసుకునేందుకుగాను ఆ మార్గమంతటా ఏటీఎంకు నెట్‌వర్క్ కనెక్టివిటీ స్థిరంగా ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. అయితే, ఈ రైలు మార్గంలోని ఇగట్‌పురి, కసర మధ్యలో టన్నెళ్లు, మొబైల్ కనెక్టివిటీ తక్కువగా ఉండటంతో సిగ్నల్ సమస్య కొంత ఏర్పడుతోందని భుసావల్ డివిజనల్ రైల్వే మేనేజర్ పాండే చెప్పారు. అయినప్పటికీ అప్పటికప్పుడు దానిని సరిచేస్తున్నామన్నారు.



అల్లర్ల కుట్రలో బీఎస్ఎఫ్, నిఘా సంస్థలు

- బెంగాల్‌లో 'వక్ఫ్' వ్యతిరేక ఆందోళనల్లో కేంద్రం పాత్ర
- తీవ్ర ఆరోపణలు చేసిన మమతా బెనర్జీ
- అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్

కోల్‌కతా: వివాదాస్పద వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లాలో కొనసాగిన ఘర్షణలు, హింసాత్మక ఘటనల వెనుక కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సరిహద్దు భద్రతా బలగం(బీఎస్ఎఫ్), నిఘా వర్గాల హస్తముందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం కోల్‌కతాలో ముస్లిం మతాధికారులతో సమావేశం సందర్భంగా మమత మాట్లాడారు. ''అరాచక, సమాఖ్య వ్యతిరేక వక్ఫ్(సవరణ) చట్టాన్ని ప్రధాని మోదీ అమలుచేయొద్దు. దీని అమలు కొనసాగితే అది దేశాన్ని ముక్కలుచేస్తుంది. సొంత రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా పనిచేసే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ప్రధాని మోదీ వెంటనే పదవి నుంచి తప్పించాలి. ఓవైపు బంగ్లాదేశ్‌లో అస్థిర పరిస్థితులు రాజ్యమేలుతుంటే బీజేపీ సర్కార్ హడావుడిగా వక్ఫ్ చట్టం తెచ్చింది. బెంగాల్‌లో హింసకు కేంద్ర హోం శాఖ పథకరచన చేసింది. ఈ కుట్రలో బీఎస్ఎఫ్ పాత్రపై విచారణ జరిపించాలి. సరిహద్దును పరిరక్షించాల్సిన బాధ్యత బీఎస్ఎఫ్‌ది కాదా?. అంతర్జాతీయ సరిహద్దును మా(టీఎంసీ) ప్రభుత్వం పరిరక్షించదు. ఈ విషయంలో కేంద్రం తన బాధ్యతలను విస్మరించకూడదు. బెంగాల్ అల్లర్లలో మృతుల కుటుంబాలకు తలో రూ.10 లక్షల నష్టపరిహారం ఇస్తున్నా. సరిహద్దు దాటి బెంగాల్‌లోకి బంగ్లాదేశీయులు చొరబడుతుంటే నిర్లక్ష్యంగా ఉన్న బీఎస్ఎఫ్ వైఖరిపై విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తున్నా'' అని మమత అన్నారు. ''అమిత్ షా ఎన్నటికీ ప్రధాని కాలేరు. మోదీజీ ప్రధాని పీఠం నుంచి దిగిపోయాక అమిత్ షా ఏం చేస్తారు?. కేంద్ర నిఘా సంస్థలను అమిత్ షా దుర్వినియోగం చేస్తున్నారు. అమిత్ షా కార్యకలాపాలపై మోదీ ఓ కన్నేసి ఉంచాలి. మోదీ అమిత్‌కు అడ్డుకట్టవేయాల్సిందే'' అని మమత అభ్యర్థించారు.



బుధవారం కోల్‌కతాలో ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతున్న మమత

స్థానిక కాంగ్రెస్ నిర్లక్ష్యమూ దాగి ఉంది

ఘర్షణల వెనుక టీఎంసీ ఉందన్న ఆరోపణలను మమత ఖండించారు. '' ఘర్షణలు జరిగిన ధులియాన్, షంషేర్‌గంజ్‌లు మాల్దా దక్షిణ్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తాయి. కాంగ్రెస్ నేత ఇషా ఖాన్ చౌదరి అక్కడ ఎంపీగా ఉన్నారు. ఆ ప్రాంతాల్లో కాంగ్రెస్ క్రియాశీలకంగా ఉంది. ఈ ఘర్షణల వెనుక నిజంగా టీఎంసీ ఉంటే మా ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్లపై నిరసనకారులు ఎందుకు దాడులు చేస్తారు?. మా పార్టీ కార్యాలయాన్ని ఎందుకు ధ్వంసం చేస్తారు? అని మమత ఎదురు ప్రశ్నించారు. ముస్లిం మతాధికారులు వక్ఫ్ అంశంలో నేరుగా రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలను కలిసి తమ ఆందోళనను తెలియజేయాలి. వక్ఫ్‌కు వ్యతిరేకంగా విపక్షాల 'ఇండియా' కూటమి తుదికంటా పోరాడుతుంది'' అని అన్నారు.

ఆయన యోగి కాదు భోగి

తనపై విమర్శలు చేసిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌పై మమత ప్రతివిమర్శలు చేశారు. ''యోగి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారు. నిజానికి ఆయన యోగి కాదు పెద్ద భోగి. మహాకుంభమేళాలో తొక్కిసలాటలో ఎంత మంది చనిపోయారు?. మీ రాష్ట్రంలో పోలీస్ ఎన్‌కౌంటర్‌లలో ఎంత మందిని చంపేశారు?. రాష్ట్రంలో శాంతియుత ర్యాలీలను కూడా యోగి అనుమతించట్లేదు. బెంగాల్‌లో మాత్రం ప్రజలు స్వేచ్ఛను ఆస్వాదిస్తున్నారు'' అని అన్నారు. హిందువులను బాధితులుగా మారుస్తున్న మమత సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయని బీజేపీ విమర్శించింది.

ఆర్థిక నేరాలకు ఈడీ విచారణ అవసరం లేదు

- అందుకు వేరే సంస్థలు ఉన్నాయి
- సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ వ్యాఖ్య

భువనేశ్వర్: ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ అవసరం లేదని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చెప్పారు. విచారణ కోసం ఇతర దర్యాప్తు సంస్థలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మిగతా రాజకీయ పార్టీలు వ్యతిరేకించినప్పటికీ ఈడీని ఏర్పాటు చేశారని అన్నారు. ఈడీ ఇప్పుడు ఎన్నో రకాలుగా వివాదాల్లో చిక్కుకుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థను పక్కనపెట్టడమే మంచిదని అభిప్రాయపడ్డారు. ఆర్థిక నేరాలపై విచారణకు ఆదాయపు పన్ను శాఖ వంటి విభాగాలు ఉండగా ఈడీ ఎందుకని ప్రశ్నించారు. అఖిలేష్ యాదవ్ బుధవారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో మీడియాతో మాట్లాడారు. ఈడీ అవసరం ఇప్పుడు లేదని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. భువనేశ్వర్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ జెనా నివాసానికి అఖిలేష్ వెళ్లారు. దీంతో శ్రీకాంత్ జెనా సమాజ్‌వాదీ పార్టీలో చేరబోతున్నట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. కానీ, అందులో వాస్తవం లేదని వారిద్దరూ స్పష్టతనిచ్చారు.

ఈడీ కేసుపై కదంతొక్కిన కాంగ్రెస్ నేతలు

ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా ఈడీ ఆఫీస్‌ల ఎదుట ధర్నా

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ ఆస్తుల కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ పాత ప్రధాన కార్యాలయ భవనం నుంచి ఈడీ కార్యాలయం వరకు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. మార్గమధ్యంలో వాళ్లను పోలీసులు అడ్డుకున్నారు. దేశ రాజధాని సహా రాష్ట్రాల్లోని ఈడీ కార్యాలయాల వద్ద సైతం కాంగ్రెస్ కార్యకర్తలు ' భయపడేది లేదు', 'దేశం మా వెంటే ఉంది' ప్లకార్డులు చేతపట్టుకుని ధర్నాకు దిగారు. పార్టీ ఎంపీలు, కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. కాంగ్రెస్‌ను చూసి బీజేపీ భయపడుతోందని, అందుకే ఇలా తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందని పార్టీ సీనియర్ నేతలు విమర్శించారు.

సాక్షి
హైదరాబాద్

గురువారం । 17 । ఏప్రిల్ । 2025



రూ.15 లక్షల రుణం కోసం..
నగరానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు నిండా ముంచారు. రూ.15 లక్షలు రుణం మంజూరైందంటూ రూ.44 లక్షలు కాజేశారు.
-8లో



హాలీడేస్.. పార్ట్‌టైం జాబ్స్
వేసవి సెలవులు మొదలు కానున్నాయి. నగర యువతకు కనపడుతున్న పలు మార్గాల్లో సమ్మర్ జాబ్స్ ముందున్నాయి.
- సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.0/23.0
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

దైవ సన్నిధానంలో సీఎస్ ప్రత్యేక పూజలు



ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానంలో బుధవారం సంకష్ట హరచతుర్థి సందర్భంగా వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేష మల్లె పుష్పార్చనతో పాటు 350 కిలోల బెల్లంతో అలంకరించారు. వేకువ జామునే పంచామృతాభిషేకం, పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల్లో చీఫ్ సెక్రటరీ (సీఎస్) శాంతి కుమారి పాల్గొన్నారు.

తోడేస్తున్నారు!

చెరువుల పక్కన, ఖాళీ ప్లాట్లలో యథేచ్ఛగా బోర్లు

అక్రమ ఫిల్లింగ్ కేంద్రాలతో ప్రైవేటు ట్యాంకర్ల దందా
- పశ్చిమ హైదరాబాద్‌లో పెరిగిన డిమాండ్
- నీటి రేట్లు పెంచేసి వ్యాపారుల దోపిడీ
- ప్రతిరోజూ పది వేల ట్రిప్పులకుపైగా జలమండలి సరఫరా

సాక్షి, సిటీబ్యూరో: భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటికే కాదు.. ఇంటి అవసరాలూ తీరే పరిస్థితి కనిపించడంలేదు. నీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. పశ్చిమ హైదరాబాద్ ప్రాంతంలో విచ్చలవిడిగా బోర్ల తవ్వకాల ప్రభావంతో జలాలు పాతాళానికి పడిపోయి బోరుబావులు బావురుమంటున్నాయి. ఫలితంగా వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. రాత్రి పగలూ తేడా లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగుతోంది. సిటీజనుల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు చెరువుల పక్కన, ఖాళీ ప్లాట్లలో.. ఇలా ఎక్కడ పడితే అక్కడ బోర్లు వేసి, కోట్ల కొద్దీ లీటర్ల నీటిని పుడమి కడుపు నుంచి తోడేస్తున్నారు. ప్రాంతాన్ని బట్టి.. అక్కడ ఉన్న నీటి కొరత తీవ్రత, అత్యవసరాన్ని బట్టి ట్యాంకర్ నీటి ధరను పెంచేసి వసూళ్లకు పాల్పడుతున్నారు.

జంట జలాశయాల పరీవాహకంలో..

నగర శివార్లలోని జంట జలాశయాల పరిసరాల్లో విచ్చలవిడిగా ప్రైవేటు ఫిల్లింగ్ కేంద్రాలు భారీగా పుట్టుకొచ్చాయి. మూసీ పరీవాహకంలో సైతం ప్రైవేటు బోర్ల నీటి దందా అడ్డూ అదుపూ లేకుండా సాగుతోంది. అసలు బోరు ఎక్కడుంది? ఎక్కడి నుంచి నీళ్లు వస్తున్నాయన్నది అర్థంకాని పరిస్థితి నెలకొంది. చెరువులు, కుంటలు, ఖాళీ స్థలాల్లో ఎక్కడిపడితే అక్కడ బోర్లు ఏర్పాటు చేసి గుర్తించకుండా వాటి చుట్టూ ఇంటిని తలపించేలా రేకుల షెడ్లు వేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సిమెంట్, కాంక్రీట్‌తో శ్లాబ్‌లు నిర్మిస్తున్నారు. గండిపేట, నార్సింగ్, మణికొండ, హఫీజ్‌పేట, మియాపూర్, బౌరంపేట, దుండిగల్, మల్లంపేట, ఉప్పల్, రామంతాపూర్, బోయిన్‌పల్లి తదితర ప్రాంతాల్లో చెరువుల పక్కన ప్రైవేటు బోర్ల వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది

వాల్టాకు తూట్లు..

వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ (వాల్టా) యాక్ట్- 2002 ప్రకారం ఇంటి అవసరాల కోసం బోరు వేసినా రెవెన్యూ విభాగం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయి పరిస్థితులు, దరఖాస్తుదారు అవసరం, అక్కడి భూగర్భ జలాల లభ్యతను బట్టి అనుమతినిస్తారు. ఇంటి నిర్మాణం కోసం సామాన్యులు బోరు వేస్తే.. ఈ చట్టాన్ని చూపి నానా ఇబ్బందులూ పెట్టే రెవెన్యూ యంత్రాంగం ప్రైవేటు నీటి దందా కోసం ఇష్టానుసారంగా పదుల సంఖ్యలో బోర్లు తవ్వి పుడిమిని తోడేస్తున్నా.. కనీసం అటువైపు కన్నెత్తి చూడట్లేదు. ఇటీవల జలమండలి విజిలెన్స్ విభాగం అక్రమ ఫిల్లింగ్ కేంద్రాలను గుర్తించి రెవెన్యూ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లింది.

ఇదీ పరిస్థితి..

మహానగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో వర్షపు నీరంతా నాలాలు, డ్రైయినేజీల నుంచి మూసీలో కలుస్తోంది. ఫలితంగా ఆశించిన స్థాయిలో నగర పరిధిలో భూగర్భ జలమట్టాలు పెరగలేదు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధితో పాటు ఔటర్ పరిధిలోని సుమారు 45 ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు సగటున 12 మీటర్ల దిగువన పడిపోయినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వెయ్యి నుంచి 5 వేల అడుగుల మేర తవ్వించిన బోర్లు సైతం ఎండిపోతుండటంతో భూగర్భజలాలు ఎంత పాతాళానికి పడిపోతున్నాయో అర్థం చేసుకొవచ్చు..

జలమండలి ట్యాంకర్ల తాకిడి

గ్రేటర్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో తాగునీటిని సరఫరా చేస్తున్న జలమండలి ఈసారి పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోలేక తడబడుతోంది. పశ్చిమ హైదరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, పటాన్‌చెరు, మూసాపేట్, మాదాపూర్, హైటెక్ సిటీ, నానక్‌రాంగూడ, కోకాపేట్, నార్సింగి, కొండాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల నుంచి తాకిడి అధికంగా పెరిగినట్లు తెలుస్తోంది. సాధారణంగా వాటర్‌బోర్డుకు వేసవిలో రోజుకు 5 వేల నుంచి 6 వేల వరకు ట్యాంకర్ల డిమాండ్ ఉంటోంది. కానీ.. ఈసారి ఆ సంఖ్య పదివేలు దాటింది. ట్యాంకర్ బుక్ చేసిన 12 గంటల లోపు ట్యాంకర్‌ను సరఫరా చేయడం గమనార్హం. కేవలం ట్యాంకర్లపైనే ఆధారపడిన హాస్టళ్లు, సర్వీస్, వాణిజ్య కేంద్రాలు మాత్రం అత్యవసర సరఫరాకు ప్రైవేటు ట్యాంకర్ల వైపు మొగ్గుచూపుతున్నాయి.



4 లక్షల ట్రిప్పుల వరకు అంచనా..

రాబోయే రోజుల్లో ట్యాంకర్లకు డిమాండ్ మరింత పెరిగవచ్చని జలమండలి అంచనా వేస్తోంది. గత ఏడాదితో పోల్చితే ఈసారి జనవరిలో 35 శాతం, ఫిబ్రవరిలో 50 శాతం, మార్చిలో 90 శాతం అదనంగా డిమాండ్ పెరిగినా.. ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా చేయగలిగింది. తాజాగా ఈ నెలలో రెట్టింపు స్థాయిలో ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది. ఏప్రిల్, మే నెలల్లో సగటున 4 లక్షల ట్రిప్పుల చొప్పున డిమాండ్ ఉండే అవకాశం ఉంటుందని జలమండలి అంచనా వేస్తోంది.

జలమండలి ద్వారా ట్యాంకర్ల సరఫరా ఇలా

సంవత్సరం	జనవరి	ఫిబ్రవరి	మార్చి
2021	52,778	55,175	75,782
2022	45,613	52,548	83,078
2023	74,870	86,479	1,12,679
2024	81,821	1,12,926	1,69,596
2025	1,19,752	1,84,074	2,82,961



‘దొంగ’మొగుడు

సొంత భార్య మెడలోని బంగారు గొలుసునే కొట్టేసిన ఘనుడు

ఎట్టకేలకు కేసును ఛేదించిన పోలీసులు



నిందితుడు ఆంజనేయులు



బంగారు గొలుసు

కేపీహెచ్‌బీకాలనీ: గాఢ నిద్రలో ఉన్న భార్య మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తానే కాజేసి.. దొంగలు ఎత్తుకెళ్లారంటూ కథనం అల్లి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు యత్నించిన ఓ భర్తను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు తులాల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ కాలనీలోని ప్లాట్ నంబర్-115లోని బహుళ అంతస్తుల భవనంలో మెదక్ జిల్లా వల్లూరుకు చెందిన ముక్కెర ఆంజనేయులు, భార్య భాగ్యమ్మతో కలిసి వాచ్‌మన్‌గా పని చేస్తూ ఇక్కడే ఓ గదిలో నివాసం ఉంటున్నారు. తన భార్య మెడలోని రెండు తులాల బంగారు గొలుసును దొంగిలించాలని పథకం వేసిన ఆంజనేయులు మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో భాగ్యమ్మ గాఢ నిద్రలో ఉండగా ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసును దొంగిలించి దాచి పెట్టాడు. వెంటనే ఎవరో దొంగలు వచ్చి తన భార్య మెడలోని బంగారు గొలుసును తెంచుకెళ్లారంటూ బుకాయిస్తూ భార్యను కూడా నమ్మించాడు. ఇదే విషయాన్ని ఇరుగు పొరుగు వారికి చెప్పి పోలీసులకు సైతం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా భాగ్యమ్మ, ఆంజనేయులును విచారణ చేయగా.. పొంతన లేని సమాధానాలు చెప్పారు. సీసీ పుటేజీల ఆధారంగా బయటి వ్యక్తులెవరూ వీరి గదిలోకి రాలేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆంజనేయులును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయగా.. బంగారు గొలుసును తానే దొంగిలించానని ఒప్పుకొన్నాడు. గొలుసు పోయిందనే సానుభూతి పొందటంతో పాటు ప్లాట్ యజమానులు ఇచ్చే ఆర్థిక సహకారంతో తన అప్పులు తీర్చుకోవచ్చని పథకం వేసి చోరీకి పాల్పడినట్లు వెల్లడించాడు. ఈ మేరకు పోలీసులు ఆంజనేయులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భూముల రక్షణకే ‘భూ భారతి’

నేటి నుంచి 30 వరకు చట్టంపై అవగాహన సమావేశాలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న భూ భారతి చట్టానికి సంబంధించిన పోర్టల్‌ను ఆవిష్కరించి రైతు కుటుంబాలకు అంకితం చేసింది. జూన్ 2 నుంచి పోర్టల్ అమలు చేసేందుకు సన్నాహకాలు చేస్తున్న ప్రభుత్వం ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తోంది.



- కమతాలకు భూధార్ నంబర్ల కేటాయింపు
- వాటి ఆధారంగానే సంక్షేమ ఫలాలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన ‘భూ భారతి’పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం నుంచి ఈ నెల 30 వరకు మండలాల వారీగా రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్‌ఓఆర్)-2025 భూమి హక్కుల రికార్డు, ధరణి స్థానంలో కొత్తగా తీసుకురాబోతున్న భూ భారతి, ఆర్‌ఓఆర్‌లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, వారసత్వ భూముల మ్యూటేషన్, సేల్‌డీడ్ ఇతర మార్గాల ద్వారా వచ్చిన మ్యూటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పట్టాదారు పాసుపుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించడంతో పాటు భూములకు (కమతం) ఆధార్ తరహాలో భూధార్ నంబర్ కేటాయింపు సహా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు సైతం ఈ నంబర్ల ఆధారంగానే అందనున్నాయి. భూ రికార్డుల నిర్వహణలో ఎలాంటి వివాదాలకు ఆస్కారం ఇవ్వొద్దని నిర్ణయించింది. ఆర్డీఓ, తహసీల్దార్ సహా డి సెక్షన్ అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొని, రైతులు, భూ యజమానుల్లోని అనుమానాలను నివృత్తి చేయనున్నారు. తద్వారా రెవెన్యూ శాఖపై సృష్టించిన అపవాదులను పూర్తిగా తొలిగించుకోవాలని యోచిస్తోంది.

రిజెక్ట్ చేస్తే.. కారణం చెప్పాల్సిందే

జిల్లా వ్యాప్తంగా 12,43,035 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో 64,803 ఎకరాల అటవీ భూములు ఉండగా 8,86,705 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. 2,26,509 ఎకరాల వ్యవసాయేతర భూములు ఉన్నాయి. 1,89,406 ఎకరాలు తోటలు, చెట్లతో నిండి ఉంది. 59,906 ఎకరాలు సాగుకు యోగ్యం కానీ భూములున్నాయి. ప్రభుత్వ, భూదాన్, వక్ఫ్, సీలింగ్, లావణి, అటవీ భూములతో పాటు ప్రైవేటు పట్టా భూములు ఉన్నాయి. నగరానికి సమీపంలో జిల్లా ఉండడం, ఐటీ, అనుబంధ సంస్థలతో పాటు రియల్ ఎస్టేట్ రంగం పెట్టుబడులు ఇక్కడ భారీగా పెడుతుండటంతో జిల్లాలోని భూములకు రెక్కలొచ్చాయి. దీంతో పాటు సరిహద్దు వివాదాలు కూడా అధిక మయ్యాయి. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నవంబర్‌లో ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇప్పటి వరకు రెండు లక్షలకుపైగా దరఖాస్తులు పోర్టల్‌లో నమోదు కాగా, ఇప్పటికే 1.80 వేల దరఖాస్తులను క్లియర్ చేయగా.. ప్రస్తుతం 17,646 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. వీటిలో 7,966 దరఖాస్తులు తహసీల్దార్ల వద్ద, 3,351 దరఖాస్తులు ఆర్డీఓల వద్ద, అదనపు కలెక్టర్ వద్ద 4,877 దరఖాస్తులు, కలెక్టర్ వద్ద 1,452 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. గతంలో దరఖాస్తు తిరస్కరిస్తే. కారణం చెప్పేవారు కాదు. ప్రస్తుతం అమల్లోకి తెచ్చిన భూ భారతిలో అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. కొత్తగా అమల్లోకి తీసుకురాబోతున్న భూ భారతిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తోంది.

సదస్సుల సమాచారం

తేదీ	మండలం
17	షాద్‌నగర్, కేశంపేట
19	ఆమనగల్లు, తలకొండపల్లి
21	చేవెళ్ల, శంకర్‌పల్లి
22	కొందుర్గు, చౌదరిగూడ
23	మాడ్గుల, యాచారం
24	మెయినాబాద్, షాబాద్, గండిపేట్
25	మంచాల, ఇబ్రహీంపట్నం
26	కొత్తూరు, నందిగామ, శంషాబాద్
28	అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, సరూర్‌నగర్
29	మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్
30	శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలాపూర్

మంత్రాల నెపంతో గెంటేశారు!

కన్న తల్లిదండ్రులనే ఇంట్లోంచి వెళ్లగొట్టిన కొడుకులు

- ఆర్నెల్లుగా కూతురు వద్ద ఉంటున్న వృద్ధ దంపతులు
- తమకు న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు
- త్వరలోనే సొంతింటికి పంపిస్తామని అధికారుల హామీ



తమకు న్యాయం చేయాలంటూ గండిపేట తహసీల్దార్‌ను వేడుకుంటున్న బాలమల్లయ్య, శారద దంపతులు

మణికొండ: కుమారుల మూఢ నమ్మకం కన్న తల్లిదండ్రులనే ఇంట్లోంచి గెంటివేసే స్థాయికి దిగజార్చింది. క్షుద్ర పూజలు చేసి తన కుమారుడి మృతికి కారణమయ్యారనే అభాండాన్ని వేసి వృద్ధ దంపతులను ఇంటి నుంచి వెళ్లగొట్టిన ఘటన నార్సింగిలో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఎర్రగొల్ల బాలమల్లయ్య (70), శారద (62) దంపతులు. బాలమల్లయ్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ పొందారు. వీరికి బాలరాజు, శివ కుమార్, కృష్ణ ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం బాలమల్లయ్య పెద్ద కొడుకు బాలరాజు కుమారుడు (13) అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదే సమయంలో బాలమల్లయ్య దంపతుల గదిలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు కనిపించాయని, వారే క్షుద్ర పూజలు చేసి తమ కుమారురుడి మృతికి కారణమయ్యారంటూ ఇంట్లోంచి గెంటేశారు. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో హయత్‌నగర్‌లో ఉంటున్న తమ కూతురు వద్ద తలదాచుకుంటున్నారు.

న్యాయం చేయాలంటూ అధికారుల చెంతకు..

తమ కష్టార్జితంతో కట్టుకున్న ఇంట్లో నుంచి కుమారులు నింద మోపి గెంటేశారని.. తిరిగి తమను ఇంటికి చేర్చాలంటూ వృద్ధ దంపతులు అధికారులను ప్రాధేయపడుతున్నారు. తనకు ప్రతి నెలా వచ్చే పెన్షన్ పత్రాలను లాక్కున్నారని బాలమల్లయ్య ఆరోపించారు. గత ఆరు నెలలుగా కూతురు వద్ద తలదాచుకున్న వీరు.. తమకు న్యాయం చేయాలంటూ రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు, గండిపేట తహసీల్దార్‌ల చుట్టూ తిరుగుతున్నారు. తమ పేరిట ఉన్న ఇంట్లోంచి గెంటివేయటం చట్ట ప్రకారం ఎలా చెల్లుతుందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎలాగైనా న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. కాగా.. ఆర్డీఓ ఆదేశాలతో బుధవారం తన వద్దకు వచ్చిన వృద్ధ దంపతులను ఓదార్చిన గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి.. వీరిని నార్సింగిలోని ఇంటికి పంపించాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో పోలీసు బందోబస్తు మధ్య వారిని ఇంటికి చేర్చాలని అధికారులు భావిస్తున్నారు.

నల్లాలకు వ్యవసాయ మోటార్లు

- వాణిజ్య సముదాయాల్లో డొమెస్టిక్ కనెక్షన్లు
- పలు ప్రాంతాల్లో పర్యటించిన జలమండలి ఎండీ
- స్పెషల్ డ్రైవ్‌తో పెరుగుతున్న నీటి ప్రెషర్
- రెండో రోజూ కొనసాగిన మోటార్ ఫ్రీ ట్యాప్ డ్రైవ్

యథేచ్ఛగా నీటిని తోడుతున్నట్లు బహిర్గతం

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో తాగునీటి నల్లాలకు వ్యవసాయ మోటార్లను బిగించి నీటిని తోడుతున్నట్లు బహిర్గతం కావడం ఆందోళన కలిగిస్తోంది. జలమండలి నీటి సరఫరాలో లో ప్రెషర్ తగ్గించేందుకు పకడ్బందీగా చేపట్టిన ‘మోటర్ ఫ్రీ ట్యాప్’ వాటర్ స్పెషల్ సర్వే తనిఖీలో నల్లాలకు బిగించిన మోటార్లు కుప్పలు తెప్పలుగా బయటపడుతున్నాయి. మరోవైపు వాణిజ్య భవన సముదాయాలు డొమెస్టిక్ కనెక్షన్లు కలిగి ఉన్నట్లు తనిఖీ బృందాలు గుర్తిస్తున్నాయి. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం పలు ప్రాంతాల్లో నల్లాలకు వినియోగిస్తున్న సుమారు 32 మోటార్లను సీజ్ చేసి 39 మంది వినియోదారులకు జరిమానాలు విధించారు. రెండో రోజూ జలమండలి ఎండీ అశోక్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. ఎస్ఆర్ నగర్‌లోని మధురానగర్ పరిధిలో నీటి సరఫరాను పరిశీలించారు. లోప్రెషర్‌ను గుర్తించి సమీపంలోని హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలును తనిఖీ చేశారు.



జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తనిఖీల్లో బయటపడిన వ్యవసాయ మోటారు

2 హెచ్‌పీ మోటార్ వినియోగంపై ఆగ్రహం

వ్యవసాయానికి వినియోగించే 2 హెచ్‌పీ మోటార్లను నల్లాలకు వినియోగించడంపై అశోక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పది గృహ సముదాయాలకు సరిపడే నీటిని ఒకే గృహానికి వాడితే మిగతా వారు ఏమైపోవాలంటూ ఆయన ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గృహ సముదాయంలోని ఆ హాస్టల్‌కు నెలవరకు నీటిని నిలిపివేసి ట్యాంకర్ సైతం బుక్ చెయ్యకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇదే ప్రాంతంలో మరో భవనానికి సైతం వ్యవసాయ మోటార్ వాడుతూ పట్టుపడగా కనెక్షన్ తొలగించి, నెల వరకు ట్యాంకర్ సరఫరా కూడా నిలిపివేయాలంటూ అధికారులకు ఎండీ ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజూ వాటర్ సరఫరా సమయంలో తనిఖీలు కొనసాగించాలని ఆయన సూచించారు.

నీటి సరఫరాలో పెరుగుతున్న ప్రెషర్..

మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ స్పెషల్ డ్రైవ్‌తో నీటి సరఫరాలో ఒత్తిడి పెరుగుతోంది. క్షేత్ర స్థాయిలో తనిఖీలు కొనసాగుతుండటంతో కొందరు వినియోగదారులు నల్లాలకు మోటార్లను తొలగిస్తున్నారు. దీంతో నీటి సరఫరాలో ఒత్తిడి పెరిగి సమపాళ్లలో సరఫరా కొనసాగుతోంది. దీంతో లో ప్రెషర్‌తో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా నీటి సరఫరాలో లోప్రెషర్ ప్రాంతాలపైనే జలమండలి దృష్టి సారించి తనిఖీలను ముమ్మరం చేసింది.

ఒప్పందం కుదిరేనా!

మెట్రో రెండో దశపై జైకాతో సంప్రదింపులు
- సీఎం రేవంత్‌తో పాటు జపాన్ పర్యటనలో మెట్రో ఎండీ

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రెండోదశ నిర్మాణానికి నిధుల సమీకరణకు రాష్ట్ర సర్కారు జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ)తో సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో భాగంగా ఆ సంస్థతో రుణ అంశంపై చర్చించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నుంచి జపాన్‌లో పర్యటిస్తున్నందున.. ఇదే సమయంలో జైకాతో సమావేశం నిర్వహించేలా షెడ్యూల్ ఖరారైంది. ఈ సమావేశంలో నిధుల విడుదల వ్యవహారం కొలిక్కి వచ్చే అవకాశముంది. మెట్రో రెండో దశ నిర్మాణానికి నిధులు అందజేసేందుకు జైకా సూత్రప్రాయంగా అంగీకరించింది. తాజాగా సీఎం జపాన్ పర్యటనలో భాగంగా మరోసారి జైకా ప్రతినిధుల బృందంతో సమావేశమై నిధుల విడుదలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. తద్వారా మెట్రో రెండో దశకు నిధులను అందజేసేందుకు జైకా సిద్ధంగా ఉన్న దృష్ట్యా కేంద్రం నుంచి సావరిన్ గ్యారంటీ లభించేందుకు ఒత్తిడి చేసేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

నిధుల సేకరణలో భాగంగా..

మెట్రో రెండో దశలో మొదట ప్రతిపాదించిన 5 కారిడార్‌లలో 76.4 కిలోమీటర్ల మెట్రో నిర్మాణానికి సుమారు రూ.24,269 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. ఇందులో ప్రైవేట్ సంస్థల నుంచి 52 శాతం నిధులను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే.. సుమారు రూ.12,726 కోట్లు జైకా వంటి సంస్థల నుంచి రుణాలుగా తీసుకోవాల్సి ఉంటుంది. మిగతా వ్యయంలో 30 శాతం నిధులు అంటే రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. మరో 18 శాతం నిధులను (రూ.4,230 కోట్లు) కేంద్రం భరించాల్సి ఉంటుంది. అలాగే మెట్రో స్టేషన్లలో మౌలిక సదుపాయాలతో పాటు పలు పనులను పీపీపీ విధానంలో చేపట్టాలని ప్రతిపాదించారు. ప్రైవేట్ సంస్థల నుంచి నిధుల సేకరణలో భాగంగా సీఎం జపాన్ పర్యటనలో జైకాతో సంప్రదింపుల్లో హెచ్ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కీలకంగా వ్యవహరించనున్నారు.



జపాన్ రవాణా సదుపాయాలపై అధ్యయనం..

ఈ పర్యటనలో భాగంగా జపాన్‌లోని వివిధ మెట్రోపాలిటన్ నగరాల్లో వినియోగంలో ఉన్న ప్రజారవాణా సదుపాయాలను కూడా ముఖ్యమంత్రి బృందం అధ్యయనం చేయనుంది. జపాన్‌లోని కోబ్, క్యోటో, నగోయా, ఒసాకా, సప్పోరో, సెండాయ్, టోక్యో, యొకోహామా తదితర నగరాల్లో సబ్‌వే వ్యవస్థలు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీకనుగుణంగా మెట్రోపాలిటన్ ప్రాంతాలను క్రాస్ చేసే సబర్బన్ కమ్యూటర్ రైల్వే సదుపాయం అక్కడ ఉంది. అలాగే అనేక నగరాల్లో స్ట్రీట్ కార్, మోనోరైల్ నెట్‌వర్క్‌లు అందుబాటులో ఉన్నాయి. అర్బన్ ర్యాపిడ్ రైల్ సిస్టమ్, ఆటోమేటెడ్ గైడ్‌వే ట్రాన్సిట్ (ఏజీటీ), ఆటోమేటెడ్ పీపుల్ మూవర్, (ఏపీఎం), లైట్ రైల్ ట్రాన్సిట్ (ఎల్ఆర్‌టీ), ట్రామ్, సిటీబస్ వంటి వివిధ రకాల ప్రజారవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌లో మెట్రో రైల్ విస్తరణతో పాటు అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు అనుగుణమైన ప్రజారవాణా సదుపాయాలపై ఈ అధ్యయనంలో దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కమిటీ పదవీ బాధ్యతల స్వీకరణ

సిటీ కోర్టులు: నూతనంగా నియమించబడిన తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించనుంది. కమిషన్ చైర్మన్‌గా డా.జస్టిస్ షమీమ్ అక్తర్ (రిటైర్డ్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి), సభ్యులుగా శివాది ప్రవీణ (రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి), డా.బి.కిషోర్ (రిటైర్డ్ ఐఏఎస్) బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర మానవ హక్కుల భవన్‌లో పదవీ బాధ్యతల కార్యక్రమం ఉంటుందని సంబంధిత అధికారులు మీడియాకు తెలిపారు.

వాటర్ లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి నీటి సరఫరాలో శాశ్వతంగా లో–ప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు వాటర్ లైన్‌మెన్లపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. ఏకంగా ఎండీ అశోక్ రెడ్డి లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. తాజాగా బుధవారం డివిజన్ 18 పరిధిలోని లైన్‌మెన్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఒక్కో లైన్‌మెన్ ఎన్ని వాల్వ్‌లను ఆపరేట్ చేస్తారో వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు ఎలా చేయాలో చర్చించారు. ప్రతి లైన్‌మన్ ఆధీనంలో ఉన్న ఆపరేషన్ వాల్వ్‌ల సంఖ్య, నీటి సరఫరా చేసే క్యాన్ నంబర్లు, వాల్వ్ ఆపరేషన్ సమయాన్ని తగ్గించడం తదితర అంశాలపై లైన్‌మెన్లతో చర్చించారు. వీటితోపాటు మెట్రో కస్టమర్‌లో సమోదయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలను జీఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ జూమ్ మీటింగ్‌లో జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ– డైరెక్టర్ ఆపరేషన్–2 వీఎల్ ప్రవీణ్ కుమార్, జీఎం, డీజీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోపంతోనే వృద్ధురాలిని చంపేశాడు...

- కమలాదేవి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- జువైనల్ హోంకు మైనర్ తరలింపు

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్ రోడ్డు నెంబరు–5లో చోటు చేసుకున్న కమలాదేవి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమె తిడుతుందనే కోపంతో కసి పెంచుకున్న మైనర్ బాలుడే ఆమెను హత్యచేశాడని, ఇందులో ఎలాంటి కుట్రకోణం లేదని తేల్చారు. నిందితుడితో పాటు హార్డ్‌వేర్ అండ్ ఎలక్ట్రికల్ షాప్ యజమానులు ప్రకాష్‌చౌదరి, లలిత్‌చౌదరిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని సుదీర్ఘంగా విచారించారు. సీసీ పుటేజీలతో పాటు వారి కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు చివరకు బాలుడే కమలాదేవిని హత్య చేసినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు అతన్ని జువైనల్ హోంకు తరలించారు. ఈ విషయాలను బుధవారం కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. విషయం వెల్లడవడంతో పారిపోయేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి ట్రైన్ కోసం వేచి చూస్తున్న మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. కమలాదేవిని హత్య చేసిన విషయాలను బాలుడు వెల్లడించినట్లు ఏసీపీ పేర్కొన్నారు. మేడ్చల్ కోర్టులో హాజరు పరిచిన అనంతరం అతడి వద్ద నుంచి రక్తపు మరకల దుస్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

రూ. 15 లక్షల రుణం పేరిట రూ. 44 లక్షలు స్వాహా!



నగర ఉద్యోగి నుంచి కాజేసిన సైబర్ నేరగాళ్లు • సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన రెండు గంటల్లో రుణం ఇస్తామంటూ నమ్మబలికిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ఓ వ్యక్తిని నిండా ముంచారు. రుణం పొందడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, రూ.15 లక్షలు మంజూరు అయిందని చెప్పి రూ.44 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్ ప్రాంతంలో నివసించే ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఇటీవల వాట్సాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. మహాలక్ష్మీ ఫైనాన్సెస్ సంస్థ నుంచి వచ్చినట్లు ఉన్న ఆ సందేశంలో అర్హులైన వారికి దరఖాస్తు చేసిన రెండు గంటల్లో వ్యక్తిగత రుణం మంజూరు చేస్తామని ఉంది. ఆ సందేశం చివరలో ఓ నెంబర్ సైతం ఉండటంతో బాధితుడు ఫోన్ చేశాడు. బాధితుడి నుంచి కొన్ని వివరాలు తెలుసుకున్న అవతలి వ్యక్తి సిబిల్ స్కోరు చాలా తక్కువగా ఉందని, ఈ పరిస్థితుల్లో రుణం ఇవ్వడం సాధ్యం కాదని చెప్పాడు. ఆపై తాము పంపే క్యూఆర్ కోడ్‌కు కొంత మొత్తం చెల్లించాలి రీపేమెంట్ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సూచించాడు. ఇలా చెల్లించిన మొత్తం రిఫండబుల్ అని మోసగాడు చెప్పడంతో బాధితుడు చెల్లించాడు. నేరగాళ్లు ఆధార్, పాన్‌కార్డులతో పాటు ఓ చెక్కు ఫొటోను పంపమని కోరడంతో బాధితుడు అలానే చేశాడు. ఈ విషయం తెలిసిన అతడి సోదరుడు వారించడంతో వాటి ఫొటోలను బాధితుడు నేరగాడి చాట్ నుంచి డిలీట్ చేసేశాడు. బాధితుడిని సంప్రదించిన సైబర్ నేరగాడు రూ.15 లక్షల లోన్ ప్రాసెస్‌లో ఉండగా డాక్యుమెంట్లు డిలీట్ చేసిన ఉల్లంఘనకు పాల్పడ్డావని చెప్పాడు. దీంతో పాటు బాధితుడి ఎస్‌బీఐ ఖాతాలో బ్యాలెన్స్ తక్కువగా ఉండటంతో దాని నిమిత్తం మరికొంత పెనాల్టీ అంటూ వసూలు చేశాడు. ఇలా మొత్తం ఎనిమిదిసార్లు రకరకాలైన పెనాల్టీలు, ఫీజులు వసూలు చేసిన సైబర్ నేరగాడు ప్రతి సందర్భంలోనూ రిఫండ్ అంటూ నమ్మబలికాడు. చివరకు ఓ రోజు రుణం మంజూరైందని చెప్తూ దానికి సంబంధించిన సందేశమంటూ డమ్మీ స్క్రీన్‌షాట్ పంపాడు. త్వరలోనే తమ సంస్థ ప్రధాన కార్యాలయం అధికారులు సంప్రదించి ఆ మొత్తం రిలీజ్ చేస్తారని నమ్మించాడు. వాళ్లు సూచించిన మొత్తం మరోసారి డిపాజిట్ చేయాలని, అలా కాకుంటే రుణం రద్దు అవుతుందని బెదిరించారు. అప్పటికే దాదాపు 25 సార్లు పెనాల్టీల చెల్లింపు కోసం బాధితుడు కుటుంబీకులు, బంధువులతో పాటు స్నేహితుల వద్ద అప్పు చేసి రూ.44,83,000 చెల్లించాడు. వీటికి తోడు మరికొంత చెల్లించాలంటూ వాళ్లు చెప్తుండటంతో అనుమానించిన బాధితుడు ఆరా తీశాడు. ఈ నేపథ్యంలోనే తాను మోసపోయినట్లు గుర్తించి ఆ మొత్తం తిరిగి చెల్లించాలని కోరాడు. దీంతో పంథా మార్చిన సైబర్ నేరగాళ్లు బాధితుడిని బెదిరింపులతో కూడిన, అభ్యంతరకరమైన సందేశాలు పంపడం మొదలెట్టారు. ఈ మేరకు బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

బీఆర్‌ఎస్‌తోనే మారిన బంజారాల బతుకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ కృషితో తెలంగాణలో బంజారాల బతుకులు మారాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అఖిల భారత బంజారాల ఆధ్యాత్మిక గురువు, పౌరాదేవీ పీఠాధిపతి శ్రీశ్రీ చంద్రశేఖర్ మహారాజ్ బుధవారం ఎమ్మెల్సీ కవిత నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా ఎమ్మెల్సీ కవిత వారిని ఆహ్వానించి సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీకవిత మాట్లాడుతూ... రాష్ట్రంలోని బంజారాల ఆశీస్సులు కేసీఆర్‌పై, బీఆర్‌ఎస్ పార్టీపై ఉన్నాయని తెలిపారు. బంజారా పిల్లలకు విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి కేసీఆర్ ఎన్నో చర్యలు తీసుకున్నారని వివరించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్నా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి కేసీఆర్ చరిత్ర సృష్టించారని స్పష్టం చేశారు. దేశంలోనే తొలిసారిగా సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే చంద్రవతి, హరిప్రియ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

తెలంగాణ డ్యాకుమెంట్ రైటర్స్ ఫెడరేషన్



నిరసన తెలుపుతున్న డ్యాకుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ నాయకులు

చిక్కడపల్లి: రిజిస్ట్రేషన్‌లలో స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దుచేసి డ్యాకుమెంట్ రైటర్స్‌కు జీవనోపాధి కల్పించాలని తెలంగాణ డ్యాకుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ నాయకులు శ్రీనివాస్, గిరిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్లాట్ విధానంతో రానున్న రోజుల్లో డాక్యుమెంట్ రైటర్స్ జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. స్లాట్ విధానంతో వినియోగదారులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. స్లాట్ పద్ధతిని రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్యామెంట్ రైటర్స్ ఈశ్వర్, అశోక్, కార్తీక్, బ్రహ్మం, అతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికి ఏడుగురు!

- తెలంగాణ నుంచి 'రెడ్ కార్నర్'లో ఉన్నవాళ్ల సంఖ్య ఇది..
- తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో..



సాక్షి, సిటీబ్యూరో: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, ఓ మీడియా ఛానల్ మాజీ ఎండీ శ్రవణ్‌రావులపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది. తీవ్రమైన, సంచలనాత్మక కేసుల్లో వాంటెడ్‌గా ఉండి, విదేశాలకు పారిపోయినట్లు ఆధారాలు లభించిన వారిపై పోలీసులు ఈ నోటీసులు జారీ చేయిస్తారు. తెలంగాణ నుంచి రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయి ఉన్న వారి సంఖ్య ప్రస్తుతం ఏడుగా ఉంది. శ్రవణ్‌రావు తిరిగి రావడంతో వీరిలో వాంటెడ్ నిందితుల సంఖ్య ఆరు మాత్రమే. ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులపై జారీ అయిన రెడ్ కార్నర్ నోటీసుల్ని ఇంటర్‌పోల్ కేవలం అఫీషియల్ వ్యూలోనే ఉంచింది.

ముగ్గురిపై ఉగ్రవాద సంబంధ కేసుల్లో...

ఈ ఏడుగురిలో ముగ్గురిపై మాత్రం ఉగ్రవాద సంబంధిత కేసుల్లో రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. మాదన్నపేట సమీపంలోని కుర్మగూడకు చెందిన ఫర్హాతుల్లా ఘోరీ అలియాస్ అబు సూఫియాన్ 1998లోనే ఉగ్రవాదం వైపు మళ్లి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2002లో గుజరాత్‌లోని అక్షర్‌ధామ్ దేవాలయంపై దాడి, 2004లో నగరం కేంద్రంగా బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి హత్యకు కుట్ర, 2005లో నగర కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయం మానవబాంబు దాడి, 2012 నాటి బెంగళూరు 'హుజీ కుట్ర' సహా అనేక కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడితో పాటు బెంగళూరు కుట్ర కేసులో నిందితులుగా ఉన్న మరో ఇద్దరి పైనా ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్, బెంగళూరు, హుబ్లీ, నాందేడ్‌లో విధ్వంసాలకు కుట్ర పన్నిన ఆరోపణలపై నమోదైన ఈ కేసులో తలాబ్‌కట్టకు చెందిన మహ్మద్ సాదిక్ బిన్ ఉస్మాన్, యాకత్‌పురకు చెందిన మహ్మద్ అబు సాద్‌ల పైనా ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసింది.

మరో ఇద్దరిపై వేర్వేరు కేసుల్లో...

ఈ ముగ్గురిపై ఉగ్రవాద సంబంధ కేసుల్లో, ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో రెడ్ కార్నర్ నోటీసులు జారీ కాగా.. మరో ఇద్దరిపై వేర్వేరు కేసుల్లో ఈ నోటీసులు ఉన్నాయి. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో నమోదైన అనేక హత్య, హత్యాయత్నం కేసుల్లో నగరానికి చెందిన తాహెర్ అన్సారీ నిందితుడిగా ఉన్నాడు. ఇతడితో పాటు అమీర్‌పేట కేంద్రంగా పని చేసిన ఓ ప్రైవేట్ బ్యాంక్‌ను నిండా ముంచిన బాబు మహ్మద్ పైనా ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసులు ఉన్నాయి. ఇతగాడు మరికొందరితో కలిసి 1997–2000 మధ్య సదరు బ్యాంకును నిండాముంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రెడ్‌కార్నర్ నోటీసులు ఉన్న మోస్ట్‌వాంటెడ్ జాబితాను ఇంటర్‌పోల్ తన వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. అవసరాన్ని బట్టి కొందరి వివరాలు పబ్లిక్ వ్యూలో, మరికొందరివి అఫీషియల్ వ్యూలో ఉంచుతుంది. ఇలా అఫీషియల్ వ్యూలో ఉన్న కారణంగానే ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులపై ఉన్నవి ప్రత్యేక లాగిన్ అవకాశం ఉన్న అధికారులకు తప్ప సాధారణ ప్రజలకు కనిపించవు. కేవలం ఉగ్రవాద సంబంధిత, అత్యంత తీవ్రమైన కేసుల్లో నిందితులుగా ఉన్న వారి వివరాలు మాత్రమే పబ్లిక్ వ్యూలో ఉంటాయి.

శ్రవణ్‌రావుపై సుప్రీం కోర్టుకు...

ఇలా రెడ్‌కార్నర్‌లో ఉన్న నిందితుల్లో శ్రవణ్‌రావుకు సుప్రీం కోర్టు ఊరట ఇవ్వడంతో వచ్చి లొంగిపోయారు. అయితే దర్యాప్తునకు సహకరించాలంటూ న్యాయస్థానం విధించిన షరతును ఈయన ఉల్లంఘిస్తున్నారని పోలీసులు చెప్తున్నారు. ఇప్పటికి మూడుసార్లు నోటీసులు ఇచ్చి విచారించినా సరైన వివరాలు చెప్పలేదని, ట్యాపింగ్ సమయంలో వినియోగించిన ఫోన్లు ఇవ్వాలని కోరితే వేరేవి ఇచ్చారని ఆరోపిస్తున్నారు. ఆయన స్వాధీనం చేసిన మూడు ఫోన్లకు ప్రాథమికంగా ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించిన అధికారులు అందులో ఎలాంటి డేటా లేదని తేల్చారు. ఇలా దర్యాప్తునకు సహకరించని శ్రవణ్‌రావుపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలని అధికారులు భావిస్తున్నారు. ఆయనకు ఉన్న ఊపశమనం ఎత్తివేయాలంటూ కోర్టును కోరే అవకాశం ఉందని తెలుస్తోంది.

వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి, సిటీబ్యూరో: వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ ఆధ్వర్యంలో మసాబ్ ట్యాంక్‌లో మంగళవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు రాష్ట్రం నలుమూలల నుంచి కారు, బైక్ ర్యాలీలతో ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బిల్లు ఉపసంహరించుకునే వరకు వెనక్కి తగ్గేదే లేదని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. శాంతి యుతంగా నిరసనలు కొనసాగిస్తామన్నారు.

పరువు నష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు : తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ విచారణకు పిటిషనర్ నాగార్జునతోపాటు ప్రతివాది మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడంతో వారి తరుపున న్యాయవాదులు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. సినీ అగ్రహీరో నాగార్జున కుమారుడు హీరో నాగచైతన్య-సమంత విడాకుల విషయంపై వ్యాఖ్యల నేపథ్యంలో కేసు నమోదైన విషయం విదితమే.

నిషేధిత హుక్కా ఉత్పత్తులు సీజ్

కుత్బుల్లాపూర్: నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుండ్లపోచంపల్లిలోని స్కైలైన్ కేఫ్‌లో మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించగా హుక్కా ఉత్పత్తులు విక్రయిస్తూ ఎర్రోళ్ల శ్రీధర్, కదమంచి మహేష్ పట్టుబడ్డారు. వారి వద్ద నుండి హుక్కా పాట్స్, వివిధ అల్రాజ్ ఫ్లేవర్లు, 15 బ్రిగ్ కోల్‌బాక్స్‌లు, ప్రొజెక్టర్, బిల్లింగ్ మిషన్‌లను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాంపల్లి కోర్టుకు మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి గైర్హాజరు

సిటీ కోర్టులు: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి నాంపల్లి కోర్టుకు గైర్హాజరయ్యారు. 2019 హుజూర్‌నగర్ బై ఎలక్షన్‌లో ఆయనపై పోలీసులు నమోదు చేసిన కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ కేసులో నిందితుడితోపాటు సాక్షులు గైర్హాజరు కావడంతో విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు. బై ఎలక్షన్స్ సమయంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోలో అనుమతికి మించి కార్యకర్తలు పాల్గొనడంతో నిబంధనలు ఉల్లంఘించారని సైదిరెడ్డిపై కేసు నమోదైన విషయం విదితమే.

బైకును ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

- భార్య మృతి..భర్తకు గాయాలు

మాదాపూర్: వాటర్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన శ్రీకాంత్ కుమార్ భార్య మనీషా కుమారితో కలిసి బుధవారం ఉదయం బైక్‌పై పర్వత్ నగర్ నుంచి మైహోంభుజ అపార్ట్‌మెంట్‌కి వెళ్తుండగా..సైబర్ టవర్ ఎంట్రీ గేట్ వద్ద ఓ వాటర్ ట్యాంకర్ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరు బైక్‌పై నుంచి పడిపోగా మనీషాకుమారి పైనుంచి వాటర్ ట్యాంకర్ వెళ్లడంతో తీవ్రగాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. శ్రీకాంత్ కుమార్ తల, చేతులకు స్వల్పగాయాలయ్యాయి. నర్లక్ష్యంగా నడిపిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను కె.శ్రీనివాస్‌గా గుర్తించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్రీడమ్ వేరుశనగ నూనె సరికొత్త ప్యాక్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా నవీకరించిన ఫ్రీడమ్ వేరుశనగ నూనె ప్యాక్‌ను బుధవారం ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖరరెడ్డి ఆవిష్కరించారు. సంప్రదాయ భారతీయ ఊరగాయ, పచ్చళ్లు, ఇతర వంటకాలకు అవసరమైన ఆరోగ్యకర కుకింగ్ ఆయిల్ కలెక్షన్‌ను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఫ్రీడమ్ వేరుశనగ నూనె గింజ రుచిని కలిగి ఉంటుందని, వివిధ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో సంప్రదాయ రుచి, సువాసనతో ఊరగాయలు, పచ్చళ్లు తయారు చేయడానికి ప్రాధాన్యతనిస్తారన్నారు. వీని అభిరుచికి తగిన 'ఫ్రీడమ్ వేరుశనగ నూనె ప్యాక్'ను పరిచయం చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెమినీ ఎడిబుల్స్–ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ చేతన్ పింపాల్టే తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల్లోకి పేదలను అనుమతించండి

- రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలో ఉన్న భూముల చెర విడిపించండి
- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు వినతిపత్రం



రాచకొండ సీపీ సుధీర్‌బాబును కలిసిన సీపీఎం బృందం

ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీ ఫిలింసిటీ ఆక్రమణలో ఉన్న ఇళ్ల స్థలాల కబ్జా కోసం లబ్ధిదారులకు సహకరించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సమక్షంలో బుధవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫిలింసిటీ చెరలో ఉన్న పేదల భూములకు విముక్తి కల్పించాలన్నారు. గతంలో నిరుపేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు. శాంతియుతంగా ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటామని, ఇందుకు సహకరించాలని కోరారు. దీనిపై సీపీ స్పందిస్తూ ఇంటి స్థలాల అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామేలు, మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గరాములు, ఇంటి స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ పి.జగన్, మండల కమిటీ సభ్యుడు ఆనంద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మా కుమారుడి ఇంట్లోనే ఉంటాం..

లావణ్య ఇంటికి వచ్చిన రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు



కుమారుడి ఇంట్లో ఉండేందుకు వచ్చిన రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు

మణికొండ: మా కుమారుడి కష్టార్జితంతో నిర్మించుకున్న ఇంట్లో తామే ఉంటామని హీరో రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు రాజేశ్వరి, బసవరాజు పేర్కొన్నారు. తమ ఇంట్లో లావణ్య అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోందని, తమకు స్వంత ఇల్లు ఉండగా బయట అద్దెకు ఉండాల్సిన ఖర్మ తమకు లేదని వారు పేర్కొన్నారు. బుధవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేటలోని విల్లాలో రాజ్‌తరుణ్ తరపు వ్యక్తులు, కేర్ టేకర్స్‌తో పాటు అతని తల్లిదండ్రులు వచ్చారు. తమ ఇంట్లో తాము ఉంటామని లోనికి వెళ్లే ప్రయత్నం చేశారు. దాంతో లావణ్య వారిని అడ్డుకున్నారు. తన ఇంటి సీసీ కెమెరాలను, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి తనపై దాడి చేశారని లావణ్య ఆరోపించారు. రాజ్‌తరుణ్‌తో తనకు జరిగిన వివాహంతో పాటు ఇంటి విషయం కోర్టులో ఉందని, కోర్టు ఆదేశాల ప్రకారమే తాను నడుచుకుంటానన్నారు. కాగా దీనిపై తమకు లావణ్య, రాజ్‌తరుణ్ తల్లిదండ్రులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని నార్సింగి పోలీసులు తెలిపారు.

ఓజీ కుష్ డ్రగ్స్ స్వాధీనం

- అమెరికా నుంచి దిగుమతి
- బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు సరఫరా
- పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.40 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో : అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియా తదితర ప్రాంతాల్లో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తోపాటు ఇతర మాదకద్రవ్యాలను, విదేశీమద్యం సీసాలను ఎక్సైజ్ శాఖ ఎస్టీఎఫ్ బి టీమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ డ్రగ్స్‌తోపాటు స్కోడాకారు గంజాయి, హాషిష్ సింథటిక్ డ్రగ్స్, చరస్ వంటి మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టుకున్న డ్రగ్స్‌ను, నిందితులను హాజరుపరిచారు. పట్టుబడిన కారు, డ్రగ్స్ విలువ రూ.40 లక్షలుగా ఉంటుందని ఆయన వెల్లడించారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బుధవారం బి టీమ్ ఎస్ఐ సంధ్య బృందం ఈ డ్రగ్స్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద బెక్‌పైన ఉన్న ఒక వ్యక్తి స్కోడా కారులోని మరో వ్యక్తి నుంచి ఓజీ కుష్‌ను మార్పిడి చేసుకుంటుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. కారులో తనిఖీల్లో 500 గ్రాముల ఓజీ కుష్, కిలో గంజాయి, 6 గ్రాముల చరస్, 4.38 గ్రాముల హాషీష్ సింథటిక్ డ్రగ్స్‌తోపాటు ఐదు విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు ప్రతీష్ భట్, జై సూర్యలను అరెస్టు చేసినట్లు జాయింట్ కమిషనర్ ఖురేషి తెలిపారు.ఈ సమావేశంలో బి టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, సీఐ భిక్షా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఎఫ్‌ఓ సాయిరెడ్డి

బంజారాహిల్స్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించేందుకు జూబ్లీహిల్స్ ఫైర్ స్టేషన్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని సాయిస్ఫూర్తి ఎన్‌క్లేవ్‌లో అపార్ట్‌మెంట్‌వాసులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలో తెలియజేశారు. ప్రమాదం జరిగిప్పుడు వెంటనే తీసుకోవాల్సిన చర్యలు వీరు ప్రయోగాత్మకంగా వివరించారు. జూబ్లీహిల్స్ ఎస్‌ఎఫ్‌ఓ సాయిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తాము మంటలను ఎలా ఆర్పుతామో వారికి సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.రామన్ గౌడ్ బుధవారం పరిశీలించారు. కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు డివిజన్‌లోని విఠల్ వాడీలో మట్టి కుప్పలు, పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించమని.. ఎప్పటికప్పుడు శుభ్రత పాటించేలా చూడాలని కార్మికులకు సూచించారు.

ప్రభుత్వ స్థలంలోని కంటైనర్ తొలగింపు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వెనుక ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కబ్జాదారులు ఏర్పాటు చేసిన కంటైనర్‌ను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వేనెంబర్ 403లో ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంత మంది కబ్జాకు పాల్పడి కంటైనర్‌ను ఏర్పాటు చేసుకుని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి సిబ్బందితో కలిసివెళ్లి ఘటనా స్థలంలో కంటైనర్‌ను తొలగించి ఆక్రమణలను నేలమట్టం చేశారు. ఇక్కడ ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అరుదైన అధ్యయనంలో శరత్‌కుమార్‌కు డాక్టరేట్



శరత్‌కుమార్

బంజారాహిల్స్: నగరానికి చెందిన ఎ.శరత్‌కుమార్‌కు అరుదైన డాక్టరేట్ లభించింది. స్టడీ ఆఫ్ ఇంపాక్ట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆన్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఎంప్లాయిస్ అనే పరిశోధన అంశంపై కళింగ విశ్వవిద్యాలయం నుంచి ఆయన ఈ డాక్టరేట్ పొందారు. ఈ తరహా అధ్యయనం దేశంలోనే చాలా అరుదైనది. ఎ కేస్ స్టడీ ఆఫ్ ఇన్సూరెన్స్ సెక్టార్‌లో కళింగ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ శర్మ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో.. ఉద్యోగుల పనితీరుపై శిక్షణ, అభివృద్ధి ప్రభావంపై ఆయన సమగ్రమైన అధ్యయనం చేశారు. ప్రత్యేకంగా బీమా రంగంలో అనేక కేస్ స్టడీస్ తీసుకుని తన పరిశోధన పూర్తి చేశారు. రెండు దశాబ్దాలుగా డాక్టర్ శరత్ బీమా రంగంలో వివిధ హోదాల్లో పనిచేశారు. త్వరలో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఈ డాక్టరేట్ పట్టా బహూకరించనున్నట్లు కళింగ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వెల్లడించారు.

మెరుగైన వైద్యం అందించాలి

సనత్‌నగర్: ఆరోగ్య సమస్యలు వచ్చినపుడు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బుధవారం ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఒక లక్షా 75 వేల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, నాయకులు శ్రీహరి, ఆరీఫ్, జనార్దన్, నర్సింగరావు, విఠల్, శివకుమార్, చందు, రాజు పాల్గొన్నారు.

‘యువ వికాసం’@ 2,023

యువతకు మెరుగైన ఉపాధికి ‘రాజీవ్’ పథకం

రూ. 4 లక్షల రుణాలకు అధికంగా దరఖాస్తులు

త్వరలో లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: నిరుపేద నిరుద్యోగులకు ఆర్థిక సాయం అందించి ఉపాధి పొందేలా తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రారంభంలో ఆన్‌లైన్‌లో మాత్రమే మీ-సేవా కేంద్రాల్లో ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మీ-సేవా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించడంతో పునరాలోచన చేసిన ప్రభుత్వం ఈ నెల 14 వరకు గడువు పొడిగించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని డివిజన్ వార్డు కార్యాలయాల్లో ఈ మేరకు ప్రత్యేక కేంద్రాలు తెరిచి సిబ్బందిని నియమించి దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలో 2,023 మంది దరఖాస్తు చేసుకున్నారు. చాలామంది దుకాణాల ఏర్పాటుకు మొగ్గుచూపారు. రూ. 4 లక్షల రుణాలకు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

కమిటీ పరిశీలన...

రాజీవ్ యువ వికాసానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను త్వరలో ఎంపిక చేయనున్నారు. వార్డు స్థాయిలో ఇందుకు సంబంధించి కమిటీ ఏర్పాటుచేసే దిశలో ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జీహెచ్‌ఎంసీ అధికారులు, సంబంధిత బ్యాంక్ మేనేజర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈబీసీల ఆర్థిక సంస్థల ప్రతినిధులు కమిటీలో ఉండనున్నారు. ఈ కమిటీ అభ్యర్థుల ధ్రువపత్రాల ప్రామాణికతను, వారి అర్హతను ధ్రువీకరించి ఎంచుకున్న స్వయం ఉపాధి పథకం సాధ్యాసాధ్యాలను అంచనా వేస్తారు. కమిటీ తయారుచేసిన తుది జాబితాను జిల్లా స్థాయి కమిటీకి పంపుతారు.

- జిల్లా స్థాయిలో కూడా సంబంధిత శాఖల అధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ ఉంటారు. ఈ కమిటీ స్వయం ఉపాధి పథకం ఎంపిక చేసిన అనంతరం ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేయనున్నారు.
- లబ్ధిదారులకు 15 రోజుల వరకు శిక్షణ ఇవ్వనున్నారని అధికారులు వెల్లడించారు.

డివిజన్ వారీగా వచ్చిన దరఖాస్తులివీ...

డివిజన్	దరఖాస్తులు
సోమాజిగూడ	242
ఖైరతాబాద్	523
వెంకటేశ్వరకాలనీ	334
బంజారాహిల్స్	189
జూబ్లీహిల్స్	735

‘ఎల్‌ఆర్‌ఎస్ కట్టినా జరగని న్యాయం’



ఫిర్యాదు చేస్తున్న యూనియన్ సభ్యులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

టబంజారాహిల్స్: తెలుగు సినీ అండ్ టీవీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రొడక్షన్ సెట్ అసిస్టెంట్స్ యూనియన్ కార్యవర్గం 2017లో యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో స్థలం కొనుగోలు చేసింది. అయితే ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు యూనియన్ బాధిత సభ్యులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ కొనుగోలు చేసిన స్థలాన్ని విభజించి యూనియన్ సభ్యులకు ఇచ్చారని బాధితులు తెలిపారు. ఆయా ప్లాట్‌లకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2019, 2020లలో తమ యూనియన్‌కు చెందిన గత కార్యవర్గం పి.సుబ్బరాజు, కె.రాజేశ్వర్‌రెడ్డి, పీఎస్‌ఎస్‌వీ ప్రసాద్ తమ యూనియన్ నుంచి ఎల్‌ఆర్‌ఎస్ నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 26 వేల చొప్పున 190 మందికి చెల్లించామన్నారు. మోత్కూరుకు చెందిన ఓ వ్యక్తికి 33 ఎల్‌ఆర్‌ఎస్ డాక్యుమెంట్ల నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 25 వేలు చెల్లించామన్నారు. అయితే ఇప్పటివరకు 175 మందికి పూర్తి ఎల్‌ఆర్‌ఎస్ కాలేదని, ఎల్‌ఆర్‌ఎస్ నిమిత్తం డబ్బులు కట్టిన సభ్యులు, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశ్నారు. తమను మోసం చేసిన మోత్కూరుకు చెందిన గోపీనాథ్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాము ఎప్పుడు అడిగినా సైట్ క్లోజ్ అయ్యిందని చెప్పి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఇస్తానని నమ్మించి మోసం

వెంగళరావునగర్: కారు ఇస్తానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... షేక్ షోయబ్ ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 14న కారు కొనడానికి ఓఎల్‌ఎక్స్‌లో వెదికాడు. ఈ సందర్భంలో ఎస్.సాంబశివరావు అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో కలిసి తాను మాసబ్ ట్యాంక్ వద్ద ఉంటానని, తన కారు విక్రయిస్తానని చెప్పాడు. తమ వద్దకు వస్తే సోదరుడు సర్ఫ్‌రాజ్ కారును చూపుతాడని అన్నాడు. దాంతో షోయబ్ మాసబ్‌ట్యాంక్ వెళ్లగా సర్ఫ్‌రాజు కారును చూపించాడు. రాత్రి సాంబశివరావు ఫోన్ చేసి తనకు రూ. 4.48 లక్షలు ఆన్‌లైన్ ద్వారా పంపితే ఉదయం తన సోదరుడు కారును అప్పగిస్తాడని తెలియజేశాడు. దాంతో షోయబ్ ఆ నగదు మొత్తాన్ని పంపాడు. మరుసటి రోజు సాంబశివరావుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. రెండురోజులైనా ఫలితం లేదు. దాంతో తనను మోసగించిన సాంబశివరావుపై చర్యలు తీసుకోవాలని షోయబ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



నాయిశెట్టి రమేష్

బంజారాహిల్స్: స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని పీఎంజే జ్యువెలర్స్‌లో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న నాయిశెట్టి రమేష్ (47) యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7వ తేదీన రమేష్ తన భార్యకు ఫోన్ చేసి గ్రామం నుంచి బయలుదేరానని, వస్తున్నానని చెప్పాడు. రెండు రోజులు గడిచినా రమేష్ రాకపోవడంతో కుటుబ సభ్యులు అన్ని ప్రాంతాలు గాలించారు. బంధుమిత్రుల ఇళ్లలోనూ వాకబు చేశారు. ఆచూకీ దొరకకపోవడంతో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87125 68901లో సంప్రదించాలని కోరారు.

మరో ఘటనలో...



దారావత్ రాయుడు

కేరళకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన తన భర్త రోజులు గడిచినా తిరిగి రాకపోవడంతో బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-46లోని అంబేద్కర్‌నగర్ బస్తీలో నివసించే దారావత్ రాయుడు (40) డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. కేరళకు ఒక కుటుంబం వెళ్లడానికి డ్రైవర్ కావాలంటూ స్నేహితుడు చెప్పడంతో ఈ నెల 11వ తేదీన రాయుడు ఇంట్లో చెప్పి డ్రైవింగ్‌కు వెళ్లాడు. ఈ నెల 13న ఆయన భార్య ఫోన్ చేయగా స్పందించలేదు. ఆ తర్వాత రోజు ఫోన్ చేసి తాను తిరుపతిలో ఉన్నానని, వస్తున్నానని చెప్పాడు. రెండు రోజులు గడిచినా రాకపోవడంతో బాధితురాలు పలుమార్లు భర్తకు ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో బంధుమిత్రుల ఇళ్లలో వాకబు చేసింది. రోజులు గడిచినా రాకపోవడంతో తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు రాయుడు కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 92463 36412లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

జాతీయ బీసీ నేతను దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీసీ నేతలు

ఫిలింనగర్: బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను ఇష్టమొచ్చినట్లు తిట్టడంతో పాటు ఆయన మర్యాదకు భంగం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఫిలింనగర్ బీసీ సంఘం నేతలు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహ విష్కరణ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ను శివారెడ్డి అనే ఓ నేత మీడియాలో మాట్లాడుతూ... అడ్డగోలుగా బూతులు మాట్లాడటంతో పాటు పక్కనే ఉన్న మహిళలతో తిట్టించాడని అంతేకాకుండా అంతు చూస్తానంటూ అవమానకరంగా మాట్లాడారంటూ నేతలు ఫిర్యాదు చేశారు. సదరు నేతపై కేసు నమోదు చేయాలని ఈ సందర్భంగా బీసీ నేతలు పోలీసులను కోరారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా మల్లికార్జున యాదవ్



నియామక పత్రం అందుకుంటున్న మల్లికార్జున యాదవ్

ఖైరతాబాద్: గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మల్లికార్జున్ యాదవ్ నియమితులయ్యారు. బుధవారం జాంబాగ్‌లోని యాదవ సంఘం గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బోయిని వెంకటేష్ యాదవ్, చైర్మన్ చిట్టబోయిన నందకిషోర్‌ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో యాదవుల ఐక్యత, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

లిబర్టీ: విద్యకు మించిన ఆయుధం ఏదీ లేదని విద్యతో ఉన్నత శిఖరాలకు చేర్చుకోవచ్చని పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సి.హెచ్.బాలకృష్ణ అన్నారు. కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చని స్పష్టం చేశారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఆయన నోటు పుస్తకాలు ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాణించాలనే పట్టుదల.. లక్ష్యం చేరుకోవాలని సంకల్పం ఉంటే ఏదైనా జీవితంలో సాధించవచ్చన్నారు. 20 ఏళ్లు కష్టపడితే 80 ఏళ్ల జీవితంలో మంచి జీవనం గడపవచ్చని పేర్కొన్నారు. విద్యా రంగంలో విద్యార్థులు పోటీపడి రాణిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. నేతలు రాజు, మూర్తి, శ్యామ్, ప్రొఫెసర్ లింగస్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

సునార్‌లేన్‌లో లోప్రెషర్ సమస్య



కాచిగూడ: సునార్‌లేన్‌లో కొంత కాలంగా తాగునీరు లోప్రెషర్‌తో రావడంతో స్థానికులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సమస్యను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌కు వివరించామని తెలిపారు. బుధవారం కాచిగూడ డివిజన్‌లోని సునార్‌లేన్‌లో కార్పొరేటర్ పర్యటించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్య సత్వర పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్.సంతోష్, కృష్ణ, బి.భీమ్‌రాజ్, సూరి, ఎస్.రవియాదవ్, వాసు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త టెక్నాలజీతో నల్లాలకు మోటార్లు!

- కొనసాగుతున్న ‘మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్’
- తనిఖీల్లో పట్టుబడుతున్న మోటార్లు



స్పెషల్ డ్రైవ్‌లో స్వాధీనం చేసుకున్న మోటార్లు

బంజారాహిల్స్: మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ లక్ష్యంగా జలమండలి డివిజన్-6 అధికారులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ రెండో రోజైన బుధవారం కూడా కొనసాగింది. జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ ఆధ్వర్యంలో డీజీఎంలు, మేనేజర్లు, లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నల్లాలకు మోటార్లు బిగించిన వారిపై చర్యలు తీసుకున్నారు. రెండో రోజు 20 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అధికారుల బృందం జలమండలి విజిలెన్స్ పోలీసులతో కలిసి నల్లాల్లో నీరు వదిలే సమయంలో తనిఖీలు చేపడుతున్నారు. అయితే చాలామంది జలమండలి సిబ్బంది కళ్లు గప్పి సరికొత్త టెక్నాలజీతో అధికారుల తనిఖీల్లో దొరక్కుండా మోటార్లు బిగించి నీళ్లను తోడేస్తున్నట్లుగా తనిఖీల్లో తేలింది. కొంతమంది తమ మోటార్లను పూర్తిగా సంప్‌ల్లోనే ఏర్పాటుచేసి కొత్త టెక్నాలజీతో నీళ్లను లాగేస్తున్నట్లు గుర్తించారు. మరికొంతమంది సబ్‌మెర్సిబుల్ మోటార్లను బిగించారు. ఇంకొంతమంది గ్రామాల్లో పంటల వద్ద ఏర్పాటుచేసే 1.5 హెచ్‌పీ భారీ మోటార్లను కూడా ఏర్పాటు చేసి నీళ్లను లాగుతున్నట్లుగా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైతే అక్రమంగా మోటార్లు ఏర్పాటుచేస్తున్నారో వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తామని జీఎం తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ రోజూ కొనసాగుతుందన్నారు. ఎవరైనా ఇప్పటికే మోటార్లు బిగించుకుని ఉంటే వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. అక్రమ మోటార్లు బయట పడితే ఆ కనెక్షన్ కూడా కట్ చేస్తామని హెచ్చరించారు.

దాసోజు ప్రమాణ స్వీకారానికి బీఆర్ఎస్ నేతలు



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ఖైరతాబాద్ నేతలు

బంజారాహిల్స్: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దాసోజు శ్రవణ్‌కు ఖైరతాబాద్ నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి శ్రవణ్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బంజారాహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత జేజోళ్ల రాజుముదిరాజ్, వెంకటేష్, సాయినాయుడు, విజయకృష్ణ, కొమ్ము విజయ్‌కుమార్, బర్ల నాగరాజు ముదిరాజ్‌తో పాటు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతను మోసం చేస్తున్న ప్రభుత్వాలపై ఉద్యమించాలి

ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు పిలుపు



మాట్లాడుతున్న లెనిన్ బాబు

హిమాయత్‌నగర్: యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. దేశంలోని వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్న సంపన్నులు ముఖేష్ అంబానీ, అదానీ, ఇతర బడా వ్యాపారస్తుల ఆస్తులను జాతీయం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి సమావేశం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ... దేశంలో రోజు రోజుకూ నిరుద్యోగం పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తంచేశారు. 2023లో కార్పొరేట్ పన్ను 30 నుంచి 22 శాతానికి తగ్గించారని, సంపద పన్ను తగ్గింపు వల్ల రూ.950 కోట్లు కార్పొరేట్ పన్ను తగ్గింపుతో రూ. లక్ష కోట్ల రెవిన్యూ లోటు కలిగిందన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, లింగం రవి, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్, పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్ బేగ్, షేక్ మహమూద్, శివ కుమార్, మధు, బోనగిరి మహేందర్, మస్కు సుధీర్, మోగిలి లక్ష్మణ్, మహేష్, మాజీద్‌అలీ ఖాన్, కళ్యాణ్, మానస్ కుమార్, మార్కపూరి సూర్య, రాజేష్, మధు, ప్రవీణ్, అశోక్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కేసులన్నీ కక్షపూరితమే: విజయారెడ్డి



ధర్నాలో పాల్గొన్న విజయారెడ్డి తదితరులు

బంజారాహిల్స్: నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్షపూరితంగా ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చార్జ్‌షీట్‌లో చేర్చారని టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఈడీ కార్యాలయం ఎదుట నిర్వమించిన ధర్నాలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై మోపిన కేసులన్నీ కుట్రపూరితమే అని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భర్తను దూషించాడని కార్పొరేటర్ ఫిర్యాదు

వెంగళరావునగర్: ఎలాంటి ఆధారాలు లేకుండా తన భర్తను ఒకవ్యక్తి అవమానిస్తూ దూషించాడని సోమాజిగూడ కార్పొరేటర్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఏటా రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం ప్రతి డివిజన్‌లో లక్ష రూపాయల చొప్పున ఇఫ్తార్ విందు కోసం పంపిణీ చేస్తుంది. అయితే ఈ ఏడాది ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయలేదు. పండగ తర్వాత 7వ తేదీ ఇఫ్తార్ విందును ఇవ్వాలని నిర్ణయించారు. అయితే స్థానికంగా ఉన్న ఖాజా అలీయుద్దీన్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వం విడుదల చేసిన లక్ష రూపాయలు తన భర్త వనం శ్రీనివాస్ కాజేశాడని ఈ నెల 5వ తేదీనాడు దుర్భాషలాడాడు. దాంతో ఎలాంటి ఆధారాలు లేకుండా తన భర్తను ఫోన్‌లో అవమానించి, దూషించిన ఖాజా అలీయుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ భార్య సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో దాచిన నగలు మాయం

వెంగళరావునగర్: ఇంట్లోని లాకర్‌లో దాచిన బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... మధురానగర్‌కాలనీలో నివసించే డాక్టర్ వి.రమణకుమార్ డెంటల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. దాదాపు 10 రోజుల కిందట రూ.90 వేలు విలువైన గోల్డ్ చైన్, గాజులు ఇంట్లోని లాకర్‌లో దాచాడు. తిరిగి బుధవారం చూడగా కనిపించలేదు. దాంతో రమణకుమార్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా ఇన్‌చార్జి సూర్యనారాయణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, సివిల్ కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేసిందని ఆరోపించారు. బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ పరిధిలో ఉన్న మెయింటనెన్స్ కాంట్రాక్టులను బీసీలకు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు చేయడంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నందున న్యాయ నిపుణులతో లోతుగా చర్చించి అమలు కోసం పగడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్ల కోసం ఒక బిల్లు, రాజకీయ రిజర్వేషన్ల కోసం మరొక బిల్లు ఉందన్నారు. ఈ రెండు బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల సంక్షేమానికి ఉపయోగపడే బీసీ రిజర్వేషన్ బిల్లుని ఆమోదించాలని కోరారు. అమల్లోకి వచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

షకీల్‌ను పరామర్శించిన కేటీఆర్


మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

బంజారాహిల్స్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఇటీవల షకీల్ మాతృమూర్తి కన్నుమూసిన విషయం తెలిసిందే. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-86లో నివసించే షకీల్ నివాసానికి కేటీఆర్ బుధవారం వెళ్లారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేటీఆర్ వెంట జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కూడా ఉన్నారు.

గ్రూప్–1 సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

నాంపల్లి: తెలుగు వర్సిటీ ప్రాంగణంలో బుధవారం గ్రూప్–1 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రక్రియ నాలుగు రోజులపాటు కొనసాగుతుంది. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుంది. మొదటి రోజు 200 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిసింది. వర్సిటీ ప్రాంగణంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రూప్–1 ఫలితాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. మొదటి రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా ముగిసింది. ఈ గ్రూప్–1 ఫలితాలను ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

కేసీఆర్ ఇంటికెళ్లే రోడ్డుకు మరమ్మతులు


నందినగర్ కేసీఆర్ ఇంటికి వెళ్లే మార్గంలో పనులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

వెంకటేశ్వరకాలనీ: మాజీ సీఎం, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఇంటికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు పనులను ఎట్టకేలకు మంగళవారం అర్ధరాత్రి పునఃప్రారంభించారు. రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయిన విషయమై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ ఇంజినీర్లు స్పందించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని నందినగర్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి వెళ్లే మార్గంలో రెండు నెలల క్రితం అధికారులు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డును సగం మేర తవ్వేసి వదిలేశారు. గత నెలన్నర రోజులుగా స్థానికులు తవ్విన రోడ్డుపై ప్రయాణించడానికి అవస్థలు పడుతున్నారు. దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు ఆపేసిన వైనాన్ని పత్రికలో చూసిన జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సంబంధిత ఇంజినీర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెంటనే పనులు ప్రారంభమయ్యాయి.

గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌లో గీత కార్మికులపై విధించిన సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ రమణ, తెలంగాణ గౌడ, కల్లుగీత వృత్తిదారుల సమన్వయ కమిటీ చైర్మన్, బాలగౌని బాలరాజు గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయకుమార్ గౌడ్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ గౌడ మహిళను గుడి నుంచి గెంటేసి ఈత చెట్లను తగలబెట్టిన వీడీసీ సభ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనను కోర్టు సుమోటోగా తీసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ నెల 25న బాధితులకు మద్దతుగా వేలాది మందితో చలో తాళ్ల రాంపూర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు పి.ఆశయ్య ఎల్.బాలకృష్ణ, ఉడుత రవీందర్, ఎం .దశరథ్ , వీరస్వామిగౌడ్ పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో నివాస రిజర్వేషన్లు కల్పించాలి

– మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రవేశాల్లో 25 శాతం నివాస రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్‌లను కలిశారు. తెలంగాణ ప్రాంత విద్యా అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 371–ఇ కింద స్థాపించిన ఏకైక కేంద్ర విశ్వవిద్యాలయం హైదరాబాద్ విశ్వవిద్యాలయమని చెప్పారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీ వంటి ఇతర సెంట్రల్ యూనివర్సిటీల్లో ఇప్పటికే నివాస ఆధారిత రిజర్వేషన్ విధానాలు అమలులో ఉన్నాయని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వీటిని అమలు చేయడానికి రాజ్యాంగబద్ధమైన, విధానపరమైన అడ్డంకులేమీ లేవని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సామాజిక–విద్యా వాస్తవాలను గుర్తించాలని కోరారు. వినోద్ కుమార్ వెంట భారత్ రాష్ట్ర సమితి విద్యార్థి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, విద్యార్థి నాయకులు విశాల్ తదితరులు ఉన్నారు.

విత్తనాల తయారీకి ప్రోత్సాహం

- రాష్ట్రంలో 311 రైతు ఉత్పత్తిదారుల కేంద్రాల గుర్తింపు
- సహకార సంఘాల కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ సురేంద్రమోహన్
- 3 జిల్లాల సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు, అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అందించే అదనపు సేవల్లో ప్రధానంగా భూసార పరీక్షలు నిర్వహించడం, ఏ.ఐ. ద్వారా రైతులకు సలహాలు ఇవ్వడం ఉంటాయని రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ అండ్ రిజిస్ట్రార్ కె.సురేంద్ర మోహన్ తెలిపారు. రైతులు విత్తనాలు తయారు చేసుకునేలా తీర్చిదిద్దడంతోపాటు సరైన ఎరువులను మాత్రమే వాడుకులేనా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 311 ప్రాథమిక వ్యవసాయ/రైతు సేవా సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(కేంద్రాలు)గా గుర్తించినట్లు తెలిపారు. దేశంలో పదివేల రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాలులో మేడ్చల్–మల్కాజిగిరి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల సహకార సంఘాల అధికారులు, ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి మూడు జిల్లాల పరిధిలో 36 సంఘాలను గుర్తించగా, ఇందులో రంగారెడ్డి జిల్లాలో 14 సంఘాలు, వికారాబాద్ జిల్లాలో 13, మేడ్చల్ జిల్లాలో తొమ్మిది సంఘాలు ఉన్నాయన్నారు. ఈ రైతు సేవా సహకార సంఘాలు అందిస్తున్న సేవలతోపాటు అదనంగా మరిన్ని సేవలు చేపట్టనున్నట్లు సురేంద్రమోహన్ పేర్కొన్నారు.

తక్కువ నీరు.. ఎక్కువ ఉత్పత్తి

తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేలా జలవనరుల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తామని సురేంద్ర మోహన్ అన్నారు. పెరుగుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం డ్రోన్లు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు వ్యవసాయేతర డైరీ ఫామ్స్, సోలార్ పవర్ యూనిట్లు, పెట్రోల్ పంపులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. రైతులు ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయడమే రైతు ఉత్పత్తిదారుల సంఘాల లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సహకార సంఘాల అడిషనల్ రిజిస్టర్ జి.శ్రీనివాసరావు, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ ఎండీ అన్నపూర్ణ మాట్లాడుతూ రైతు పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని గమనించిన కేంద్రం రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మర్ హార్టికల్చర్ కమిషనర్ ఎల్.వెంకటరామిరెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ చక్రపాణి, సహజ వ్యవసాయ రైతు ప్రసాద్ రెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా సహకార అధికారి టి.వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా సహకార అధికారి సుధాకర్, వికారాబాద్ జిల్లా సహకార అధికారి నాగార్జున, తెలంగాణ కోపరేటివ్ యూనియన్ ప్రిన్సిపాల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మ్యాచింగ్ గ్రాంట్‌ను ముఖ్యఅతిథులు అందజేశారు.



29న ఇందిరా పార్కు వద్ద పెన్షనర్ల ధర్నా

సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా చేపట్టనున్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో నోటీసులు అందించినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి గత అక్టోబర్‌లో మూడు దశల పోరాటానికి సిద్ధమయ్యామన్నారు. నవంబర్ 5, 6 తేదీలలో పెన్షన్ పేమెంట్ కార్యాలయాల ముందు నవంబర్ 19న కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. దీంతో ప్రభుత్వ ఒక డీఏ మంజూరు చేసినట్లు తెలిపారు. అయినా కొన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నందువల్లా వాటి పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీన ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన ధర్నాను పెన్షనర్లు వందల సంఖ్యల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, మీడియా ఇన్‌ఛార్జ్ జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయంలో నోటీసులు ఇస్తున్న పెన్షనర్ సంఘాల నాయకులు

25న పింఛన్ కమిటీ సమావేశం

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్ పింఛన్ కేసులను పరిష్కరించడానికి హైదరాబాద్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో పింఛన్ కమిటీ సమావేశం ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సమావేశానికి రిటైర్డ్ ఉద్యోగులు, పింఛనుదారుల పింఛన్ కేసు వివరాలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

క్వారీ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్


క్వారీ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ప్రభుత్వ స్థలంలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాలను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం పరిశీలించారు. ఈ మేరకు రహమత్‌నగర్ డివిజన్‌లోని క్వారీ మైదానాన్ని సందర్శించారు. క్వారీలోని ప్రభుత్వ భూముల వివరాలను ఆర్డీఓ సాయిరామ్‌ను, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీమొద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో పేదలకు జీప్లస్ త్రీ భవనాల సముదాయ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. చుట్టుపక్కల ఉన్న బస్తీల వివరాలు, స్థలాల సమాచారం గురించి స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి వివరించారు. అనంతరం క్వారీ మైదానంలో గుట్టపై ఉన్న ఆలయంలో కలెక్టర్ పూజలు నిర్వహించారు.

నీటి ఇబ్బందుల్లేకుండా కార్యాచరణ


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్

బండ్లగూడ: వేసవి నేపథ్యంలో ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బండ్లగూడ జాగీర్, శంషాబాద్, మణికొండ, నార్సింగి, తుక్కుగూడ, జల్‌పల్లి, ఆదిభట్ల, బడంగ్‌పేట్, మీర్‌పేట్, పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీల కమిషనర్లతో, జలమండలి అధికారులతో తాగునీటి సమస్యలపై సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్యలను అధిగమించడానికి వార్డుల వారీగా కార్యాచరణ చేసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్ల సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో వివిధ మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.


పాల్గొన్న మున్సిపాలిటీల కమిషనర్లు, జలమండలి అధికారులు

కాంట్రాక్ట్ అధ్యాపకులకు మద్దతుగా ధర్నా


కోఠిలోని చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

సుల్తాన్‌బజార్: కాంట్రాక్ట్ అధ్యాపకులకు మద్దతుగా విద్యార్థినులు రోడ్డెక్కారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నవారిని క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. విద్యార్థినులు ఒక్కసారిగా కోఠి ఉమెన్స్ కళాశాల నుంచి రోడ్డుపైకి వచ్చేందుకు ప్రయత్నించడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న సుల్తాన్ బజార్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. విశ్వవిద్యాలయం లోపటే ధర్నా నిర్వహించుకోవాలని పోలీసులు సూచించడంతో విద్యార్థులు వందల సంఖ్యల్లో గేటు లోపలనే బైఠాయించారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మనెంట్ చేయకుండా కొత్త రిక్రూట్‌మెంట్‌ను ఎలా చేపడతారని విద్యార్థులు ప్రశ్నించారు. 20 నుంచి 30 ఏళ్లపాటు కాంట్రాక్ట్ అధ్యాపకులుగా ఎంతో అనుభవం ఉన్న వీరిని ఖాళీల్లో భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'అజంజాహి'లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

– పలు పార్టీ నేతల డిమాండ్


ధర్నాలో పాల్గొన్న హరగోపాల్, వామపక్ష పార్టీల నేతలు, అజంజాహి కార్మికులు

కవాడిగూడ: సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, అజంజాహి మిల్లు భూమిలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అజంజాహి మిల్లు మాడిఫైడ్ వాలంటరీ రిటైర్డ్–2002 వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అజంజాహి మిల్లు కార్మిక యూనియన్ భవనాన్ని అక్రమంగా కూల్చివేసిన కాసం పుల్లయ్య షాపింగ్ మాల్ యాజమాన్యాన్ని, దొంగ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన వారందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజారావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, అసోసియేషన్ అధ్యక్షుడు యనమల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆరెల్ల కృష్ణ నాయకులు భిక్షపతి, సందీప్, శ్యామ్, సంజీవ, యశోద, గణేష్ , వీరస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి కేంద్రం తూట్లు: సంపత్

శంషాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తోందని ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ ఆరోపించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బేగంగార్డెన్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన 'జై బాపు, జై భీం, జై సంవిధాన్'సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని తొక్కిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర సర్కారు చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శంషాబాద్ మాజీ సర్పంచులు ఆర్.గణేష్‌గుప్తా, రాచమల్ల సిద్ధేశ్వలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి మైలారం సులోచన, సీనియర్ నాయకులు కె.చంద్రారెడ్డి, డి.వెంకటేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఉద్యమ చరిత్రను గ్రంథస్థం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనంలో ఎమ్మెల్సీ కోదండరాం

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక వహించిన అన్ని యూనివర్సిటీల విద్యార్థుల ఆందోళనలు, ఉద్యమాలు, ఉద్యమ చరిత్రను గ్రంథస్థం చేయాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. విద్యార్థులు భవిష్యత్ గురించి ఆలోచించకుండా నిస్వార్థంగా పోరాటం చేశారని, అప్పుడు విద్యార్థులు నిర్వహించిన చలో అసెంబ్లీ కూడా డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటనకు ఒక కారణమని గుర్తుచేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యార్థి ఉద్యమ కారుల వేదిక, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కంచర్ల బద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర మరవలేనిదని, అరెస్టులు, లాఠీదెబ్బలు, కేసులకు బెదరకుండా చాలా కీలక పోరాటం చేశారన్నారు. విద్యార్థుల ఆందోళనలు రికార్డు కాకపోవడం వల్ల కొంతమంది కేవలం ఇద్దరి, ముగ్గురి ఉద్యమంగా చూపుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే తెలంగాణ ఉద్యమ కాలంనాటి కేసులు దాదాపుగా ఎత్తివేశారని, కానీ కేసీఆర్ పాలనలో ఉద్యమకారులపై పెట్టిన కేసులు, ఉపా కేసులు ఉన్నాయని, వీటిని కూడా ఎత్తివేయించేలా కృషి చేస్తానని కోదండరాం అన్నారు. కంచర్ల బద్రి మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు 250 గజాల స్థలంలో ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సుల్తాన్ యాదగిరి, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, మందాల భాస్కర్, స్టాలిన్, వీరస్వామి, చాగంటి రాములు తదితరులు పాల్గొన్నారు.

'బర్త్‌రైట్'లో గర్భిణీకి అరుదైన శస్త్రచికిత్స

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ బర్త్‌రైట్ బై రెయిన్‌బో ఆసుపత్రిలో అసాధారణ, సంక్లిష్టమైన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ హిమబిందు బృందం ఒక ప్రకటనలో తెలిపింది. 26 ఏళ్ల గర్భిణీకి 30–32 వారాలకు సాధారణ స్కానింగ్ చేసిన సమయంలో ప్లెసెంటా పెర్క్రీటా ఉన్నట్లు గుర్తించామని హిమబిందు పేర్కొన్నారు. ప్లెసెంటా పెర్క్రీటా వల్ల ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరుగుతుందని, తల్లీ, బిడ్డ ప్రాణాలకే ముప్పు ఉంటుందని తెలిపారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో 35 వారాల్లో ప్రసవం చేయాలని నిర్ణయించామని, ప్లెసెంటా నుంచి దూరంగా ఉన్న ప్రదేశంలో కోతకోసి శిశువు జన్మించిన తరువాత అంతర్గత ఇలియాక్ ధమనుల్లో గాలి నింపిన బెలూన్ కాథెటర్‌లను చొప్పించడంతో రక్తస్రావం తగ్గిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మొత్తం 6 గంటల సమయం పట్టిందని, సాధారణంగా ఈ శస్త్రచికిత్స చేయడానికి 10 నుంచి 15 యూనిట్ల రక్తం అవసరం అవుతుందని, హైరిస్క్ కేసు విషయంలో రక్తస్రావం జరగకుండా జాగ్రత్త పడటంతో అదనంగా రక్తం అవసరం లేకుండా చికిత్స పూర్తి చేశామని ఆమె తెలిపారు. ప్రమాదాన్ని తగ్గించడానికి వైద్య బృందం ఇంటర్వెన్షనల్ రేడియాలజీని ఉపయోగించిందని, ఇది ప్రసూతిశాస్త్రంలో అరుదుగా ఉపయోగించే అధునాతన సాంకేతికత అని పేర్కొన్నారు. ఈమె గతంలో సందర్శించిన ఆసుపత్రులు ప్రసవం చేయించడానికి నిరాకరించాయని తెలిపారు. చికిత్సలో వైద్యులు శ్రీనివాస్, గీత, విపిన్ గోయెల్, మహేష్, అత్యంత నైపుణ్యం కలిగిన నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారని పేర్కొన్నారు.



ఉపాధి అవకాశాలే లక్ష్యంగా జాబ్‌మేళా

– నిమ్స్‌మే ఎస్‌ఈఎం డైరెక్టర్ విజయ


ఇంటర్వ్యూల్లో పాల్గొన్న యువత

వెంగళరావునగర్: నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశమని నిమ్స్‌మే ఎస్‌ఈఎం డైరెక్టర్ ఇ.విజయ అన్నారు. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్ మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా కేంద్రంలో బుధవారం ఎస్‌ఈఎం ఫ్యాకల్టీ మెంబర్ స్వప్న ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఉద్యోగమేళాను ప్రారంభించిన డైరెక్టర్ విజయ మాట్లాడుతూ ఐటీ, ఎనేబుల్ సర్వీసులు, బ్యూటీ, వెల్‌నెస్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, మీడియా ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన 22 ప్రముఖ సంస్థలు మేళాలో పాల్గొనడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన వారికి కొందరికి తక్షణమే ఇస్తామని, మరికొందరికి త్వరలోనే ఆఫర్ లెటర్స్ పంపుతామని ఆయా కంపెనీల ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ఉద్యోగమేళా కొనసాగింది. కార్యక్రమంలో అసోసియేట్ ఫ్యాకల్టీ మెంబర్ డాక్టర్ మనీషా, వివిధ సంస్థల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువతీయువకులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో రాష్ట్రం ముందంజ

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ సునీతారావు

రహమత్‌నగర్: కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో దేశంలో తెలంగాణ ముందుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ నాయకులు నియోజక వర్గాలు, డివిజన్, బ్లాక్‌ల వారీగా సభ్యత్వ నమోదు పూర్తి చేశారని చెప్పారు. పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు లభిస్తుందని, ఎవరూ నిరుత్సాహ పడొద్దన్నారు. మహిళా కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అంతకుముందు రహమత్‌నగర్ కూడలిలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు ఆమె కార్పొరేటర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత, జూబ్లీహిల్స్ అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సునీతారావు

పేరిణి నాట్యం రాష్ట్రానికే గర్వకారణం

గన్‌ఫౌండ్రీ: కాకతీయుల కాలం నుంచి ఎంతో ఆదరణ పొందిన పేరిణి నృత్యం తెలంగాణకే గర్వకారణమేనని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమి ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహిస్తున్న పేరిణి నాట్య గురు శిష్య పరంపర వేసవి శిక్షణ శిబిర వాల్‌పోస్టర్‌ను బుధవారం రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరిణి నృత్యంలో ఈ తరం కళాకారులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పేరిణి నాట్యాచార్యులు గజ్జెల రంజిత్ కుమార్, నవ్యజ, రాయబారపు శ్రవణ్‌రాజు, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ జాతీయ అవార్డు గ్రహీత ధరావత్ రాజ్‌కుమార్, బందారు వైష్ణవి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 17 ఏప్రిల్, 2025

వేసవి సెలవులు మొదలు కానున్నాయి. ఇవి కేవలం విశ్రాంతి, వినోదానికి మాత్రమే అనుకోవడం పాత ఆలోచన. నేర్చుకోవడానికి, స్వతంత్రంగా సంపాదించడానికి, భవిష్యత్‌కు బలమైన పునాది ఏర్పర్చుకోవడానికి ఓ మంచి అవకాశం అనేది కొత్త పంథా. కొత్త పంథాలో అడుగేసేందుకు నగర యువతకు కనపడుతున్న పలు మార్గాల్లో సమ్మర్ జాబ్స్ ముందున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



హాలీడేస్ పార్ట్‌టైం జాబ్స్

వేసవి సెలవులు.. విద్యార్థులకు ఆదాయ మార్గాలు

- పలు రంగాల్లో పార్ట్‌టైం జాబ్స్‌కు ప్లాన్ చేస్తున్న స్టూడెంట్స్
- పాకెట్ మనీతో పాటు కెరీర్‌కు మేలనే భావన
- కెరీర్‌కు ఉపకరించే ఇంటర్న్‌షిప్స్‌కూ ఇదే రైట్ టైమ్

స్కూళ్లు, కాలేజీలకు విరామం వచ్చిన ఈ సమయం యువతకు నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి, స్వల్ప ఆదాయం సంపాదించడానికి మంచి అవకాశం. ఆదాయం, అనుభవం రెండింటికీ అనేక రంగాల్లో సమ్మర్ జాబ్స్ అందుబాటులో ఉన్నాయి. సరైన దిశలో అడుగేస్తే, ఈ వేసవి తమ జీవితానికే మార్గనిర్దేశం చేసేదిగా మారవచ్చని భావిస్తున్న విద్యార్థులు సెలవుల్లో పలు ఆదాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. వాటిలో కొన్ని..

సోషల్ మీడియా మేనేజ్‌మెంట్

సోషల్ మీడియా పట్ల ఆసక్తి అందులో కొంత నైపుణ్యం ఉన్నవారు చిన్న వ్యాపారాలకు పేజ్ మేనేజ్‌మెంట్ సేవలందించవచ్చు. డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో ఫ్రీలాన్సింగ్ ద్వారా నెలకు రూ.20 వేల వరకూ ఆదాయం సాధ్యం.

ఇంటర్న్‌షిప్స్

దాదాపు అన్ని తాత్కాలిక ఉద్యోగాల వల్ల ఎంతో కొంత అనుభవం వచ్చి అది భవిష్యత్తుకు ఉపకరిస్తుంది అనేది నిజమే.. అయితే తాము ఎంచుకున్న కెరీర్‌కు అనుగుణమైన రీతిలో అటు ఆదాయం ఇటు అభ్యాసాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకునే విద్యార్థులకు ఐటీ, డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, గ్రాఫిక్ డిజైన్ రంగాల్లో సమ్మర్ ఇంటర్న్‌షిప్స్ ఎంచుకుంటున్నారు. వీటిలో కొన్నింటికి స్టైఫండ్ రూ.10 వేలు ఆపైన లభిస్తుంది. ఈ అనుభవంతో భవిష్యత్ ఉద్యోగావకాశాల్లో ప్రయోజనం కలుగుతుంది.

కంపెనీలూ రెడీ..

స్వల్పకాలిక ప్రాజెక్ట్‌ల కోసం వేసవి సెలవుల్లో విద్యార్థులను నియమించుకోవడం అనేది కొంత కాలంగా కంపెనీలు అనుసరిస్తున్న విధానం. నగరంలోని ప్రొఫెషనల్ రెగ్యులర్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు ఈ వేసవిలో తమ అధ్యయన రంగానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులపై పని చేయబోతున్నామని చెప్పారు. కళలు హ్యుమానిటీస్ నేపథ్యానికి చెందిన విద్యార్థులు కంటెంట్ రైటింగ్ నుంచి ఫీల్డ్ రీసెర్చ్ వరకు ఉద్యోగాలపై పని చేస్తుంటే, ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి వచ్చిన వారు కంపెనీల ద్వారా అవుట్‌సోర్స్ చేసే ప్రాజెక్ట్‌లలో పని చేస్తున్నారు. విద్యార్థులు చెబుతున్న ప్రకారం, వేసవి ఉద్యోగాల ద్వారా నెలకు సగటున రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకు ఆదాయాలు ఉంటాయి. సెలవులు ప్రారంభం కావడానికి ముందే కళాశాలలు విద్యార్థులకు ఇలాంటి ఉద్యోగాలు అందుకోవడంలో సహకరిస్తున్నాయి.





కాల్ సెంటర్ / బీపీఓలు..

ఐటీ హబ్‌గా మారుతున్న నగరంలో పలు కంపెనీలు తాత్కాలిక కాల్ సెంటర్, కస్టమర్ సపోర్ట్ ఉద్యోగాలను అందిస్తున్నాయి. వీటికి 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు సైతం అర్హులే. పనివేళలు షిఫ్ట్ ప్రాతిపదికన ఉండటంతో సెలవులు ముగిశాక కూడా అవసరం అనుకుంటే క్లాసుల వేళలతో సమన్వయం చేయవచ్చు. నెలకు రూ.20 వేల వేతనం అందుకోవచ్చు.

ట్యూటరింగ్ /హోం ట్యూషన్లు..

పాతదే అయినా ఇప్పటికీ వన్నెతగ్గని ఉపాధి ఇది. ఇంటర్ లేదా డిగ్రీ చదువుతున్న యువత, పాఠశాల విద్యార్థులకు హోమ్ ట్యూషన్లు చెప్పడం ద్వారా నెలకు రూ.15 వేల వరకూ ఆదాయం వస్తోంది. కొంతమంది ఆన్‌లైన్ ట్యూటర్‌గా కూడా పని చేస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు.

రిటైల్, కస్టమర్ సర్వీస్

షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, బ్రాండెడ్ షోరూమ్స్‌లో కస్టమర్ సర్వీస్, క్యాషియర్, స్టాక్ మేనేజ్‌మెంట్ వంటి ఉద్యోగాలు వేసవిలో తాత్కాలికంగా లభిస్తాయి. వీటిలో నెలకు రూ.15 వేల వరకు వేతనం అందుతుంది. ఈ ఉద్యోగం వల్ల ప్రధాన లాభం కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి.





ఫుడ్ డెలివరీ

అంతకంతకూ విస్తరిస్తున్న ఊబర్ ఈట్స్, స్విగ్గీ తదితర ఫుడ్ డెలివరీ సంస్థలకు ఎప్పుడూ ఉద్యోగుల అవసరం ఉంటుంది. డ్రైవింగ్ తెలిసిన యువతకు డెలివరీ బాయ్‌తో పాటు మరికొన్ని ఉద్యోగాలు కూడా లభిస్తాయి. నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు సంపాదించవచ్చు.



> 'నేను ప్రస్తుతం ఒక ప్రసిద్ధ కంపెనీలో నెలకు రూ.12 వేల జీతంతో రెండున్నర నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేస్తున్నాను. ఇది తక్కువ జీతానికి పని చేసినట్లుగా అనిపించవచ్చు. అయితే ఈ అనుభవం దీర్ఘకాలంలో సహాయపడుతుంది.' అని నగరానికి చెందిన విద్యార్థి హరితా సింగ్ చెప్పింది.



వ్యాయామం.. సమతుల్య ఆహారం..

- ఆరోగ్యానికి అదే మార్గం..
- పోషకాహార నిపుణుల స్పష్టీకరణ

సాక్షి, సిటీబ్యూరో: క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యానికి ప్రధానమని జాతీయస్థాయిలో పేరొందిన న్యూట్రిషనిస్ట్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణ స్వామి అన్నారు. ఇండియన్ డైటెటిక్ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్, ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియాతో కలిసి నగరంలోని తాజ్ డెక్కన్‌లో పోషకాహారంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన ఆహారంతో పాటు చురుగ్గా ఉండటం కూడా చాలా అవసరం అన్నారు. వ్యాయామానికి ముందు తర్వాత తీసుకునే ఆహారం చాలా కీలకమని, కొవ్వులు, ఆహారంలో ఫైబర్, జింక్, మెగ్నీషియం వంటి 15 ముఖ్యమైన పోషకాలతో నిండిన బాదం వంటి పప్పులు మేలు చేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయన్నారు. ఈ సదస్సులో భాగంగా జరిగిన చర్చలో అపోలో హాస్పిటల్స్ చీఫ్ డైటీషియన్ హరితా శ్యామ్, యశోద హాస్పిటల్స్ చీఫ్ డైటీషియన్ సునీతా ఫిలిప్, స్టార్ హాస్పిటల్ చీఫ్ డైటీషియన్ నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




జోరుగా.. హుషారుగా..

పార్కుల్లో చిన్నారుల సందడి

శాస్త్రిపురం: వేసవిలో పచ్చని పార్కులు ఆహ్లాదాన్నిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు పార్కుల్లో సందడి చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పార్కులలో జీహెచ్‌ఎంసీ అధికారులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఓపెన్ జిమ్‌తో పాటు చిన్నారుల కోసం ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. దీంతో పార్కుల్లో చిన్నారులు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. ఏ పార్కు చూసినా పిల్లలు, వృద్ధులు, మహిళలతో కళకళలాడుతున్నాయి.

వినూత్నమైన ఎలివేటర్ బెస్పోక్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: అధునాతన, విలాసవంతమైన జీవనానికి కేంద్రంగా మారుతున్న నగరాల్లో హోమ్ లిఫ్టులు మరో ట్రెండ్‌గా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రీమియం హోమ్ లిఫ్ట్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తున్న ఎలైట్ ఎలివేటర్స్ ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి ప్రీమియం కస్టమైజ్డ్ లగ్జరీ హోమ్ ఎలివేటర్ 'బెస్పోక్'ను ఆవిష్కరించింది. హైదరాబాద్‌తో పాటు దేశంలోని అన్ని నగరాల్లో ఈ ప్రీమియం ఎలివేటర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని సంస్థ వ్యవస్థాపకులు విమల్ బాబు తెలిపారు. నగరంలోని బహుళ అంతస్తులు, ఇళ్లలో ప్రపంచస్థాయి అధునాతన సాంకేతికతతో ఈ సేవలు అందిస్తున్నామన్నారు. వినూత్నంగా లిఫ్ట్ ఇంటీరియర్‌తో కొత్త సొగసులు రూపొందిస్తున్నామని ఆయన వివరించారు.

గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకుంటున్నారన్న సామెత అచ్చం సిటీ ప్రజలకు అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. ఉదయం, సాయంత్రం.. వీలైనప్పుడు ప్రతిరోజూ కాస్త సమయం శరీరానికి ఎండ తగిలితే విటమిన్ డి మన శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఆమాత్రం సమయం కేటాయించకపోవడం వల్ల వయసుతో సంబంధం లేకుండా అందరిలోనూ ఎముకలు, కండరాలు బలహీనపడిపోవడం, లివర్, కిడ్నీ, లంగ్స్, డయాబెటిస్, బీపీ, జుట్టు నుంచి గోర్ల వరకు వివిధ రోగాలు వస్తున్నాయని ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రీసెర్చ్ (ఐసీఆర్ఐఈఆర్) సర్వే స్పష్టం చేస్తోంది. మన రాష్ట్రంతో పాటు హైదరాబాద్‌నూ సరాసరి 92 శాతం మంది ప్రజల్లో విటమిన్ డి లోపం వేధిస్తోందని నివేదికల్లో పొందుపరిచారు. - సాక్షి, సిటీబ్యూరో

గుర్తుంచుకోండి

నిత్యం కాస్త ఎండ తగలాలంటున్న వైద్యులు




- వేధిస్తున్న విటమిన్ డి లోపం
- 92 శాతం మందిలో ఆరోగ్య సమస్యలు
- వెన్ను, నడుము, కండరాలు బలహీనం
- తగ్గుతున్న రోగ నిరోధక శక్తి

ఇండోర్ జీవన శైలితో విటమిన్ డి లోపం పెరుగుతోందని ఐసీఆర్ఐఈఆర్ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖకు అందించిన నివేదికలో పేర్కొన్నారు. పిల్లలు, కౌమార దశ, గర్భిణులు, వృద్ధులపై అధిక ప్రభావం కనిపిస్తోందని ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2019–21లో దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరిలో విటమిన్ డి లోపం కనిపించగా, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి 100 మందిలో 92 మందిలో ఈ లోపం కనిపిస్తోంది. ప్రధానంగా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసున్న యువత, విద్యార్థుల్లో సైతం విటమిన్ డి లోపించడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా దీర్ఘకాలిక వైకల్యం సంభవించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. దేశంలో భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా ఏడాది పొడవునా సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది. అయితే చాలా మంది వ్యక్తులు ఇంటి నుంచి బయటకు రాకపోవడం, పెరుగుతున్న కాలుష్యం, పట్టణీకరణ, దట్టంగా నిండిన నివాస ప్రాంతాలు, లైఫ్‌స్టైల్ తదితరాలు విటమిన్ డి లోపానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. అధిక సమయం ఇల్లు, కార్యాలయాల్లో గడపటం, ఆధునిక జీవన శైలి సూర్యకాంతి ఎక్స్‌పోజర్‌ను తగ్గిస్తోందని ఐసీఆర్ఐఈఆర్ స్పష్టం చేస్తోంది.




యువతలో ఎముకలు బలహీనపడుతున్నాయ్

నిమ్స్‌లో 2019–21 సంవత్సరాల మధ్య చేపట్టిన సర్వే, తాజాగా బీబీనగర్ ఎయిమ్స్‌లో జరుగుతున్న రీసెర్చ్ ఫలితాలు పరిశీలిస్తే పిల్లలు, వృద్ధులు, గర్భిణులతో పాటు ప్రధానంగా 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయసు గల విద్యార్థులు, యువతలో సైతం వెన్ను, నడుం నొప్పి, ఎముకలు, కండరాల బలహీనపడటం, జుట్టు రాలిపోవడం, ఇమ్యూనిటీ తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిశోధనలో మొత్తం 700 మంది నివేదికలు పరిశీలించారు. అందులో యువత సుమారుగా 400 మంది ఉండగా, ఇతరులు మరో 300 మందికి పైగా ఉన్నారు. ఇంట్లో ఉన్న వారితో పోలిస్తే ఇంటి నుంచి బయటకు వచ్చే వారిలో ఈ లోపం కాస్త తక్కువగా ఉందని తేలింది.



> తెలంగాణ, హైదరాబాద్‌లో 92 శాతం మంది ప్రజల్లో విటమిన్ డి లోపం కనిపిస్తోంది. ఎముకలు, కండరాలు బలహీనపడతాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. శరీరానికి ఎండ తగలకపోవడం, స్మోకింగ్ వంటివి విటమిన్ డి లోపానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. యువతలోనూ ఈ తరహా లక్షణాలు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతిరోజూ ఉదయం కాస్త సమయం ఎండ పడితే విటమిన్ డి శరీరానికి అందుతుంది. మంచి ఫలితాలు ఉంటాయి. – డా.మహేశ్వర్ లక్కి రెడ్డి, ఎయిమ్స్ బీబీనగర్

92 శాతం మందిపై ప్రభావం





ఎకో చాంపియన్ హాకథాన్

- ప్లాస్టిక్ నియంత్రణ కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వినూత్న కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో 'ఎకో చాంపియన్ హాకథాన్' నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ హాకథాన్‌కు ఈ నెల 23వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతున్నాయని వెల్లడించారు. ఈ 'ఎకో చాంపియన్ హాకథాన్' విజేతలకు రూ.50 వేల వరకు నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వేములవాడ రాజన్నకు కొత్త గుడి

మూడు దశల్లో ఆలయ అభివృద్ధి, విస్తరణ

- తొలిదశలో రూ.76 కోట్లతో ప్రధాన ఆలయ నిర్మాణం
- రూ.33 కోట్లతో కల్యాణ మండపం
- జూన్ 15 నుంచి ప్రధాన ఆలయంలో దర్శనాల నిలిపివేత
- భీమేశ్వరాలయంలో స్వామి దర్శనాలు
- శృంగేరీ పీఠం కనుసన్నల్లో నిర్మాణాలు
- చారిత్రక ప్రధాన ఆలయం తొలగించకుండా విస్తరణ



సాక్షి, హైదరాబాద్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, విస్తరించే పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. మూడు దశల్లో ఆలయం, పరిసరాలను అభివృద్ధి చేయబోతోంది. ఇందులో తొలి దశ పనులను జూన్‌లో ప్రారంభించాలని నిర్ణయించింది. జూన్ 15 నుంచి ప్రధాన దేవాలయంలోకి భక్తులను అనుమతించరు. కేవలం నిత్య పూజలను మాత్రం అర్చకులు ప్రధాన దేవాలయ గర్భాలయంలో నిర్వహిస్తారు. భక్తులకు స్థానిక భీమేశ్వరాలయంలో స్వామి దర్శనం కొనసాగుతుంది. ఏడాదిన్నర నుంచి రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తి చేయనున్నారు. అప్పటి వరకు రాజరాజేశ్వర స్వామి దేవాలయంలోని ఉత్సవ మూర్తులను భీమేశ్వరాలయంలో ఉంచి భక్తులకు దర్శనాలు, కైంకర్యాలు కొనసాగిస్తారు. ఈ పనులకు సంబంధించి గురువారం వేములవాడలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో చర్చించి తుది నిర్ణయాన్ని అధికారికంగా వెల్లడిస్తారు.

మొత్తం పనులకు రూ.550 కోట్లు అవసరం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్ట దేవాలయాన్ని పునర్నిర్మించిన విషయం తెలిసిందే. గర్భాలయంలోని మూల విరాట్టు ప్రాంగణాన్ని అలాగే ఉంచి మిగతా మొత్తం ఆలయం స్థానంలో పూర్తి కొత్త ఆలయాన్ని నిర్మించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న పురాతన ఆలయాన్ని తొలగించటం పట్ల భక్తుల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో వేములవాడ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. శృంగేరీ శంకరమఠం పీఠాధిపతి సూచించిన మార్పులను మాత్రమే పరిగణనలోకి తీసుకుని కొత్త నిర్మాణాన్ని చేపడుతోంది. ప్రధాన గర్భాలయం, మండప భాగాన్ని పటిష్ట పరిచి దాన్ని అలాగే ఉంచి చుట్టూ కొత్త మండపాన్ని నిర్మిస్తారు. పాత నిర్మాణాన్ని అనుసరిస్తూ కొత్త నిర్మాణంతో ఆలయాన్ని విస్తరిస్తారు. పురాణ నేపథ్యంలో ఉన్న ధర్మగుండం, గుడి చెరువు ప్రాశస్త్యం తగ్గకుండా 40 ఎకరాల పరిధిలో నిర్మాణాలు చేపట్టనున్నారు. అన్నదాన సత్రం, క్యూ కాంప్లెక్సు, వసతి గృహాలు, రెండు ప్రాకారాలు, కార్యాలయం, కోనేరు, కల్యాణ కట్ట, కోడె మొక్కుల ప్రాంతం.. ఇలా అన్నీ కొత్తగా నిర్మిస్తారు. భీమేశ్వరాలయం సహా అనుబంధ దేవాలయాలను అభివృద్ధి చేస్తారు. ఈ మొత్తం పనులకు రూ.550 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రభుత్వం ఇప్పటికే ప్రధాన దేవాలయానికి సంబంధించి రూ.76 కోట్లకు, కల్యాణ మండపానికి సంబంధించి రూ.33 కోట్లకు నిధులు మంజూరు చేసింది. ఇటీవలి బడ్జెట్‌లో మరో రూ.100 కోట్లు ప్రతిపాదించింది. వీటితో పనులు కొనసాగిస్తూ, తదుపరి విడతలకు మరిన్ని నిధులు మంజూరవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్రప్రభుత్వ 'ప్రసాద్'పథకంలో భాగంగా 96 గదులతో కూడిన వసతి గృహ నిర్మాణానికి రూ.44 కోట్లు మంజూరయ్యాయి. దీనికి మరిన్ని నిధుల కోసం కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

- ఆలయం 15 డిగ్రీల కోణంలో ఆగ్నేయం దిశ వైపు వక్షి ఉంటుంది. ఇప్పుడు గర్భాలయం, సభా మండపాన్ని అదే దిశలో నిర్మించి మిగతా భాగాన్ని నేరుగా ఉండేలా సరిద్ది విస్తరిస్తారు.
- చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న అన్ని భాగాలను, పురాణాలు, పురాతన గ్రంథాలు, 1970లో వెలుగు చూసిన రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఇబ్బంది లేకుండా విస్తరిస్తారు. కొన్ని నిర్మాణాలు తదనంతరం వెలిశాయి. వాటి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- అన్నాదాన సత్రాన్ని రెండెకరాల విస్తీర్ణంలో రెండంతస్తులుగా లక్షన్నర చ.అ. మేర రూ.35.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు.
- ప్రస్తుత ప్రధాన ఆలయం 4 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దాన్ని 4.6 ఎకరాల విస్తీర్ణానికి పెంచనున్నారు.
- సరైన ప్రణాళిక లేకపోవటంతో గతంలో ఆలయ పునరుద్ధరణ వంకరటింకరగా జరిగింది. ఇప్పుడు దాన్ని రెండు ప్రాకారాలు, రెండు వీధులతో క్రమపద్ధతిలోకి మార్చనున్నారు.
- ప్రస్తుతం ఇరుకుగా ఉన్న వీధులను రూ.47 కోట్ల వ్యయంతో 80 అడుగుల మేర విస్తరించనున్నారు.
- అన్ని ప్రాంతాల్లో బతుకమ్మ పండుగను 9 రోజులు నిర్వహిస్తే, ఒక్క వేములవాడలో ఏడు రోజులు మాత్రమే జరుగుతుంది. బతుకమ్మ పుష్పం నుంచే ఆలయం ఉద్భవించిందన్న పౌరాణిక గాథ ఉంది. దాన్ని ప్రతిబింబించే తరహా గుర్తులను నిర్మాణంలో చూపనున్నారు.
- పునరుద్ధరణ క్రమంలో గతంలో కొన్ని నిర్మాణాల్లో వేములవాడ చాళుక్యుల శైలి లోపించింది. ఇప్పుడు కొత్త నిర్మాణం యావత్తు ఆ శైలిలోనే ఉండనుంది.

క్లుప్తంగా...

24న 'సీతారామ'కు అనుమతులపై టీఏసీ భేటీ

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) శుభవార్త చెప్పింది. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులపై చర్చించడానికి ఈ నెల 24న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన ఢిల్లీలో టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపింది.మేడిగడ్డ బరాజ్ కుంగిన ఉదంతం నేపథ్యంలో సీతమ్మసాగర్ బరాజ్ డిజైన్లను పునఃపరిశీలించిన తర్వాతే ఈ ప్రాజెక్టుకి అనుమతుల విషయంలో ముందుకు వెళ్తామని గత సమావేశంలో దేబశ్రీ ముఖర్జీ స్పష్టం చేశారు. ఆమె సూచనలతో ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం సీడబ్ల్యూసీకి అందించింది. సీతమ్మ సాగర్ బరాజ్ డిజైన్లను విశ్లేషించి సరిగ్గానే ఉన్నట్టు సీడబ్ల్యూసీ తేల్చింది. టీఏసీ సూచనల మేరకు ఐఐటీ రూర్కీతో భూకంప ముప్పుపై కూడా అధికారులు అధ్యయనం చేశారు. డ్రాయింగ్స్‌ను పరిశీలించి అవి కూడా సరైన రీతిలోనే ఉన్నట్లు నిర్ధారించింది. దీంతో టీఏసీ సమావేశానికి పిలుపొచ్చింది.

పట్టిసీమ తాత్కాలిక ప్రాజెక్టు కాదు

- కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఏపీలోని కృష్ణా డెల్టా కింద ఉన్న ఆయకట్టు ప్రత్యామ్నాయ సాగునీటి ఏర్పాట్లను కలిగి ఉందని తెలంగాణ స్పష్టం చేసింది. ఏపీ పేర్కొన్నట్టు పట్టిసీమ ప్రాజెక్టు తాత్కాలిక కట్టడం కాదని, శాశ్వత అవసరాలకు వాడుకోవడానికి ఆ రాష్ట్రం కార్యచరణ సిద్ధం చేసిందని తెలిపింది. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీపై జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో బుధవారం రెండో రోజు విచారణ నిర్వహించిన కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ఈ మేరకు వాదనలు వినిపించారు. పోలవరం నుంచి కృష్ణా బేసిన్‌కి తరలించాల్సిన గోదావరి జలాల విషయంలో 1978 ఆగస్టు 4న జరిగిన ఒప్పందానికి విరుద్ధంగా, ఏపీ పోలవరం కాల్వ సామర్థ్యం పెంచుతోందని ఆరోపించారు. గురువారం సైతం దీనిపై వాదనలు కొనసాగనున్నాయి.

వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చండి

- ఆరోగ్య శాఖ కార్యదర్శికి తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ వినతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా మార్చాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్.. ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు డి.నరహరి, సెక్రటరీ జనరల్ లాలూప్రసాద్ ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు ముఖ్యమైన డిమాండ్లను వివరించి, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. . ఈ డిమాండ్లు వైద్య సంఘం సంక్షేమం సమర్థవంతమైన ఆరోగ్య సేవల కోసం అవసరమన్నారు.

మతోన్మాద సంస్థల నిరసనలకు అనుమతి ఇవ్వొద్దు

- డీజీపీకి వీహెచ్‌పీ వినతి

సాక్షి, హైదరాబాద్: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించే ముసుగులో హిందువులపై దాడులకు మతోన్మాద సంస్థలు కుట్రలు చేస్తున్నట్టు డీజీపీ జితేందర్‌కు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మతోన్మాద సంస్థల నిరసన కార్యక్రమాలకు అనుమతి ఇవ్వొద్దని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రార్థనాస్థలాల్లో అనుమానిత వ్యక్తులు తిష్టవేశారని ఆరోపించింది. లక్షల కోట్ల వక్ఫ్ ఆస్తులను కాజేసిన ఒవైసీ కుటుంబం హైదరాబాద్‌లో మతఘర్షణలు సృష్టించాలని ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. బంగ్లాదేశ్, రోహింగ్యా ముస్లింలపై, హైదరాబాద్‌లో ఐసిస్ జెండాలు ఎగురవేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బుధవారం ఈమేరకు డీజీపీకి వినతిపత్రం అందించిన బృందంలో రావినూతల శశిధర్, సునీతారెడ్డి, రామరాజు తదితరులున్నారు.

గుండె గు'బిల్లు'

ఏపీలో వినియోగదారులను బెంబేలెత్తిస్తున్న కరెంట్ చార్జీల భారం



సాక్షి, అమరావతి: 'ఓట్లేయ్యండి తమ్ముళ్లూ..! మేం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం..! పైగా తగ్గిస్తాం..! నేను గ్యారెంటీ..!'అంటూ ఎన్నికల ముందు హామీలిచ్చిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేసి 'చార్జీలు పెంచనని నేనెప్పుడు చెప్పా?'అంటూ మాట మార్చేశారు. ఎడాపెడా విద్యుత్ షాక్ లిస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల మాదిరిగానే కరెంట్ చార్జీలపై వాగ్దానాన్ని విస్మరించడం ఒక ఎత్తు కాగా విద్యుత్తు వినియోగదారులను చార్జీల పెంపుతో నడ్డి విరవడం మరో పార్శ్యం. ఏడాది వ్యవధిలో పెరిగిపోయి భగ్గుమంటున్న బిల్లులే ఇందుకు నిదర్శనం. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.15,485.36 కోట్ల విద్యుత్తు భారాన్ని ప్రజలపై మోపారు. గతేడాది చివరి నుంచే రూ.6,072.86 కోట్ల చార్జీల భారాన్ని వసూలు చేస్తుండగా ఈ ఏడాది జనవరి బిల్లుల నుంచి మరో రూ.9,412.50 కోట్ల బాదుడు మొదలైంది. గతేడాదితో పోలిస్తే రెట్టింపు చార్జీలతో బిల్లులు జారీ అవుతుండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. సామాన్యులు, చిరు వ్యాపారులు ఈ బిల్లులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. అసలే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండగా దానికి తోడు విద్యుత్ చార్జీలు పెంచడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వాడుకున్న విద్యుత్తుకు, వస్తున్న బిల్లులకు ఏమాత్రం పొంతన లేకపోవడంతో ఇదెక్కడి దారుణమని మండిపడుతున్నారు.

చిత్తూరుకి చెందిన జేజులరెడ్డి (సర్వీసు నంబర్ 3457) ఇంట్లో రెండు ఫ్యాన్లు, మూడు ట్యూబ్‌లైట్లు, టీవీ, కూలర్ ఉన్నాయి. కరెంట్ బిల్లులను పరిశీలిస్తే గతేడాదికి, ఇప్పటికి భారీ వ్యత్యాసం ఉంది. గతేడాది మార్చిలో 177 యూనిట్లకుగానూ ఆయనకు రూ.1,015 బిల్లు వచ్చింది. యూనిట్‌కు రూ.5.74 చార్జీ పడింది. ఈ ఏడాది మార్చిలో 563 యూనిట్లకు రూ.4,584 బిల్లు వేశారు. యూనిట్‌కు ఏకంగా రూ.8.14 వసూలు చేశారు. రూ.1,335.49 అదనంగా బిల్లు రావడంతో వినియోగదారుడు 39 శాతం అధిక భారం భరించాల్సి వచ్చింది.

చార్జీల భారం మోపని గత ప్రభుత్వం..

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచకుండా ప్రజలకు ఊరట కల్పించింది. వ్యవసాయ అవసరాలకు పెద్ద పీట వేస్తూ 9 గంటల పాటు పగటిపూట నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసింది. 6,663 వ్యవసాయ విద్యుత్తు ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.1,700 కోట్లు వ్యయం చేశారు. గతంలో టీడీపీ సర్కారు రైతులకు ఎగ్గొట్టిన రూ.8,845 కోట్ల ఉచిత విద్యుత్ బకాయిలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. వివిధ వర్గాల పేదలకు ఉచితంగా, రాయితీతో విద్యుత్‌ను అందచేసింది. రాష్ట్రంలోని దాదాపు రెండు కోట్ల మంది విద్యుత్ వినియోగదారులపై ఎలాంటి విద్యుత్ చార్జీల భారం లేకుండా టారిఫ్ ఆర్డర్‌ను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆమోదించేలా నాడు వైఎస్ జగన్ టారిఫ్ భారాలను సైతం భరించారు.



వాడకం తగ్గినా.. బిల్లు పెరిగింది

శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఉంటున్న సువ్వారి జగదీష్ ఇంటికి 2024 మార్చిలో 216 యూనిట్లకు గానూ రూ.1,108 బిల్లు వచ్చింది. అంటే యూనిట్‌కు రూ.5.12 పడింది. ఇదే వినియోగదారుడు ఈ ఏడాది మార్చిలో 171 యూనిట్లు వినియోగించారు. దాని ప్రకారం రూ.875.52 మాత్రమే బిల్లు రావాలి. వినియోగం తగ్గినప్పుడు సాధారణంగా బిల్లు కూడా తగ్గాలి. కానీ అందుకు భిన్నంగా బిల్లు పెరిగి రూ.1,286 వచ్చింది. గతేడాది ధర (టారిఫ్)ల్లో ఏ మార్పూ జరగలేదని, చార్జీలు పెంచలేదని కూటమి ప్రభుత్వం చెబుతున్నా కరెంటు బిల్లు మాత్రం భారీగా పెరిగింది.

పొంతన లేని బిల్లులు

కర్నూలు జిల్లా కల్లూరు సెక్షన్ పరిధిలో నివసించే ఎస్.శిరీష ఈ ఏడాది ఫిబ్రవరిలో 125 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. ఈ లెక్కన ఆమెకు రావాల్సిన బిల్లు రూ.489.50 మాత్రమే. కానీ వచ్చిన బిల్లు మాత్రం ఏకంగా రూ.850. అంటే రూ.361 మేర కరెంట్ చార్జీ పెరిగింది.



రూ.29 వేల కోట్ల 'గ్రీన్' పెట్టుబడులు

- 'ఎకోరెన్' ఆధ్వర్యంలో 5,579 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, జీపీఎస్ఆర్ ఆర్య ఆధ్వర్యంలో 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల స్థాపన
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో ఆయా కంపెనీలతో రెడ్కో 4 ఎంఓయూలు



భట్టి సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రూ.29,000 కోట్ల భారీ పెట్టుబడులతో 5,579 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులతోపాటు 15 కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల స్థాపనకు ముందుకొచ్చిన రెండు ప్రైవేటు వ్యాపార సంస్థలతో రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో రెడ్కో ఈ మేరకు మొత్తం నాలుగు ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టుల స్థాపనతో రాష్ట్రంలో 19,200 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎకోరెన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.27,000 కోట్ల పెట్టుబడులతో మొత్తం 5,579 మెగావాట్ల సామర్థ్యంతో మూడు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు మూడు ఎంఓయూలు కుదుర్చుకుంది.

- → సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 3,279 మెగావాట్ల పవన-సౌర హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులను ఈ సంస్థ ఏర్పాటు చేయనుంది.
- → జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 7 ప్రాంతాల్లో మొత్తం 1,650 మెగావాట్ల సామర్థ్యంతో ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును స్థాపించనుంది.
- → జోగుళాంబ గద్వాల జిల్లాలో 650 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. ఈ మూడు ప్రాజెక్టుల ఏర్పాటుతో 16,200 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్రానికి జీఎస్టీ రూపంలో రూ.1600 కోట్ల ఆదాయం రానుంది.
- → జీఎస్‌పీఆర్ ఆర్య సంస్థ రూ.2000 కోట్ల పెట్టుబడులతో 15 జిల్లాల్లో 15 కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి ఎంఓయూ చేసుకోగా, 3,000 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.
- → వరి గడ్డి నుంచి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయనుండగా, ఒక్కో ప్రాజెక్టు 15 టన్స్ పర్‌డే(టీపీడీ)ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉండనున్నాయి.

ఎనర్జీ పాలసీతోనే : భట్టి

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీకి ఆకర్షితులై జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, రెడ్కో వీసీ, ఎండీ వి.అనీల, ఎకోరెన్ కంపెనీ ఎండీ ప్రసాద్, జీపీఎస్ఆర్ ఆర్య కంపెనీ ఎండీ దీపక్ అగర్వాల్ పాల్గొన్నారు.

తెలంగాణలో ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించండి

- కేంద్రమంత్రులకు బండి సంజయ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ దక్షిణ కాశీ, ప్రముఖ దేవాలయం వేములవాడ సహా కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాలను ఆధ్యాత్మిక విశ్రాంతి కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్రాన్ని కోరారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ (ఎస్ఏఎస్‌సీఐ) పథకం కింద నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లను వేర్వేరుగా కలిసి సంజయ్ వినతిపత్రాలు అందజేశారు. తెలంగాణలో పర్యాటకాన్ని అత్యవసరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని, కేంద్రం సైనిక స్కూల్‌ను మంజూరు చేస్తే భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న విషయాన్ని సంజయ్ వివరించారు. అందుకు కేంద్రమంత్రులు సానుకూలంగా స్పందించారు. సిరిసిల్ల లేదా హుస్నాబాద్ పట్టణంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ అధికారులను ఆదేశించారని సంజయ్ తెలిపారు.



రాజ్‌నాథ్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బండి సంజయ్



నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం



వరి దుబ్బలు చేతిలో పట్టుకొని రాస్తారోకో చేస్తున్న పాతర్లపాడు రైతులు

ఖమ్మం జిల్లాలో 3,222 ఎకరాల్లో పంట నష్టం

- రైతులను దెబ్బతీసిన ఈదురుగాలులు, వర్షం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అతలాకుతలం
- నష్టపరిహారం అందించాలని పాతర్లపాడులో రాస్తారోకో

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ సాక్షి, నెట్‌వర్క్: అకాల వర్షంతో రైతులు అతలాకుతలమయ్యారు. వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా 56 గ్రామాల్లో 1,782 మంది రైతులకు చెందిన 3,222 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ ప్రాథమికంగా గుర్తించింది. మంగళవారం రాత్రి ఈదురుగాలులు, వర్షం సహా ఇప్పటివరకు జిల్లాలోని వైరా, తల్లాడ, కల్లూరు, మధిర, పెనుబల్లి మండలాల్లో సాగులో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. ఈ మండలాల్లో 1,672 మంది రైతులకు చెందిన 2,947 ఎకరాల్లో వరి, 27 మంది రైతులకు చెందిన 37 ఎకరాల్లో మొక్కజొన్న, 79 మంది రైతులకు చెందిన 226 ఎకరాల్లో మామిడి, నలుగురు రైతులకు చెందిన 12 ఎకరాల్లో నువ్వుల పంటకు నష్టం జరిగిందని తేల్చారు.

- పెద్దపల్లి జిల్లాలోని ముత్తారం, ఓదెల మండలాల్లో అకాల వర్షానికి వరి, మామిడికాయలకు తీవ్రనష్టం వాటిల్లింది. 3 వేల ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నదని, దాదాపు 40 ఎకరాల్లోని మామిడికాయలు రాలిపోయాయని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 11 విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- ఈదురుగాలులు, వడగండ్ల వానతో వరి నేలపాలై నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సూర్యాపేట జిల్లా ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపాడు వద్ద బుధవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో 1,200 ఎకరాలకు పైగా వరి పంట నేలపాలైందని, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని కాంటాలు వేయకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామంలోని సీతారామాలయంలో 40 అడుగుల ధ్వజస్తంభం విరిగిపోయింది. భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో కన్నం ప్రభాకర్ ఇంటి పక్కన పిడుగు పడటంతో రూ.1.50 లక్షల విలువైన రెండు కాడెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. చిట్యాల మండలం రాంచంద్రాపూర్‌లో అరటితోటలు గాలి వానకు విరిగిపోయాయి. భూపాలపల్లి జిల్లాలో వరి సుమారు 2 వేల ఎకరాలు, మొక్కజొన్న వేయి ఎకరాలు, అరటి 200 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ గ్రామం శివారులోని మామిడితోటలో మామిడికాయలు రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పరకాల వ్యవసాయ మార్కెట్‌యార్డులో అమ్మకానికి తెచ్చిన ధాన్యం మొత్తం కొట్టుకుపోయింది. కమలాపూర్ మండలం శనిగరానికి చెందిన పలువురు రైతులు లక్ష్మీపూర్, వంగపల్లి శివారుల్లో సుమారు 50 ఎకరాల్లోని మామిడి తోటలు, మరో ఐదెకరాల్లోని సపోట తోటలు కౌలుకు తీసుకున్నారు. వాన కారణంగా నేలరాలడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

చేతులెత్తేసిన కృష్ణాబోర్డు

- శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు అప్పగిస్తేనే నీటి విడుదల నియంత్రించగలమని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి ఇరు రాష్ట్రాలు జరుపుకునే నీటి విడుదలను నియంత్రించే విషయంలో కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చేతులెత్తేసింది. 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం శ్రీశైలం, సాగర్ జలాశయాలకు సంబంధించిన 15 ప్రధాన అవుట్‌లెట్లను తమకు అప్పగిస్తేనే నీటి విడుదలను నియంత్రించగలమని తేల్చి చెప్పింది. ఉమ్మడి జలాశయాల నుంచి నీటి విడుదలను నియంత్రించడానికి ఈ 15 అవుట్‌లెట్లను అప్పగించాలని తాము చాలా కాలంగా కోరుతుండగా, ఏపీ మాత్రమే అంగీకరించిందని, తెలంగాణ ఇప్పటి వరకు అంగీకరించలేదని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్‌కు కృష్ణా బోర్డు బుధవారం లేఖ రాసింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాల పంపిణీని నియంత్రించడానికి 15 అవుట్‌లెట్లను తమకు అప్పగించేందుకు ఇకనైనా చర్యలు తీసుకోవాలని కోరింది. ఉమ్మడి జలాశయాల నుంచి అక్రమంగా నీటిని తీసుకోకుండా ఏపీని అడ్డుకోవడానికి కృష్ణా బోర్డు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని కోరుతూ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ ఈ నెల 2న కృష్ణా బోర్డుకు లేఖ రాశారు. ఏపీ చర్యలతో తమ హక్కులకు భంగం కలుగుతోందని, నాగార్జునసాగర్ కింద తెలంగాణలో సాగుచేస్తున్న లక్షల ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ తీసుకుంటున్న నీటిని నిలుపుదల చేయడం ద్వారా వచ్చే జూలై 31నాటికి జలాశయంలో 510 అడుగుల కనీస నిల్వలు ఉండేలా చూడాలని కోరారు. ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా ఏపీ తీసుకుంటున్న నీటిని నిలుపుదల చేయించి శ్రీశైలం జలాశయంలో సైతం 820 అడుగుల కనీస నిల్వలుండేలా చూడాలని సూచించారు. ఈ లేఖకు స్పందనగా కృష్ణా బోర్డు తాజాగా తెలంగాణ ఈఎన్‌సీకి ప్రత్యుత్తరం రాసింది.

బోర్డు అప్పగించాలని కోరుతున్న 15 అవుట్‌లెట్లు ఇవే

- → శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి ఏపీ అధీనంలో ఉన్న స్పిల్‌వే, రివర్ స్లూయిస్, కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్, హంద్రీనీవా ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంతోపాటు తెలంగాణ అధీనంలో ఉన్న ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, పంప్‌హౌస్‌లను అప్పగించాల్సి ఉంది.
- → నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ అధీనంలో ఉన్న స్పిల్‌వే, రివర్‌స్లూయిస్, కుడికాల్వ రెగ్యులేటర్, ఎడమకాల్వ విద్యుత్ కేంద్రాలు (రెండు), వరదకాల్వ, ఏఎంఆర్ లిఫ్టుతోపాటు ఏపీ పరిధిలోని కుడికాల్వ విద్యుత్ కేంద్రాన్ని అప్పగించాల్సి ఉంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 17-4-2025



ఐ.టి. దిగ్గజ సంస్థ టి.సి.ఎస్. మే 1 నుంచి ఆర్తి సుబ్రహ్మణ్యానికి సి.ఓ.ఓ. బాధ్యతలు అప్పజెప్పింది. బహుశా దేశంలో ఐ.టి. రంగంలో సి.ఓ.ఓగా నియమితురాలైన మొదటి మహిళ ఆర్తినే కావొచ్చు. ఆమె పరిచయం.

న్యూస్‌మేకర్

ఐటీలో ఆమెకు అగ్రపీఠం

చిన్న చిన్న ఉద్యోగాలు, వర్తకాలు చేసే వారు కూడా 'వాకింగ్‌కి టైమ్ దొరకలేదు' అంటుంటారు. కాని టాటా సంస్థల్లో కీలకమైన బాధ్యతల్లో ఉంటూ వచ్చిన ఆర్తి సుబ్రహ్మణ్యం ఏ రోజూ వాకింగ్ మానేయరు. వాన వచ్చినా వరద ముంచెత్తినా వాకింగ్ చేయాల్సిందే. 'రోజుకు 10 నుంచి 12 కిలోమీటర్లు నడవాలని నా ప్రయత్నం. కనీసం ఆరు నుంచి ఎనిమిదైనా నడుస్తుంటాను. నడక ఆలోచనకు చోటు ఇస్తుంది. ఆరోగ్యకరమైన శరీరం, ఆరోగ్యకరమైన ఆలోచన విజయానికి దోహదం చేస్తాయి' అంటారామె. 58 ఏళ్ల ఆర్తి సుబ్రహ్మణ్యం 30 బిలియన్ డాలర్ల లావాదేవీలు ఉన్న దిగ్గజ ఐ.టి. సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టి.సి.ఎస్.)కు మే 1 నుంచి సి.ఓ.ఓ. (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా బాధ్యతలు స్వీకరించనున్నారు. సాధారణంగా మగవారే పై స్థానాల్లో ఉండే ఐ.టి. రంగంలో సి.ఓ.ఓ.గా మహిళ కనిపించడం అరుదు. టాటా సంస్థల్లో గాని, ఇతర ఐ.టి. దిగ్గజ సంస్థల్లోగాని ఇలా సి.ఓ.ఓ.స్థాయికి చేరిన స్త్రీలు బహు తక్కువ. అందుకే అందరూ అబ్బురంగా ఆర్తి వైపు చూస్తున్నారు.

ట్రయినీగా చేరి.. అంచెలంచెలుగా ఎదిగి...

ఆర్తి సుబ్రహ్మణ్యం మన వరంగల్ విద్యార్థి. వరంగల్ ఎన్.ఐ.ఐ.టి.లో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ చేసి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్‌లో ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేశారు. 1989లో తన కెరీర్‌ని గ్రాడ్యుయేట్ ట్రయినీగా టాటాలో మొదలుపెట్టి అంచెలంచెలుగా ఎదిగారు. దాదాపు టాటాలోని అన్ని కీలక సంస్థల్లో ముఖ్యహోదాల్లో పని చేశారు. మన దేశంలో పాస్‌పోర్ట్ డిజిటలైజేషన్ కోసం టాటా నిర్వహించిన ప్రాజెక్ట్‌లో చురుగ్గా పని చేశారు. టాటా ఏ.ఐ.జి.లో, అలాగే హెచ్.ఆర్‌లో చేస్తూ టాటా సన్స్‌లో ఎనిమిదేళ్లుగా గ్రూప్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అక్కడి నుంచే టి.సి.ఎస్.కు సి.ఓ.ఓ.గా వస్తున్నారు.

మిసెస్ ఫిక్సిట్

ఆర్తి సుబ్రహ్మణ్యానికి సాటి ఉద్యోగులు 'మిసెస్ ఫిక్సిట్' అని సరదాగా పిలుచుకుంటారు. ఎందుకంటే ఏ సమస్య వచ్చినా దానికి ఆమె దగ్గర సమాధానం ఉంటుంది. సవాళ్లను స్వీకరించే ఆమె తత్త్వమే ఆమెను ఈ స్థాయికి చేర్చింది. అయితే ఆమెకు ఉద్యోగమే జీవితం కాదు. వారాంతం వచ్చిందంటే కచ్చితంగా బాలీవుడ్ సినిమా చూడాల్సిందే. అమితాబ్ బచ్చన్‌కు పెద్ద ఫ్యాన్. అలాగే పాటలు వింటారు. మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతారు. 'ఒక వ్యక్తి రాబోయే కాలంలో ఎక్కడ ఎలా ఉండాలో నిర్దేశించుకుని ఆ లక్ష్యాన్ని చేరొచ్చు. అయితే టీమ్ మీతో ఉండి మీకు సహకరించాలి. మీరు టీమ్‌కి సహకరించాలి. అది జరిగిన పక్షంలో ఉద్యోగంలో ఒక్క క్షణం కూడా మీకు బోరు కొట్టదు' అంటారామె.

టి.సి.ఎస్.కు ఐదేళ్ల పాటు సి.ఓ.ఓ.గా పని చేయనున్నారు ఆర్తి సుబ్రహ్మణ్యం. ఈ సమయంలో ఈ వార్త ఆ సంస్థ ఉద్యోగులకే కాదు ఐ.టి. రంగంలో పని చేస్తున్న స్త్రీలందరికీ స్ఫూర్తిదాయకమే.

బ్యూటీ టిప్స్

ఫేషియల్ మాస్క్



పెసరపిండిలో కొద్దిగా పెరుగు, కొబ్బరి నూనె కలిపి ముఖానికి, చేతులకు, పాదాలకు రాయాలి. మృదువుగా మర్దనా చేసి, పది నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. పెసరపిండి, పెరుగులో ఉండే గుణాలు ఎండకు కమిలిన చర్మాన్ని సాధరణ రంగులోకి తీసుకువస్తాయి. కొబ్బరి నూనె చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

టీ స్పూన్ పెసరపిండిలో పచ్చి పాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖంపై మాస్క్‌లా వేయాలి. ఆరిన తర్వాత, నీటిని ముఖానికి స్ప్రే చేసి, శుభ్రపరుచుకోవాలి. పొడి చర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.

అందాల పోటీలు మన దేశానికి చాలా సార్లు కిరీటాన్ని తొడిగాయి! కాస్మెటిక్స్‌కి మంచి మార్కెట్‌గా మార్చాయి! భారత్‌కు బ్రాండ్‌నూ సృష్టించాయి! మన అమ్మాయిల ఆత్మవిశ్వాసాన్నీ పెంచాయి... ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీలో స్టార్స్‌ని చేశాయి! ఆ అవకాశాలు ఇప్పుడు తెలంగాణ వెదుక్కుంటూ వచ్చాయి... మేలో జరగనున్న 73వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్‌ను డెస్టినేషన్‌గా కోరుకుంటూ! ఆ స్టోరీ...



మన ప్రతిభ మెరుస్తుందా?

భాష, సంస్కృతి, సంప్రదాయం, భౌగోళిక వైవిధ్యంలో తెలంగాణ.. మన దేశానికి మినియేచర్‌గా ఉంటుంది. ఆ ప్రత్యేకతే తెలంగాణ రాష్ట్రాన్ని మిస్ వరల్డ్ పోటీలకు వేదికను చేసింది. ఇక్కడి కళలు, చేనేత, పర్యాటక ప్రాభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయబోతోంది. అందులో భాగంగానే ఈ పోటీలను తెలంగాణలోని పలుచోట్ల నిర్వహించనున్నారు. వీటిని కవర్ చేయడానికి అంతర్జాతీయంగా మూడు వేల మీడియా సంస్థలు వస్తున్నాయి. అలా తనకంటూ ఓ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. పోచంపల్లి ఇక్కత్‌తో 120 దేశాల సుందరీమణులు మెరవబోతున్నారు. హిందూ, ముస్లిం సౌభ్రాతృత్వానికి చిరునామా అయిన లాడ్‌బజార్‌లో హెరిటేజ్ వాక్ చేయబోతున్నారు. చౌమొహల్లా ప్యాలెస్‌లో చవులూరించే రుచులతో విందారగించనున్నారు. వీటన్నిటితో పాటు తెలంగాణ అభివృద్ధి, తమ అబ్జర్వేషన్స్‌నూ అంతర్జాతీయ మీడియా సంస్థలు.. ఫీచర్స్‌గానో.. ఆఫ్ బీట్ స్టోరీస్‌గానో ఫోకస్ చేస్తాయి. అలా తెలంగాణ టాక్ ఆఫ్ ద వరల్డ్ అవుతుందని అందాల పోటీల నిర్వాహకుల అభిప్రాయం. తెలంగాణ కూడా ఇక్కడి పర్యాటకం మీద ప్రపంచదృష్టి పడేలా చేసి తద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశిస్తోంది. ఈ పోటీల్లో లోకల్ మేకప్ ఆర్టిస్టులు, హెయిర్ స్టయిలిస్ట్‌లు, టెక్స్‌టైల్, కాస్ట్యూమ్ డిజైనర్స్, ఇతర కళాకారులకు అవకాశాలు లభించి, వారి ప్రతిభకు ప్రపంచ గుర్తింపు దొరకనుందా? హైదరాబాద్‌ను సౌత్ ఫ్యాషన్ హబ్‌లా మార్చనుందా? ఇక్కడా గ్రూమింగ్ సెంటర్స్, ఇమేజ్ బిల్డింగ్ కన్సల్టేషన్స్, స్కిన్ కేర్ ఇండస్ట్రీస్ ఏర్పడనున్నాయా? ఆయా రంగాల్లోని నిపుణులు ఏమంటున్నారో చూద్దాం!

బాధ్యతనూ తీసుకోవాలి



నారాయణ పేట్ విమెన్ వీవర్స్ మీద నేనొక డాక్యుమెంటరీ చేశాను. లాక్‌డౌన్ టైమ్‌లో వాళ్లకో ఉపాధిలా ఉంటుందని తస్రిక వీవింగ్ టెక్నిక్‌తో అక్కడి స్త్రీలతో చీరలను నేయించాను. వాటికి నేను డిజిటల్ ప్రింట్స్‌ని యాడ్ చేసి ఆ చీరలతోనే వాళ్లకు మేకోవర్ చేసి నారాయణ పేట్‌లోనే వీడియో షూట్, ఫొటో షూట్ చేశాను. ఆ డిజైన్స్‌ని హైదరాబాద్‌కి తీసుకొచ్చి పదిహేను రోజులు ఎగ్జిబిషన్‌లా పెట్టి.. ఆ సేల్స్‌ని పెంచాం. తర్వాత ఆ చీరలను హ్యాండ్లూమ్ డే రోజు వాళ్లకు గిఫ్ట్‌గా ఇచ్చాం. ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి చేయూతా దొరకలేదు. అలాగే ఈ అందాల పోటీల వల్ల మన టెక్స్‌టైల్స్ గురించి ఒక వారం మాట్లాడుకుంటారేమో అంతే! అవకాశాలు రావాలి, పెరగాలంటే మాత్రం టెక్స్‌టైల్ మినిస్ట్రీ చొరవ తీసుకుని తెలంగాణ ఫ్యాషన్ హబ్ లాంటిదొకటి ఏర్పాటు చేయాలి.

– **హేమంత్ సిరి,** ఫ్యాషన్ డిజైనర్

మంచి అవకాశం



నేనైతే దీన్ని పాజిటివ్‌గానే చూస్తాను. ఈ మిస్ వరల్డ్ కంటెస్ట్ తెలంగాణలో అందాల పోటీలకు ఓ స్పేస్ క్రియేట్ చేస్తుందనుకుంటున్నాను. ఫుట్‌వేర్, కాస్ట్యూమ్ డిజైనర్స్, హెయిర్ స్టయిలిస్ట్స్, మేకప్ ఆర్టిస్ట్స్ లాంటివాళ్లెందరికో అవకాశాలు దొరుకుతాయి. అంతేకాదు ఈ పోటీల్లో వాడే ఫుట్‌వేర్, కాస్ట్యూమ్స్ తయారీకీ ఇది హబ్‌గా మారొచ్చు. గ్రూమింగ్ సెంటర్స్, ఇమేజ్ బిల్డింగ్ కన్సల్టేషన్స్, స్కిన్ కేర్ ఇండస్ట్రీస్‌కీ స్కోప్ ఉంటుంది. గ్రూమింగ్ వల్ల తర్వాత అమ్మాయిలు ఏ రంగంలోకి వెళ్లాలనుకున్నా ఆ కమ్యూనికేషన్ స్కిల్స్, కాన్ఫిడెన్స్ ఉపయోగపడతాయి.

– **కె. అభిమానిక యాదవ్,** సెలబ్రిటీ ఫిట్‌నెస్ కోచ్

ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని..



మేకప్ రంగంలో మంచి విమెన్ మేకప్ ఆర్టిస్టులు ఉన్నారు. కానీ వాళ్లకు అవకాశాల్లేవు. అలాంటి వాళ్లకు ఈ ఈవెంట్స్ ఉపయోగపడాలి. నేను వరుసగా నాలుగేళ్లు ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్ ఈవెంట్‌కి వర్క్ చేశాను. ఆ తర్వాత నుంచి మళ్లీ అబ్బాయిలనే తీసుకుంటున్నారు. అలా కాకుండా దీన్ని తెలంగాణ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. అర్హతలు, ప్రమాణాలు, సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని మేకప్ ఆర్టిస్టుల నుంచి కొటేషన్స్‌ను ఆహ్వానించాలి

– **శోభాలత,** సీనియర్ మేకప్ ఆర్టిస్ట్

భద్రత.. రక్షణ కల్పించి...



ముందు మహిళలకు తగిన భద్రత, రక్షణ కల్పించి.. ఆ తర్వాత మిస్ వరల్డ్ పోటీలకు వేదికను ఇవ్వడం గురించి ఆలోచించాలి. వీటివల్ల తెలంగాణ ప్రతిష్ఠ పెరగడం మాట ఎలా ఉన్నా తెలంగాణ వనరులు విదేశీ పెట్టుబడి సంస్థలకు ధారదత్తం అవడం మాత్రం ఖాయం అని నాకనిపిస్తోంది.

– **భండారు విజయ,** రచయిత, మహిళా హక్కుల కార్యకర్త

బ్యూటీ పాజంట్ విత్ తెలంగాణ స్టయిల్



ఈ పోటీలు హైదరాబాద్ మొదలుకొని రామప్ప, పోచంపల్లి, చౌమొహల్లా ప్యాలెస్.. ఇలా పలుచోట్ల జరుగుతాయి. వీటివల్ల ప్రపంచం మన కళలు, సంస్కృతి, మన వారసత్వ సంపదను తెలుసుకుంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇక్కడి వైద్య సౌకర్యాలను గమనిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ వైవిధ్యాన్ని పరిచయం చేయబోతున్నాం. ఈ పోటీలను బ్యూటీ పాజంట్ విత్ తెలంగాణ స్టయిల్ అనుకోవచ్చు.

– **మామిడి హరికృష్ణ,** డైరెక్టర్, భాష – సాంస్కృతిక శాఖ

● సరస్వతి రమ

● మన(సు)లో మాట

ఆయన వింతగా ప్రవర్తిస్తున్నారు!

మా ఆయనకు 52 సం॥లు గవర్నమెంట్ జాబ్ చేస్తున్నారు. వృత్తిలో పెద్దగా సమస్య లేదు. కాని ఈ మధ్య రాత్రి నిద్రలో తన కాళ్ళతో నన్ను కొడుతున్నాడు. నిద్రలో కాళ్ళను గట్టిగా కదిలించడం, అప్పుడప్పుడు కేకలు వేయడం, కలలో ఎవరితోనో పోరాడుతున్నట్లు ప్రవర్తిస్తున్నాడు. ఉదయాన్నే లేచిన తరువాత అడిగితే రాత్రి జరిగిన విషయాలు ఏమి గుర్తులేవని అనడమే కాక, అసలు అలా చేయనే లేదని చెప్పున్నారు. మా ఇద్దరి వైవాహిక జీవితంలో వేరే ఏ సమస్యా లేదు. నాకు ఏం చేయాలో తోచడం లేదు. నాపైన కోపంతో పగలు నన్నేం అనలేక రాత్రి నిద్రలో నన్ను ఇబ్బంది పెడ్తున్నారేమోనని అనిపిస్తుంది. దీనికి తగిన పరిష్కారం చెప్పగలరు.

– **వరలక్ష్మి,** మహబూబ్ నగర్

మీ భర్త విషయంలో మీరు వివరించిన లక్షణాలు రాత్రి నిద్రలో కాళ్ళతో తన్నడం, కేకలు వేయడం, చేతులు కదిలించడం, పొద్దున దాని గురించి అసలేం గుర్తు లేకపోవడం... ఇవన్నీ 'రెమ్ స్లీప్ బిహేవియర్ డిజార్డర్' అనే నిద్రకు సంబంధించిన రుగ్మతను సూచిస్తున్నాయి. ఈ సమస్యలో ఆ వ్యక్తి నిద్రదశలో కలల్లో వచ్చే విషయాలకు అనుగుణంగా వారికి తెలియకుండానే ఆ విధంగా ప్రవర్తిస్తారు. సాధారణంగా కలలు వచ్చే సమయంలో మన శరీర కండరాలు అచేతనమై ఉంటాయి. కానీ పైన చెప్పిన సమస్య ఉన్న వారిలో అలా జరగకపోవడం వల్ల వారు విపరీతంగా కదలడం, కాళ్ళతో చేతులతో కొట్టడం చేస్తారు. మీరు వెంటనే మీ భర్తను ఒక న్యూరాలజిస్ట్ లేదా సైకియాట్రిస్ట్ వద్దకు తీసుకెళ్ళి 'స్లీప్ స్టడీ' చేయించి ఈ రుగ్మతను నిర్ధారించుకోవాలి. కొన్ని మంచి మందులతో ఈ లక్షణాలను పూర్తిగా తగ్గించవచ్చు.

చికిత్స మొదలయ్యే వరకు మీ భద్రత కోసం మీరు వేరే బెడ్‌పై లేదా వేరే గదిలో నిద్రిస్తే మంచిది. ఆయన నిద్రపోయే ముందు మద్యపానం, కాఫీ, సిగరెట్ లాంటివి తీసుకోకుండా చూడండి. అన్నిటికీ మించి ఇది ఆయన అదుపులో లేని ఒక వైద్యసమస్య అని గుర్తించండి. ఆయన్ని కోపగించుకోకుండా, అర్థం చేసుకొని వైద్య చికిత్స చేయించండి! అన్నీ సర్దుకుంటాయి. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

కూల్ సమ్మర్

బెడ్‌షీట్... బీట్ ది హీట్

- వేసవిలో కాటన్ బెడ్‌షీట్‌లను ఉపయోగించడం మంచిది. కాటన్ చెమటను త్వరగా గ్రహిస్తుంది. నిద్ర పోతున్నప్పుడు సౌకర్యవంతంగా ఉంటుంది. చర్మాన్ని జిగటగా ఉంచదు.
- బెడ్ షీట్‌లను ఎంచుకునేటప్పుడు 100 శాతం కాటన్ ట్యాగ్‌కు ప్రాధాన్యత ఇవ్వండి. కొన్ని బ్రాండ్లు కాటన్ షీట్‌లను అమ్ముతున్నప్పటికీ... అవి బ్లెండెడ్ కాటన్‌వి (ఇతర రకాల పదార్థాలతో కలిసిన కాటన్) అయి ఉంటాయి. బ్లెండెడ్ కాటన్ స్కిన్ ఫ్రెండ్లీ కాదు.
- కలప గుజ్జును ఫైబర్‌గా మార్చడం ద్వారా తయారుచేయబడిన మృదువైన వస్త్రాలలో 'టన్సెల్' ఒకటి. ఇది చల్లని అనుభూతిని కలిగిస్తుంది. నిద్ర నాణ్యతను పెంచుతుంది.



- వేసవిలో చెమట కారణంగా బెడ్ షీట్‌లు త్వరగా మురికి పడతాయి. అందువల్ల వారానికి కనీసం రెండు సార్లు బెడ్ షీట్‌లను మార్చాలి. ఇలాంటి సందర్భాలలో తేలికైన, ఫ్లోయింగ్ కాటన్ షీట్‌లను ఎంచుకోవడం మంచిది.
- వేసవిలో దద్దుర్లలాంటి వివిధ చర్మ సమస్యలు వస్తాయి. మీది సెన్సిటివ్ స్కిన్ అయితే సింథటిక్ కాని బెడ్‌షీట్‌లను వాడితే మంచిది.
- వేసవిలో ఎలాంటి కలర్స్ బెడ్ షీట్‌లను ఎంచుకోవాలనే విషయానికి వస్తే నీలం రంగు బెటర్. లేత నీలం రంగు బెడ్‌షీట్‌లు చల్లదనాన్ని కలిగిస్తాయి.

● సమ్‌థింగ్ స్పెషల్

మాటలు నేర్చిన కాకి



ఈ కాకి కావు కావు కాదు... హాయ్ హాయ్ అని అరుస్తుంది! రామచిలక మనిషి మాటలను అనుకరించడం మనకు తెలిసిందే. అయితే మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఒక కాకి మనిషి మాటలను అనుకరిస్తూ అందరినీ బోలెడు ఆశ్చర్యపరుస్తోంది. వాడా తాలూకాలోని పాల్ఘర్‌కు చెందిన తనూజ ముక్నే అనే మహిళ తన తోటలో గాయపడిన కాకిని చూసి సపర్యలు చేసింది. కొన్ని రోజులు తరువాత కోలుకున్న కాకి తనూజ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా కలిసిపోయింది. అంతేకాదు... మనుషులు మాట్లాడే మాటలను అనుకరించడం మొదలు పెట్టింది. 'పప్పా' 'బాబా' మమ్మీ' అంటూ వరుసలు పెట్టి పిలవడం మొదలుపెట్టింది. దీంతో ఈ కాకి లోకల్ సెలబ్రిటీగా మారింది!

బార్బీ బాక్స్ ఛాలెంజ్



'బార్బీ బాక్స్ ఛాలెంజ్' అనేది సోషల్ మీడియాలో కొత్త ట్రెండ్‌గా మారింది. ఈ ఫన్ ట్రెండ్‌లో ఏఐ టూల్స్‌ను ఉపయోగించి నార్మల్ ఫొటోలను బార్బీ డాల్స్ లేదా యాక్షన్ ఫిగర్‌లుగా మారుస్తారు. యూజర్‌కు మారుస్తారు. యూజర్‌కు సంబంధించిన యాక్షన్ ఫిగర్ అందమైన ప్లాస్టిక్ పెట్టెలో కనిపిస్తుంది. ఈ ట్రెండ్‌లో మీరు కూడా చేరిపోవాలనుకుంటున్నారా? ఇందుకు మీకు కావలసింది ఏమిటంటే... ● హై క్వాలిటీ ఫొటో ● చాట్ జీపీటీ యాక్సెస్ ● ఏఐ ఇమేజ్ జనరేటర్. ఉదాహరణ మిడ్‌జర్నీ బార్బీ ప్రాంప్ట్స్ ● క్లాసిక్ బార్బీ ● మోడ్రన్ ఫ్యాషన్ బార్బీ ● ఫాంటసీ బార్బీ ● పెట్ బార్బీ.

ఊరే ప్రేరణ

ఒక బొమ్మలో మాతృత్వం
మరో బొమ్మలో పెళ్లి ఆనందం
ఇంకో బొమ్మలో రైతు శ్రమ
ఓ చిత్రంలో అందమైన బాల్యం
మొత్తంగా ఈ గ్యాలరీ అంతా...
అచ్చమైన పల్లెసీమకు చిత్రరూపం.



పల్లెటూరి చిత్రాలు

నా చిత్రాల్లో గ్రామీణ జీవనం కనిపించడానికి కారణం మా సొంతూరు రాజమండ్రి దగ్గర వానపల్లి. నేను పెరిగింది పట్టణంలోనే. ఇంటర్ సెలవుల్లో ఒకసారి నాన్నగారు నన్ను ఊరికి తీసుకెళ్లారు. రాజమండ్రి ప్రకృతి సౌందర్యం నా మనో ఫలకం మీద ముద్రించుకుపోయింది. నా బొమ్మలు కోనసీమ జీవితాలను కళ్లకు కడుతుంటాయి. నన్ను 'నారీ కళామహోత్సవ్ పురస్కారం' పురస్కారానికి ఎంపిక చేసింది మా ఊరి ప్రకృతి. గ్రామాల్లోని శ్రమ జీవన సౌందర్యమే. ఇప్పుడు హైదరాబాద్‌లో 250 మంది చిత్రకారులు వేసిన మూడు వేల చిత్రాల ప్రదర్శనలో నా చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు దక్కడానికి కారణమూ స్వచ్ఛత నిండిన అచ్చమైన జీవితాలకు చిత్రరూపమివ్వడమే.

– **అంబిక ఊరకరణం,** చిత్రకారిణి

తల్లి ఆవును ముద్దాడుతున్న లేగ దూడ, పాలు తాగుతున్న లేగదూడ తోకను మురిపెంగా ముద్దాడుతున్న గోమాత, గిర్రున తిరుగుతున్న చక్రం మీదున్న మట్టికి పాత్ర రూపమిస్తున్న కుమ్మరి, పెళ్లి పందిట్లోకి అరటి గెలను భుజాన మోసుకొస్తున్న రైతు, రెండు జడలు వేసుకుని రిబ్బన్లను పువ్వుల్లా ముడి వేసుకున్న బాలికల ముఖాల్లో విరిసిన ఆనంద విరులు, తోటలో పూలబుట్ట మోస్తున్న శ్రామికురాలి ముఖంలో పరిమళిస్తున్న సంతోషాల తావి... ఇవన్నీ అంబిక ఆర్ట్ గ్యాలరీ కొలువుదీరిన అందమైన చిత్రాలు. ఇక... తలమీద నీరు తాగేసిన ఖాళీ కొబ్బరి బోండాలను తట్టలో నింపుకుని తలమీద మోస్తున్న మహిళ ముఖంలో మాతృత్వపు మధురిమకు మరేదీ సాటిరాదు. పై చిత్రాలన్నీ ఒక ఎత్తయితే ఇదొక్కటే ఒక ఎత్తు. చంటి బిడ్డను చంకలో కట్టుకుని, పెద్ద బిడ్డను చేయి పట్టి నడిపించుకు వెళ్తున్న మహిళ ముఖంలో తల మీద మోస్తున్న బరువు కంటే కంటిపాపల్లాంటి ఇద్దరు బిడ్డల మాతృత్వపు సంతృప్తి నిండిన దరహాసం ప్రస్ఫుటమవుతోంది. ఇక రైతు కష్టాన్ని కళ్లకు కడుతూ వీక్షకుల మనసును ద్రవింపచేస్తున్న చిత్రం ఒకటుంది. ట్రాక్టర్ ట్రక్కులో ఎర్రగా నవనవలాడుతున్న మిరపకాయల మీద పడుకుని సేదదీరుతూ ఠీవిగా కాలు మీద కాలు వేసుకున్న రైతు చిత్రం అది. మిరపకాయల ఘాటును లెక్కచేయకుండా తాను పండించిన పంట మీద సాధికారత, ప్రేమ అంతకు మించిన ధీమా రైతు ముఖంలో వ్యక్తమవుతున్నాయి. అంబిక మనసులో అనంతంగా పరిభ్రమిస్తున్న ఆలోచనలకు ఆమె చేతిలో ఉన్న కుంచె ఇచ్చిన రూపాలివన్నీ. స్కూల్ రోజుల్లో భయభయంగా పెన్సిల్ పట్టుకున్న అంబిక ఇప్పుడు చిత్రకళా ప్రదర్శనల్లో తన మార్కు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌లో అంబిక తన చిత్రాలను ప్రదర్శించారు. ఆ సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న అనుభవాలివి.


దార్శనికులు లేరు!

అంబిక... ఏలూరులో పుట్టి పెరిగారు. స్కూల్లో బయాలజీ రికార్డు బొమ్మలు కజిన్స్‌ని బతిమాలి ఎప్పటికప్పుడు ఎలాగో గట్టెక్కుతూ వచ్చారు. ఒకసారి కజిన్స్ ఎవరికీ అంబికకు బొమ్మ వేసిచ్చేటంత ఖాళీ లేదు. ఇక తప్పదని ధైర్యం చేశారు. బొమ్మ బాగా వచ్చింది. తన మీద తనకు నమ్మకం కలిగిన క్షణాలవి. ఆ తర్వాత టెక్ట్స్ బుక్స్‌లో బొమ్మలను యథాతథంగా వేయడంతోపాటు గ్రీటింగ్ కార్డుల కోసం పువ్వులు, పక్షుల బొమ్మలు వేశారు. లెక్కకు మించిన బొమ్మలు వేశారు, కానీ చిత్రకారిణిగా ఎదగడానికి అవసరమైన శిక్షణ ఎక్కడ దొరుకుతుందో, ఎలా ముందుకెళ్లాలో కూడా తెలియదు.

బొమ్మలో భావం పలికింది

ఎమ్మెస్సీ తర్వాత పెళ్లి, ముంబయికి వెళ్లడం, ఆ తర్వాత ఏడాదికే బెంగళూరుకు బదిలీ. బెంగళూరు ఆమె చేతిలో కలర్ పాలెట్ అనే చెప్పాలి. అక్కడి చిత్రకళా పరిషత్‌లో ఏడాది కోర్సు చేసి, ముఖ కవళికలు, ముఖంలో భావాలు పలికించడం నేర్చుకున్నారు. హ్యూమన్ అనాటమీ కొలతల వంటి మెళకువలు పట్టుపడ్డాయి. అప్పటి నుంచి ఆ కుంచెకు విరామం లేదు. బొమ్మను అలాగే రెప్లికా వేస్తున్న దశ నుంచి సొంత థీమ్‌తో బొమ్మలు వేయడం 2018లో మొదలు పెట్టారు. హైదరాబాద్, బెంగళూరుల్లో డజను ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆమె అత్తగారి ఊరు గుళ్లపూడిలో సొంత ఆర్ట్ స్టూడియో, గ్యాలరీ ఏర్పాటు చేసుకున్నారు. ఆమె చిత్రాలకు విదేశీ చిత్రకారుల నుంచి ప్రశంసలు వచ్చాయి. సింగపూర్, దుబాయ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లలో పాల్గొనడానికి ఆహ్వానాలు వస్తున్నాయి.







– **వాకా మంజులారెడ్డి**
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



తొలి రౌండ్‌లోనే యూకీ జోడీ ఓటమి

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ నంబర్‌వన్ యూకీ బాంబ్రీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్ నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) ద్వయం 4-6, 6-7 (5/7)తో టాప్ సీడ్ కెవిన్ క్రావిట్జ్-టిమ్ ప్యూట్జ్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడిపోయింది. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం నాలుగు ఏస్‌లు సంధించింది. మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. యూకీ జోడీ సాధించిన మొత్తం 65 పాయింట్లలో 39 సర్వీస్ పాయింట్లు, 26 రిటర్న్ పాయింట్లు ఉన్నాయి. తొలి రౌండ్‌లో ఓడిన యూకీ-గాలోవేలకు 10,730 యూరోలు (రూ. 10 లక్షల 45 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 32 ఏళ్ల యూకీ బాంబ్రీ ఈ ఏడాది మొత్తం పది టోర్నీలలో బరిలోకి దిగాడు. అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)తో కలిసి దుబాయ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ నెగ్గిన యూకీ... మయామి ఓపెన్, ఇండియన్ వెల్స్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలలో క్వార్టర్ ఫైనల్ చేరుకొని కెరీర్ బెస్ట్ 26వ ర్యాంక్‌ను అందుకున్నాడు.



సురుచి ధమాకా

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు సొంతం

లిమా (పెరూ): గతవారం అర్జెంటీనాలో అదరగొట్టిన భారత టీనేజ్ పిస్టల్ షూటర్ సురుచి ఇందర్ సింగ్ అదే జోరును పెరూలో పునరావృతం చేసింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్ రెండో టోర్నమెంట్‌లో హరియాణాకు చెందిన 18 ఏళ్ల సురుచి 24 గంటల వ్యవధిలో రెండు స్వర్ణ పతకాలతో మెరిసింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సురుచి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సురుచి 243.6 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని దక్కించుకుంది. సురుచి ధాటికి గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు నెగ్గిన భారత స్టార్ మనూ భాకర్ రజత పతకంతో సంతృప్తి పడింది. మనూ భాకర్ 242.3 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. 34 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో సురుచి 582 పాయింట్లతో రెండో స్థానంలో, మనూ భాకర్ 578 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. బుధవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లోనూ సురుచి గురి అదిరింది. ఈ ఈవెంట్ ఫైనల్లో సురుచి-సౌరభ్ చౌధరీ (భారత్) ద్వయం విజేతగా నిలిచి పసిడి పతకాన్ని సాధించింది. ఫైనల్లో సురుచి-సౌరభ్ జోడీ 17-9తో కియాన్‌జున్ యావో-కాయ్ హు (చైనా) జంటను ఓడించింది. కాంస్య పతక మ్యాచ్‌లో మనూ భాకర్-రవీందర్ సింగ్ (భారత్) జోడీ 6-16తో కియాన్‌కె మా-యిఫాన్ జాంగ్ (చైనా) ద్వయం చేతిలో ఓడిపోయింది.

ఢిల్లీ 'సూపర్' విక్టరీ

- ఒత్తిడికి చిత్తయిన రాజస్తాన్ రాయల్స్
- మెరిసిన స్టార్క్, రాహుల్



న్యూఢిల్లీ: ఉత్కంఠ ఊపేసిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించింది. ఆధిక్యం చేతులు మారుతూ చివరి బంతి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగిన మ్యాచ్... ఆఖరికి 'సూపర్ ఓవర్'కు వెళ్లగా... అందులోనూ ఆకట్టుకున్న క్యాపిటల్స్ ఐపీఎల్ 18వ సీజన్‌లో ఐదో విజయం ఖాతాలో వేసుకుంది. సొంతగడ్డపై తొలి విజయం సాధించిన ఢిల్లీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకుంది. బుధవారం జరిగిన ఈ పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ పొరెల్ (37 బంతుల్లో 49; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... కేఎల్ రాహుల్ (38; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టబ్స్ (18 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (14 బంతుల్లో 34; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు సరిగ్గా 188 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (37 బంతుల్లో 51; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), నితీశ్ రాణా (28 బంతుల్లో 51; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలు సాధించగా... సామ్సన్ (19 బంతుల్లో 31; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. ఆఖర్లో తీవ్ర ఒత్తిడిలో ధ్రువ్ జురెల్ (17 బంతుల్లో 26; 2 సిక్స్‌లు), హెట్‌మైర్ (15 నాటౌట్; 1 ఫోర్) మెరుగైన ప్రదర్శన కనబర్చారు. స్కోర్లు సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు 'సూపర్ ఓవర్' ఆడించారు.

స్కోరు వివరాలు: **ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** మెక్‌గుర్క్ (సి) జైస్వాల్ (బి) ఆర్చర్ 9; పొరెల్ (సి) పరాగ్ (బి) హసరంగ 49; కరుణ్ (రనౌట్) 0; రాహుల్ (సి) హెట్‌మైర్ (బి) ఆర్చర్ 38; స్టబ్స్ (నాటౌట్) 34; అక్షర్ (సి) జురెల్ (బి) తీక్షణ 34; అశుతోష్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 188. వికెట్ల పతనం:** 1-34, 2-34, 3-97, 4-105, 5-146. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-32-2; తుషార్ 3-0-38-0; సందీప్ 4-0-33-0; తీక్షణ 4-0-40-1; హసరంగ 4-0-38-1; పరాగ్ 1-0-6-0. **రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 51; సామ్సన్ (రిటైర్డ్ హర్ట్) 31; పరాగ్ (బి) అక్షర్ 8; నితీశ్ రాణా (ఎల్బీ) స్టార్క్ 51; జురెల్ (రనౌట్) 26; హెట్‌మైర్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 188. వికెట్ల పతనం:** 1-76, 2-112, 3-161, 4-188. **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-1; ముకేశ్ 3-0-31-0; మోహిత్ 4-0- 38-0; విప్రాజ్ 1-0-13-0; అక్షర్ 3-0-23-1; కుల్దీప్ 4-0-33-1; స్టబ్స్ 1-0-12-0.

సూపర్ ఓవర్ సాగిందిలా...

సూపర్ ఓవర్‌లో ఢిల్లీ తరఫున బౌలింగ్ చేసిన స్టార్క్... తన యార్కర్లతో ప్రత్యర్థిని కట్టిపడేశాడు. తొలి బంతికి పరుగులేమీ రాకపోగా... రెండో బంతికి హెట్‌మైర్ ఫోర్ కొట్టాడు. మూడో బంతికి సింగిల్ రాగా... నాలుగో బంతికి పరాగ్ ఫోర్ కొట్టాడు. ఆ బంతి నోబాల్ అని తేలగా... మరుసటి బంతికి పరాగ్ రనౌటయ్యాడు. ఐదో బంతికి రెండో పరుగు తీసే క్రమంలో జైస్వాల్ రనౌటవడంతో రాయల్స్ ఇన్నింగ్స్ ముగిసింది. ఛేదనలో తొలి బంతికి రెండు పరుగులు తీసిన రాహుల్... రెండో బంతిని బౌండరీకి తరలించాడు. మూడో బంతికి సింగిల్ రాగా... నాలుగో బంతికి స్టబ్స్ సిక్స్ బాది మ్యాచ్‌ను ముగించాడు.

రాజస్తాన్	బంతులు	ఢిల్లీ
0	1	2
4	2	4
1	3	1
4+నోబ్	4	6
0 రనౌట్	4	-
1+రనౌట్	5	-
-	6	-
11/2	మొత్తం	12/0

బ్యాటర్లు: హెట్‌మైర్, పరాగ్, జైస్వాల్
బౌలర్: స్టార్క్

బ్యాటర్లు: కేఎల్ రాహుల్, స్టబ్స్,
బౌలర్: సందీప్ శర్మ

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
ఢిల్లీ	6	5	1	10	0.744
గుజరాత్	6	4	2	8	1.081
బెంగళూరు	6	4	2	8	0.672
పంజాబ్	6	4	2	8	0.172
లక్నో	7	4	3	8	0.086
కోల్‌కతా	7	3	4	6	0.547
ముంబై	6	2	4	4	0.104
రాజస్తాన్	7	2	5	4	-0.714
హైదరాబాద్	6	2	4	4	-1.245
చెన్నై	7	2	5	4	-1.276

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × హైదరాబాద్
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ప్రపంచ బిలియర్డ్స్ చాంప్ సౌరవ్



కార్లో (ఐర్లాండ్): అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ప్రపంచ బిలియర్డ్స్ (టైమ్ ఫార్మాట్) చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్ సౌరవ్ కొఠారి విజేతగా అవతరించాడు. బుధవారం జరిగిన ఫైనల్లో బెంగాల్‌కు చెందిన 40 ఏళ్ల సౌరవ్ 725-480 పాయింట్ల తేడాతో భారత్‌కే చెందిన దిగ్గజ ప్లేయర్ పంకజ్ అద్వానీపై గెలిచి ఈ ఫార్మాట్‌లో తొలిసారి విశ్వవిజేతగా నిలిచాడు. చాంపియన్ సౌరవ్‌కు 5,000 డాలర్లు (రూ. 4 లక్షల 28 వేలు), రన్నరప్ పంకజ్‌కు 2,500 డాలర్లు (రూ. 2 లక్షల 14 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఐదు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో గ్రూప్ దశ మ్యాచ్‌లను 90 నిమిషాలపాటు, క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లను 120 నిమిషాలపాటు, సెమీఫైనల్ మ్యాచ్‌లను 150 నిమిషాలపాటు, ఫైనల్‌ను 180 నిమిషాలపాటు నిర్వహించారు. బిలియర్డ్స్‌లో 150 అప్, లాంగ్ అప్, టైమ్ ఫార్మాట్‌లలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లు జరుగుతాయి. 2015 తర్వాత టైమ్ ఫార్మాట్‌లో మళ్లీ వరల్డ్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించారు. 2015లో పంకజ్ అద్వానీ టైటిల్ సాధించగా... పదేళ్ల తర్వాత మళ్లీ భారత ప్లేయరే విజేత కావడం విశేషం.

ఆ వ్యాపారవేత్తతో జాగ్రత్త!

- ఐపీఎల్‌లో ఫిక్సింగ్ ప్రయత్నాలు చేస్తున్న హైదరాబాద్ వ్యాపారవేత్త
- అప్రమత్తమైన బీసీసీఐ అవినీతి నిరోధక భద్రతా విభాగం
- ఫ్రాంచైజీలు, ప్లేయర్లు, సహాయక సిబ్బందికి హెచ్చరికలు జారీ



హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)పై మరోసారి నీలినీడలు కమ్ముకుంటున్నట్లు కనిపిస్తున్నాయి. మూడు ఫోర్లు, ఆరు సిక్సర్లుగా సాగుతున్న లీగ్ 18వ సీజన్‌లో ఫిక్సింగ్ జరిగే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో... భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా ఐపీఎల్ ఆడుతున్న ప్లేయర్లు, జట్ల యజమానులు, సహాయక సిబ్బంది, కామెంటేటర్లకు బీసీసీఐ కీలక సూచనలు చేసింది. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్‌గా గుర్తింపు పొందిన ఐపీఎల్‌లో ఫిక్సింగ్ జరిగే ఆస్కారముందని లీగ్‌తో సంబంధం ఉన్న వారందరికీ బోర్డు హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ బడా వ్యాపార వేత్త దీనికి గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించింది. అలాంటి ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని బీసీసీఐ అవినీతి నిరోధక భద్రతా విభాగం (ఏసీఎస్‌యూ) సూచించింది. ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, జట్టు యజమానులు, వ్యాఖ్యాతలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ప్లేయర్లతో పాటు వారి కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మెలుగుతూ వారికి ఖరీదైన బహుమతులు ఇవ్వడం ద్వారా వారిని ఆకర్షించుకునే ప్రయత్నాలు జరగొచ్చని ఏసీఎస్‌యూ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ వ్యాపారవేత్తకు బుకీలు, పంటర్‌లతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని కూడా సమాచారం. అతడు గతంలోనూ ఇలాంటి అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డాడని... ఈనేపథ్యంలో ఐపీఎల్‌తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ ఏసీఎస్‌యూ హెచ్చరించింది. ఎవరైనా ఖరీదైన బహుమతులు, నగలు ఇవ్వజూపితే తమకు తెలియ పరచాలని స్పష్టం చేసింది. అభిమానిగా నటిస్తూ తరచూ ఆటగాళ్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించడం అతడికి అలవాటని... అది వీలు పడకపోతే ప్లేయర్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, బంధువుల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తాడని బీసీసీఐ హెచ్చరించింది. విదేశాల్లో ఉండే వారిని సైతం దీనికోసం సంప్రదిస్తాడని.. సామాజిక మాధ్యమాల్లోనో అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఆయన అభిప్రాయాలను తప్పుపట్టను

- ఏఆర్ రెహమాన్



''సింగర్ అభిజీత్ అంటే నాకెంతో అభిమానం. నాపై ఎన్ని విమర్శలు చేసినా ఆయన్ను గౌరవిస్తూనే ఉంటాను. ఆయన అభిప్రాయాలను తప్పుపట్టను. ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుంది. నా పని తీరుపై ఆయనకు ఉన్న అభిప్రాయాన్ని ఆ విధంగా బయటపెట్టారు'' అని పేర్కొన్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్. విషయం ఏంటంటే... ఏఆర్ రెహమాన్ డిజిటల్ టూల్స్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నారని, దీంతో సంప్రదాయ సంగీత వాద్యకారులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని అభిజీత్ పేర్కొన్నారు. ఈ విషయంపై రెహమాన్ ఓ ఇంటర్వ్యూలో స్పందిస్తూ...''దుబాయ్ వేదికగా 60మంది మహిళలతో ఓ ఆర్కెస్ట్రా బృందాన్ని ఏర్పాటు చేసి, వారికి ఉద్యోగాలు కల్పించి, ప్రతి నెలా జీతాలు ఇస్తున్నాను. వారికి ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యాలనూ కల్పించాను. అది 'ఛావా' కావొచ్చు... 'పొన్నియిన్ సెల్వన్' కావొచ్చు... నా ప్రతి సినిమాలో 200 నుంచి 300 మంది వరకు మ్యూజిషియన్స్ ఇన్‌వాల్వ్ అవుతారు. కొన్ని పాటలపై 1000 మంది మ్యూజిషియన్స్ వర్క్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయను. సో... నా వర్కింగ్ స్టైల్‌పై అందరికీ అవగాహన ఉండకపోవచ్చు'' అన్నారు.

అందుకే 'వండర్‌మెంట్' అని పెట్టా: రెహమాన్, ఆయన భార్య సైరా భాను విడి విడిగా ఉండటం, అలాగే ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడం వంటి విషయాలు చర్చనీయాంశం కావడం పట్ల ఆ ఇంటర్వ్యూలో రెహమాన్ స్పందిస్తూ... ''ఇది అమానవీయం. నా జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. ప్రతి ఒక్కరిలోనూ ఓ ప్రత్యేకమైన గుణం ఉంటుంది. వాళ్ల ఇంట్లో వారే సూపర్‌హీరో. కానీ.. నేను సూపర్ హీరో అయ్యేలా చేసింది మాత్రం నా అభిమానులే. నేను ఆస్పత్రిలో చేరాననగానే ఎంతో ప్రేమతో సందేశాలు పంపారు. ఇంతమంది అభిమానం సొంతం చేసుకోవడం నాకు 'వండర్'గా అనిపించింది. అందుకే నా తర్వాతి మ్యూజికల్ టూర్‌కి 'వండర్‌మెంట్' అని పేరు పెట్టుకున్నాను'' అన్నారు.

త్రిపాత్రాభినయం?



అల్లు అర్జున్

అల్లు అర్జున్ కెరీర్‌లో ఇప్పటివరకు సిల్వర్ స్క్రీన్‌పై ద్విపాత్రాభినయం చేసింది లేదు. ఇప్పుడు ఏకంగా త్రిపాత్రాభినయం చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. అల్లు అర్జున్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ ఏడాది చివర్లో షూటింగ్ ప్రారంభించి, 2027లో ఈ సినిమాని రిలీజ్ చేయాలని అనుకుంటున్నారని సమాచారం. కాగా ఈ చిత్రంలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేయనున్నారని, అందుకే ముగ్గురు కథానాయికలను ఎంపిక చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ప్రస్తుతానికి జాన్వీ కపూర్, దిశా పటానీ, శ్రద్ధా కపూర్‌ల పేర్లను చిత్రబృందం పరిశీలిస్తోందనే ప్రచారం జరుగుతోంది. మరి... వార్తల్లో ఉన్నట్లు అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేస్తారా? వేచి చూడాల్సిందే.

కృత్రిమ మేధ కంపెనీ ఆరంభం



'దిల్' రాజు

ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు 'క్వాంటమ్ ఏఐ గ్లోబల్'తో కలిసి కొత్త ఏఐ (కృత్రిమ మేధ) కంపెనీని ప్రారంభించారు. ఈ కంపెనీ సినిమాలు, ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ కోసం ప్రత్యేకంగా వినియోగించే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'కి సంబంధించి స్మార్ట్ టూల్స్ రూపొందించడంపై దృష్టి పెడుతుంది. 'దిల్' రాజు మాట్లాడుతూ–''ఆటోమేషన్, స్మార్ట్ ఏఐ ఉపయోగించడం ద్వారా కొత్త కథలను సృష్టించడం ఓ విప్లవాత్మక మార్పునకు నాంది కానుంది. ఏఐ కేవలం మెరుగైన కంటెంట్ గురించి మాత్రమే కాదు... మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్ వరల్డ్‌కి మద్దతు ఇచ్చే బలమైన వ్యవస్థ. ఈ కంపెనీ పేరు, ప్రొడక్ట్స్ లిస్ట్, లాంచ్ వివరాలు మే 4న తెలియజేస్తాం'' అన్నారు.

హిట్ గ్యారెంటీ


- నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్



ఇంద్రగంటి మోహనకృష్ణ, రూప, ప్రియదర్శి, శివలెంక, 'వెన్నెల' కిశోర్, 'వైవా' హర్ష

''జెంటిల్‌మ్యాన్, సమ్మోహనం' చిత్రాల తర్వాత ఇంద్రగంటిగారితో 'సారంగపాణి జాతకం' తీశాను. ఈ సినిమా ఔట్‌పుట్ పట్ల సంతోషంగా ఉన్నాను. ఓ మంచి కుటుంబ కథతో రూపొందిన ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది... ఇందుకు నాది గ్యారెంటీ'' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. నరేష్ విజయకృష్ణ, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, 'వెన్నెల' కిశోర్, 'వైవా' హర్ష ఇతర పాత్రలు పోషించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ–''క్రైమ్‌తో కూడిన కామెడీ సినిమా ఇది. తెలుగు వారు నటించిన ఈ అచ్చ తెలుగు చిత్రం ప్రేక్షకులను అన్ని రకాలుగా మెప్పిస్తుంది'' అన్నారు. ''ఇంద్రగంటిగారితో పని చేయాలనే ఆకాంక్ష ఈ మూవీతో నెరవేరింది'' అని ప్రియదర్శి చెప్పారు. ''విజయవాడలో డాక్టర్‌గా పని చేసుకుందామనుకుంటే... నన్ను యాక్టర్‌ని చేశారు. ఇంద్రగంటిగారి సినిమాలో నటించడం గర్వంగా భావిస్తున్నాను'' అని రూపా కొడువాయూర్ చెప్పారు. ''పుష్పక విమానం' సినిమా టాకీగా వస్తే ఎలా ఉంటుందో 'సారంగపాణి జాతకం' అలా ఉంటుంది'' అని 'వెన్నెల' కిశోర్ పేర్కొన్నారు. నటుడు వడ్లమాని శ్రీనివాస్ మాట్లాడారు.

భవిష్యత్‌లోకి ప్రయాణం



సుదీప్

దాదాపు 180 సంవత్సరాలు భవిష్యత్‌లోకి వెళ్లి, సరికొత్త అడ్వెంచరస్ జర్నీని మొదలు పెట్టారు కిచ్చా సుదీప్. ఆయన హీరోగా అనూప్ భండారి దర్శకత్వంలో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'బిల్లా రంగ బాషా'. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణను బుధవారం మొదలుపెట్టినట్లుగా చిత్రయూనిట్ పేర్కొంది. ''2209 ఏడీ ఫ్యూచర్‌లో ఈ సినిమా కథనం సాగుతుంది. ప్రేక్షకులు ముందెన్నడూ అనుభూతి చెందని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ మూవీతో పొందుతారు'' అని చిత్రబృందం పేర్కొంది.

చౌర్య పాఠంతో నిర్మాతపై గౌరవం పెరిగింది

- త్రినాథరావు నక్కిన



నిఖిల్ గొల్లమారి, ఇంద్ర రామ్, పాయల్, త్రినాథరావు నక్కిన

''ఈ మధ్యకాలంలో ఆడియన్స్ థియేటర్స్‌కి రావడం తగ్గింది. ఇలాంటి సమయంలో అంతా కొత్తవారితో 'చౌర్య పాఠం' సినిమా చేయడం ఒక సాహసమే. అలాంటి సాహసం చేశాను. ఈ సినిమా చేస్తున్నప్పుడు నిర్మాత అసలు కష్టాలు అర్థం అయ్యాయి. నిర్మాతపై విపరీతమైన గౌరవం పెరిగింది'' అని త్రినాథరావు నక్కిన చెప్పారు. ఇంద్ర రామ్ హీరోగా, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'చౌర్య పాఠం'. నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై నక్కిన త్రినాథరావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ–''ఒక్క నేరం కూడా లేని, ఒక్క కేసు కూడా నమోదు కాని ఊరు నేపథ్యంలో కార్తీక్ చెప్పిన కథ ఆసక్తిగా అనిపించి ఈ మూవీ తీశాను. ప్రేక్షకులందరికీ చేతులెత్తి నమస్కరించి కోరుతున్నాను. ఈ సినిమా చూడ్డానికి థియేటర్స్‌కి రండి... చూడండి. నచ్చితే నలుగురికి చెప్పండి. మీరు చూస్తేనే మేము మరిన్ని చిత్రాలు తీయగలం'' అన్నారు. ''ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది'' అన్నారు ఇంద్రరామ్, పాయల్ రాధాకృష్ణ. ''ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు నిఖిల్ గొల్లమారి.

ట్రైలర్ ఆహ్లాదకరంగా ఉంది

- వీవీ వినాయక్



ఉదయ్ రాజ్, వీవీ వినాయక్

ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం. బంగార్రాజు నిర్మించిన చిత్రం 'మధురం'. ఈ నెల 18న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు వీవీ వినాయక్ విడుదల చేసి, ట్రైలర్ ఆహ్లాదకరంగా ఉందని, మంచి ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో బంగార్రాజు నిర్మించిన 'మధురం' విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంగీత దర్శకుడు, దర్శక-నటుడు ఆర్పీ పట్నాయక్, సంగీత దర్శకుడు- నటుడు రఘు కుంచె, దర్శకుడు విజయ్ కుమార్ కొండా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. **ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా ట్రైలర్ చూశాక ఎమోషన్ బాగా వర్కౌట్ అయ్యిందనిపించింది'' అన్నారు. ''ప్రతి ఒక్కరి జీవితంలో ఫస్ట్ లవ్ స్టోరీకి ప్రత్యేకత ఉంటుంది'' అన్నారు రఘు కుంచె. ''ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే మూవీ 'మధురం''అన్నారు ఉదయ్. ''మధురం' ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది'' అని పేర్కొన్నారు రాజేశ్-యం. బంగార్రాజు.

కీమో థెరపీ చేయించుకుంటూనే షూటింగ్ చేశాను

- శివ రాజ్‌కుమార్

''45' సినిమా షూటింగ్ చివరలో నాకు క్యాన్సర్ అని తెలిసింది. కీమోథెరపీ చేయించుకుంటూనే షూటింగ్ చేశాను. మీరు అది చేయొద్దు... ఇది చేయొద్దు అని మా మూవీ టీమ్ అన్నారు. కానీ, నేను చేయగలిగినప్పుడు మోసం చేయడం నాకు ఇష్టం ఉండదు. అందుకే నా పాత్రకి సంబంధించిన అన్ని రకాల సన్నివేశాలు చేశాను'' అని శివ రాజ్‌కుమార్ చెప్పారు. ఉపేంద్ర, శివ రాజ్‌కుమార్, రాజ్ బి. శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '45'. సంగీత దర్శకుడు అర్జున్ జన్యా ఈ చిత్రంతో దర్శకుడిగా మారారు. ఉమా రమేశ్ రెడ్డి, ఎం. రమేశ్ రెడ్డి నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో **శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ–** ''ఈ సినిమాకు మేం ముగ్గురం కాదు... కథే హీరో. అర్జున్ జన్యాకి మంచి పేరొస్తుంది. ప్రస్తుతం రజనీకాంత్‌గారి 'జైలర్ 2', రామ్‌చరణ్‌తో 'పెద్ది' చిత్రాల్లో నటిస్తున్నా'' అన్నారు. **ఉపేంద్ర మాట్లాడుతూ–** ''ఈ మూవీలో నన్ను చాలా కొత్తగా చూపించారు అర్జున్ జన్యా. 'కూలీ' సినిమాలో రజనీకాంత్, నాగార్జున గార్లతో నటించడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''సనాతన ధర్మం గురించి ఈ చిత్రంలో చాలా అంశాలుంటాయి. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది'' అన్నారు ఎం. రమేశ్ రెడ్డి. **అర్జున్ జన్యా మాట్లాడుతూ–** ''ఈ మూవీకి ముందుగా సీజీ, డైలాగ్స్, బీజీఎంతో సహా విజువలైజ్ చేసి, ఆ తర్వాత షూటింగ్ చేశాం. ఈ పద్ధతి వల్ల ఒక్క సీన్ కూడా వేస్టేజ్ ఉండదు. ప్రొడ్యూసర్స్‌కు బడ్జెట్ ఆదా అవుతుంది'' అని తెలిపారు.



అర్జున్ జన్యా, ఉపేంద్ర, శివ రాజ్‌కుమార్, రమేశ్ రెడ్డి

సాక్షి బిజినెస్
గురువారం
17-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	309	77,044
నిఫ్టీ ▲	109	23,437

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,333	▽ 485
డోజోన్స్	39,942	▽ 426
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,276	▲ 26
డాక్స్	21,311	▲ 57
షాంఘై	3.268	▲ 8
నికాయ్	34,268	▽ 347

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.ల్లో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	96,575
బంగారం (99.5 స్వచ్ఛత)	94,200
వెండి (కిలో)	96,575

ఫారెక్స్ రేట్లు (రూ.ల్లో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.01	111.10
€	యూరో	ఎస్‌బీఐ	95.82	98.54
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.30	60.86
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.24	55.44
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.86	67.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.95	23.45
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.44	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.85	12.67

పసిడి మరో కొత్త రికార్డు

- రూ.98,100 స్థాయికి
- ఒకే రోజు రూ.1,650 ర్యాలీ
- అంతర్జాతీయంగా 3,349 డాలర్లు

న్యూఢిల్లీ: పసిడి మరోసారి కొత్త గరిష్ట రికార్డును నమోదు చేసింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు (99.9% స్వచ్ఛత) రూ.1,650 పెరగడంతో రూ.98,100 స్థాయికి చేరింది. క్రితం రికార్డు రూ.96,450ను చెరిపేసింది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతుండడం బంగారం ధరలకు ఆజ్యం పోస్తోంది. బంగారం ఈ నెల 11న ఒక్క రోజే 10 గ్రాములకు రూ.6,250 పెరగడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు 23.56 శాతం ర్యాలీ చేసింది. జనవరి 1న రూ.79,390 స్థాయి నుంచి చూస్తే 10 గ్రాములకు రూ.18,710 లాభపడింది. మరోవైపు వెండి కిలోకి రూ.1,900 పెరిగి రూ.99,400కు చేరింది.

''బంగారం మళ్లీ భారీ ర్యాలీ చేసింది. ఎంసీఎక్స్‌లో రూ.95,000 స్థాయిని చేరింది. సురక్షిత సాధనానికి ఉన్న బలమైన డిమాండ్‌ను ఇది తెలియజేస్తోంది''అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. భౌగోళిక అనిశ్చితులకుతోడు అమెరికా–చైనా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు చల్లారనంత వరకు బంగారం ర్యాలీకి అవకాశాలున్నట్టు చెప్పారు. కాగా, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్స్‌కు 105 డాలర్లు పెరిగి 3,349 డాలర్ల సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిని తాకింది.



విప్రో లాభం రూ. 3,570 కోట్లు

- క్యూ4లో 26 శాతం జంప్
- ఆదాయం రూ. 22,504 కోట్లు
- క్యూ1 ఆదాయ అంచనాలు వీక్



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో గతేడాది(2024–25) చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 26 శాతం జంప్ చేసి రూ. 3,570 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,835 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం నామమాత్ర వృద్ధితో రూ. 22,504 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,208 కోట్ల టర్నోవర్ సాధించింది. త్రైమాసిక(క్యూ3)వారీగా చూస్తే నికర లాభం 6% పుంజుకోగా.. ఆదాయం 1% బలపడింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి విప్రో నికర లాభం 19% ఎగసి రూ. 13,135 కోట్లను అధిగమించగా.. మొత్తం ఆదాయం మాత్రం నామమాత్ర క్షీణతతో రూ. 89,088 కోట్లను తాకింది.

అనిశ్చితుల ఎఫెక్ట్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆదాయం 1.5–3.5% క్షీణించవచ్చని విప్రో తాజాగా అంచనా వేసింది. వెరసి ఏప్రిల్–జూన్ (క్యూ1)లో ఐటీ సర్వీసుల బిజినెస్ నుంచి 250.5–255.7 కోట్ల డాలర్ల మధ్య నమోదుకావచ్చని గైడెన్స్ ప్రకటించింది. త్రైమాసికవారీగా వేసిన అంచనాలివి. ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో ఐటీ ఆదాయం మందగించవచ్చని అభిప్రాయపడింది. ప్రణాళికల ప్రకారం గతేడాది 10,000 మందికి ఉపాధి కల్పించింది.

మెగా డీల్స్‌తో...

స్థూలఆర్థిక అనిశ్చితుల కారణంగా క్లయింట్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు విప్రో సీఈవో, ఎండీ శ్రీని పాలియా పేర్కొన్నారు. అయితే నిలకడ, లాభాల్లో వృద్ధిని కొనసాగించే బాటలో క్లయింట్ల అవసరాలపై దృష్టిపెట్టి సాగుతున్నట్లు తెలియజేశారు. ఇటీవలి టారిఫ్ ప్రకటనలు ప్రపంచ అనిశ్చితులను మరింత పెంచుతున్నట్లు అభిప్రాయపడ్డారు. గతేడాది కుదుర్చుకున్న రెండు మెగా డీల్స్‌తో భారీ కాంట్రాక్ట్ బుకింగ్స్ మెరుగుపడినట్లు తెలియజేశారు. కన్సల్టింగ్, ఏఐ సామర్థ్యాలను పటిష్టపరచుకోవడంతోపాటు గ్లోబల్ టాలెంట్‌పై పెట్టుబడులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి. అంతకుముందు విప్రో షేరు బీఎస్‌ఈలో 1.4 శాతం లాభంతో రూ. 248 వద్ద ముగిసింది.

ఇతర విశేషాలు...

- విప్రో మొత్తం సిబ్బంది సంఖ్య 2,32,614 నుంచి 2,33,346కు బలపడింది.
- క్యూ4లో 13% అధికంగా 395.5 కోట్ల డాలర్ల బుకింగ్స్ సాధించింది.
- భారీ డీల్స్ బుకింగ్స్ 49% ఎగసి 176.3 కోట్ల డాలర్లకు చేరాయి.
- క్యూ4లో ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్ 17.5%గా నమోదైంది.
- పూర్తి ఏడాదికి 5.4 బిలియన్ డాలర్ల భారీ డీల్ బుకింగ్స్‌తో కలిపి 14.3 బిలియన్ డాలర్లను తాకాయి.
- నిర్వహణ మార్జిన్లు క్యూ4లో 1.1%, పూర్తి ఏడాదికి 0.9% చొప్పున పుంజుకున్నాయి.

మూడోరోజూ ముందడుగే

- బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్
- మళ్లీ 77,000 పైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 109 పాయింట్లు



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూలతలను విస్మరిస్తూ దేశీయ స్టాక్ సూచీలు మూడోరోజూ ముందడుగేశాయి. రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి దిగిరావడంతో ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపుపై ఆశలు మరింత పెరిగాయి. ఈ ఏడాది వర్షాలు సాధారణంకన్నా ఎక్కువగానే కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటన, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 309 పాయింట్లు పెరిగి 77,044 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109 పాయింట్లు బలపడి 23,437 వద్ద నిలిచింది. ద్వితీయార్థంలో బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దాదాపు అరశాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. చైనా దిగుమతులపై 245 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఆసియాలో సింగపూర్, చైనా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 1% పైగా పడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- నాలుగో త్రైమాసిక నికరలాభం 49% వృద్ధి నమోదుతో ప్రభుత్వరంగ 'ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' (ఐఆర్‌ఈడీఏ) షేరు ఆరుశాతం లాభపడి రూ.176 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఏడున్నర శాతం పెరిగి రూ.180 వద్ద గరిష్టాన్ని తాకింది.

జెన్సోల్ ప్రమోటర్లకు సెబీ షాక్

- జగ్గీ సోదరులపై నిషేధం
- కీలక పదవులు చేపట్టకుండా చెక్...
- సెక్యూరిటీ మార్కెట్లలోనూ నో ఎంట్రీ
- లిస్టెడ్ కంపెనీని సొంత సంస్థలా మార్చారన్న నియంత్రణ సంస్థ



న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీ జెన్సోల్ ఇంజినీరింగ్‌ను ప్రమోటర్లు జగ్గీ బ్రదర్స్ సొంత (ప్రొప్రయిటరీ) సంస్థలా వాడుకున్నట్లు క్యాపిటల్‌మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వెల్లడించింది.కంపెనీ ప్రమోటర్లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీపై నిషేధ అస్త్రాన్ని ప్రయోగించింది. వెరసి వీరిరువురూ జెన్సోల్ సహా ఏ ఇతర లిస్టెడ్ కంపెనీలోనూ డైరెక్టర్లుగా లేదా కీలక యాజమాన్య స్థానంలో బాధ్యతలు చేపట్టేందుకు వీలుండదు. అంతేకాకుండా తదుపరి నోటీసు జారీ చేసేటంతవరకూ సెక్యూరిటీల మార్కెట్లో కార్యకలాపాలకూ అనుమతించమని సెబీ పేర్కొంది. నిధుల మళ్లింపునకు తోడు పాలనా సంబంధ అక్రమాలను గుర్తించడంతో సెబీ తాజా చర్యలకు ఉపక్రమించింది.

ఏం జరిగిందంటే..?

లిస్టెడ్ కంపెనీ జెన్సోల్ ఇంజినీరింగ్‌కు చెందిన కార్పొరేట్ నిధులను జగ్గీ బ్రదర్స్ అక్రమ మార్గంలో వినియోగించినట్లు 29 పేజీల మధ్యంతర ఆదేశాలలో సెబీ పేర్కొంది. వీటి ప్రకారం గుర్గావ్‌లోని డీఎల్‌ఎఫ్ కామెలియాస్‌లో హైఎండ్ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశారు. విలాసవంత గోల్ఫ్ సెట్‌ను సొంతం చేసుకున్నారు. క్రెడిట్ కార్డుల బిల్లుల చెల్లింపు, దగ్గరి బంధువులకు నిధుల బదిలీ తదితరాలను చేపట్టారు. తద్వారా దగ్గరి బంధువుల వ్యక్తిగత ప్రయాణాలు, విలాసాలకు సైతం నిధులు వెచ్చించారు. వెరసి లిస్టెడ్ కంపెనీని పిగ్గీ బ్యాంకులాగా మార్చుకున్నారు. ఇవికాకుండా ఫైనాన్షియల్ పీఎస్‌యూ దిగ్గజాలు ఇరెడా, పీఎఫ్‌సీల నుంచి ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) కొనుగోళ్ల కోసం తీసుకున్న రూ. 978 కోట్ల రుణాలను అక్రమంగా వినియోగించారు. 6,400 ఈవీ కొనుగోళ్లకు రూ. 664 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొనగా.. 4,704 వాహనాలను మాత్రమే ప్రొక్యూర్ చేసినట్లు ఫిబ్రవరిలో సెబీకి వెల్లడించింది. ఈవీలను బ్లూస్మార్ట్‌కు లీజుకిచ్చారు. అయితే 4,704 ఈవీలకు రూ. 568 కోట్లు మాత్రమే చెల్లించినట్లు గో ఆటో టెడ్ వెల్లడించింది. అయితే 20% అదనపు ఈక్విటీ చెల్లింపులతో కలిపి ఈవీలకు జెన్సోల్ రూ. 830 కోట్లు కేటాయించింది. అంటే వీటిలో రూ. 262 కోట్లు లెక్కతేలాల్సి ఉంది. కాగా.. జెన్సోల్, గో ఆటో బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే గో ఆటోకు చెల్లించిన నిధులు తిరిగి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జెన్సోల్ సంబంధిత సంస్థలలోకి చేరడం గమనార్హం! కాగా, బ్లూస్మార్ట్ క్యాబ్ సర్వీసులు 3 మెట్రో నగరాల్లో నిలిచిపోయాయి.

షేర్ల విభజనకు చెక్...

జెన్సోల్ ఇంజినీరింగ్ ప్రతిపాదించిన 1:10 నిష్పత్తిలో షేర్ల విభజనను సెబీ నిలిపివేసింది. 1 షేరుకి 10 షేర్లుగా విభజించడం ద్వారా మరింతమంది రిటైల్ ఇన్వెస్టర్లను ఆకట్టుకునేందుకు కంపెనీ ప్రతిపాదించింది. ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈలలో లిస్టయిన కంపెనీ సోలార్ కన్సల్టింగ్, ఈపీసీ సర్వీసులు, ఈవీల లీజింగ్ తదితర కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాగా.. స్టాక్ ఎక్స్ఛేంజీలలో షేరు 5 శాతం డౌన్ సర్క్యూట్‌తో రూ. 124 వద్ద నిలిచింది. బీఎస్‌ఈలో 2024 జూన్ 24న రూ. 1,125 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది!

ఐసీఐసీఐ సేవింగ్స్ డిపాజిట్ రేటు తగ్గింపు

ఇక మీదట 2.75 శాతమే...



ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్ (సేవింగ్స్ ఖాతాల్లోని బ్యాలెన్స్)పై వడ్డీ రేటును పావు శాతం మేర తగ్గించింది. సేవింగ్స్ ఖాతాల్లో బ్యాలెన్స్ రూ.50 లక్షల వరకు ఉన్న వారికి ఇక మీదట 2.75 శాతం రేటు అమలవుతుంది. అదే మాదిరి రూ.50 లక్షలకు పైన బ్యాలెన్స్ ఉన్న వారికి 3.25 శాతం రేటు లభిస్తుంది. బుధవారం నుంచే కొత్త రేటు అమల్లోకి వచ్చింది. ఎస్‌బీఐ సైతం సేవింగ్స్ డిపాజిట్లపై 2.70 శాతం రేటు అమలు చేస్తుండడం గమనార్హం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా తాజాగా సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ రేటును 0.25% తగ్గించి 2.75% చేసింది. రూ.50 లక్షలకు మించిన మొత్తంపై వడ్డీ రేటు 3.5% ఉండగా 3.25 శాతానికి తగ్గించింది.

రూపాయి.. రయ్ రయ్

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్లు, అమెరికా కరెన్సీ బలహీనతలు కలిసిరావడంతో రూపాయి విలువ మూడోరోజూ ర్యాలీ చేసింది. డాలర్ మారకంలో 16 పైసలు బలపడి 85.64 వద్ద స్థిరపడింది. మెరుగైన దేశీయ స్థూల ఆర్థిక గణాంకాల నమోదు కూడా మన కరెన్సీ బలపడేందుకు దోహదపడింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ట్రేడింగ్ 85.66 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 85.50 వద్ద గరిష్టాన్ని, 85.72 కనిష్టాన్ని తాకింది.

భవిత

స్పర్థయా వర్ధతే విద్య

ఏఐ కొలువులు.. కావాల్సిన స్కిల్స్

» ఐటీ నుంచి సర్వీస్ సెక్టార్ వరకు ఏఐ-ఎంఎల్ కీలకం
» జావా, పైథాన్, డీప్ లెర్నింగ్ నిపుణులకు డిమాండ్
» కోడింగ్ నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్న సంస్థలు

దేశవ్యాప్తంగా లక్షల మంది ప్రతిఏటా ఇంజనీరింగ్ పట్టాలతో జాబ్ మార్కెట్‌లో అడుగుపెడుతున్నారు. బీటెక్ సర్టిఫికెట్ చేతిలో ఉంటే.. కొలువు దక్కుతుందనే నమ్మకం! కాని ప్రస్తుత ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) యుగంలో.. లేటెస్ట్ టెక్నాలజీపై పట్టుంటేనే ఉద్యోగావకాశాలు లభించే పరిస్థితి నెలకొంది. ఏఐ, మెషిన్ లెర్నింగ్ కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో.. ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో కీలకంగా మారుతున్న నైపుణ్యాల వివరాలు..



బీటెక్ విద్యార్థులకు క్లాస్ రూమ్ లెర్నింగ్‌తో పాటు రియల్ టైమ్ నైపుణ్యాలు, లేటెస్ట్ టెక్నాలజీస్‌పై అవగాహన ఎంతో ముఖ్యం. దీనికి అనుగుణంగా వారు ముఖ్యంగా.. ఏఐ, ఎంఎల్ సంబంధిత అంశాల్లో నైపుణ్యాలు పెంచుకునేలా ప్రయత్నించాలి అంటున్నారు నిపుణులు. ఎందుకంటే.. వ్యక్తుల నుంచి సంస్థల వరకు ప్రతి చోటా ఏఐ-ఎంఎల్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. దీంతో.. ఉద్యోగావకాశాలు కూడా దానికి తగినట్లుగానే లక్షల సంఖ్యలో అందుబాటులోకి వస్తున్నాయి.

అన్నింటా ఏఐ-ఎంఎల్

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ డిజిటల్ టెక్నాలజీస్ ఆధారిత కార్యకలాపాల వేగం పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీస్ వినియోగం విస్తరిస్తోంది. చిన్న తరహా కంపెనీలు మొదలు బహుళ జాతి సంస్థల వరకు.. అదే విధంగా కోర్ ఐటీ నుంచి బ్యాంకింగ్ దాకా.. ఈ-కామర్స్ మొదలు ఎడ్యుకేషన్ సెక్టార్ వరకు.. ఏఐ-ఎంఎల్ టెక్నాలజీస్ కీలకంగా మారుతున్నాయి. దీంతో ఏఐ ఎంఎల్ నిపుణులకు డిమాండ్ భారీగా పెరుగుతోంది.

తాజా నివేదికల అంచనా

- గత ఏడాది నియామకాల్లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఉద్యోగంగా మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్ ప్రొఫైల్ గుర్తింపు పొందింది.
- ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ విశ్లేషణ ప్రకారం-2030 నాటికి ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల స్థానంలో నూతన తరం సాంకేతికతలకు సంబంధించి 80 మిలియన్ల కొలువులు అందుబాటులోకి రానున్నాయి.
- వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా ప్రకారం-2025 చివరికి 97 మిలియన్ ఉద్యోగాలు ఏఐ-ఎంఎల్‌లో లభించనున్నాయి.

ఎన్‌ఎల్‌పీ.. ఎమర్జింగ్ స్కిల్

ఏఐ-ఎంఎల్‌లో అత్యంత డిమాండ్ నెలకొన్న స్కిల్‌గా.. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్(ఎన్‌ఎల్‌పీ) నిలుస్తోంది. ఏఐ అంటే.. మానవ ప్రమేయం లేకుండా మెషీన్లే స్వయంగా పనిచేసేలా చేయడం. దీంతో కంప్యూటర్స్, సాంకేతిక సిబ్బంది మధ్య ఇంటరాక్టివ్ టూల్‌గా ఉండే ఎన్‌ఎల్‌పీకి ప్రాధాన్యం పెరుగుతోంది. ఉదాహరణకు గూగుల్ ట్రాన్స్‌లేట్, ఓకే గూగుల్, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ విధానంలో ఆన్‌లైన్ ద్వారానే మనకు సమాచారం లభిస్తోంది. మైక్రోసాఫ్ట్ వర్డ్ ప్రాసెసర్‌లో ఏదైనా డాక్యుమెంట్‌కు సంబంధించి ఒక వాక్యాన్ని రూపొందిస్తున్నప్పుడు.. మనం స్పెల్లింగ్ తప్పుగా టైప్ చేసినా లేదా ఒక వాక్యంలో గ్రామర్ పొరపాట్లు ఉన్నా.. వాటంతటవే సరైనవిగా మారేలా వర్డ్ ప్రాసెసర్ ఉపయోగపడుతోంది. ఇది కూడా నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఆధారంగానే పనిచేస్తోంది. దీంతో సంస్థలు ఈ ఎన్‌ఎల్‌పీ వినియోగంపై ఆసక్తి చూపుతున్నాయి.

మెషీన్ లెర్నింగ్

ఇటీవల కాలంలో కొలువుల పరంగా తప్పనిసరి నైపుణ్యం..మెషీన్ లెర్నింగ్. వాస్తవానికి మెషీన్ లెర్నింగ్ అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అనుసంధాన విభాగం. డేటాను విశ్లేషించడం, ఆటోమేషన్ ఆధారిత సేవలందించే విధంగా కంప్యూటర్స్‌లో ముందస్తు ప్రోగ్రామింగ్ రూపొందించడం మెషీన్ లెర్నింగ్ ప్రత్యేకతగా పేర్కొనొచ్చు. మెషీన్ లెర్నింగ్‌కు అవసరమైన ప్రత్యేక అల్గారిథమ్స్‌ను రూపొందించి సిస్టమ్స్‌లో నిక్షిప్తం చేస్తారు. అదే విధంగా డేటాసైన్స్, డేటా మేనేజ్‌మెంట్, డేటా అనలిటిక్స్‌ల సమ్మిళితంగా మెషిన్ లెర్నింగ్ కార్యకలాపాలు ఉంటాయి. ఈ కార్యకలాపాలను నిర్వహించే నిపుణులకు ప్రస్తుతం డిమాండ్ నెలకొంది. మెషిన్ లెర్నింగ్ అభ్యర్థులు కంప్యూటర్ బేసిక్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ నైపుణ్యాలను పెంచుకోవాలి. వీటికి అవసరమైన విధంగా మ్యాథమెటికల్ స్కిల్స్, కంప్యుటేషనల్ స్కిల్స్, డేటా మోడలింగ్, సాఫ్ట్‌వేర్ డిజైన్, డెవలప్‌మెంట్‌పై పట్టు సాధిస్తే.. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్ పరంగా మరింత మెరుగ్గా రాణించే అవకాశం ఉంటుంది.

డీప్ లెర్నింగ్

ఏఐ-ఎంఎల్‌కు సంబంధించిన ఉప విభాగం.. డీప్ లెర్నింగ్. కంప్యూటర్స్‌లో నిర్దిష్టంగా ఒక డేటా ప్రక్రియను పూర్తి చేసే విధానమే.. డీప్ లెర్నింగ్. దీనిద్వారా చిత్రాలు, టెక్స్ట్, సౌండ్స్, ఇతర డేటాను గుర్తించి కచ్చితమైన అంచనాలు రూపొందించే అవకాశం లభిస్తుంది. హ్యూమన్ ఇంటెలిజెన్స్ అవసరమైన విభాగాల్లో సైతం డీప్ లెర్నింగ్ ద్వారా ఆయా పనులు ఆటోమేటిక్ టాస్క్ రూపంలో పూర్తి చేయొచ్చు. డిజిటల్ అసిస్టెన్స్, ఫ్రాడ్ డిటెక్షన్, ఆటోమేటిక్ ఫేషియల్ రికగ్నిషన్ వంటి కార్యకలాపాల్లో డీప్ లెర్నింగ్ ఉపయోగపడుతోంది.

జావా లాంగ్వేజ్

ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌లో అత్యంత కీలకమైంది.. జావా లాంగ్వేజ్. ఈ లాంగ్వేజ్ ద్వారా న్యూరల్ నెట్‌వర్క్స్, ఎన్‌ఎల్‌పీ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్‌ను సమర్థవంతంగా పూర్తి చేయొచ్చు. ముఖ్యంగా ఏఐ అల్గారిథమ్‌కు అనుగుణంగా కోడింగ్‌కు జావా ఎంతో అనుకూలమైంది. ప్రస్తుతం ఏఐలో డేటా ప్రాసెస్, డెసిషన్ మేకింగ్, ఇంటెలిజెంట్ చాట్‌బోట్స్ రూపకల్పనలో జావాపైనే ఆధారపడుతున్నారు. దీంతో.. ఈ లాంగ్వేజ్ నైపుణ్యాలున్న వారు ఏఐ-ఎంఎల్ విభాగంలో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

పైథాన్ కూడా

జనరల్ పర్పస్ కోడింగ్ లాంగ్వేజ్‌గా పైథాన్ ముందుంది. దీనికి ప్రధాన కారణం.. కోడింగ్‌తో పాటు ఇతర ప్రోగ్రామింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోణంలో ఇది సులభంగా ఉండడమే. ముఖ్యంగా బ్యాక్ ఎండ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, సిస్టమ్ స్క్రిప్ట్ రైటింగ్‌లో పైథాన్ ఉపయోగపడుతోంది. దీంతో పైథాన్ నైపుణ్యాలున్న వారికి అవకాశాలు మెరుగవుతున్నాయి.

టెన్సార్స్ ఫ్లో

ఏఐ టూల్స్‌లో భాగంగా కంపెనీలు వినియోగిస్తున్న మరో స్కిల్.. టెన్సార్స్ ఫ్లో. పైథాన్ కోడింగ్ ద్వారా రూపొందించిన ప్రోగ్రామ్స్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి న్యూమరికల్ కంప్యూటేషన్‌ను సులభంగా పూర్తి చేసి, మెషీన్ లెర్నింగ్ ప్రక్రియను పైథాన్-ఫ్రెండ్లీగా ఉంచేందుకు గూగుల్ రూపొందించిన టెన్సార్‌ఫ్లో వైపు కంపెనీలు దృష్టిసారిస్తున్నాయి.

కోడింగ్ స్కిల్స్

బీటెక్ విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ ప్రక్రియలో విజయం సాధించేందుకు కోడింగ్ స్కిల్స్ కీలకంగా మారుతున్నాయి. ప్రస్తుతం అత్యధిక శాతం ఐటీ కొలువులు కోడింగ్ ప్రొఫైల్‌లోనే ఉంటున్నాయి. పలు రిక్రూటింగ్, స్టాఫింగ్ సంస్థల అంచనా ప్రకారం-ఐటీ సంస్థల్లో దాదాపు 80 శాతం మేర కోడింగ్ ప్రొఫైల్స్‌లోనే నియామకాలు జరుగుతున్నాయి. తాజా సర్వే ప్రకారం-ఐటీ కొలువుల్లో మోస్ట్ డిమాండింగ్ స్కిల్‌గా కోడింగ్ నిలిచింది. కోడింగ్ అంటే.. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌ను వినియోగిస్తూ నిర్దిష్టంగా ఒక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడం. ఇది ఆయా సంస్థల అవసరాలకు తగినట్లుగా రూపొందుతుంది. కంప్యూటర్ ఆధారిత సేవలు విస్తృతం చేయడానికి కోడింగ్ ప్రధాన మార్గంగా నిలుస్తోంది. ఫలితంగా ప్రస్తుతం కోడింగ్ నిపుణులకు కంపెనీలు రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకుతున్నాయి.

లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్

ఏఐలో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ నైపుణ్యం ఎంతో కీలకంగా మారుతోంది. లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ అంటే.. పలు రకాల టాస్క్‌లను నిర్వహించడానికి నేచురల్ లాంగ్వేజ్‌ను అర్థం చేసుకోవడంగా చెప్పొచ్చు. దీనిద్వారా టెక్స్ట్ జనరేషన్, ట్రాన్స్‌లేషన్, ఆన్సరింగ్ కోడ్ జనరేషన్ వంటి వాటిని సులువుగా పూర్తి చేయొచ్చు. వీటిని చాట్ బాట్స్, కంటెంట్ క్రియేషన్, సెర్చ్ ఇంజన్స్‌లో విస్తృతంగా వినియోగిస్తున్నారు.

టెక్నికల్ డాక్యుమెంటేషన్

ఏఐ సహాయంతో టెక్నికల్ కంటెంట్‌ను రూపొందించడం, ఎడిటింగ్ చేయడం, నిర్వహణ, నాణ్యత పాటించడం వంటి టాస్క్‌లు పూర్తి చేయడంలో టెక్నికల్ డాక్యుమెంటేషన్ కీలకంగా నిలుస్తోంది. డాక్యుమెంట్స్‌ను క్రమబద్ధీకరించడం, రీడబులిటీని పెంచడం వంటి కార్యకలాపాలను సులువుగా నిర్వహించొచ్చు. యూజర్ మాన్యువల్స్, ట్రాన్స్‌లేషన్, కోడ్‌ను వినియోగించి డాక్యుమెంట్‌ను రూపొందించడం వంటివి తేలిగ్గా పూర్తి చేయొచ్చు.

పైటార్క్

పైటార్క్ అనేది ఒక ఓపెన్ సోర్స్ మెషీన్ లెర్నింగ్ ఫ్రేమ్‌వర్క్. పైథాన్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ఆధారంగా ఇది పని చేస్తుంది. డీప్ లెర్నింగ్ రీసెర్చ్‌కు సంబంధించి ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న లాంగ్వేజ్‌గా గుర్తింపు పొందుతోంది. టెన్సార్ ఫ్లో, పైథాన్ వంటి లాంగ్వేజ్‌ల మాదిరిగానే ఇది పని చేస్తుంది. టెస్లా ఆటో పైలట్‌లో సైతం పైటార్క్ సహాయంతోనే డీప్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారంటే దీని ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

ప్రాంప్ట్ ఇంజనీరింగ్

చాట్ జీపీటీ, గూగుల్ సెర్చ్‌లో కొన్ని సందర్భాల్లో మనం అడిగే ప్రశ్నలు లేదా సమాచార ఇన్‌పుట్ సరిగా లేకపోతే కచ్చితత్వంతో కూడిన సమాధానం అందదు. దీనికి పరిష్కారంగా తెరపైకి వచ్చిన సాంకేతికతే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్! వ్యక్తులు లేదా వినియోగదారులు ఏఐ టూల్స్ వినియోగించి అడిగే ప్రశ్నలకు కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చే విధంగా సదరు టూల్స్‌ను తీర్చిదిద్దడమే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ప్రత్యేకత.

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్ఏఎల్, కోరాపుట్ డివిజన్‌లో 208 అప్రెంటిస్‌లు

కోరాపుట్(ఒడిశా)లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 208.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్(టెక్నికల్) అప్రెంటిస్‌లు–28, గ్రాడ్యుయేట్ (నాన్ టెక్నికల్) అప్రెంటిస్‌లు–22, డిప్లొమా అప్రెంటిస్‌లు–158.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్–ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కెమికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్,డిగ్రీ,డిప్లొమాలో ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్(టెక్నికల్–నాన్ టెక్నికల్) అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.04.2025
» **శిక్షణ ప్రారంభతేది:** 01.06.2025.
» **వెబ్‌సైట్:** www.hal-india.co.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూలై 2025 సెషన్ వివిధ సబ్జెక్టులు/విభాగాల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **సబ్జెక్టులు:** ఫిజిక్స్, ఇంగ్లిష్, హిందీ, తెలుగు, అప్లైడ్ లాంగ్వేజెస్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, ఎడ్యుకేషన్, రీజనల్ స్టడీస్, ఫోక్ కల్చర్ స్టడీస్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2025
» **ప్రవేశ పరీక్షతేది:** 31.05.2025, 01.06.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 30.06.2025, 03.07.2025
» **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

మనూలో పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ.. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెగ్యులర్ విధానంలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, ఎల్ఎల్‌బీ పీజీ డిప్లొమా, సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. » **మనూ క్యాంపస్‌లు:** హైదరాబాద్, లక్నో, శ్రీనగర్, భోపాల్, దర్భంగా, అసన్‌సోల్, ఔరంగాబాద్, సంభాల్, నుహ్, బీదర్, బెంగళూరు, కటక్.

కోర్సుల వివరాలు

» **పీహెచ్‌డీ ప్రోగ్రామ్:** ఉర్దూ, అరబిక్, ఇంగ్లిష్, హిందీ, పర్షియన్, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, ఇస్లామిక్ స్టడీస్, హిస్టరీ, ఎకనామిక్స్, సోషియాలజీ, డెక్కన్ స్టడీస్, ఎడ్యుకేషన్ తదితరాలు.
» **పీజీ ప్రోగ్రామ్:** ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్), ఎంఈడీ, ఎల్ఎల్ఎం.
» **యూజీ ప్రోగ్రామ్:** బీటెక్(సీఎస్), బీటెక్(సీఎస్) లేటరల్ ఎంట్రీ, బీఈడీ, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్,ఎల్ఎల్‌బీ,బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్).
» **ప్రొఫెషనల్ డిప్లొమా:** డీఈఎల్ఈడీ, పాలిటెక్నిక్–డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్–సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రానిక్స్–ఎలక్ట్రానికల్, ఆటోమొబైల్, అప్పారెల్ టెక్నాలజీ అండ్ పాలిటెక్నిక్–డిప్లొమా లేటరల్ ఎంట్రీ.
» **సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌లు:** ఉర్దూ సర్టిఫికేట్ కోర్సు, ప్రొఫిషియన్సీ ఇన్ అరబిక్, పర్షియన్, పాష్తో, ఫ్రెంచ్, రష్యన్, తెలుగు, కశ్మీరీ, టర్కిష్.
» **అర్హత:** అభ్యర్థులు తప్పనిసరిగా ఉర్దూ ఒక సబ్జెక్టుగా లేదా పదో తరగతి /ఇంటర్ / గ్రాడ్యుయేషన్ స్థాయిలో లేదా మనూ ఆమోదించే విధంగా ఉర్దూతో తత్సమాన మదర్సా కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.05.2025
» **ప్రవేశ పరీక్షల తేదీలు:** 12,13 & 14.06.2025
» **వెబ్‌సైట్:** https://manuucoe.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

క్లుప్తంగా...

పోలీసులకు అభినందనలు

ప్రథమ స్థానంపై సీఎం హర్షం



సాక్షి, హైదరాబాద్: అత్యుత్తమ పని తీరుతో తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు సీఎం ఎ.రేవంత్‌రెడ్డి పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్–2025' ప్రకారం కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలలో పోలీసింగ్ విషయంలో.. తెలంగాణ తొలి స్థానంలో నిలిచింది. టాటా ట్రస్ట్ లాంటి ప్రఖ్యాత సంస్థ రూపొందించిన ఈ నివేదికలో గొప్ప గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసుల కృషికి దక్కిన గౌరవమని, ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. శాంతిభద్రతలు కాపాడటం, నేరాల నియంత్రణ, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసుల నమోదులో పారదర్శకత చూపడం ద్వారా పోలీసులు రాష్ట్రంలో శాంతి, న్యాయం నిలబెట్టడంలో విజయవంతమయ్యారని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని విజయాలను తెలంగాణ పోలీసులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

డ్రగ్స్‌తో మాజీ సీఎస్ కొడుకు పట్టివేత?

గచ్చిబౌలి (హైదరాబాద్): ఉత్తరాది రాష్ట్రానికి చెందిన ఒక మాజీ సీఎస్ కొడుకు డ్రగ్స్‌తో పట్టుబడినట్లు తెలిసింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్‌తో పట్టుబడగా, పోలీసులు గోప్యంగా ఉంచారని ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ అధికారులు ధ్రువీకరించడం లేదు. ఇటీవల కాలంలో ఐటీ కారిడార్‌లో డ్రగ్ కేసులు పెరిగిపోయాయి. పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు, టీనాబ్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు డ్రగ్స్ దందాపై దాడులు చేస్తున్నారు. సినీ ప్రముఖులు, వీఐపీల పిల్లలు డ్రగ్స్ కేసుల్లో ఉంటున్నారు. తాజాగా మాజీ సీఎస్ కొడుకు డ్రగ్ కేసులో పట్టుబడ్డాడా? లేదా? అనేది స్పష్టత రావలసి ఉంది.

కృతికా ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు రూ. 29.96 లక్షల జరిమానా

బోడుప్పల్‌లో రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్ట్‌పై రెరా కన్నెర్ర

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ పేరుతో ప్రజలను మోసం చేస్తూ, డబ్బులు వసూలు చేసిన కృతికా ఇన్‌ఫ్రా డెవలపర్స్‌పై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కఠినచర్యలు చేపట్టింది. హైదరాబాద్ శివార్లలోని బోడుప్పల్ గ్రామంలో 'శేషాద్రి సిల్వర్ ఓక్' పేరుతో ప్రాజెక్ట్ ప్రకటించి, రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ప్రకటనలు జారీ చేసి, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు నిర్ధారణ అయింది. డాక్టర్ శ్రీకాంత్, శశికాంత్, డి.గోపాల్, రాధాబుక్య సంబంధించిన ఈ సంస్థలు, లేని రిజిస్ట్రేషన్లు చూపించి, వినియోగదారుల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలుచేసినట్లు గుర్తించింది. డబ్బులు తీసుకున్న తర్వాత నిర్మాణాలు పూర్తి చేయకపోగా, వాటి ప్రస్తుత స్థితిగతులపై ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో రెరా విచారణ జరిపింది. ప్రాజెక్టును రెరాలో రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రకటనలు ఇవ్వడం, అమ్మకాలు చేయడం నిషిద్ధం. అయినప్పటికీ, ఈ సంస్థలు చట్టాన్ని ఉల్లంఘించడంతో రూ. 29.96 లక్షల జరిమానా విధించింది.

కేసు క్లియరెన్స్ రేట్.. 100%

తెలంగాణలోని న్యాయస్థానాల ఘనత

న్యాయవ్యవస్థ పనితీరులో రెండోస్థానం

మహిళా జడ్జీల్లో రాష్ట్రమే నంబర్ వన్

ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025లో వెల్లడి

సాక్షి, స్పెషల్ డెస్క్: నూటికి నూరు శాతం కేసులను పరిష్కరిస్తూ న్యాయవ్యవస్థ పనితీరులో తెలంగాణ ద్వితీయస్థానం సాధించింది. గతంలో 5వ స్థానంలో ఉండగా ఆ స్థానాన్ని మెరుగుపర్చుకుంది. వరుసగా మూడేళ్లుగా 100% కేసు క్లియరెన్స్ రేట్‌ను సాధిస్తోంది. ఈ వివరాలను ఇండియన్ జస్టిస్ రిపోర్ట్- 2025 తాజా నివేదికలో వెల్లడించింది. 2025 జనవరి నాటికి దేశంలో పెండింగ్ కేసుల సంఖ్య 5.1 కోట్లు దాటిందని.. జడ్జీల నియామకంలో జాప్యం, జనాభాకు సరిపడా న్యాయమూర్తులు లేకపోవడమే దీనికి ప్రధాన కారణాలని అభిప్రాయపడింది.

ఆన్‌లైన్ విచారణతో.. ▶ కరోనాతో వచ్చిన వర్చువల్ విచారణలు.. ఆ తర్వాత వచ్చిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల కారణంగా కేసుల విచారణ వేగం పుంజుకుంది. ఏటా నమోదవుతున్న కేసుల సంఖ్య ను మించి పిటిషన్లు పరిష్కరిస్తూ ముందుకెళ్తోంది. దీంతో హైకోర్టుతో పాటు సబార్డినేట్ కోర్టుల్లో కేసుల పరిష్కార రేటు మెరుగుపడింది.

జడ్జీలపై పనిభారం..

దేశవ్యాప్తంగా 2025లో హైకోర్టుల్లో మొత్తం మంజూరు చేసిన పోస్టుల్లో 33 శాతం జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నా యి. అత్యధికంగా అలహాబాద్, మధ్య ప్రదేశ్ హైకోర్టులో ఒక్కో న్యాయ మూర్తిపై 15 వేల కేసుల పని భారం ఉంది. తెలంగాణలో 42 మంది (32 శాశ్వత, 10 అదనపు) జడ్జీలకుగాను 30 మందే ఉన్నారు. సుమారు 30 శాతం (12 పోస్టులు) ఖాళీలున్నాయి. రాష్ట్ర జనాభా సుమారు 3.7 కోట్లుకాగా మంజూరు చేసిన పోస్టుల ప్రకారం ప్రతి 8.8 లక్షల మందికి ఒక హైకోర్టు జడ్జి ఉండాలి. కానీ ప్రస్తుతం ప్రతి 12.3 లక్షల మందికి ఒక జడ్జీ ఉన్నారు. తెలంగాణలో ఒక్కో న్యాయమూర్తిపై 4,000 కేసుల పనిభారం పడుతోంది. దేశవ్యాప్తంగా జిల్లా కోర్టుల్లో 21 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్కో న్యాయమూర్తిపై 2,200 కేసుల పనిభారం ఉంది. తెలంగాణలో 655 మంది జడ్జీలు ఉండాల్సి ఉండగా 440 మందే ఉన్నారు. సుమారు 215 పోస్టుల ఖాళీలున్నాయి.

మనమే నంబర్ వన్..

దేశంలోని జిల్లా కోర్టుల్లో మహిళా జడ్జీల ప్రాతినిధ్యం పెరిగింది. 2017లో వారి సంఖ్య 30 శాతం ఉండగా 2025లో 38.3 శాతానికి పెరిగింది. 55.3 శాతంతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. హైకోర్టుల్లో మహిళా జడ్జీల ప్రాతినిధ్యం దేశవ్యాప్తంగా 14 శాతం ఉండగా తెలంగాణలో అత్యధికంగా 33.3 శాతంగా ఉంది. దేశంలోని హైకోర్టులన్నింటిలోనూ ఒకే ఒక్క మహిళా ప్రధాన న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు.




అధ్యయనం జరిగిందిలా...

కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనీషియేటివ్, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ, టీఎస్–ప్రయాస్, హౌ ఇండియా లీవ్స్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్ లాంటి సంస్థల సహకారంతో టాటా ట్రస్టు ఈ అధ్యయనం నిర్వహించింది. 2019 నుంచి ఈ అధ్యయనం చేస్తోంది.

జనవరి 2025 నాటికి..

సుప్రీంకోర్టు జడ్జీలు సహా సిట్టింగ్ జడ్జీల సంఖ్య:	21,285
మొత్తంగా ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్య:	26,927
మంజూరు చేసిన సంఖ్యతో పోలిస్తే ఖాళీల శాతం:	15
2011 జనాభా లెక్కల ఆధారంగా ప్రతి 10 లక్షల మందికి రాజ్యసభ సూచించిన జడ్జీల సంఖ్య:	21
1987లో ఏర్పాటైన న్యాయ కమిషన్ ప్రతి 10 లక్షల జనాభాకు ఉండాలని సూచించిన జడ్జీల సంఖ్య:	50
ప్రస్తుతం దేశంలో ప్రతి 10 లక్షల మందికి ఉన్న జడ్జీల సంఖ్య:	15
అమెరికాలో ప్రతి 10 లక్షల మందికి ఉన్న జడ్జీల సంఖ్య:	150
యూరప్‌లో ఇదే సంఖ్య:	220



➤ కోర్టు స్థాయిలో విచారణ ప్రక్రియలను క్రమబద్ధీకరించాల్సిన అవసరాన్ని 1958లోనే 14వ లా కమిషన్ నివేదిక నొక్కిచెప్పింది. 1987లో న్యాయ మూర్తుల సంఖ్యను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని సూచించింది. 2009లో అన్ని స్థాయిల్లో కోర్టు సెలవులను తగ్గించాలని, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను వినియోగించుకోవాలని సిఫార్సు చేసింది. 2016లో కేంద్ర, సుప్రీంకోర్టు పరిశోధనలో 2040లో జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్య 80,000 వరకు పెరుగుతుందని, అయినా పెండింగ్ కేసుల భారం తప్పదని తేలింది. 2025 జనవరిలో హైకోర్టులు, జిల్లా కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య 5.1 కోట్లు దాటింది. పదేళ్లకుపైగా పెండింగ్ కేసులు 12%, 5–10 ఏళ్ల కేసులు 22% ఉన్నాయి. హైకోర్టుల్లో 61%, దిగువ కోర్టుల్లో 46% మూడేళ్ల కంటే ఎక్కువ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులున్నాయి.

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు: 82,000

దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో కేసు క్లియరెన్స్ రేటు (సీసీఆర్): 94%

100% సీసీఆర్ నమోదు చేసుకున్న రాష్ట్రాలు: 7

(తెలంగాణ, జార్ఖండ్, త్రిపుర, మద్రాస్, పంజాబ్-హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్. వరుసగా ఇది మూడోసారి)

అకాల మరణం.. అశ్విని పేరు శాశ్వతం

కొత్త శనగ వంగడానికి వ్యవసాయ శాస్త్రవేత్త అశ్విని పేరు పెట్టడంపై హర్షం

ఎక్కువ దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలు కనుక్కుంటానమ్మా అనేది అంటూ అశ్విని తల్లి భావోద్వేగం

కారేపల్లి/ గార్ల: అతిచిన్న వయసులోనే వ్యవసాయ పరిశోధనలో అద్భుత ప్రతిభ కనబరిచి, అకాల మరణం చెందిన తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) కొత్తగా ఆవిష్కరించిన 'పూస శనగ-4037'అనే వంగడానికి 'అశ్విని'పేరు పెట్టింది. ఈ నెల 14న ఢిల్లీలో ఐఏఆర్ఐ ఈ కొత్త రకాన్ని విడుదల చేసింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సరిహద్దు గ్రామమైన గంగారం తండాకు చెందిన నూనావత్ అశ్విని, హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తగా ఉద్యోగంలో చేరారు. గతేడాది సెప్టెంబర్ 1వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లో ఓ సెమినార్‌లో పాల్గొనేందుకు తండ్రి మోతీలాల్‌తో కలిసి స్వగ్రామం నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ సమీపంలో ఆకేరు వాగు వరద ప్రవాహంలో వారు ప్రయాణిస్తున్న కారు కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో మోతీలాల్‌తోపాటు అశ్విని కూడా దుర్మరణం చెందారు. ఆ సెమినార్‌లోనే అశ్విని అవార్డు అందుకోవాల్సి ఉంది.



అశ్విని ఫొటో పట్టుకుని రోదిస్తున్న తల్లి నేజా

అవార్డు అందుకోకుండానే అకాల మరణం చెందిన ఆమెకు గుర్తింపుగా కొత్త శనగ వంగడానికి అశ్విని పేరు పెట్టారు. అశ్వినికి గొప్ప గౌరవం లభించటంపై ఆమె కుటుంబ సభ్యులు, తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అశ్విని తల్లి నేజా 'సాక్షి'తో మాట్లాడుతూ.. కొత్త వంగడానికి తన బిడ్డ పేరు పెట్టడంతో ఆమె పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని చెప్పింది.'తక్కువ పెట్టుబడితో అత్యధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాలను కనుక్కుంటానమ్మా.. నా ఉద్యోగం అదే.. నన్ను వ్యవసాయ శాస్త్రవేత్త అంటారమ్మా అని నా బిడ్డ చెప్పింది' అని నేజా భావోద్వేగానికి గురైంది.

చదువుల తల్లి

అశ్విని చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేది. ఆమె 10వ తరగతి వరకు కారేపల్లిలో, ఇంటర్ విజయవాడలో పూర్తిచేసింది. అగ్రికల్చర్ బీఎస్సీ అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో చదివి బంగారు పతకం సాధించింది. ఆ తర్వాత ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసింది. రాయ్‌పూర్‌లో శాస్త్రవేత్తగా పనిచేసిన ఆమె.. గత ఏడాది సోదరుడి వివాహ నిశ్చితార్థం ఉండడంతో స్వగ్రామానికి వచ్చింది. అనంతరం తిరుగు ప్రయాణంలో ఆకేరు ప్రవాహంలో చిక్కుకుని తండ్రీకుమార్తె మృతి చెందారు.



చిన్న చెక్క వంతెనే అని తీసిపారేయొద్దు..!

చూడటానికి చాలా చిన్నగా ఉన్న ఈ పాతకాలపు చెక్క వంతెనకు పెద్ద చరిత్రే ఉంది. ఇది అట్లాంటి ఇట్లాంటి బ్రిడ్జ్ కాదు.. దీనిని దాటితే దేశం, భాషే కాదు.. సమయం కూడా మారిపోతుంది. ఇది ప్రపంచంలోనే ఉన్న అతి చిన్న అంతర్జాతీయ వంతెన. 19 అడుగుల పొడవు, 4.7 అడుగుల వెడల్పు ఉన్న ఈ బ్రిడ్జ్.. స్పెయిన్‌లోని ఈఐ మాక్రో, పోర్చుగల్‌లోని వర్జియా గ్రాండే అనే రెండు గ్రామాలను కలుపుతోంది. ఒకప్పుడు స్మగ్లర్లు తమ రవాణా అవసరాల కోసం చిన్నగా దీనిని ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడున్న ఈ వంతెనను 2008లో ప్రభుత్వ నిధులతో నిర్మించారు. ఈ వంతెనకు ఓ వైపు ఉన్న స్పెయిన్‌లో సెంట్రల్ యూరోపియన్ టైమ్ (సీఈటీ) అమల్లో ఉండగా.. మరోవైపు ఉన్న పోర్చుగల్ గ్రీన్‌విచ్ మీన్ టైమ్(జీఎంటీ)ని అనుసరిస్తోంది. ఈ రెండు టైమ్ జోన్ల మధ్య రెండు గంటల తేడా ఉంది. అంటే.. ఈ వంతెన దాటితే రెండు గంటలు ముందుకో, వెనుకకో వెళ్లిపోతాం అన్నమాట. అంటే.. కాలంలో ప్రయాణించినట్టే. వెడల్పు తక్కువగా ఉండటం.. పైగా చెక్క వంతెన కావడంతో దీనిపై పాదచారులు, సైక్లిస్టులు, బైకర్లు మాత్రమే వెళ్లగలరు. దీని ప్రత్యేకతల కారణంగా ఇది ఓ ప్రముఖ పర్యాటక ప్రదేశంగా మారిపోయింది. అది సరే.. రెండు దేశాలను కలిపే అంతర్జాతీయ వంతెన అంటున్నారు.. కానీ ఎక్కడా ఎలాంటి భద్రతా తనిఖీల వంటి హడావిడి కనిపించడంలేదేంటి అనే సందేహం వచ్చిందా? షెంగెన్ ఒప్పందం కారణంగా ఇక్కడి ప్రజలు ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా అంతర్గత సరిహద్దులు దాటి వెళ్లొచ్చు. యూరోపియన్ యూనియన్‌కు చెందిన 29 దేశాలు తమ ఉమ్మడి సరిహద్దుల్లో ఉన్న దాదాపు 46 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని షెంగెన్ ఏరియాగా నిర్దేశించుకున్నాయి. తద్వారా ఆ ప్రాంతంలోని అంతర్గత సరిహద్దుల్లో ఎలాంటి భద్రతా తనిఖీలు, వీసాలు లేకుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించే వెసులుబాటు కల్పించుకున్నాయి.

– సాక్షి, సెంట్రల్ డెస్క్



కలెక్టర్‌కు విన్నవించుకుంటున్న అమృతవ్వ

అయ్యా.. నా కొడుకులు తిండి పెడుతలేరు!

కలెక్టర్‌కు ఓ వృద్ధురాలి మొర

జన్నారం: 'అయ్యా.. నా పేరు అమృతవ్వ. భర్త పేరు లక్ష్మీరాజం. మాకిద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు. అందరికీ పెళ్లిళ్లు చేసినమ్. ఉన్న ఎకరం భూమిని కొడుకులకిచ్చినం. మాకోసం ఏం ఉంచుకోలేదు. ఇల్లు లేకపోవడంతో కిరాయికి ఉంటున్నం. పింఛన్ డబ్బులతో బతుకుతున్నం. ముసలితనంలో ఉన్న మమ్మల్ని కొడుకులు పట్టించుకుంటలేరు. కనీసం తిండి కూడా పెడ్తలేరు. మీరే మమ్మల్ని ఆదుకోవాలే అయ్యా.. మీకు దండం పెడుతా..' అంటూ మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని అక్కెపెల్లిగూడకు చెందిన మేడిశెట్టి అమృతవ్వ కలెక్టర్ కుమార్ దీపక్‌ను వేడుకున్నారు. భూభారతి చట్టం అవగాహన కార్యక్రమ నిమిత్తం కలెక్టర్ బుధవారం గ్రామానికి విచ్చేశారు. ఆయన తిరిగి వెళ్లే క్రమంలో ఆ వృద్ధురాలు అక్కడికి చేరుకుని కలెక్టర్‌కు చేతులు జోడించి వేడుకుంది. స్పందించిన కలెక్టర్ వివరాలు సేకరించి, ఆమె కొడుకులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీనివాస్‌రావును ఆదేశించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



గుట్ట కింద కార్మెల్‌గిరి పుణ్యక్షేత్రం



పాల్వంచలోని ఆర్‌సీఎం చర్చి ప్రాంగణం

40 రోజులు.. తపస్సు కాలం



ఎత్తయిన గుట్టపై ఉపవాస దీక్షలు జరిపే కార్మెల్ గిరి ప్రాంగణం

మార్చి 10 నుంచి ఏప్రిల్ 20 ఈస్టర్ వరకు..

సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9-30 మధ్య ఉపవాస ప్రార్థనలు

భారీగా తరలివస్తున్న క్రైస్తవులు

అర్థ శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతున్న పాల్వంచ ఆరోగ్య మాత చర్చి

పాల్వంచ: ఏసుక్రీస్తుకు శిలువ వేసిన 'గుడ్ ఫ్రై డే' క్రైస్తవులకు ఎంతో విశిష్టమైనది. దీనికి ముందు 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ 40 రోజుల విశిష్టతపై బైబిల్‌లో పలుచోట్ల రాసి ఉంటుంది. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఆరోగ్యమాత చర్చిలో ప్రత్యేక ఆరాధన మహోత్సవాలు (తపస్సు కాలం) నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు దివ్య బలిపూజ, ఆశీర్వాదం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అనంతరం అన్నదానం చేస్తున్నారు.

50 ఏళ్లు పూర్తి కావస్తున్న ఆర్‌సీఎం: పాల్వంచలోని ఆర్‌సీఎం చర్చి నిర్మాణం ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ చర్చి నిర్మించి ఈ ఏడాదితో 50 ఏళ్లు పూర్తి కావస్తుండగా.. అర్థ శతాబ్ది వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చిలో గోర్తిక్ ఆర్ట్ (కళ) అద్భుతంగా కనిపిస్తుంది. 1975 సెప్టెంబర్ 17న ఈ చర్చిని వరంగల్ బిషప్ ఎ.బెరెట్టా ప్రారంభించారు. అనంతరం అధునాతన రీతిలో పాత చర్చి స్థానంలో.. అప్పటి ఫాదర్ బెనడిక్ట్ సారథ్యంలో ఏడెకరాల స్థలంలో నూతన మందిరాన్ని నిర్మించారు. ఆలయ ఆవరణలో దేవదూతల విగ్రహాలు, మరియమ్మ, బాలఏసు, ఏసుక్రీస్తు ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. పద్నాలుగు గోపురాలపై ఏసుక్రీస్తు పుట్టుక నుంచి చివరి వరకు గల ముఖ్య ఘట్టాలు అందరికీ అర్థమయ్యేలా విగ్రహాలను ప్రతిష్ఠించారు. పార్క్ ప్రహరీపై గల జీసస్ చిత్రాలు కూడా ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

40 రోజుల ఉపవాస ప్రార్థనలు

ఏటా గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగల ముందు 40 రోజుల పాటు క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు చేస్తుంటారు. ఈ క్రమంలో కార్మెల్ గిరి గుట్టపై ఆరోగ్యమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తుంటారు. బుధ, శుక్ర, ఆదివారాల్లో గుట్ట కింద నుంచి పైవరకు శిలువ మార్గం ద్వారా వెళ్తారు. ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 11వ తేదీ రాత్రి కాల జాగరణ, రొట్టెల పండుగను నిర్వహించగా.. ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాశ్ దివ్యబలిపూజలో పాల్గొన్నారు. 13వ తేదీ ఆదివారం మట్టల పండుగ నిర్వహించారు.

ఆకట్టుకోనున్న శిలువ మార్గం

నలభై రోజుల ప్రార్థనల్లో భాగంగా ఈ నెల 18న గుడ్ ఫ్రైడే (పవిత్ర శుక్రవారం) రోజు ఆరోగ్య మాత చర్చిలో క్రీస్తు శ్రమల సంస్మరణ నిర్వహిస్తారు. అనంతరం జరిగే సజీవ శిలువ మార్గం కార్యక్రమానికి వేలాదిమంది భక్తులు రోడ్డుకు ఇరువైపులా బారులు దీరుతుంటారు. ఈనెల 20న ఈస్టర్ పండుగతో ఉపవాస దీక్షలు ముగుస్తాయి. ఈ దీక్షలతో ఆత్మ పరిశీలన, ఆధ్యాత్మిక జీవితం, జీవన విధానంలో మార్చుకోవలసిన విషయాలు అలవాటవుతాయని మత పెద్దలు చెబుతుంటారు.



గుట్టపై మత గురువుల ప్రార్థనలు

శ్రమల దినాలుగా ఉపవాసాలు



గుడ్ ఫ్రైడే మాసాన్ని పురస్కరించుకుని మార్చి 10 నుంచి ఏప్రిల్ 20 ఈస్టర్ వరకు శ్రమల దినాలుగా పాటిస్తూ ఉపవాసాలు చేస్తాం. ఈ క్రమంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో కార్మెల్ గిరి గుట్టపై సాయంత్రం వేళ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నాం. అనంతరం అన్నదానం ఉంటుంది. గుడ్ ఫ్రైడే రోజు సజీవ శిలువ మార్గం ఎంతో ఆకట్టుకుంటుంది. ఉపవాస ప్రార్థనలతో ప్రతి ఒక్కరిలో పరిపూర్ణ భక్తి భావాలు అలవడతాయి.

– విజయారావు, ఫాదర్, ఆర్‌సీఎం చర్చి, పాల్వంచ

టార్గెట్‌కు 'సై' అంటున్న 'నైనీ'

తొమ్మిదేళ్ల కల.. సాకారమైన వేళ

ఒడిశాలోని సింగరేణి నైనీ ప్రాజెక్టు ప్రారంభం

ఏటా 4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని: వార్షిక లక్ష్యం వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం దిశగా సింగరేణి అడుగులు వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా, ఈసారి నైనీబ్లాక్ ప్రారంభించడంతో 76 మిలియన్ టన్నులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మే 2016లో నైనీ బ్లాక్‌కు బీజం పడింది. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత బుధవారం నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ఆరంభమైంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చేతుల మీదుగా వర్చువల్ పద్ధతిన బొగ్గు ఉత్పత్తి ప్రారంభించారు. దీనిద్వారా భవిష్యత్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సంస్థ భావిస్తోంది. ప్రస్తుతం సింగరేణిలోని అతిపెద్ద గనిగా నైనీ బ్లాక్ రికార్డుకెక్కింది. సింగరేణి ఓసీపీల్లో ఒకటన్ను బొగ్గు వెలికి తీయడానికి ప్రస్తుతం 12 క్యూబిక్ మీటర్ల మట్టి (ఓబీ) వెలికితీస్తుండగా, నైనీ బ్లాక్‌లో టన్ను బొగ్గు తీయడానికి రెండున్నర క్యూబిక్ మీటర్ల మట్టి (ఓబీ) తొలగిస్తే సరిపోతుంది. నైనీ బ్లాక్ కోసం 2,255 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 1,935 ఎకరాలు అటవీశాఖది కాగా, మిగతా 320 ఎకరాలు ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సేకరించారు.

శరవేగంగా బొగ్గు ఉత్పత్తి

నైనీబ్లాక్ ప్రారంభంతో సింగరేణిలో ఉత్పత్తి ఊపందుకోనుంది. 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు, స్కిప్పింగ్ రేషియో తక్కువగా ఉన్న ఈ ప్రాజెక్టు నుంచి బొగ్గు వెలికితీసే పనులు శరవేగంగా సాగనున్నాయి. తక్కువ ఓబీతో బొగ్గు వస్తుండటంతో లాభాలు ఎక్కువగా రావడంతో పాటు బొగ్గు ఉత్పత్తి కూడా రెట్టింపుగా వస్తుందని భావిస్తున్నారు.

వంద మిలియన్ టన్నులు లక్ష్యం..

భవిష్యత్ అవసరాల దృష్ట్యా విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు అందించాలనే లక్ష్యంతో సింగరేణి ప్రణాళికలు రచిస్తోంది. నైనీ బ్లాక్‌లో 4 మిలియన్ టన్నుల నుంచి 10 మిలియన్ టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి పెంచాలని నిర్ణయించడంతోపాటు కొత్త ప్రాజెక్టుల ప్రారంభంపై యాజమాన్యం దృష్టి సారించింది.



ఒడిశాలోని నైనీ బ్లాక్ కార్యాలయం

లోక్‌సభలో తెలం'గానం'

పేరు	పార్టీ	లోక్‌సభ స్థానం	హాజరు శాతం	ప్రశ్నలు	చర్చలు	ప్రైవేట్ మెంబర్ బిల్లు
ఈటల రాజేందర్	బీజేపీ	మల్కాజిగిరి	91.17	80	9	0
చామల కిరణ్	కాంగ్రెస్	భువనగిరి	100	79	17	0
డీకే.అరుణ	బీజేపీ	మహబూబ్‌నగర్	88.23	73	14	0
అర్వింద్ ధర్మపురి	బీజేపీ	నిజామాబాద్	88.23	59	2	0
సురేశ్ షెట్కార్	కాంగ్రెస్	జహీరాబాద్	86.76	62	5	0
కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	బీజేపీ	చేవెళ్ల	95.58	18	6	0
మల్లు రవి	కాంగ్రెస్	నాగర్‌కర్నూల్	92.64	28	10	0
రఘురామ్ రెడ్డి	కాంగ్రెస్	ఖమ్మం	85.29	56	9	0
అసదుద్దీన్ ఒవైసీ	ఎంఐఎం	హైదరాబాద్	92.64	54	21	0
బలరాంనాయక్	కాంగ్రెస్	మహబూబాబాద్	72.05	13	3	0
రఘునందన్‌రావు	బీజేపీ	మెదక్	97.05	46	7	0
గోడం నగేశ్	బీజేపీ	ఆదిలాబాద్	92.64	40	4	0
గడ్డం వంశీకృష్ణ	కాంగ్రెస్	పెద్దపల్లి	89.70	31	7	0
కడియం కావ్య	కాంగ్రెస్	వరంగల్	83.82	31	5	0
కుందూరు రఘువీర్	కాంగ్రెస్	నల్లగొండ	72.05	8	0	0

కట్టెలుంటేనే కూడు




ఏజెన్సీలో ఇప్పటికీ వంటకు కట్టెలనే వాడుతున్నారు. గ్యాస్ వాడకం తెలియని వీరు.. అడవిలోని నీటి కాలువల సమీపంలో ఎండిన చెట్ల కొమ్మలను సేకరిస్తారు. ఇంటిల్లిపాదీ మోపులు కట్టి ఇంటికి తీసుకెళ్తుంటారు. ఒక్కసారి తీసుకెళ్తే.. వారం రోజులపాటు వంటకు సరిపోతాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో వలస వచ్చిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక ఆదివాసీ కుటుంబం.. ఇలా కట్టెలు మోసుకెళ్తూ కనిపించింది.

– గోవిందరావుపేట

మత్స్య సొసైటీకి రక్షణ ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట్ జిల్లా అక్బర్‌పేట్ భూంపల్లి మండలం ఖాజీపూర్ ప్రాథమిక మత్స్య సహకార సంఘం సభ్యులు చేపల వేటకు వెళ్లినప్పుడు.. రక్షణ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఖాజీపూర్ పరిధిలోని సుంకరపల్లి కుంట, మొండి కుంట, మామిడితోట కుంట సహా పలు కుంటల్లో చేపల వేటకు జిల్లా మత్స్యశాఖ అధికారి తమకు హక్కులు కల్పించినా.. కొందరు కావాలనే అడ్డుకుంటున్నారని ఖాజీపూర్ మత్స్య సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవిదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదనలు వినిపిస్తూ.. 1964 నాటి జీవో 98 ప్రకారం ముదిరాజ్, ముత్తరాశి, తెనుగు, బెస్త, గంగపుత్ర సహా 29 కులాలకు మాత్రమే చేపలు పట్టే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు అనుమతించినా.. స్థానికంగా వారి హక్కులను అడ్డుకుంటున్నారని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీస్, మత్స్యశాఖ అధికారులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేశారు.

ఘన చరిత్రకు గ్రహణం

పాలకుల నిర్లక్ష్యంతో మరుగునపడిన చరిత్ర

- ఉమ్మడి రాష్ట్రంలో కోటిలింగాలకు అన్యాయం
- పాలకులు దృష్టిసారిస్తే రాత మారనున్న శాతవాహన రాజధాని
- గొప్ప పర్యాటక కేంద్రంగా మారనున్న కోటిలింగాల
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని గతంలో కేసీఆర్ హామీ



మట్టికోటపై ఇటుకలతో నిర్మించిన కట్టడాల ఆనవాలు

వెల్గటూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీవ్ర వివక్షకు గురైన జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్ మండలంలోగల కోటిలింగాలకు స్వరాష్ట్రంలోనూ తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోటిలింగాలపై పాలకుల నిర్లక్ష్యంతో ఘన చరిత్ర కలిగిన శాతవాహన తొలి రాజధాని మహా నగరం మట్టిలో కలిసిపోతోంది. ప్రస్తుతం కోటిలింగాలకు మూడు వైపులా శ్రీపాద ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో చారిత్రక ప్రాంతం ఆనవాలు కోల్పోయి కనుమరుగు కానుంది. పాలకులు దృష్టిసారిస్తే దేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా వర్ధిల్లే అవకాశం ఉంది.

చరిత్రను వక్రీకరించిన ఆంధ్ర పాలకులు..

ఉమ్మడి కరీంనగర్.. ప్రస్తుత జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటిలింగాలను రాజధానిగా చేసుకొని సుమారు రెండు వేల ఏళ్ల క్రితం క్రీ.పూ. 230 నుంచి క్రీ.శ. 220 వరకు సుమారు 450 సంవత్సరాలు శాతవాహనులు పరిపాలించారు. 1979 నుంచి 1984 వరకు పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరిగిన తవ్వకాలలో శాతవాహన వంశ మూల పురుషుడు (చిముక) శ్రీముఖుని పేరుతో వందలాది సీసం, రాగి నాణేలు లభ్యం కావడంతో కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని నగరంగా చారిత్రక ఆధారాలు లభించాయి. పూర్తిగా తయారుకాని నాణేలు లభించడంతో, ఇక్కడే నాణేల ముద్రణాలయం కూడా ఉండేదని ఆధారాలు లభించాయి. అప్పటివరకు శాతవాహనుల తొలి రాజధాని ప్రాతిష్ఠానపురం (పైఠాన్), మలి రాజధాని ధాన్యకటకం (అమరావతి)గా వాదిస్తూ వచ్చారు. పాఠ్యపుస్తకాల్లోనూ, చరిత్ర పుస్తకాల్లోనూ ఇదే రాసుకున్నారు. తవ్వకాలు జరిగిన సుమారు 20 ఏళ్ల వరకు కోటిలింగాల తవ్వకాల రిపోర్టును ఉమ్మడి రాష్ట్ర పాలకులు బయటపెట్టలేదు. అలాగే తవ్వకాల్లో బయటపడిన నాణేలు, పనిముట్లు, మట్టి పాత్రలు, పూసలు, ఆభరణాలు, పురాతన వస్తువులు కొన్ని ఆర్కియాలజీ విభాగంలో, కొన్ని హైదరాబాద్ సెంట్రల్ మ్యూజియంలో, కరీంనగర్‌లోని మ్యూజియంలో చెట్టుకొకటి పుట్టకొకటిలాగా అపూర్వ సంపద మొత్తం తరలిపోయింది. నాగముచిలింద లాంటి అరుదైన శిల్పాలు నవ్యాంధ్ర రాజధాని అమరావతికి తరలించారు. ఘనకీర్తి కలిగిన కోటిలింగాల చరిత్రను వెలుగులోకి రానీయకుండా మరుగున పడేసి అమరావతిని శాతవాహన రాజధానిగా అభివృద్ధి చేసుకున్నారు. ఉమ్మడి పాలనలో వివక్షకు గురైన కోటిలింగాలను తెలంగాణ ఏర్పాటు తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌లు గొప్ప పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి.

పాలకులు పట్టించుకుంటే పర్యాటక కేంద్రంగా...

ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురైన కోటిలింగాల ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో మూడు వైపులా నీటితో నిండిపోయి, చరిత్ర ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. ఇక్కడి నుంచి తరలించిన చారిత్రక ఆనవాళ్లను, శిల్పాలను తిరిగి తీసుకువచ్చి మ్యూజియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. 2027వ సంవత్సరంలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి కోటిలింగాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, సరైన ప్రచారం కల్పిస్తే దేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుంది.



తవ్వకాలలో బయటపడిన శ్రీముఖుడి నాణేలు







ఇది మీనం, మత్స్యకారుల జీవన పోరాటం!!

సముద్రంలో చేపల వేట నిషేధం కావడంతో వాటి విక్రయాలు బాగా తగ్గిపోయాయి. దీంతో చెరువు చేపలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువులో చేపల వేట జోరందుకుంది. పెద్దచెరువులో మత్స్యకారులు తమ పొట్టకూటి కోసం ఓ వైపు చేపలు పడుతుంటే.. మరోవైపు అవి తమ ప్రాణాలను కాపాడుకునేందుకు.. చెంగుచెంగున ఎగురుతూ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తోన్న దృశ్యాలను 'సాక్షి' బంధించింది.

– డి.సత్యనారాయణమూర్తి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అనంతపురం నగరానికి చెందిన రంగనాథ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వయసు 32 ఏళ్లు. మూడేళ్ల క్రితం పెళ్లయింది. ఎందుకో అనుమానమొచ్చి ఇటీవల ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోగా షుగర్ ఉన్నట్లు తేలింది. దీంతో ఒక్కసారిగా అతను ఖిన్నుడయ్యాడు.

నగరానికి చెందిన మటన్ వ్యాపారి గౌస్‌మొహిద్దీన్‌కు 37 ఏళ్లు కూడా లేవు. ఇద్దరు పిల్లలున్నారు. సరైన వ్యాయామం లేక ఒత్తిడికి గురై బీపీ, షుగర్ రెండూ వచ్చాయి. ఇటీవల సరిగా నిద్రపట్టడం లేదని బాధితుడు వాపోతున్నాడు. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలో మధుమేహం, రక్తపోటు బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.



కలవరపెడుతున్న మధుమేహం

ఉమ్మడి అనంతలో చాపకింద నీరులా విస్తరిస్తున్న షుగర్ వ్యాధి

- 22 శాతానికి పైగా బాధితులు
- వందలో 28 మందికి రక్తపోటు
- అవగాహన లేక గ్రామీణులూ బాధితులవుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంత పురం జిల్లాలో మధుమేహ జబ్బు చాపకింద నీరులా విస్తరిస్తోంది. జనాభా పెరుగుదల రేటుతో పోల్చి చూస్తే డయాబెటిక్ బారిన పడుతున్న వారే ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. యువకులు సైతం జీవనశైలి జబ్బుల బారిన పడుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో 40 ఏళ్లు నిండిన వారిలో ఎక్కువగా ఆయా జబ్బుల బారిన పడేవారు. కానీ, ఇటీవల 30 ఏళ్లు దాటని వారూ వీటి కోరల్లో చిక్కుతున్నారు. ఈ విషయం వైద్యులను కూడా విస్మయానికి గురి చేస్తోంది.

గ్రామీణులూ బాధితులే..

మధుమేహం, రక్తపోటు తదితర జబ్బులతో బాధపడేవారు ఒకప్పుడు పట్టణాలు, నగరాల్లోనే ఎక్కువగా ఉండేవారు. పని ఒత్తిడితో సతమతమవడం కారణంగా వీటి బారిన పడేవారు. కానీ, ఇప్పుడు ఆయా రోగాలు పల్లెలకూ విస్తరించడం గమనార్హం. ఈ క్రమంలోనే డయాబెటిక్, బీపీ మందుల ధరలు పెరగడం సామాన్యులకు కొరకరాని కొయ్యగా మారింది.

అవగాహన లేకే..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) బాధితులు 27 శాతం పైగానే ఉన్నట్టు తేలింది. పట్టణాల్లో అయితే ఇది 30 నుంచి 32 శాతం కూడా ఉన్నట్టు తాజా సర్వేలో వెల్లడైంది. ఇక.. షుగర్, హైపర్‌టెన్షన్ జబ్బులు నియంత్రణలో లేనివారు ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో శరీరంలో ఇతర అవయవాలపై ప్రభావం పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జబ్బుల నియంత్రణపై అవగాహన లేకపోవడం అనర్థాలకు దారి తీస్తోంది.


ఉమ్మడి అనంత జిల్లాలో వివరాలిలా..



కేటగిరీ	శాతం
మధుమేహ బాధితులు	22.7
హైపర్ టెన్షన్ బాధితులు	27.4
రెండు జబ్బులతో ఉన్నవారు	19.1
ఉమ్మడి జిల్లా జనాభా	41,15,783
30 ఏళ్లు పైబడిన వారు	20,19,938
డయాబెటిక్ బాధితులు	4,64,585
హైపర్ టెన్షన్ బాధితులు	5,45,383
మందుల షాపులు	2,250
షుగర్, బీపీ మందుల విక్రయ వాటా	31 శాతం

సమస్యలెన్నో..

- షుగర్ నియంత్రణలో లేకుంటే కిడ్నీ సమస్యలు తలెత్తుతాయి.
- కంటిచూపుపై దుష్ప్రభావం పడుతుంది.
- శరీరంలో గాయాలైనప్పుడు మానడం చాలా కష్టం.
- మధుమేహం అదుపులో లేకపోతే గుండె జబ్బులొచ్చే అవకాశాలు ఎక్కువ.
- అధిక రక్తపోటు వల్ల బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.
- నరాల వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది.





అలవాట్లు మార్చుకోవాలి

మధుమేహం, హైపర్ టెన్షన్ ఉన్న వారు జాగ్రత్తలు తీసుకోవాలి. బాధితులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా లేని ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు. పొగ తాగడం చాలా ప్రమాదకరం.

–డా.సుధాకర్‌రెడ్డి, గుండె వైద్య నిపుణులు

ప్చ్.. ఇంటర్నెట్ సేవలు బాగోలేదు..!

బ్రాడ్‌బ్యాండ్, డీఎస్‌ఎల్ సేవల్లో 62 శాతం మందికి సమస్యలు
'లోకల్ సర్కిల్స్ సర్వే'లో వెల్లడి



సాక్షి, అమరావతి: ఉద్యోగం, విద్యా, వినోదం ఇలా వివిధ అవసరాల కోసం ఇళ్లకు బ్రాడ్ బ్యాండ్, ఫైబర్, డిజిట్–సబ్‌స్క్రైబర్ లైన్ (డీఎస్‌ఎల్) ఇంటర్నెట్ కనెక్షన్లు తీసుకోవడం సర్వసాధారణంగా మారింది. కాగా, ఆయా సంస్థలు అందిస్తున్న సేవలపై సగానికి పైగా వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లోకల్ సర్కిల్స్ సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశ వ్యాప్తంగా ఏకంగా 62% మంది తమ ఇంటర్నెట్ కనెక్షన్‌లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్వే స్పష్టం చేసింది. సర్వేలో వెల్లడైన కొన్ని ముఖ్యాంశాలు..

- ఇంటర్నెట్ కనెక్షన్‌లో అంతరాయం ఎదుర్కొంటున్నారా! అని 29,701 మందిని ప్రశ్నించగా 62 % మంది అవునని సమాధానం ఇచ్చారు.
- నెలలో ఎన్నిసార్లు ఇంటర్నెట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని 29,529 మందిని ఆరా తీయగా 37 శాతం మంది ప్రతి నెలా మూడు కంటే ఎక్కువ సార్లు అంతరాయం ఎదుర్కొంటున్నామని వెల్లడించారు. 36% మంది ఒకటి, రెండు సార్లు అంతరాయం ఉందని, మిగిలిన వారు సమస్యలు తలెత్తడం లేదని పేర్కొన్నారు.
- ఇంటర్నెట్ సరఫరాలో సమస్యలు వచ్చిన సందర్భాల్లో పరిష్కారానికి 24 గంటల కంటే ఎక్కువ సమయాన్ని సర్వీస్ ప్రొవైడర్లు తీసుకుంటున్నారని సర్వేలో తేలింది.
- వినియోగదారుల ఫిర్యాదులపై సర్వీస్ ప్రొవైడర్స్ స్పందనపై 29 వేల మందిని ఆరా తీశారు. కేవలం 43 శాతం మంది 24 గంటల్లో ఫిర్యాదులు పరిష్కరిస్తున్నారని అన్నారు. 35 శాతం మంది ఒకటి నుంచి మూడు రోజులు, మిగిలినవారు 4 నుంచి ఏడు, అంతకంటే ఎక్కువ రోజులు పడుతోందన్నారు.
- దాదాపు 66 శాతం మంది వినియోగదారులు మెరుగైన నాణ్యత, సేవ లేదా ధర కోసం ప్రత్యామ్నాయ ప్రొవైడర్‌కు మారడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.
- గతేడాది కూడా బ్రాడ్‌బ్యాండ్, ఫైబర్ నెట్, డీఎస్‌ఎల్ సేవలపై ఈ సంస్థ సర్వే చేసింది. అప్పట్లో సర్వీస్ ప్రొవైడర్ వాగ్దానం చేసిన వేగం కంటే తక్కువకు ఇంటర్నెట్ సరఫరా ఉంటోందని 66 శాతం మంది అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండటం లేదని 38 శాతం మంది అసహనం వ్యక్తం చేశారు.

మొత్తం 333 జిల్లాల్లో సర్వే

దేశవ్యాప్తంగా మొత్తం 333 జిల్లాల్లో ఫిక్స్‌డ్ లైన్ ఇంటర్నెట్ వినియోగదారుల నుంచి వచ్చిన 1.40 లక్షల సమాధానాల మదింపు ద్వారా సంస్థ సర్వే ఫలితాలను వెలువరించింది. సర్వేలో పాల్గొన్న వారిలో 62 శాతం మంది పురుషులుకాగా, 38 శాతం మహిళా వినియోగదారులు ఉన్నారు. వివిధ ప్రశ్నల రూపంలో వినియోగదారుల నుంచి సమాధానాలను స్వీకరించారు.

ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి చాన్సలర్‌గా మధుమూర్తి

- ప్రభుత్వ కార్యదర్శి పేరు లేకుండానే ఉత్తర్వులు జారీ
- సెక్షన్ ఆఫీసర్ సంతకంతో వెలువడిన జీవో

సాక్షి, అమరావతి: రాజీవ్‌గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) ఇన్‌చార్జి చాన్సలర్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో జారీచేసింది. గతంలో ఆర్జీయూకేటీ చాన్సలర్‌గా వ్యవహరించిన కేసీ రెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిలీవ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఆయన పదవీకాలం ముగియడానికి ఒకరోజు ముందుగా ప్రభుత్వం రిలీవ్ చేసింది. అనంతరం ఆర్జీయూకేటీలో పరిపాలన సజావుగా సాగేందుకు ఇన్‌చార్జి చాన్సలర్‌ను నియమిస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులు.. ప్రభుత్వ కార్యదర్శి (ఉన్నతవిద్య కార్యదర్శి) పేరుతో వెలువడాల్సి ఉండగా ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి చాన్సలర్ నియామకం మాత్రం సెక్షన్ ఆఫీసర్ గోవర్ధన్‌కుమార్ పేరుతో రావడం గమనార్హం. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతున్న నేపథ్యంలో ఉన్నతవిద్య కార్యదర్శి కోన శశిధర్ పేరు ఉత్తర్వుల్లో లేకపోవడంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే ఉన్నత విద్యామండలి అధికారాలను తగ్గించి.. వాటిని ఉన్నతవిద్య కమిషనరేట్ ఏర్పాటు చేసి అక్కడికి బదలాయించేలా అధికారులు పావులు కదుపుతుండటం, వీసీల నియామకాలకు సంబంధించి ఫైలు పెండింగ్‌లో పెట్టడం వంటి చర్యలకు తోడు తాజా ఉత్తర్వులు కార్యదర్శికి సంబంధం లేదన్నట్టు వెలువడటం ఉన్నత విద్యావ్యవస్థల్లో అంతరాన్ని స్పష్టం చేస్తోంది.

అమరావతికి భూములిచ్చిన రైతులు ఆందోళన చెందవద్దు

- రాజధానిపై కొందరు అపోహలు సృష్టిస్తున్నారు
- మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: రాజధాని కోసం భూములిచ్చిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రైతుల త్యాగంతోనే అమరావతి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధవారం మంత్రి వెలగపూడి సచివాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడారు. అమరావతి అంటే కేవలం మౌలిక వసతుల కల్పన మాత్రమే కాదని, జనాభా, యువతకు ఉద్యోగాల కల్పనకోసం స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు జరగాలన్నారు. రైతుల భూముల ధరలు పెరగాలన్నా పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలో కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి తెలిపారు.

విదేశీ పెట్టుబడిదారులు అమరావతికి రావాలంటే విమానయాన అనుసంధానం ఉండేలా ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని మంత్రి నారాయణ తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు 5 వేల ఎకరాల భూమి అవసరమని, అయితే దీనికోసం భూసేకరణ చేయాలా, ల్యాండ్ పూలింగ్ చేయాలా అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అమరావతిలో రూ.64 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించిందని, టెండర్లు పూర్తయి పనులూ ప్రారంభమయ్యాయన్నారు. ఏడాదిలోగా అధికారుల నివాస భవనాలు పూర్తి చేస్తామన్నారు. ఏడాదిన్నరలో ట్రంక్ రోడ్లు, రెండున్నరేళ్లలో లే అవుట్ రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ వివరించారు.



అపరిశుభ్రంగా ఐస్ తయారీ కేంద్రం

ఎండలు మండిపోతున్నాయి.. వేసవి తాపం భరించలేక చల్లటి పానీయాలతో గొంతు తడుపుకుంటున్నారు. అందులో చల్లని ఐస్ లేనిదే లోపలికి పోనంటోంది. ఈ తరుణంలో జ్యూస్ విక్రయాలు జోరందుకున్నాయి. ఫలితంగా ఐస్ గడ్డలకు భలే గిరాకీ వచ్చి పడింది. చిత్తూరు జిల్లాతో పాటు తమిళనాడు నుంచి ఐస్ గడ్డలు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. అయితే ఈ తయారీలో శుభ్రత ఎంత అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. అపరిశుభ్రత ఐస్ ముక్కలు ప్రజలకు అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయంటూ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐస్ తయారీ కేంద్రాలను పర్యవేక్షించే అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు చల్లటి పానీయాలతో అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు.

అనారోగ్యం కొంటున్నారు

అమ్మో..ఐస్ / చల్లని పానీయాలు.. ఐస్‌గడ్డ విక్రయాలు / తయారీలో కానరాని శుభ్రత / వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు / హెచ్చరికలు జారీ చేస్తున్న వైద్యనిపుణులు

కాణిపాకం : జిల్లాలో జ్యూస్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వీధికి రెండు నుంచి మూడు షాపులుంటాయి. వేసవి కాలం వస్తే రోడంతా చల్లటి జ్యూస్ షాపులు కిటకిటలాడుతుంటాయి. ఇంటి నుంచి బయటకొచ్చిన వారిలో 40 శాతం మంది వీటిని గబగబా తాగేస్తుంటారు. వీరంతా చల్లటి ఐస్ వేస్తే తప్ప ఆ జ్యూస్ ముట్టుకోవడం లేదు. ఇక వేసవి సీజన్‌లో జరిగే ప్రతి శుభకార్యంలోనూ ఈ చల్లటి ఐస్ ముక్కలు వేసి కలిపిన జ్యూస్‌లు విచ్చలవిడిగా ఇస్తుంటారు. ఈ ఐస్ గడ్డలు తయారు చేసే కేంద్రాలు చాలా చోట్ల అధ్వాన్నంగా కలుషిత నీటితో తయారీ చేస్తుంటారని, రోగాలు తప్పవని వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ఐస్ గడ్డ తయారీ కేంద్రాలు 40 దాకా ఉన్నాయి. ఒక్కో షాపు నుంచి రోజువారిగా సుమారు 500 కిలోలు అమ్ముడుపోతాయని అంచనా. ఈ లెక్కన జిల్లాలో 20 వేల కిలోల ఐస్ గడ్డలు అమ్ముడుపోతుంటాయి. దీనికి తోడు జిల్లా సరిహద్దు ప్రాంతాలకు తమిళనాడు నుంచి ఐస్ గడ్డలు విపరీతంగా సరఫరా అవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ఐస్ గడ్డల తయారీ సీజనల్ వ్యాపారమే అయినా తక్కువ పెట్టుబడి .. అధిక లాభాలున్నాయి. అయితే ఐస్ తయారీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. పరిశ్రమల శాఖ, ట్రేడ్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ బోర్డు, విద్యుత్ శాఖ ద్వారా వాణిజ్య విద్యుత్తు కనెక్షన్, పట్టణ ప్రణాళిక, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులుండాలి. చాలా చోట్ల ఈ రకమైన అనుమతులు లేవు. చాలా వరకు ఇళ్ల మధ్య, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు.

అపరిశుభ్రమైన ఐస్ వాడకంతో..

అపరిశుభ్రమైన ఐస్ వాడటం వల్ల అనారోగ్య సమస్యలు ముంచెత్తుతున్నాయి. విష జ్వరాలు, టైఫాయిడ్, దగ్గు దడ పుట్టిస్తున్నాయి. గొంతు నొప్పి, ఊపిరితిత్తుల సమస్యలు బాధేస్తున్నాయి. చిన్న పిల్లలకు గవద బిళ్లలు వచ్చే ప్రమాదం ఉంటుంది. రోటా, అడినో, హైపటైటిస్–ఏ వంటి వైరస్‌ల వల్ల ఊపిరితిత్తులు, పచ్చ కామెర్లు వస్తుంటాయి.

తుప్పు పట్టిన తయారీ కేంద్రాలు

మార్కెట్లో 2 రకాల ఐస్ దొరుకుతోంది. మొదటిది పారిశ్రామిక అవసరాల కోసం, రెండోది ఎడిబుల్ నిమిత్తం వినియోగించేది. మొదటి రకం చేపలు, మాంసాన్ని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచుకునేందుకు పండ్లు ఇతర వస్తువులు ఎగుమతి చేసేందుకు, ఆస్పత్రుల్లోని మార్చురీల్లో వినియోగిస్తారు. ఇక రెండో రకం దీన్ని కచ్చితంగా శుద్ధి చేసిన నీటితో పరిశుభ్రమైన వాతావరణంలోనే తయారు చేయాలి. దీన్ని పానీయాల్లో వాడితే ఎలాంటి ప్రమాదమూ ఉండదు. ఈ ఐస్ ధర ఎక్కువగా ఉండటంతో చల్లని పానీయాలు విక్రయించే వ్యాపారులు తక్కువగా ధరకు దొరికే మొదటి రకం ఐస్‌ను వాడుతున్నారు. ఐస్ క్యూబ్స్ అచ్చులు తయారీకి ఇనుప రేకు డబ్బాలు వినియోగిస్తున్నారు. ఇవి తుప్పు పట్టి..ముక్కలు ఊడిపోతున్నాయి.

హోమ్ ట్రయాంగిల్ సేవలు విజయవంతం

మెప్మా ఎండీ తేజ్ భరత్

సాక్షి, అమరావతి: పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల కుటుంబాలకు సుస్థిర జీవనోపాధికి మెప్మా అందించిన ఉపాధి శిక్షణ విజయవంతమైందని మెప్మా ఎండీ తేజ్ భరత్ తెలిపారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) ద్వారా 12500 మందికి ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, ప్లంబర్, కార్పెంటర్, గృహోపకరణాలతోపాటు పలు విభాగాల్లో శిక్షణ అందించామన్నారు.శిక్షణ పొందినవారి వివరాలను హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేశామన్నారు. దీని ద్వారా గృహ అవసరాలకు సంబంధించి నాణ్యమైన సేవలు వీరు ఇంటివద్దకే వచ్చి అందిస్తారని పేర్కొన్నారు.

'టీచర్ల అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి'



సాక్షి, అమరావతి: కొన్నేళ్లుగా అంతర్ జిల్లా బదిలీలు జరగక ఉపాధ్యాయ దంపతులు, కుటుంబాలు మనోవేదనతో ఉన్నాయని, వారికోసం వెంటనే అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్‌ను కోరారు. తాము బుధవారం సచివాలయంలో కార్యదర్శిని కలిసి ఈమేరకు వినతిపత్రం ఇచ్చినట్లు వారు తెలిపారు.

బిజినెస్ రీల్

వీ-మార్ట్ 500వ స్టోర్ ప్రారంభం



న్యూఢిల్లీ: వ్యాపార విస్తరణ, స్థిరమైన వృద్ధిలో భాగంగా వీ-మార్ట్ రిటైల్ లిమిటెడ్ 500వ స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఎండీ లలిత్ అగర్వాల్ మాట్లాడుతూ.. సిబ్బంది అంకితభావమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. దేశంలో అందరికీ నాణ్యమైన ఫ్యాషన్‌ను అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. వీ-మార్ట్ గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 62 స్టోర్లను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 300 నగరాల్లో స్టోర్లను, 43 లక్షల చదరపు అడుగుల రిటైల్ స్పేస్ కలిగి ఉంది. ఇప్పటి వరకు 100 మిలియన్ కస్టమర్లకు సేవలు అందించింది.

1.29 కోట్లకు 'గ్రో' ఖాతాలు



న్యూఢిల్లీ: బ్రోకరేజి ప్లాట్‌ఫాం గ్రో యాక్టివ్ డీమ్యాట్ ఖాతాల సంఖ్య ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి 36 శాతం వృద్ధి చెంది 1.29 కోట్లకు చేరింది. గతేడాది ఇదే వ్యవధిలో ఖాతాల సంఖ్య 95 లక్షలుగా నమోదైంది. తాజాగా సంస్థ మార్కెట్ వాటా 23.28 శాతం నుంచి 26.26 శాతానికి పెరిగింది. సమీక్షాకాలంలో ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఎక్స్ఛేంజీలో కొత్తగా 84 లక్షల యాక్టివ్ డీమ్యాట్ ఖాతాలు జతయి మొత్తం యాక్టివ్ డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లకు చేరింది. అటు రెండో అతి పెద్ద బ్రోకరేజీ సంస్థ జీరోధా ఖాతాల సంఖ్య 5.8 లక్షలు పెరిగి 78.8 లక్షలకు పెరిగింది.

లీడర్‌షిప్ నైపుణ్యాల్లో ఆరోహ శిక్షణ సేవలు



హైదరాబాద్: కంపెనీల్లో నాయకత్వ సామర్థ్యాల మదింపు, లీడర్‌షిప్ నైపుణ్యాల్లో శిక్షణ తదితర సేవలు అందించే దిశగా ఆరోహ సంస్థ ఏర్పాటైంది. మైక్రోసాఫ్ట్ మాజీ ఎగ్జిక్యూటివ్‌లైన కల్పన సిన్హా, హరిత కందుళ్ల, అప్‌గ్రాడ్ మాజీ ఇన్‌సైట్స్ ఇండియా హెడ్ కేతకి కడేకర్ సహ-వ్యవస్థాపకులుగా ఈ కన్సల్టింగ్ సంస్థను నెలకొల్పారు. ఆరోహ నిర్వహించిన ఇండియా బిజినెస్ లీడర్స్ సర్వే 2025 ప్రకారం వ్యాపార సంస్థలకు ప్రతిభావంతులైన ఉద్యోగుల లభ్యత పెద్ద సవాలుగా ఉంటోంది. అలాగే, వారు వేరే సంస్థకు వెళ్లిపోకుండా కాపాడుకోవడం, టెక్నాలజీ వినియోగం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కంపెనీ సంస్కృతిని తీర్చిదిద్దుకోవడం వంటివి ఇతరత్రా సవాళ్లుగా ఉంటున్నట్లు కల్పన తెలిపారు.

బోర్డు సమావేశాలు

ఇన్ఫోసిస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, అదానీ పోర్ట్స్, టాటా ఎలెక్సి, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, లాయిడ్స్ ఇంజినీరింగ్ వర్క్స్, మహీంద్రా ఈపీసీ, ఓమ్నిటెక్స్ ఇండస్ట్రీస్, స్వదేశీ ఇండస్ట్రీస్-లీజింగ్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-4-2025

విశాఖ	425-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	785.5	6.74
AXISBANK	1,161.00	4.33
ONGC	240.84	3.5
TRENT	5,042.00	3.38
ADANIPORTS	1,235.50	2.04

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	11,665.00	-1.6
HINDALCO	609.65	-1.29
TATAMOTORS	616.1	-0.98
INFY	1,412.20	-0.97
NTPC	359.35	-0.87

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,360
ఎన్ఎస్ఈ	92,100
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,82,090
ఎఫ్ఐఐ	+ 3936
డీఐఐ	- 2,513

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.22 (రాత్రి 11.30కు)	$ 61.33 (క్రితం ముగింపు)
బ్రెంట్	65.63 (రాత్రి 11.30కు)	$ 64.67 (క్రితం ముగింపు)

అమ్మో రుణమా..!

ఆచితూచి రుణాల మంజూరు

- బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల్లో అప్రమత్తత
- గతేడాది పండుగ సీజన్‌లో తగ్గుముఖం
- క్రిఫ్ హైమార్క్ విశ్లేషణలో వెల్లడి



ముంబై: గతేడాది పండుగల కాలంలో (సీజన్) రుణ వితరణ పట్ల బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు అప్రమత్త ధోరణితో వ్యవహరించాయి. వ్యక్తిగత, క్రెడిట్ కార్డు సహా అన్‌సెక్యూర్డ్ విషయంలో దూకుడు వద్దంటూ ఆర్‌బీఐ చేసిన హెచ్చరికలతో ఈ పరిస్థితి నెలకొంది. 2024-25 మూడో త్రైమాసికంలో(2024 అక్టోబర్-డిసెంబర్) వినియోగ రుణాల తీరును పరిశీలించినట్టయితే స్కీపట్ల స్పృహతో, బాధ్యతాయుతంగా రుణదాతలు వ్యవహరించినట్టు తెలుస్తోందని క్రిఫ్ హైమార్క్ చైర్మన్ సచిన్ సేత్ తెలిపారు. గత కొన్ని త్రైమాసికాలుగా వినియోగం విషయమై ఆందోళనలు నెలకొన్న విషయాన్ని గుర్తు చేశారు. గతేడాది పండుగ సీజన్‌లో గృహ రుణాలు (రుణాల్లో అతిపెద్ద విభాగం) విలువ పరంగా 0.1 శాతం పెరిగినట్టు కనిపించినప్పటికీ.. సంఖ్యా పరంగా 7 శాతం క్షీణించడాన్ని క్రిఫ్ హైమార్క్ నివేదిక ప్రస్తావించింది. అలాగే, వ్యక్తిగత రుణాలు 6.7 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ రుణాలు 1.9 శాతం చొప్పున (సంఖ్యా పరంగా) తగ్గాయి. ఆటో రుణాలు, ద్విచక్ర వాహన రుణాల్లో ఎలాంటి వృద్ధి నమోదు కాలేదు. వ్యవస్థలో నగదు లభ్యత కఠినంగా మారడం, గృహాల రుణ భారం అధికం కావడం, ఆర్‌బీఐ కఠిన నిబంధనలు ఈ పరిస్థితికి దారితీసినట్టు ఈ నివేదిక వివరించింది.

వినియోగదారుల్లోనూ ఉత్సాహం కరువు..

పండుగల సీజన్‌లో మొదటిసారి కస్టమర్లకు రుణాల జారీలోనూ క్షీణత కనిపించినట్టు క్రిఫ్‌హై మార్క్ నివేదిక తెలిపింది. ఇది కూడా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల్లో అప్రమత్త ధోరణికి నిదర్శనమని పేర్కొంది. వడ్డీ రేట్లు భారంగా మారడం, అన్‌సెక్యూర్డ్ రుణాల్లో రిస్క్ వెయిటేజీ పెంపు నిబంధనల నేపథ్యంలో రుణ గ్రహీతల్లోనూ ఉత్సాహం లోపించినట్టు వెల్లడించింది. ప్రీమియం రుణ గ్రహీతలు రుణాలతో ఆస్తులు సమకూర్చుకుంటుంటే.. ఇతర రుణ గ్రహీతలు వినియోగం కోసం రుణాలపై ఆధారపడుతున్నారన్న ఆర్‌బీఐ స్థిరత్వ నివేదికను సైతం ప్రస్తావించింది.

కార్ల అమ్మకాలకు 'యుటిలిటీ' దన్ను

- 2024-25లో 43 లక్షల హోల్‌సేల్ విక్రయాలు
- వివిధ కేటగిరీల వాహనాల మొత్తం అమ్మకాలు 7 శాతం అప్
- సియామ్ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: యుటిలిటీ వాహనాల దన్నుతో గత ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్ వెహికల్స్ హోల్‌సేల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో 43 లక్షల యూనిట్లకు చేరాయి. ఇందులో యుటిలిటీ వాహనాల వాటా 65 శాతంగా ఉన్నట్లు పరిశ్రమ సమాఖ్య సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం కంపెనీల నుంచి డీలర్లకు వాహనాల సరఫరా గతేడాదితో పోలిస్తే 2 శాతం పెరిగి 43,01,848 యూనిట్లకు చేరింది. 2023-24లో ఇది 42,18,750 యూనిట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అధిక బేస్ ఎఫెక్ట్ కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి నామమాత్రంగానే ఉన్నట్లు సియామ్ పేర్కొంది. మొత్తం మీద భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ దేశీయ అమ్మకాలు 7.3%, ఎగుమతులు 19.2 శాతం వృద్ధి చెందాయి.

'డిమాండ్ మెరుగుపడటం, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెరగడం, ప్రభుత్వ సానుకూల విధానాలు, పర్యావరణహిత మొబిలిటీకి ప్రాధాన్యమిస్తుండటం వంటి అంశాలతో గత ఆర్థిక సంవత్సరంలో దేశీ ఆటోమొబైల్ పరిశ్రమ నిలకడగా రాణించింది. అధిక బేస్ ఎఫెక్ట్ కారణంగా ప్యాసింజర్, త్రిచక్ర వాహనాల అమ్మకాల వృద్ధి ఒక మోస్తరు స్థాయికే పరిమితమైనప్పటికీ, ఆయా కేటగిరీల్లో ఆల్-టైమ్ గరిష్టాలు నమోదయ్యాయి. ద్విచక్ర వాహనాల అమ్మకాలు కూడా పటిష్టంగా పెరిగాయి' అని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర తెలిపారు. వ్యక్తిగత ఆదాయ పన్నులపరమైన సంస్కరణలు, కీలక వడ్డీ రేట్ల తగ్గింపు, స్థిరమైన పాలసీలు మొదలైనవి ఆటో అమ్మకాలకు ఊతమివ్వగలవని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇతర వివరాలు..

- మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాల్లో యుటిలిటీ వాహనాల వాటా 60 శాతం నుంచి 65 శాతానికి పెరిగింది. సంఖ్యాపరంగా చూస్తే 25,20,691 యూనిట్ల నుంచి 27,97,229 యూనిట్లకు చేరాయి.
- ఇతరత్రా ప్యాసింజర్ కార్ల సెగ్మెంట్లో అమ్మకాలు 13 శాతం నెమ్మదించి 15,48,947 యూనిట్ల నుంచి 13,53,287 యూనిట్లకు తగ్గాయి.
- ద్విచక్ర వాహనాల హోల్‌సేల్ అమ్మకాలు 9 శాతం వృద్ధితో 1,79,74,365 యూనిట్ల నుంచి 1,96,07,332 యూనిట్లకు చేరాయి. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్, వినియోగదారుల్లో విశ్వాసం మెరుగుపడటంతో ఈ సెగ్మెంట్ పుంజుకుంటోంది. టూవీలర్ల సెగ్మెంట్‌లో అమ్మకాలకు స్కూటర్లు సారథ్యం వహించాయి. మెరుగైన ఫీచర్లతో కొత్త మోడల్స్ రావడం కూడా ఇందుకు దోహదపడింది.
- ద్విచక్రవాహనాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 6 శాతం మార్కును దాటింది. టూవీలర్ల ఎగుమతులు 21 శాతం పెరిగాయి.
- వాణిజ్య వాహనాల విక్రయాలు 9,68,770 యూనిట్ల నుంచి 9,56,671కు తగ్గాయి.
- త్రిచక్ర వాహనాల అమ్మకాలు 7 శాతం పెరిగి 6,94,801 యూనిట్ల నుంచి 7,41,420 యూనిట్లకు చేరాయి.
- గత ఆర్థిక సంవత్సరంలో వివిధ కేటగిరీలవ్యాప్తంగా వాహనాల అమ్మకాలు 7 శాతం పెరిగి 2,38,57,411 యూనిట్ల నుంచి 2,56,07,391 యూనిట్లకు చేరాయి.
- మార్చి నెలలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 4 శాతం వృద్ధి చెంది 3,81,358 యూనిట్లకు పెరిగాయి.
- టూ-వీలర్ల అమ్మకాలు వార్షికంగా 11 శాతం పెరిగి 16,56,939 యూనిట్లకు, త్రీ-వీలర్ల విక్రయాలు 10 శాతం వృద్ధితో 62,813 యూనిట్లకు చేరాయి.

గురుగ్రామ్‌లో ట్రంప్ హౌసింగ్ ప్రాజెక్ట్

రూ. 2,200 కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: 'ట్రంప్' బ్రాండ్ కింద గురుగ్రామ్‌లో అల్ట్రా-లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ నిర్మించనున్నట్లు రియల్టీ సంస్థలు ఎం3ఎం గ్రూప్ సంస్థ స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్, ట్రిబెకా డెవలపర్స్ వెల్లడించాయి. దీనిపై రూ. 2,200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపాయి. ఈ ప్రాజెక్టులో 12 లక్షల చ.అ.లతో 288 యూనిట్లను విక్రయించనున్నారు. ఇది అయిదేళ్లలో పూర్తవుతుందని, సుమారు రూ. 3,500 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నట్లు స్మార్ట్‌వరల్డ్ డెవలపర్స్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్ తెలిపారు. చ.అ.కు రూ. 27,000 రేటుతో, ఒక్కొక్క అపార్ట్‌మెంట్ ధర రూ. 8 కోట్ల నుంచి రూ. 12 కోట్ల వరకు ఉంటుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రాండ్‌కి ఆ దేశం వెలుపల భారత్ అతి పెద్ద రియల్టీ మార్కెట్‌గా మారింది. భారత్‌లో ట్రంప్ బ్రాండ్‌కి ట్రిబెకా డెవలపర్స్ సంస్థ అధికారిక ప్రతినిధిగా వ్యవహరిస్తోంది. ట్రంప్ ఈ ఏడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగా, ఈ ఒప్పందం 6-8 నెలల క్రితమే కుదిరినట్లు ట్రిబెకా తెలిపింది.

చైనాతో వాణిజ్య లోటు @ 99 బిలియన్ డాలర్లు

- వరుసగా 4వ ఏడాది పెద్ద భాగస్వామిగా అమెరికా
- వాణిజ్య శాఖ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: అమెరికా వరుసగా నాలుగో ఏడాదీ భారత్‌కు అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 131.84 కోట్లుగా నమోదైంది. మరోవైపు, చైనాతో భారత్ వాణిజ్య లోటు సుమారు 17 శాతం పెరిగి 99.2 బిలియన్ డాలర్లకు ఎగిసింది. 2024-25లో చైనాకు భారత్ ఎగుమతులు 14.5 శాతం తగ్గి 14.25 బిలియన్ డాలర్లుగా ఉండగా దిగుమతులు 11.52 శాతం వృద్ధి చెంది 113.45 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2023-24లో ఎగుమతులు 16.66 బిలియన్ డాలర్లు కాగా దిగుమతులు 101.73 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 127.7 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో భారత్‌కు రెండో అతి పెద్ద భాగస్వామిగా చైనా నిల్చింది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం 2013-14 నుంచి 2017-18 వరకు, ఆ తర్వాత 2020-21లోను భారత్‌కు చైనా అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిల్చింది. ఎలక్ట్రానిక్స్, ఈవీ బ్యాటరీలు, సోలార్ సెల్స్, కీలకమైన పారిశ్రామిక ముడివస్తువుల విషయంలో భారత సరఫరా వ్యవస్థలపై చైనా ఆధిపత్యం కొనసాగుతోందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. కీలకమైన మొత్తం ఎనిమిది పారిశ్రామికోత్పత్తుల కేటగిరీల్లోనూ చైనా టాప్ సరఫరాదారుగా ఉంటోందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు చైనాకు మన ఎగుమతులు పడిపోవడమనేది ఆందోళనకర అంశమని, పోటీపరమైన సంక్షోభ పరిస్థితిని ఇది సూచిస్తోందని శ్రీవాస్తవ వివరించారు. తయారీ అంతరాలను భర్తీ చేసుకుని, పారిశ్రామిక సామర్థ్యాలను భారత్ పెంచుకోకపోతే చైనాపై మనం ఆధారపడటంతో పాటు వాణిజ్య లోటు కూడా మరింతగా పెరుగుతుందని పేర్కొన్నారు.

అమెరికాతో వాణిజ్య గణాంకాలు ..

- 2024-25లో అమెరికాతో వాణిజ్య మిగులు 35.32 బిలియన్ డాలర్ల నుంచి 41.8 బిలియన్ డాలర్లకు పెరిగింది. డ్రగ్ ఫార్ములేషన్లు..బయోలాజికల్స్ (8.1 బిలియన్ డాలర్లు), టెలికం పరికరాలు (6.5 బిలియన్ డాలర్లు), విలువైన స్టోన్స్ (5.3 బిలియన్ డాలర్లు), పెట్రోలియం ఉత్పత్తులు (4.1 బిలియన్ డాలర్లు), పసిడి.. ఇతరత్రా విలువైన లోహ ఆభరణాలు (3.2 బిలియన్ డాలర్లు), రెడీమేడ్ కాటన్ దుస్తులు .. యాక్సెసరీలు (2.8 బిలియన్ డాలర్లు), ఇనుము..ఉక్కు (2.7 బిలియన్ డాలర్లు) మొదలైన వాటిని భారత్ ఎగుమతి చేసింది.
- అమెరికా నుంచి భారత్ క్రూడాయిల్ (4.5 బిలియన్ డాలర్ల విలువ), పెట్రోలియం ఉత్పత్తులు (3.6 బిలియన్ డాలర్లు), బొగ్గు.. కోక్ (3.4 బిలియన్ డాలర్లు), కట్..పాలిష్డ్ డైమండ్స్ (2.6 బిలియన్ డాలర్లు), ఎలక్ట్రిక్ యంత్రపరికరాలు (1.4 బిలియన్ డాలర్లు), విమానాలు.. స్పేస్ క్రాఫ్ట్.. విడిభాగాలు (1.3 బిలియన్ డాలర్లు), బంగారం (1.3 బిలియన్ డాలర్లు) దిగుమతి చేసుకుంది. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేరుతుందనే అంచనాలు ఉన్నాయి.

నెలవారీ సిప్‌లు రూ.40,000 కోట్లు

- రెండేళ్లలో చేరుకుంటాయ్
- దీర్ఘకాలంలో మెరుగైన పనితీరు
- యూనియన్ ఏఎంసీ సీఈవో నాయర్



న్యూఢిల్లీ: నెలవారీ క్రమానుగత పెట్టుబడులు (సిప్) వచ్చే 18-24 నెలల్లో రూ.40,000 కోట్లకు పెరగనున్నట్టు యూనియన్ ఏఎంసీ సీఈవో మధు నాయర్ అంచనా వేస్తున్నారు. ఖర్చు చేసే ఆదాయంలో పెరుగుదల, క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాల పెట్టుబడుల పట్ల ఇన్వెస్టర్లలో అవగాహన విస్తృతం అవుతుండడం సిప్ పెట్టుబడులను ఇతోధికం చేస్తుందన్నది ఆయన విశ్లేషణ. ఈ ఏడాది మార్చి నెలలో సిప్ రూపంలో ఈక్విటీ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.25,925 కోట్లుగా ఉంటే.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ సగటు సిప్ పెట్టుబడులు రూ.24,113 కోట్లకు పెరగడం గమనార్హం. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇవి నెలవారీ రూ.16,602 కోట్లుగా ఉన్నాయి. ఫండ్స్ నిర్వహణలోని మొత్తం సిప్ పెట్టుబడులు 2024 మార్చి నాటికి ఉన్న రూ.10.71 లక్షల కోట్ల నుంచి 2025 మార్చి నాటికి రూ.13.31 లక్షల కోట్లకు వృద్ధి చెందాయి. బడ్జెట్‌లో ప్రకటించిన పన్ను ప్రయోజనాలు, మార్కెట్ విలువలు ఆకర్షణీయంగా మారడం సిప్ పెట్టుబడులను పెంచేందుకు సానుకూలిస్తాయని నాయర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు యూనియన్ మ్యూచువల్ ఫండ్ తన తాజా త్రైమాసికం నివేదికలో భారత ఈక్విటీ మార్కెట్లను 'ఆకర్షణీయ జోన్'కు అప్‌గ్రేడ్ చేసింది. అంతకుముందున్న మోస్తరు ఖరీదు నుంచి మెరుగుపడడం గమనార్హం. ఇటీవలి స్టాక్స్ దిద్దుబాటుకు తోడు, కంపెనీల ఆదాయాలు కాస్త మెరుగుపడడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

దీర్ఘకాలంలో మెరుగైన పనితీరు..

దీర్ఘకాల పెట్టుబడులకు ఉన్న ప్రాధాన్యాన్ని మధు నాయర్ గుర్తు చేశారు. స్వల్పకాల ప్రభావాన్ని అతిగా ఊహించుకోవడం, దీర్ఘకాల సామర్థ్యాలను తక్కువగా అంచనా వేయడం ఇన్వెస్టర్లలో సాధారణంగా కనిపించేదిగా పేర్కొన్నారు. వచ్చే 10-15 ఏళ్ల కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ, ఈక్విటీ మార్కెట్లు మంచి పనితీరు చూపిస్తాయని భావిస్తున్నట్టు చెప్పారు.

భారత్‌లోకి వెల్లువలా చైనా ఉత్పత్తులు?

మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: అమెరికాలో టారిఫ్‌ల విధింపుతో చైనా ఉత్పత్తులు భారత్‌లోకి వెల్లువెత్తే అవకాశాలున్న నేపథ్యంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి అంతర్-మంత్రిత్వ శాఖల మానిటరింగ్ సెల్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అటు అగ్రరాజ్యంపై చైనా ప్రతీకార టారిఫ్‌ల వల్ల అమెరికా వ్యవసాయోత్పత్తులు కూడా భారత్‌లోకి భారీగా వచ్చి పడే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దిగుమతుల్లో అసాధారణ ధోరణులేమైనా కనిపించిన పక్షంలో దేశీ పరిశ్రమల ప్రయోజనాలను పరిరక్షించే దిశగా యాంటీ-డంపింగ్ సుంకాల్లాంటివి విధించవచ్చని వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి ఎల్ సత్య శ్రీనివాస్ చెప్పారు. కమోడిటీలు, దేశాలవారీగా ట్రెండ్స్‌ను మానిటరింగ్ గ్రూప్ ప్రతి వారం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఇందులో వాణిజ్య శాఖ, డీజీఎఫ్‌టీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్), సీబీఐసీ (పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్రీయ బోర్డు), పరిశ్రమలు .. అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) మొదలైన విభాగాల నుంచి ప్రతినిధులు ఉన్నారు.

కేంద్ర మంత్రి గోయల్‌తో స్టార్‌లింక్ బృందం భేటీ



న్యూఢిల్లీ: శాటిలైట్ ఇంటర్నెట్ సేవల సంస్థ స్టార్‌లింక్ బృందం బుధవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌తో భేటీ అయ్యింది. తమ ప్రస్తుత భాగస్వామ్యాలు, భారత్‌లో భవిష్యత్ పెట్టుబడుల ప్రణాళికల గురించి వివరించింది. ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో గోయల్ ఈ విషయాలు వివరించారు. స్టార్‌లింక్ ప్రతిపాదనలకు ఇంకా సెక్యూరిటీ క్లియరెన్సులు రావాల్సి ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. స్టార్‌లింక్ పోటీ సంస్థలైన భారతి గ్రూప్‌నకు చెందిన యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కు ప్రభుత్వం ఇప్పటికే లైసెన్సులు ఇచ్చింది. అదే సమయంలో స్టార్‌లింక్ సర్వీసులను భారత్‌లో ప్రవేశపెట్టడానికి సంబంధించి రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ ఇప్పటికే స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 26% డౌన్



- జనవరి-మార్చి మధ్య 10,647 యూనిట్లు
- టాప్-8 నగరాల్లో 19 శాతం క్షీణత
- ప్రాప్ టైగర్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు డీలా పడ్డాయి. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (2025 జనవరి-మార్చి) మొత్తం 10,647 యూనిట్ల ఇళ్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో అమ్మకాలు 14,298 యూనిట్లుగా ఉండడం గమనార్హం. అంతేకాదు దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ నగరాల్లోనూ జనవరి-మార్చి కాలంలో ఇళ్ల అమ్మకాలు 19 శాతం తగ్గిపోయాయి. మొత్తం 98,095 యూనిట్ల విక్రయాలు జరిగాయి. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ ప్రాప్‌టైగర్ విడుదల చేసింది. ఇళ్ల ధరలు పెరిగిపోవడం, వృద్ధి తగ్గుముఖం పట్టడంతో కొనుగోలుదారులు అప్రమత్త ధోరణితో వ్యవహరించినట్టు వెల్లడించింది. అలాగే, ఎనిమిది ప్రముఖ నగరాల్లో మార్చి త్రైమాసికంలో కొత్త ఇళ్ల సరఫరా 10 శాతం తగ్గినట్టు తెలిపింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డెవలపర్లు వ్యవహరించినట్టు పేర్కొంది. "ధరలు గణనీయంగా పెరగడం విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపించింది. అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం కొత్త అనిశ్చితులను తీసుకొచ్చింది. ఇలాంటి తరుణంలో కొనుగోళ్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడం సాధారణంగా కనిపించేదే" అని ప్రాప్ టైగర్, హౌసింగ్ డాట్ కామ్ గ్రూప్ సీఈవో ధ్రువ్ అగర్వాల్ తెలిపారు.

నగరాల వారీ విక్రయాలు..

- అహ్మదాబాద్‌లో 10,730 ఇళ్ల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 12,915 యూనిట్లతో పోల్చి చూస్తే 17 శాతం తగ్గాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 8,477 యూనిట్ల విక్రయాలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 10,058 యూనిట్లతో పోల్చి చూస్తే 16 శాతం తగ్గాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో అమ్మకాలు 26 శాతం క్షీణించి 30,705 యూనిట్ల ఇళ్లకు పరిమితయ్యాయి.
- పుణెలో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 25 శాతం తక్కువగా 17,228 యూనిట్లుగా ఉన్నాయి.
- కోల్‌కతాలో విక్రయాలు కేవలం ఒక శాతం తగ్గి 3,803 యూనిట్లుగా ఉన్నాయి.
- బెంగళూరులో మాత్రం భిన్నమైన పరిస్థితి కనిపించింది. ఈ ఏడాది జనవరి-మార్చి మధ్యకాలంలో ఇళ్ల అమ్మకాలు 13 శాతం పెరిగి 11,731 యూనిట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 10,381 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం.
- చెన్నైలోనూ అమ్మకాలు 8 శాతం పెరిగి 4,774 యూనిట్లుగా ఉన్నాయి.
- జనవరి-మార్చి కాలంలో ప్రముఖ నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా 10 శాతం తగ్గి 93,144 యూనిట్లుగా ఉంది. ఈ డేటా కొత్త ఇళ్ల విక్రయాలకు సంబంధించినది.


హారిక


హంపి

హంపి, హారిక తొలి గెలుపు

పుణే: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళ గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో మూడో రోజు భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక సత్తా చాటుకున్నారు. వీరిద్దరు ఈ టోర్నీలో తొలి విజయాన్ని అందుకున్నారు. బుధవారం జరిగిన మూడో రౌండ్ గేముల్లో ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి హంపి తెల్ల పావులతో ఆడుతూ 53 ఎత్తుల్లో ప్రపంచ జూనియర్ చాంపియన్, భారత్‌కే చెందిన రైజింగ్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్‌ను ఓడించింది. తొలి రెండు రౌండ్ గేముల్లో నెగ్గిన దివ్యకిది తొలి ఓటమి కావడం గమనార్హం . మరో గేమ్‌లో హైదరాబాద్‌కు చెందిన హారిక 68 ఎత్తుల్లో నుర్గుల్ సలీమోవా (బల్గేరియా)పై గెలిచి ఈ టోర్నీలో తొలి గెలుపు రుచి చూసింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు రెండో 'డ్రా' నమోదు చేసుకుంది. పొలీనా షువలోవా (రష్యా)తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను వైశాలి 63 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. మరోవైపు బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ (మంగోలియా) 34 ఎత్తుల్లో అలీనా కష్‌లిన్‌స్కాయా (పోలాండ్)పై గెలుపొందగా... జు జినెర్ (చైనా)–మెలియా సలోమి (జార్జియా) మధ్య గేమ్ 76 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది.

రైజర్స్ రఫ్ఫాడించేనా!

నేడు ముంబై ఇండియన్స్‌తో 'ఢీ' • రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో పోరుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో సంచలన బాదుడుతో ప్రకంపనలు సృష్టించిన సన్‌రైజర్స్... ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడింది. ఎట్టకేలకు గత పోరులో పంజాబ్ కింగ్స్‌పై భారీ స్కోరును ఛేదించి తిరిగి గెలుపు బాట పట్టింది. గత సీజన్ నుంచి దూకుడే పరమావధిగా చెలరేగిపోతున్న సన్‌రైజర్స్ మరోసారి బ్యాటింగ్ బలాన్నే నమ్ముకొని బరిలోకి దిగుతోంది. మరోవైపు ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ పరిస్థితి కూడా అంత మెరుగ్గా లేదు. 6 మ్యాచ్‌లాడిన ఆ జట్టు 2 విజయాలు, 4 పరాజయాలతో 4 పాయింట్లు మాత్రమే సాధించింది. గత మ్యాచ్‌లో దూకుడు మీదున్న ఢిల్లీని కట్టడి చేయడంతో ముంబై తిరిగి ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి రావడంతో... ముంబై బౌలింగ్ మరింత పదునెక్కగా... అతడిని రైజర్స్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. ఇన్నాళ్లు ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించి ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు మారిన ఇషాన్ కిషన్‌పై అందరి దృష్టి నిలవనుంది.

ముంచినా తేల్చినా వాళ్లే!

సన్‌రైజర్స్ ప్రధాన బలం టాపార్డర్. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌తో పాటు వన్‌డౌన్ ఆటగాడు ఇషాన్ కిషన్ సత్తా చాటితే ఆరెంజ్ ఆర్మీని ఆపడం కష్టమే. అదే సమయంలో వీళ్లు ఎక్కువసేపు నిలువలేకపోతే ఇన్నింగ్స్ గాడితప్పడం కూడా పరిపాటే. తాజా సీజన్‌ను పరిశీలిస్తే ఇది సుస్పష్టం. ఈ నేపథ్యంలో మరోసారి టాపార్డర్ రాణించాలని రైజర్స్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. గత మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై 246 పరుగుల లక్ష్యాన్ని మరో 9 బంతులు మిగిలుండగానే ఛేదించిన హైదరాబాద్... ముంబైపై కూడా కలిసి కట్టుగా కదం తొక్కాలని చూస్తోంది. నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, అనికేత్ వర్మలతో మిడిలార్డర్ కూడా పటిష్టంగా ఉంది. ఎటొచ్చి రైజర్స్‌ను బౌలింగ్ దెబ్బతీస్తోంది. కెప్టెన్ కమిన్స్‌తో పాటు సీనియర్ పేసర్ షమీ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నారు. గత మ్యాచ్‌లో అయితే షమీ మరీ పేలవంగా 4 ఓవర్లలో 75 పరుగులు సమర్పించుకున్నాడు. హర్షల్ పటేల్, జీషన్ అన్సారీ నిలకడ కొనసాగించాల్సిన అవసరముంది.

రోహిత్ ఫామ్‌లోకి వచ్చేనా?

మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్ ముంబై ఇండియన్స్‌ను ఆందోళన పరుస్తోంది. సీజన్ ఆరంభం నుంచి తీవ్రంగా తడబడుతున్న రోహిత్.. ఐదు మ్యాచ్‌లాడి 56 పరుగులు మాత్రమే సాధించాడు. ఒకటీ రెండు షాట్లు ఆడటం ఆ తర్వాత అనవసరంగా వికెట్ పారేసుకోవడం హిట్‌మ్యాన్‌కు అలవాటుగా మారిపోయింది. దీంతో మిడిలార్డర్‌పై అదనపు భారం పడుతోంది. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్‌తో లైనప్ బలంగా ఉంది. లోయర్ ఆర్డర్‌లో విల్ జాక్స్ పెద్దగా ప్రభావం చూపలేక పోతుండటంతో... కార్బిన్ బాష్‌ను తుదిజట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. గాయం కారణంగా మూడు నెలలకు పైగా ఆటకు దూరమై ఇటీవలే తిరిగి వచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా లయ దొరకబుచ్చుకోవడంపై దృష్టి పెట్టాడు. గత మ్యాచ్‌లో కరుణ్ నాయర్‌ను నిలవరించలేకపోయిన బుమ్రా... ఆరెంజ్ ఆర్మీ దూకుడుకు పగ్గాలు వేయాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. బౌల్ట్, దీపక్ చహర్, సాంట్నర్, కరణ్ శర్మతో బౌలింగ్‌లో మంచి వైవిధ్యం ఉంది.


హెడ్, అభిషేక్

తుది జట్లు (అంచనా)

ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రోహిత్, రికెల్టన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, నమన్ ధీర్, విల్ జాక్స్/కార్బిన్ బాష్, సాంట్నర్, దీపక్ చహర్, బౌల్ట్, బుమ్రా, కరణ్ శర్మ.

సన్‌రైజర్స్ హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్, ఇషాన్, నితీశ్ రెడ్డి, క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్, హర్షల్ పటేల్, షమీ, జీషన్ అన్సారి, ముల్డర్.

పొమోనాలో 2028 ఒలింపిక్స్ క్రికెట్ పోటీలు

వేదిక వివరాలు వెల్లడించిన ఐసీసీ



దుబాయ్: 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీల వేదిక ఖరారైంది. 128 సంవత్సరాల విరామం అనంతరం విశ్వక్రీడల్లో క్రికెట్ పునరాగమనం చేస్తుండగా... ఈ పోటీలను దక్షిణ కాలిఫోర్నియాలోని పొమోనా నగరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అధ్యక్షుడు జై షా వివరాలు వెల్లడించారు. టి20 ఫార్మాట్‌లో పురుషుల విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ భారత్... మహిళల విభాగంలో ప్రస్తుత చాంపియన్ న్యూజిలాండ్ జట్లతో కూడిన పోస్టర్‌ను ఐసీసీ తమ సామాజిక మాధ్యమాల్లో జత చేసింది. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో చివరిసారిగా క్రికెట్ పోటీలు నిర్వహించగా... ఈసారి లాస్ ఏంజెలిస్ వేదికగా జరగనున్న విశ్వక్రీడల్లో పురుషులు, మహిళల విభాగాల్లో టి20 ఫార్మాట్‌లో టోర్నీ నిర్వహించనున్నారు. రెండు విభాగాల్లో ఆరేసి జట్లు పాల్గొంటాయి. ఒలింపిక్స్ ప్రధాన వేదిక లాస్ ఏంజెలిస్‌కు పొమోనా 48 కిలో మీటర్ల దూరంలో ఉంది. 'పొమోనాలో జరగనున్న పోటీలతో ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం చేయనుంది. విశ్వక్రీడల్లో క్రికెట్‌ను భాగం చేయడంతో ఆటకు మరింత ఆదరణ దక్కనుంది. టి20 ఫార్మాట్ ద్వారా ఇది విశ్వవ్యాప్తమై మరింత మంది అభిమానుల ఆదరణ దక్కించుకుంటుంది' అని జై షా పేర్కొన్నాడు. 2023లో ముంబై వేదికగా జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ 141వ సమావేశంలో... విశ్వక్రీడల్లో క్రికెట్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. 2010, 2014, 2023 ఆసియా క్రీడల్లో పురుషుల, మహిళల టి20 క్రికెట్ పోటీలు నిర్వహించగా... 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళల విభాగంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.


అదే అనిశ్చితి!

గందరగోళంలో భారత బాక్సింగ్ సంఘం

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సంఘం (బీఎఫ్ఐ)లో అనిశ్చితి కొనసాగుతోంది. రాష్ట్ర సంఘాలన్నీ వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని చూస్తుంటే... తాజాగా ఎన్నికైన తాత్కాలిక కమిటీ మాత్రం జాతీయ చాంపియన్‌షిప్‌ల నిర్వహణ, కోచ్‌ల నియామకం, అంతర్జాతీయ టోర్నీలో ఏర్పాటు వంటి కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎన్నికలు జరగాల్సి ఉండగా... న్యాయపరమైన సమస్యలతో ఆలస్యమైంది. గత నెల 28న ఎన్నికలు నిర్వహించాలని మొదట నిర్ణయించగా... సమయాభావం వల్ల అదీ సాధ్యపడలేదు. తాజాగా ఈ నెల 28 లోపు ఎన్నికలు నిర్వహించాలని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. చాన్నాళ్లు బీఎఫ్ఐ అధ్యక్షుడిగా ఉన్న అజయ్ సింగ్... తాత్కాలిక కమిటీకి కూడా చీఫ్‌గా కొనసాగుతున్నాడు. 'సుదీర్ఘ అనుభవం ఉన్న అజయ్ సింగ్... ఎన్నికలను వాయిదా వేయడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు' అని అస్సాం బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు, హేమంత్ అన్నారు. 'అజయ్ సింగ్ నియంతలా వ్యవహరిస్తున్నారు. ఏడాది కాలంగా ఒక్క చాంపియన్‌షిప్ కూడా నిర్వహించలేదు. పారిస్ ఒలింపిక్స్‌లో మనవాళ్లకు రిక్తహస్తాలే మిగిలాయి' అని మధ్యప్రదేశ్ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు దిగ్విజయ్ సింగ్ అన్నారు.

'ద డైరీ ఆఫ్ ఏ క్రికెటర్స్ వైఫ్'

- పుస్తకం రాసిన చతేశ్వర్ పుజారా భార్య పూజ
- ఈ నెల 29న విడుదల



న్యూఢిల్లీ: భారత సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా భార్య పూజా పుజారా కొత్త పుస్తకాన్ని తీసుకురానుంది. ఓ క్రికెటర్ జీవిత భాగస్వామిగా తన అనుభవాలను పూజ పుస్తక రూపమిచ్చింది. 'ద డైరీ ఆఫ్ క్రికెటర్స్ వైఫ్' పేరిట ఈ నెల 29న ఆ పుస్తకాన్ని విడుదల చేయనుంది. క్రికెట్‌ను విపరీతంగా అభిమానించే మన దేశంలో... ఓ ఆటగాడి జీవితంలో అటు గ్రౌండ్‌లో ఇటు ఇంట్లో ఎదురైన ఎత్తుపల్లాలను పూజ ఇందులో ప్రస్తావించింది. 'చతేశ్వర్ పుజారా చాలా మొండివాడు. ఒక పట్టాన దేన్ని అంగీకరించడు. అదే సమయంలో సున్నిత మనస్కుడు, పబ్లిసిటీకి దూరంగా ఉంటాడు. అయితే అతడి దగ్గర దాచడానికి ఏమీ లేదు. దైవంపై నమ్మకం ఎక్కువ. హాస్యాన్ని ఇష్టపడతాడు. రాజ్‌కోట్ వీధుల నుంచి అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగిన అతడి ప్రయాణం ఎంతో ప్రత్యేకం. అందులో భాగం అయ్యే అవకాశం నాకు దక్కడం ఆనందంగా ఉంది. చతేశ్వర్ జీవితంతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారని నమ్ముతున్నా. అందుకోసమే ఇంత సమయం కేటాయించి పుస్తకాన్ని తీసుకు వస్తున్నా' అని పూజా పుజారా వెల్లడించింది. క్రికెట్‌పై కనీస అవగాహన లేకుండానే 2013లో అతడిని వివాహమాడిన పూజా... ఆ తర్వాతి కాలంలో స్పోర్ట్స్ న్యూట్రీషియన్‌గా మారింది. ఓ క్రీడాకారుడి భాగస్వామి పుస్తకం రాయడం ఇదే తొలిసారి. ఈ నెలాఖరులో మార్కెట్‌లోకి రానున్న పుస్తకంపై భారత దిగ్గజ ఆటగాళ్లు అనీల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసలు కురిపించారు. పుజారాను సమీపం నుంచి గమనించిన పూజా... అతడి జీవితంలోనే భిన్న పార్శ్వాలను స్పృషించిందని ద్రవిడ్ కితాబిచ్చాడు. కష్టాన్ని నమ్ముకుంటే ఒక వ్యక్తి ఎంతటి విజయం సాధించగలడనే అంశం ఈ పుస్తకం చదివితే అర్థం అవుతుందని పేర్కొన్నాడు.

ఐడబ్ల్యూఎఫ్ అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా మీరాబాయి చాను



న్యూఢిల్లీ: స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను... భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం చేజిక్కించుకొని చరిత్ర సృష్టించిన చాను... సహచర లిఫ్టర్లకు తోడ్పాటు అందించేందుకు ఇది సహకరిస్తుందని పేర్కొంది. 'తోటి లిఫ్టర్ల తరఫున మాట్లాడే అవకాశం దక్కింది. దీన్ని సద్వినియోగ పర్చుకుంటా. పదవితో వచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తా. ఆటేతర అంశాలపై దృష్టి పడకుండా... వెయిట్‌లిఫ్టింగ్‌కు మరింత తోడ్పాటు అందించేందుకు నా వంతు కృషి చేస్తా. లిఫ్టర్ల సమస్యలతో పాటు అన్ని కోణాల్లో దృష్టి సారిస్తా' అని మీరాబాయి చాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. టోక్యో ఒలింపిక్స్‌లో చాను 49 కేజీల విభాగంలో రజతం గెలిచి... ఈ ఘనత సాధించిన తొలి భారత లిఫ్టర్‌గా నిలిచింది. అంతకుముందు (2000 సిడ్నీ ఒలింపిక్స్) భారత్ నుంచి వెయిట్‌లిఫ్టింగ్‌లో కరణం మల్లీశ్వరి కాంస్య పతకం నెగ్గింది.


శ్రీజ


మనిక

శ్రీజ, మనిక అవుట్

మకావు: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ మనిక బత్రా, భారత రెండో ర్యాంకర్ ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. వీరిద్దరూ గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టారు. మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌ల్లో మనిక, శ్రీజ తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడిపోయారు. ప్రపంచ 24వ ర్యాంకర్ బ్రునా తకహాషి (బ్రెజిల్)తో జరిగిన గ్రూప్–16 చివరి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్ మనిక 11–13, 8–11, 4–11, 12–10తో ఓటమి చవిచూసింది. ఈ గెలుపుతో బ్రునా గ్రూప్–16 టాపర్‌గా నిలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. బ్రునాతో 32 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో మనిక తన సర్వీస్‌లో 21 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 14 పాయింట్లు సాధించింది. ప్రపంచ 14వ ర్యాంకర్ బెర్నాడెట్ జోక్స్ (రొమేనియా)తో జరిగిన గ్రూప్–9 ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ 8–11, 6–11, 9–11, 8–11తో పరాజయం పాలైంది. 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 14 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 17 పాయింట్లు సంపాదించింది.



రజతాలు నెగ్గిన నితిన్, తన్ను



దమ్మమ్ (సౌదీ అరేబియా): ఆసియా అండర్–18 యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజు బుధవారం భారత్‌కు నాలుగు పతకాలు లభించాయి. ఇందులో రెండు రజతాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి. పురుషుల 5000 మీటర్ల విభాగంలో నితిన్ గుప్తా 20 నిమిషాల 21.51 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచాడు. మహిళల 400 మీటర్ల విభాగంలో తన్ను రజత పతకాన్ని దక్కించుకుంది. తన్ను 400 మీటర్ల దూరాన్ని 57.63 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. పురుషుల డిస్కస్ త్రోలో నిశ్చయ్ (58.85 మీటర్లు) కాంస్యం... మహిళల 100 మీటర్ల విభాగంలో ఆర్తి (11.93 సెకన్లు) కాంస్యం సాధించారు.

విజేత పంజాబ్

ఝాన్సీ (ఉత్తరప్రదేశ్): జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ డివిజన్ 'ఎ' విభాగంలో పంజాబ్ జట్టు విజేతగా అవతరించింది. ఫైనల్లో పంజాబ్ జట్టు 4–1 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. ఆతిథ్య ఉత్తరప్రదేశ్ జట్టుకు మూడో స్థానం లభించింది. మూడో స్థానం మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ 5–1 గోల్స్ తేడాతో మణిపూర్ జట్టును ఓడించింది. మధ్యప్రదేశ్‌తో జరిగిన తుది పోరులో పంజాబ్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (30వ, 49వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించాడు. జస్‌కరణ్ సింగ్ (38వ నిమిషంలో), మణిందర్ సింగ్ (46వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మధ్యప్రదేశ్ జట్టుకు ప్రతాప్ లాక్రా (28వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. 'ఆరంభం నుంచే దూకుడుగా ఆడాలనే ప్రణాళికతో బరిలోకి దిగాం. మైదానంలో దానిని విజయవంతంగా అమలు చేశాం. ముఖ్యంగా జుగ్‌రాజ్ సింగ్ అద్భుతంగా ఆడాడు. గోల్స్‌గా మలిచే రెండు, మూడు అవకాశాలను చేజార్చుకున్నాం. లేదంటే గెలుపు వ్యత్యాసం మరింత మెరుగ్గా ఉండేది. దేశవాళీ టోర్నీలలో రాణించడం ఆనందాన్ని ఇస్తుంది. స్వర్ణ పతకం సాధించినందుకు సంతోషంగా ఉన్నాం' అని పంజాబ్ జట్టు కెప్టెన్, భారత జట్టు కీలక సభ్యుడు హార్దిక్ సింగ్ వ్యాఖ్యానించాడు.

92
జాతీయ హాకీ చాంపియన్‌షిప్ డివిజన్ 'ఎ'లో నమోదైన మొత్తం గోల్స్. ఇందులో 47 ఫీల్డ్ గోల్స్ కాగా... పెనాల్టీ కార్నర్ల ద్వారా 34 గోల్స్, పెనాల్టీ స్ట్రోక్‌ల ద్వారా 11 గోల్స్ వచ్చాయి.

ఈసారి మూడు విభాగాలుగా...

జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌ను ఈ ఏడాది మూడు విభాగాలుగా విభజించి నిర్వహించారు. 12 అగ్రశ్రేణి జట్లకు డివిజన్ 'ఎ'లో చోటు కల్పించారు. డివిజన్ 'ఎ'లోని జట్లకు మాత్రమే జాతీయ చాంపియన్ అయ్యే అవకాశం లభిస్తుంది. మరో 10 జట్లకు డివిజన్ 'బి'లో... మరో 8 జట్లకు డివిజన్ 'సి'లో చోటు కల్పించారు. డివిజన్ 'బి'లో చండీగఢ్, ఢిల్లీ, తెలంగాణ జట్లు వరుసగా తొలి 3 స్థానాల్లో నిలిచాయి. డివిజన్ 'సి'లో ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్తాన్ వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి.





బుధవారం గ్వాంగ్‌యుజౌ (చైనా)లో జరిగిన కాంటన్ ఫెయిర్‌లో ఆకట్టుకున్న గస్తీ రోబో



పుష్పాకృతిలో కనువిందు చేస్తున్న ఫ్లయింగ్ డ్రోన్ ల్యాంచ్‌ప్యాడ్



చకాచకా ర్యాంప్‌పై నడుస్తున్న రోబో

పరస్పర సహకారం బలోపేతం చేసుకుందాం

ప్రధాని మోదీ, ఫిన్‌లాండ్ అధ్యక్షుడు స్టబ్ నిర్ణయం

న్యూఢిల్లీ: భారత్–యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని తాను కోరుకుంటున్నట్లు ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ చెప్పారు. రెండు పక్షాలు మరింత సన్నిహితం కావాల్సిన అవసరం ఉందని, అందుకోసం తన వంతు మద్దతు అందిస్తానని తెలిపారు. భారత్–ఈయూ మధ్య పరస్పరం ప్రయోజకరంగా ఉండేలా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం సాధ్యమైనంత త్వరగా సాకారం కావాలని ఆకాంక్షించారు. అలెగ్జాండర్ స్టబ్ బుధవారం భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. భారత్–ఫిన్‌లాండ్ సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. వేర్వేరు కీలక రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. 5జీ–6జీ, కృత్రిమ మేధ, సైబర్ భద్రత వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని తీర్మానించారు. అలెగ్జాండర్ స్టబ్‌తో ఫలవంతమైన చర్చ జరిగిందని పేర్కొంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈయూలో భారత్‌కు ఫిన్‌లాండ్ అత్యంత కీలకమైన భాగస్వామి అని ఉద్ఘాటించారు.

కెనడా వర్సిటీల వైపు అమెరికా విద్యార్థుల చూపు

అమెరికాలో విద్యార్థులు ఇప్పుడు కెనడా వైపు దృష్టి సారించారు. ట్రంప్ విధానాల నేపథ్యంలో కెనడియన్ విశ్వవిద్యాలయాలు అమెరికా విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేయడం, యూనివర్సిటీ నిధులను తగ్గించడంవంటి చర్యల ఫలితంగా.. యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా (యూబీసీ), యూనివర్సిటీ ఆఫ్ టొరంటో, యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ వంటి కెనడియన్ విశ్వవిద్యాలయాలకు అమెరికా విద్యార్థుల దరఖాస్తులు పెరిగాయి. వాంకోవర్‌లో ఉన్న యూబీసీ క్యాంపస్‌లో 2024తో పోలిస్తే మార్చి1 నాటికి యూఎస్ పౌరుల నుంచి గ్రాడ్యుయేషన్ దరఖాస్తుల్లో 27% పెరుగుదల నమోదైంది. ఈ సంస్థ కొన్ని ప్రోగ్రామ్స్ కోసం అడ్మిషన్లను ఈవారం కూడా తిరిగి తెరిచింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 2025 నాటికి యూఎస్ విద్యార్థుల నుంచి దరఖాస్తుల సంఖ్య పెరగవచ్చని భావిస్తున్నారు. టొరంటో విశ్వవిద్యాలయానికి కూడా సాధారణం కంటే ఎక్కువ సంఖ్యలో యూఎస్ నుంచి దరఖాస్తులు వచ్చాయి. వాటర్లూ విశ్వవిద్యాలయంలో, సెప్టెంబర్ 2024 నుంచి యూఎస్ వెబ్ ట్రాఫిక్ 15% పెరిగింది. ఎక్కువ మంది అమెరికన్ విద్యార్థులు క్యాంపస్‌ను వ్యక్తిగతంగా సందర్శిస్తున్నారని కూడా నివేదికలు చెబుతున్నాయి.

ఈ ఆకర్షణకు కారణాలు..

ట్రంప్ ప్రభుత్వం హఠాత్తుగా వీసాలను రద్దు చేయడం, విదేశీ విద్యార్థుల సోషల్ మీడియా కార్యకలాపాలను పర్యవేక్షించడం, కాలేజీలకు ఫెడరల్ ఫండింగ్ తగ్గించడం ఇందుకు కారణమని అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాలన్నీ పలువురు విద్యార్థులు, కుటుంబాల్లో భవిష్యత్తుపై భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. స్టూడెంట్ వీసాలు, యూనివర్సిటీ ఫండింగ్‌పై అమెరికాలో నిరసనలు, దావాలు ఎదుర్కొంటున్న సమయంలో కెనడా విద్యకు మరింత స్థిరమైన, స్నేహపూర్వక గమ్యస్థానంగా కనిపిస్తోంది. అయితే ఇక్కడా కొన్ని పరిమితులున్నాయి. తమ దేశంలోకి ప్రవేశించే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యపై కెనడా ప్రభుత్వం కూడా పరిమితి విధించింది.

పెరిగిన క్యాంపస్ టూర్లు..

యూబీసీలో యూఎస నుంచి అండర్ గ్రాడ్యుయేషన్ అప్లికేషన్‌లు కేవలం 2% మాత్రమే పెరిగినా, అమెరికన్–నిర్దేశిత క్యాంపస్ టూర్లు మాత్రం 20% పెరిగాయి. ఆసక్తి పెరుగుతోందని, ఎక్కువ మంది విద్యార్థులు కెనడియన్ విశ్వవిద్యాలయాలను వాస్తవ అవకాశంగా చూస్తున్నారని ఇది సూచిస్తుంది. తమ క్యాంపస్‌లకు అంతర్జాతీయ విద్యార్థులను పంపే మొదటి మూడు దేశాల్లో అమెరికా ఇప్పటికే ఒకటి అని యూబీసీ వార్షిక నివేదిక పేర్కొంది. ఇప్పటికే సుమారు 1,500 మంది యూఎస్ విద్యార్థులు యూబీసీలో గ్రాడ్యుయేషన్, అండర్‌గ్రాడ్యుయేషన్ చదువుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రెండో రోజూ ఈడీ విచారణకు వాద్రా

న్యూఢిల్లీ: హరియాణాలో భూ ఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా వరుసగా రెండో రోజు బుధవారం సైతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు తన భార్య ప్రియాంక గాంధీతో కలిసి ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం లోపలికి వెళ్లే ముందు రాబర్ట్ వాద్రా తన భార్యను ఆలింగనం చేసుకున్నారు. ప్రియాంక లోపలికి వెళ్లకుండా సందర్శకుల గదిలోనే వేచి ఉన్నారు. విచారణ అనంతరం మధ్యాహ్నం 1.10 గంటలకు వాద్రా దంపతులు తిరిగి వెళ్లిపోయారు. భోజనం తర్వాత మళ్లీ తిరిగివచ్చారు. సాయంత్రం 6 గంటలకు విచారణముగిసింది. మనీ లాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రాను ఈడీ అధికారులు మంగళవారం ఐదు గంటలపాటు విచారించిన సంగతి తెలిసిందే. ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డుచేశారు. బుధవారం మరికొన్ని వివరాలు రాబట్టినట్లు సమాచారం. ఈడీ విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల కోసం పోరాడుతున్న గాంధీ కుటుంబంలో సభ్యుడైనందుకే కేంద్ర దర్యాప్తు సంస్థలు తనను టార్గెట్ చేశాయని ఆరోపించారు. ఒక వేళ బీజేపీలో చేరి ఉంటే ఈ వేధింపులు ఉండేవి కావని చెప్పారు.

జర్మనీలో కిల్లర్ డాక్టర్

15 మంది రోగులను హత్య చేసిన వైద్యుడు

బెర్లిన్: తన వద్ద చికిత్స పొందుతున్న రోగులను కంటికి రెప్పలా సంరక్షించాల్సిన ఓ వైద్యుడు వారిని కిరాతకంగా హత్య చేశాడు. వైద్య వృత్తికే మచ్చ తెచ్చాడు. ఏకంగా 15 మంది రోగుల ప్రాణాలు బలి తీసుకున్నాడు. ఈ ఘటన జర్మనీలో చోటుచేసుకుంది. హంతక డాక్టర్‌పై దర్యాప్తు కొనసాగుతోంది. 40 ఏళ్ల ఆ డాక్టర్ 2021 సెప్టెంబర్ నుంచి 2024 జూలై వరకు 15 హత్యలు చేశాడు. బాధితుల్లో 12 మంది మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వారి వయసు 25 నుంచి 94 ఏళ్ల దాకా ఉంది. చాలామంది వారి సొంత ఇళ్లల్లోనే హత్యకు గురయ్యారు. చికిత్స పేరిట రోగుల ఇళ్లకు చేరుకొని ప్రమాదకరమైన డ్రగ్స్‌ను ఇంజెక్షన్ రూపంలో ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో శ్వాస ఆగిపోయి నిమిషాల వ్యవధిలోనే రోగులు ప్రాణాలు విడిచారు. బాధితుల ఇళ్లకు నిప్పు పెట్టడం ద్వారా సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు కిల్లర్ డాక్టర్ ప్రయత్నించినట్లు తేలింది. తొలుత నలుగురి మృతిపై అనుమానం రాగా అధికారులు దర్యాప్తు చేపట్టారు. కానీ, డాక్టర్ చేతిలో 15 మంది హత్యకు గురైనట్లు వెల్లడయ్యింది. అయితే, అతడు ఈ హత్యలు ఎందుకు చేశాడన్నది తెలియరాలేదు. హంతకుడు తన నేరం ఒప్పుకోవడం లేదని సమాచారం. నిబంధనల ప్రకారం గోప్యత దృష్ట్యా అతడి పేరును ఇంకా బయటపెట్టలేదు. గత ఏడాది ఆగస్టు 6వ తేదీ నుంచి కస్టడీలో ఉన్నాడని, విచారణ కొనసాగుతోందని అధికారులు బుధవారం వెల్లడించారు. జర్మనీలో హత్య కేసుల్లో సాధారణంగా యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు.

రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ ప్రెసిడెంట్‌గా భారత సంతతి వైద్యురాలు



లండన్: ప్రతిష్టాత్మక రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్(ఆర్‌సీపీ) 124వ ప్రెసిడెంట్‌గా భారత సంతతికి చెందిన డాక్టర్ ముంతాజ్ పటేల్ ఎన్నికయ్యారు. యూకే వైద్య నిపుణుల సంఘంలో ప్రపంచవ్యాప్తంగా నిపుణులుగా పేరున్న 40 వేల మంది వైద్యులు సభ్యులుగా ఉన్నారు. ఇంగ్లండ్‌లోని లంకాషైర్‌లో డాక్టర్ పటేల్ జన్మించారు. ఈమె తల్లిదండ్రులు భారత్‌కు చెందిన వారు. మాంచెస్టర్‌లో కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్‌గా డాక్టర్ ముంతాజ్ పనిచేస్తున్నారు. ఆర్‌సీపీకు మొట్టమొదటి ఇండో–ఆసియన్ ముస్లిం ప్రెసిడెంట్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. 16వ శతాబ్దంలో ఆర్‌సీపీ ఏర్పాటయ్యాక ఐదో మహిళా అధ్యక్షురాలుగా ముంతాజ్ పటేల్ నిలిచారు. సోమవారం ముగిసిన ఎన్నికలో డాక్టర్ ముంతాజ్ గెలుపొందారు. నాలుగేళ్ల పదవీకాలం ప్రారంభం ఖరారు కావాల్సి ఉంది. ఆర్‌సీపీ వైస్ ప్రెసిడెంట్(ఎడ్యుకేషన్–ట్రెయినింగ్)గా, తాత్కాలిక ప్రెసిడెంట్‌గా 2024 జూన్ నుంచి కొనసాగుతున్నారు. ఆర్‌సీపీ ప్రెసిడెంట్‌గా కౌన్సిల్ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యురాలుగా ఉంటారు.



భూకంపం నుంచి బిడ్డను రక్షించుకునేందుకు..

వలయాన్ని సృష్టించిన ఏనుగులు

ప్రాణి ఏదైనా పిల్లల పట్ల చూపించే ప్రేమ, తీసుకునే జాగ్రత్తలు ఒకేతీరుగా ఉంటాయి. అందుకు తాజా ఉదాహరణ ఈ ఘటన. సోమవారం దక్షిణ కాలిఫోర్నియాలో 5.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఒక్కసారిగా కదలికలను గమనించిన శాన్‌డియాగో జంతు ప్రదర్శనశాలలోని ఏనుగులు అప్రమత్తమయ్యాయి. జూ సఫారీ పార్కులో ఉన్న ఆఫ్రికన్ ఏనుగుల గుంపు ఒకేచోట చేరింది. తమ పిల్లలను రక్షించుకోవడానికి వలయం ఏర్పాటు చేసింది. మధ్యలో పిల్లలను ఉంచిన ఏనుగులు ఏ పక్క నుంచి ఏ ముప్పు ఉందోనని చుట్టుపక్కల పరిశీలించడం మొదలుపెట్టాయి. చెవులు చాచి, కళ్లు పరిసరాలను పరిశీలిస్తూ, ఎలాంటి ప్రమాదాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమన్నట్టుగా నిలబడి ఉన్నాయి. గుంపులో ఉన్న మగ ఏనుగు పిల్ల కూడా రక్షణ వలయంలోకి వచ్చి నిలబడింది. దానికి తల్లి ఏనుగు తొండంసాయంతో నేనున్నా అనే భరోసాను సైతం ఇచ్చింది. భూమి కంపించడం ప్రారంభించిన క్షణాల్లోనే ఏనుగులు చర్యకు దిగాయి. ఎన్‌క్లోజర్‌లోని నిఘా కెమెరాలు ఈ దృశ్యాలను బంధించాయి. 'అలర్ట్ సర్కిల్'అనిపిలిచే ఈ సహజ రక్షణ వలయం. బలహీనమైన సభ్యులు భయపడకుండా ఉండేందుకు ఏనుగులు ఈ విలక్షణమైన పవర్తనను కలిగి ఉంటాయి. ఇది వాటి తెలివితేటలకు, సామాజిక బంధానికి నిదర్శనమని జంతుప్రదర్శనశాల క్షీరదాల క్యూరేటర్ మిండీ ఆల్‌బ్రైట్ తెలిపారు. ఏనుగులు తమ పాదాల ద్వారా భూకంప కార్యకలాపాలను గ్రహించగలవని, ఆయా జంతువులకు ముందుగానే తెలిసిపోతుందని వెల్లడించారు. సుమారు గంట తర్వాత భూప్రకంపనలు రావడంతో ఆ గుంపు మరోసారి రక్షణ వలయాన్ని ఏర్పరిచింది. ముప్పేమీ లేదని నిర్ధయించుకున్నాకే విశ్రాంతి తీసుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పెరూ మాజీ అధ్యక్షుడు, ఆయన భార్యకు 15 ఏళ్ల జైలు శిక్ష

లిమా: పెరూ మాజీ అధ్యక్షుడు ఒలాంటా హుమాలాకు 15 ఏళ్ల జైలు శిక్షించింది. బ్రెజిల్ నిర్మాణ సంస్థ ఒడెబ్రెచ్ట్ నుంచి అక్రమ ప్రచార నిధులను తీసుకున్నందుకు అతన్నిదోషిగా తేల్చిన కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. అతని భార్య నాడిన్ హెరెడియాకు కూడా 15 ఏళ్ల జైలు శిక్ష పడింది. 2011 ఎన్నికల ప్రచారంలో హుమాలా, హెరెడియా డబ్బును స్వీకరించారని కోర్టు తెలిపింది. తన ప్రత్యర్థి కీకో ఫుజిమోరిని ఓడించి అధ్యక్షుడు కావడానికి హుమాలాకు ఈ నిధులు సహాయపడ్డాయని ప్రాసిక్యూటర్లు తెలిపారు. నేషనలిస్ట్ పార్టీ ద్వారా హుమాలాకు ఈ డబ్బు ప్రవహించినట్లు ఆరోపణలున్నాయి. కోర్టు తీర్పు అనంతరం బ్రెజిల్ ఆశ్రయంకోసం హెరెడియా ప్రయత్నించారు.

భారతీయ విద్యార్థి బహిష్కరణను నిలిపేసిన కోర్టు

మాడిసన్: విస్కాన్సిన్–మాడిసన్ యూనివర్సిటీ విద్యార్థి డిపోర్టేషన్‌ను అమెరికా ఫెడరల్ జడ్జి మంగళవారం తాత్కాలికంగా నిలిపివేశారు. విద్యార్థిని బహిష్కరించకుండా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాంట్ సెక్యూరిటీ (డీ హెచ్‌ఎస్)ని అడ్డుకోవాలని న్యాయమూర్తి విలియం కాన్లే తీర్పు చెప్పారు. విద్యార్థి ఎఫ్–1 స్టూడెంట్ వీసా రికార్డును రద్దు చేయడానికి ముందు ఎటువంటి హెచ్చరిక ఇవ్వలేదు, వివరించడానికి లేదా సమర్థించుకోవడానికి అవకాశం ఇవ్వలేదు, ఏమాత్రం అకాశం ఇవ్వలేదని తీర్పు ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (సెవిస్)కింద 21 ఏళ్ల క్రిష్ లాల్ ఇసెర్దాసానీ ఇంజనీరింగ్ చదువుతున్నారు. మే నెలలో గ్రాడ్యుయేషన్ పూర్తవుతుంది. ఈ లోగా డేటాబేస్ నుంచి అతని వీసా రద్దయ్యింది. 2024 నవంబర్ 22న బార్ నుంచి బయటకు వచ్చిన తర్వాత తన స్నేహితులతో కలిసి మరో వర్గంతో వాగ్వాదానికి దిగాడు. ఆ గొడవ అంతటితోనే సమసిపోయింది. ఏప్రిల్ 4న అతని స్టూడెంట్ వీసా రద్దయింది. ఇసెర్దాసానీ అదుపులోకి తీసుకున్నారు. తన ఎఫ్–1 స్టూడెంట్ వీసాను తప్పుగా రద్దు చేశారని కోర్టుకెళ్లాడు. దేశవ్యాప్తంగా సుమారు 1,300 మంది విద్యార్థుల సెవిస్ రికార్డులు అకస్మాత్తుగా రద్దయ్యా యి. వారిలో భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. చాలామంది విద్యార్థులకు పాలస్తీనా అనుకూల నిరసనలతో ఎటువంటి సంబంధం లేదు. వీసా రద్దుకు గత ట్రాఫిక్ ఉల్లంఘనలే కారణమని అధికారులు పేర్కొంటున్నారు. చిన్న ఉల్లంఘనల కారణంగా విద్యార్థుల వీసాలను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో క్రిష్ బహిష్కరణ నిలిపివేతను అంతర్జాతీయ స్టూడెంట్ వీసా హోల్డర్లకు ఇది మొదటి జాతీయ విజయంగా భావిస్తున్నారు.

నైతిక స్థైర్యం దెబ్బతిన్నా నెగ్గేది మేమే

మార్పు గుజరాత్ నుంచే మొదలవుతుంది • రాష్ట్ర పర్యటనలో రాహుల్ గాంధీ వ్యాఖ్య

మోదాసా(గుజరాత్): గుజరాత్‌లో కాంగ్రెస్ శ్రేణుల్లో నైతిక స్థైర్యం కాస్తంత దెబ్బతిన్నాసరే ఈసారి ఎన్నికల్లో గెలుపుజెండా ఎగరేసి తీరతామని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తంచేశారు. బుధవారం గుజరాత్‌లో పర్యటన సందర్భంగా ఆరవల్లీ జిల్లాలోని మోదాసా పట్టణంలో జిల్లా బూత్‌స్థాయి కార్యకర్తల సదస్సులో రాహుల్ పాల్గొన్నారు. జిల్లా యూనిట్లను మరింత బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాక ప్రసంగించారు. 41 జిల్లా యూనిట్లకు కొత్త సారథులను ఎన్నుకునే బాధ్యతలను ఐదుగురు సభ్యుల కమిటీకి అప్పగించారు.

గెలుపు మాదే: ''బీజేపీని ఇక్కడ ఓడించడం కష్టమని కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు భావిస్తున్నారు. బీజేపీని ఓడించడం తేలికే అని చెప్పేందుకే ఇక్కడికొచ్చా. వాళ్లను ఓడించి చూపిద్దాం. ఈసారి గెలుపు మనదే. సైద్ధాంతిక సమరంలో బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ ద్వయాన్ని ఓడించగల సత్తా ఒక్క కాంగ్రెస్‌కే ఉంది. గెలుపు కోసం మన పార్టీలో కొన్ని మార్పులు అనివార్యం''అని అన్నారు. మార్పు గుజరాత్ నుంచే మొదలవుతుందన్నారు.

మూడు రకాల గుర్రాలున్నాయి

ప్రతిభ అధారంగా నేతలను రాహుల్ మూడు రకాల గుర్రాలుగా పోల్చిచెప్పారు. ''కొన్ని రేసుగుర్రాలుంటాయి. అవి ఎన్నికల్లో దూసుకెళ్తాయి. ఇంకొన్ని పెళ్లిళ్లలో ఊరేగింపులకే పనికొస్తాయి. ఇంకొన్ని గాయాలపాలై ఏదోలా నెట్టుకొస్తుంటాయి. గుజరాత్‌లో పార్టీ అద్భుతమైన ప్రదర్శన చేయకపోవడానికి ఈ గుర్రాలను సరిగా వాడుకోకపోవడమే కారణని నాతో కొందరు చెప్పారు. రేసు గుర్రాలను పెళ్లిళ్లకు, ఊరేగింపు గుర్రాలను రేసులకు పంపుతున్నామని అంటున్నారు. ఇక ఎన్నికల బరిలో మన రేసు గుర్రాలే ఉంటాయి. జిల్లా యూనిట్లను ఇకపై జిల్లాల నుంచే నడుపుతాం ''అని రాహుల్ చెప్పారు.

గంగా-జమునా సమ్మేళనానికి ఉర్దూ ప్రతీక

మహారాష్ట్ర పాటూర్ మున్సిపాలిటీలో ఉర్దూ సైన్‌బోర్డులను సమర్థించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: గంగా–జమునా ఉన్నత సంస్కృతిక సమ్మేళనానికి ప్రతీక అయిన ఉర్దూ భారత్‌లోనే పుట్టిందని, ఈ భాషను కేవలం ముస్లింల భాషగా కొందరు భావించడం విచారకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని పాటూర్ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో మరాఠాతోపాటు ఉర్దూ భాషలో సైన్ బోర్డు ఉండటాన్ని సవాల్ చేస్తూ అకోలా జిల్లా పాటూర్ పట్టణ మాజీ మహిళా కౌన్సిలర్ వర్షతాయ్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసింది. భాష అనేది మతం కాదు అని మంగళవారం జస్టిస్ సుధాంషు ధులియా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల బెంచ్ స్పష్టంచేసింది. ఉర్దూ దక్షిణ, మధ్య భారతదేశాల ప్రజల సంస్కృతి సారథిగా, గంగా–జమునా మిశ్రమ వారధిగా ఉర్దూ భాసిల్లింది. అలాంటి భాషను మనం గౌరవించాలి. పాటూర్ పట్టణంలో చాలా మంది ఉర్దూ భాషను అర్థంచేసుకుంటారు. అందుకే మున్సిపల్ కౌన్సిల్ సైతం సైన్‌బోర్డులోని అంశాలు ఎక్కువ మందికి అర్థంకావాలనే సదుద్దేశంతో ఉర్దూ భాషలోనూ బోర్డ్ రాయించింది''అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

వేగంగా రిషికేశ్-కర్ణప్రయాగ్ రైల్ సొరంగం పనులు

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని 125 కిలోమీటర్ల పొడవైన రిషికేశ్- కర్ణప్రయాగ్ రైలు మార్గం పనులు శరవేగంగా సాగుతున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా సాగుతున్న రెండో రైల్ టన్నెల్ ప్రాజెక్టుగా ఇది నిలిచిందన్నారు. కాగా, రెండు వైపుల్నించి తవ్వుకుంటూ వచ్చిన టన్నెల్ అనుసంధాన పనులను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం స్వయంగా పర్యవేక్షించారు. ఇందుకోసం ఆయన 3.5 కిలోమీటర్ల మేర ఆయన సీఎం పుష్కర్‌సింగ్ ధామితో కలిసి సొరంగంలో ప్రయాణించారు. ఇది చారిత్రక సందర్భమన్నారు. సరిగ్గా ఇదే రోజున 1853 ఏప్రిల్ 16న బ్రిటిష్ జమానాలో మన దేశంలో రైలు సేవలు మొదలయ్యాయని గుర్తు చేశారు. జంట టన్నెళ్లకు గాను మరోటి జూలైలో పూర్తవుతుందని, ఈపనులను ఎల్ అండ్ టీ కంపెనీ చేపట్టిందన్నారు. స్పెయిన్‌లో డబుల్ షీల్డ్ టన్నెల్ బోరింగ్ మెషీన్(టీబీఎం) 9.69 డయామీటర్ల కత్రెరా టన్నెల్‌ను నెలకు 423 మీటర్ల చొప్పున తొలచగా, దేవ్‌ప్రయాగ్–జనాసు మధ్య సింగిల్ షీల్డ్ టీబీఎం నెలకు 413 మీటర్ల చొప్పున టన్నెల్ తవ్వకాన్ని పూర్తి చేసిందని ఆయన వివరించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా పూర్తయిన రెండో టన్నెల్‌గా నిలిచిందన్నారు. ప్రారంభమయ్యాక ఇది దేశంలో అత్యంత పొడవైన రవాణా టన్నెల్‌గా నిలువనుందన్నారు. మొత్తం 14.58 కిలోమీటర్ల నంబర్ 8 టన్నెల్‌కు గాను జర్మనీ నుంచి తెప్పించిన ప్రత్యేక టీబీఎం సాయంతో 10.47 కిలోమీటర్ల మేర తవ్వకం జరిపామన్నారు. మిగతాది సాధారణ డ్రిల్, బ్లాస్ట్ విధానంలోనే పూర్తి చేసినట్లు చెప్పారు. మొత్తం 125 కిలోమీటర్ల ఈ మార్గంలో 105 కిలోమీటర్ల మేర టన్నెళ్లలోనే ఉండటం దీని ప్రత్యేకతని చెప్పారు. పర్వత ప్రాంతంలో రైలు ప్రాజెక్టు కోసం టీబీఎంలను వాడటం ఇదే మొదటిసారన్నారు. సంప్రదాయ డ్రిల్, బ్లాస్ట్ విధానంలో అయితే నెలకు 60 నుంచి 90 మీటర్ల మేర సొరంగం పనులు మాత్రమే పూర్తయ్యేవన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కొండగావ్ – నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు ముఖ్య నేతలు మృతి చెందారు. కీలం–బార్గం గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు బలగాలు మంగళవారం సాయంత్రం నుంచి కూంబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా, ఆ ప్రాంతం నుంచి ఒక ఏకే 47, ఒక పిస్టల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులను తూర్పు బస్తర్ డివిజన్ కమాండర్ హల్దార్, ఏరియా కమిటీ సభ్యుడు రామేగా గుర్తించారు. హల్దార్‌పై రూ.8 లక్షలు, రామేపై రూ.5 లక్షల నగదు రివార్డులు ఉన్నాయి.

నాసిక్‌లో దర్గా కూల్చివేతలో ఉద్రిక్తత

- 21 మంది పోలీసులకు గాయాలు
- 4 పోలీసు వాహనాలు ధ్వంసం.. 22 మంది అరెస్టు

నాసిక్: మహారాష్ట్రలోని నాసిక్ నగరంలో దర్గా కూల్చివేత ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం రాత్రి కూల్చివేత సందర్భంగా అల్లరిమూకలు జరిపిన దాడిలో 21 మంది పోలీసులు గాయపడ్డారు. నాలుగు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ఈ హింసాకాండకు సంబంధించి ఇప్పటి వరకు 22 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. నాసిక్ మునిసిపల్ కార్పొరేషన్ ఈ కూల్చివేత ఆపరేషన్ చేపట్టింది. 40 మంది సిబ్బందితో కూడిన ఈ బృందం.. నాలుగు జేసీబీలు, ఎనిమిది డంపర్లు, ఏడు వాహనాలతో వచ్చింది. దీనిపై స్థానికంగా నిరసన మొదలైంది. దర్గా ధర్మకర్తవారిని శాంతింపజేసేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి చేజారిపోయింది. కొందరు పోలీసులు, పౌరులపై రాళ్లు రువ్వడం ప్రారంభించారు. రాళ్లదాడిలో తొలుత ముగ్గురు పోలీసులు గాయపడగా, ఆ తర్వాత ఆ సంఖ్య 21కి చేరింది. ఈ దాడిలో పలు పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఫిబ్రవరిలో దర్గా సమీపంలోని పలు అక్రమ కట్టడాలను ఎన్ఎంసీ తొలగించింది.

వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఎయిర్ హోస్టెస్‌పై అత్యాచారం

గురుగ్రామ్‌లో ఆసుపత్రి సిబ్బంది ఘాతుకం

న్యూఢిల్లీ: గురుగ్రామ్‌లో దారుణం చోటుచేసుకుంది. అస్వస్థతకు గురై వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఎయిర్ హోస్టెస్‌పై ఆసుపత్రి సిబ్బంది అత్యాచారానికి పాల్పడ్డారు. 46 ఏళ్ల ఎయిర్ హోస్టెస్ ఎయిర్‌లైన్ శిక్షణ కోసం ఇటీవల గురుగ్రామ్‌కు చేరుకుంది. ఓ హోటల్‌లో బస చేసింది. అస్వస్థతకు గురి కావడంతో సిబ్బంది సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అనంతరం ఆరోగ్యం క్షీణిస్తుండడంతో మెరుగైన చికిత్స కోసం ఈ నెల 6వ తేదీ మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స ప్రారంభించారు. అయితే, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు తనపై అత్యాచారం జరిగినట్లు బాధితురాలు గుర్తించారు. ఈ నెల 13న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. తనపై అత్యాచారం జరిగిన విషయాన్ని భర్తకు తెలియజేశారు. తొలుత 112 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. తర్వాత తమ లాయర్ సహాయంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందించారు. పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆసుపత్రి సిబ్బందిని విచారిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

అశోకుడు శ్రీనగర్ పట్టణ నిర్మాత అని తెలిపే గ్రంథం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర



మాదిరి ప్రశ్నలు

1. అశోకుడి ఎన్నో పాలనా సంవత్సరంలో కళింగ యుద్ధం జరిగింది?
   1) 1వ 2) 2వ
   3) 8వ 4) 13వ
2. అశోకుడి శాసనాల్లో ఉపయోగించని లిపి?
   1) ఆరామిక్ 2) ఖరోష్టి
   3) బ్రాహ్మి 4) సంస్కృతం
3. అశోకుడు శ్రీనగర్ పట్టణ నిర్మాత అని తెలిపే గ్రంథం?
   1) రాజతరంగిణి 2) పరిశిష్ట పర్వన్
   3) అశోకవదన 4) దివ్యవదన
4. అశోకుడి శాసనాలు.. ఎవరి శాసనాలను పోలి ఉన్నాయి?
   1) ఆంటియోకస్-2 2) టాలమీ-2
   3) మాగాస్ 4) డేరియస్
5. మౌర్యుల కాలంలో శిస్తు వసూలుకు అధిపతి?
   1) సమాహర్త 2) సన్నిధాత
   3) రూపదర్శక 4) కరణిక
6. ఏ సమయంలోనైనా తనను కలిసేందుకు ఏ అధికారులకు అశోకుడు అనుమతినిచ్చాడు?
   1) రజ్జుకలు 2) యుక్తలు
   3) పతివేదకులు
   4) ధమ్మ మహామాత్రులు
7. సుదర్శన తటాకాన్ని నిర్మించినవారు?
   1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
   3) రుద్రదమన 4) ఆర్యాతుషస్ప
8. మౌర్యుల కాలంలో విష్టి అంటే..?
   1) ఒక రాష్ట్రం 2) ఒక జిల్లా
   3) బలవంతపు శ్రమ 4) ఒక నాణెం
9. పన్నుల వ్యవస్థను ప్రస్తావించిన అశోకుని శాసనం?
   1) రుమ్మిందై శాసనం
   2) నిగాలిసాగర్ శాసనం
   3) కాందహార్ శాసనం
   4) బారాబర్ శాసనం
10. మౌర్యుల కాలంలో గొప్ప విద్యాకేంద్రం?
    1) తక్షశిల 2) ఉజ్జయినీ
    3) నలంద 4) వల్లభి
11. రాణి శాసనంలో పేర్కొన్న అశోకుడి రాణి ఎవరు?
    1) విదీష మహాదేవి 2) అసంధిమిత్ర
    3) కారువాకి 4) తిస్యరక్షిత
12. మౌర్యుల ఆస్థానానికి రాయబారిగా రానివారు?
    1) మెగస్తనీస్ 2) డైమాకస్
    3) డైనోసియస్ 4) పాట్రోకిల్స్
13. మెగస్తనీస్ ప్రకారం.. మౌర్యుల కాలంలో సమాజాన్ని ఎన్ని వర్గాలుగా విభజించారు?
    1) రెండు 2) నాలుగు
    3) ఆరు 4) ఏడు
14. 'ఒకే చక్రంతో బండి ఏ విధంగా నడవలేదో పరిపాలన కూడా ఒకే వ్యక్తి ద్వారా నడవలేదు' అని వ్యాఖ్యానించినవారు?
    1) మెగస్తనీస్ 2) కౌటిల్యుడు
    3) చంద్రగుప్తుడు 4) వి.ఎ. స్మిత్
15. అశోకుడు ధమ్మ ప్రచారానికి చేపట్టిన చర్యల్లో లేనిది?
    1) ధమ్మ గురించి తెలుపుతూ శిలా శాసనాలు, స్తంభ శాసనాల జారీ
    2) ధమ్మ మహామాత్రల నియామకం
    3) స్వీయ ధమ్మ యాత్రలు చేయడం
    4) ధమ్మ ఉల్లంఘనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడం
16. అశోకుడు ఏటా తన పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా మానవతా దృక్పథంతో కొంత మంది ఖైదీలను విడుదలచేసేవారని తెలిపే శాసనం?
    1) 5వ స్తంభ శాసనం
    2) మొదటి శిలాశాసనం
    3) 13వ శిలాశాసనం
    4) 4వ స్తంభ శాసనం
17. భారతదేశంలో తొలిసారిగా నౌకాదళాన్ని ఏర్పాటు చేసిన పాలకులు?
    1) నందరాజులు 2) మౌర్యులు
    3) కుషాణులు 4) గుప్తులు
18. మౌర్యుల కాలంలో ఎంత శాతం భూమిశిస్తు (భాగ)గా వసూలు చేశారు?
    1) 1/8 2) 1/6 - 1/4
    3) 1/3 4) 1/2
19. మౌర్యులు గయ వద్ద నిర్మించిన గుహల్లో అతి పెద్దది?
    1) కర్ణచౌపార గుహ 2) సుధాముని గుహ
    3) లోమస రుషి గుహ
    4) గోపికా గుహ
20. సముద్రగుప్తుడి అలహాబాద్ ప్రశస్తిపై ఏయే రాజుల శాసనాలు ఉన్నాయి?
    1) అశోకుడు, జహంగీర్
    2) అశోకుడు, కనిష్కుడు
    3) జహంగీర్, ఫిరోజ్ షా తుగ్లక్
    4) అశోకుడు, అక్బర్
21. అశోకుడిలానే 'దేవానాం ప్రియ' అనే బిరుదు ధరించిన మౌర్యచక్రవర్తి ఎవరు?
    1) సంప్రతి 2) బిందుసారుడు
    3) దశరథుడు 4) బృహద్రధుడు
22. అశోకుడి సామ్రాజ్యంలో లేని ప్రాంతం?
    1) కేరళ 2) తమిళనాడు
    3) కాశ్మీర్ 4) 1, 2
23. అశోకుడు తన పొరుగు రాజులుగా కింది వారిలో ఎవరిని పేర్కొన్నాడు?
    1) చోళులు, పాండ్యులు
    2) సత్య పుత్రులు
    3) కేరళ పుత్రులు 4) పైవారందరూ
24. కౌటిల్యుడు పేర్కొన్న సప్తాంగాల్లో లేనిది?
    1) స్వామి 2) కోశ
    3) ప్రదేశ 4) దండ
25. గ్రీకు రాజ్యాల్లో అశోకుడి సమకాలీనులు కాని వారు?
    1) ఆంటియోకస్ 2) మాగాస్
    3) జేక్సెస్ 4) టాలమీ ఫిలడెల్ఫస్
26. ఎడమ నుంచి కుడికి, కుడి నుంచి ఎడమకి రాసిన అశోకుడి శిలా శాసనం ఏది?
    1) ఎర్రగుడి సూక్ష్మ శిలాశాసనం
    2) లంపక శిలాశాసనం
    3) షాబాజ్‌గరి శిలాశాసనం
    4) మాన్‌షేరా శిలాశాసనం
27. మౌర్య ప్రభుత్వ గుత్తాధిపత్యం లేని అంశం?
    1) అడవులు 2) గనులు
    3) రేవులు 4) జూద గృహాలు
28. మౌర్యుల పాలనా భాష?
    1) సంస్కృతం 2) ప్రాకృతం
    3) ఖరోష్టి 4) అర్ధమాగధి
29. కిందివాటిలో మౌర్యుల రాగి నాణెం ఏది?
    1) పణం 2) సువర్ణం
    3) నిష్క 4) మషాక
30. జాతీయ పాలకుడిగా పేరొందిన తొలి భారతీయ రాజు?
    1) చంద్రగుప్త మౌర్య 2) అశోకుడు
    3) సముద్రగుప్తుడు 4) అక్బర్
31. అలెగ్జాండర్ తర్వాత భారతదేశ లోపలి ప్రాంతాలపై దండయాత్ర చేసిన గ్రీకు రాజు?
    1) యూథిడియస్ 2) యూకట్రైడస్
    3) డెమిట్రియస్ 4) మినాండర్
32. మహేశ్వర అనే బిరుదును ధరించిన విదేశీ రాజు?
    1) కుజుల కాడ్‌ఫైసెస్
    2) ఆంటియాల్ సిడాస్
    3) విమా కాడ్‌ఫైసెస్
    4) హెలియో డోరస్
33. వీమా కాడ్‌ఫైసెస్ ఆదరించిన శైవమత శాఖ?
    1) పాశుపతం 2) కాపాలికం
    3) కాలాముఖం 4) అఘోర శైవం
34. పాంచావొ అనే చైనా సేనాని చేతిలో ఓడిన కుషాణ చక్రవర్తి?
    1) కుజుల కాడ్‌ఫైసెస్
    2) కనిష్కుడు 3) వీమా కాడ్‌ఫైసెస్
    4) హువిష్కుడు
35. కనిష్కుడు ఎవరి సలహాపై కుండల వనంలో నాలుగో బౌద్ధ సంగీతి నిర్వహించాడు?
    1) వసుమిత్రుడు 2) అశ్వఘోషుడు
    3) శీలభద్రుడు 4) పార్శ్వ
36. శివుడు, నంది గుర్తు కలిగిన నాణేలను జారీ చేసిన కుషాణ చక్రవర్తి?
    1) హువిష్కుడు 2) వాసుదేవుడు
    3) రెండో కనిష్కుడు 4) వశిష్కుడు
37. ఎవరి పాలనా కాలంలో కశ్యపమాతంగ చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టారు?
    1) మౌర్యులు 2) శుంగులు
    3) శకులు 4) కుషాణులు
38. హుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
    1) బ్రాహ్మణ 2) క్షత్రియ
    3) వైశ్య 4) శూద్ర
39. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
    1) నరవర్ధన 2) ఆదిత్యవర్ధన
    3) ప్రభాకరవర్ధన 4) హర్షవర్ధన
40. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
    1) రెండో ధ్రువసేనుడు
    2) రెండో ప్రవరసేనుడు
    3) మూడో ధ్రువసేనుడు
    4) మూడో ప్రవరసేనుడు
41. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
    1) దండి 2) భండి
    3) వ్యాఘ్రకేతు 4) నిగ్రహత
42. సకలోత్తరపథేశ్వర అనే బిరుదు ఉన్న రాజు ఎవరు?
    1) గ్రహవర్మ 2) శశాంక
    3) హర్ష 4) భాస్కరవర్మ
43. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికారులకు భూదానాలు చేసిన రాజవంశం?
    1) శాతవాహనులు 2) గుప్తులు
    3) ఇక్ష్వాకులు 4) పుష్యభూతులు
44. ఏ వర్గాన్ని హుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
    1) బ్రాహ్మణులు 2) క్షత్రియులు
    3) వైశ్యులు 4) శూద్రులు
45. బాణుడి ప్రకారం హర్షుడి కాలంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
    1) సతీసహగమనం 2) వరకట్నం
    3) కన్యాశుల్కం
    4) వితంతు వివాహాల నిషేధం
46. హర్షుడు ఆదరించిన మతం?
    1) హిందూ మతం 2) బౌద్ధ మతం
    3) జైన మతం 4) వైష్ణవ మతం
47. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
    1) వైష్ణవం 2) బౌద్ధం
    3) శైవం 4) జైనం
48. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
    1) సముద్రగుప్తుడు
    2) హర్షవర్ధనుడు
    3) రెండో చంద్రగుప్తుడు
    4) యశోధర్ముడు
49. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరించిన రాజు?
    1) రెండో పులకేశి
    2) మొదటి మహేంద్రవర్మ
    3) హర్షుడు 4) రెండో నరసింహవర్మ
50. రెండో పులకేశి ఏ యుద్ధంలో మొదటి మహేంద్రవర్మను అంతం చేశాడు?
    1) పుల్లలూరు యుద్ధం
    2) కొప్పం యుద్ధం
    3) సంగమేశ్వర యుద్ధం
    4) మణిమంగళ యుద్ధం
51. గుజరాత్‌పై అరబ్బుల దాడిని తిప్పికొట్టిన చాళుక్యరాజు?
    1) రెండో పులకేశి
    2) మొదటి విక్రమాదిత్యుడు
    3) రెండో విక్రమాదిత్యుడు
    4) రెండో కీర్తివర్మ
52. రెండో పులకేశి క్రీ.శ.642లో జరిగిన ఏ యుద్ధంలో మొదటి నరసింహవర్మ చేతిలో అంతమయ్యాడు?
    1) మణిమంగళ యుద్ధం
    2) కంచి యుద్ధం
    3) అనిల్‌వారా యుద్ధం
    4) బనవాసి యుద్ధం
53. బాదామీ చాళుక్యుల రాజ చిహ్నం?
    1) వరాహం 2) వృషభం
    3) సింహం 4) పులి
54. ఐహోల్ శాసనాన్ని రచించిన వారు?
    1) హరిసేనుడు 2) రవికీర్తి
    3) మొదటి పులకేశి 4) బాణుడు
55. అవనీసింహ అనే బిరుదున్న పల్లవ రాజు?
    1) సింహవిష్ణు 2) రెండో నరసింహవర్మ
    3) మొదటి మహేంద్రవర్మ
    4) మొదటి పరమేశ్వర వర్మ
56. మహాబలిపురంలోని ఆదివరాహ దేవాలయంలో ఉన్న పల్లవరాజు విగ్రహం ఎవరికి సంబంధించింది?
    1) మొదటి నరసింహవర్మ
    2) రెండో నరసింహవర్మ
    3) సింహవిష్ణు 4) అపరాజిత వర్మ
57. ఏ పల్లవరాజును సైనికుడు, పాలనాదక్షుడు, మత సంస్కర్త, భవన నిర్మాత, కవి, సంగీతకారుడు అని పిలిచేవారు?
    1) రెండో నరసింహవర్మ
    2) మొదటి మహేంద్రవర్మ
    3) రెండో పరమేశ్వరవర్మ
    4) రెండో నందివర్మ

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 4	5) 1
6) 3	7) 1	8) 3	9) 1	10) 1
11) 3	12) 4	13) 4	14) 2	15) 4
16) 1	17) 2	18) 2	19) 4	20) 1
21) 3	22) 4	23) 4	24) 4	25) 3
26) 1	27) 4	28) 2	29) 4	30) 1
31) 3	32) 3	33) 1	34) 2	35) 4
36) 2	37) 4	38) 3	39) 4	40) 1
41) 2	42) 3	43) 4	44) 4	45) 2
46) 2	47) 3	48) 4	49) 3	50) 1
51) 3	52) 1	53) 1	54) 2	55) 1
56) 3	57) 2			

'మ-స-జ-స-త-త-గ' గణాలున్న పద్య పాదం?

వ్యాకరణం - ఛందస్సు

డీసెట్ తెలుగులో ఛందస్సు ప్రధానమైంది. విద్యార్థులు పద్య లక్షణాలు, గణాలు వంటివాటిపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

వృత్తాల్లో ఉత్పలమాల, చంపకమాల, శార్దూలం, మత్తేభం ముఖ్యమైనవి. జాతుల్లో కందం, ద్విపద లక్షణాలు తెలుసుకోవాలి. ఉపజాతుల్లో సీసం, తేటగీతి, ఆటవెలది మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. గణాల్లో సూర్యగణాలు, ఇంద్ర గణాలపై అవగాహన ఉండాలి. డీసెట్‌లో ప్రధానంగా పద్యాల గణాలిచ్చి ఏ పద్యపాదమో గుర్తించాలని, పద్యపాదాన్ని ఇచ్చి ఏ పద్య పాదమో తెలపాలని అడుగుతారు. అలాగే సూర్య గణాలు, ఇంద్ర గణాలు కూడా కనుక్కోవాలని ప్రశ్నలు ఇస్తారు.

సూర్య గణాలు: రెండు
1) నగణం (| | |)
2) గలము లేక హగణం (∪ |)

ఇంద్ర గణాలు: ఆరు.
భ-ర-త-నల-నగ-సల

వృత్త పద్యాలు

వృత్త పద్యాల్లో అక్షర సంఖ్యా నియమం, గణ సంఖ్యా నియమం ఉంటుంది. వీటిలో యతి, ప్రాస నియమాలు విధిగా ఉంటాయి.

1. **ఉత్పలమాల:** ప్రతి పద్య పాదంలో 'భ, ర, న, భ, భ, ర, వ' అనే గణాలుంటాయి. ప్రతి పద్య పాదంలో మొదటి అక్షరానికి పదో అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి ఇరవై అక్షరాలు ఉంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
ఎక్కడి మంత్రతం త్రముల నె క్క డి
∪| | ∪|∪ | | |∪| |
భ ర న భ
చక్రము లేడపా చికల్
∪| | ∪|∪ |∪
భ ర వ

భ-ర-న-భ-భ-ర-వ గణాలున్నాయి. 1-10 అక్షరాలకు యతిమైత్రి చెల్లింది.

2. **చంపకమాల:** ప్రతి పద్య పాదంలో 'న-జ-భ-జ-జ-జ-ర' అనే గణాలుంటాయి. ప్రతి పాదంలో 1-11 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి 21 అక్షరాలు ఉంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
అనయ ముదోష మేపరు లయందు
| | | |∪| ∪| | |∪ |
న జ భ జ
కనుంగొ నిపల్కు నట్టియా
|∪| |∪| ∪|∪
జ జ ర

న-జ-భ-జ-జ-జ-ర అనే గణాలున్నా యి. 1-11 అక్షరాలకు యతిమైత్రి చెల్లింది.

3. **శార్దూలం:** ప్రతి పద్య పాదంలో 'మ-స -జ-స-త-త-గ' అనే గణాలుంటాయి. మొదటి అక్షరానికి 13వ అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి 19 అక్షరాలుంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
ఇల్లాలిం టి కి దీ పమౌన న గ హీ
∪∪∪ | |∪ |∪| | |∪
మ స జ స
హీయంచు మందుల్ జమ్
∪∪ | ∪∪| ∪
త త గ

మ-స-జ-స-త-త-గ అనే గణాలు వచ్చాయి. 1-13వ అక్షరాలకు యతిమైత్రి చెల్లింది. పాదం మొత్తానికి 19 అక్షరాలున్నాయి.

4. **మత్తేభం:** ప్రతి పద్య పాదంలో 'స-భ-ర- న-మ- య-వ' అనే గణాలుంటాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది. పాదం మొత్తానికి 20 అక్షరాలుంటాయి. ప్రాస నియమం ఉంటుంది.

ఉదాహరణ:
తనదే శంబుస్వ భాషనై జమత
| |∪ ∪| | ∪|∪| | |
స భ ర న
మున్‌అస్మ త్సదాచా రముల్
∪∪∪ |∪∪ |∪
మ య వ

స-భ-ర-న-మ-య-వ అనే గణాలు వచ్చాయి. 1-14 అక్షరాలకు యతిమైత్రి చెల్లింది. పాదం మొత్తానికి 20 అక్షరాలు ఉన్నాయి. ఇది మత్తేభం.

జాతులు

జాతుల్లో డీసెట్ విద్యార్థులకు కందం, ద్విపద ముఖ్యమైనవి.

1. **కంద పద్యం:** 'భ-జ-స-నలి-గగ' అనే గణాలుంటాయి. 1, 3 పాదాల్లో మూడు గణాలు ఉంటాయి. 2, 4 పాదాల్లో ఐదు గణాలుంటాయి. 2, 4 పాదాల్లో మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. బేసి గణాల్లో 'జగణం' ఉండరాదు.

రెండో పాదంలో మూడో గణంతో నాలుగో పాదంలో మూడో గణంతో జగణంగానీ, నలం గానీ ఉండాలి. రెండు, నాలుగు పాదాల్లో చివరి అక్షరం గురువు ఉండాలి. ప్రాస నియమం ఉంటుంది. ప్రాస పూర్వాక్షరం మొదటి పాదంలో గురువైతే పాదాలన్నింటిలో గురువు ఉండాలి. లఘువైతే లఘువులే ఉండాలి. పద్యం పరిమాణంలో చిన్నదైనా, నియమాలు ఎక్కువగా ఉన్న పద్యం కందం. అందుకే 'కందం రాసినవాడే కవి' అనే సూక్తి వాడుకలో ఉంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

ఉదాహరణ:
ఆ ప ర మపురం ధ్రులయం
∪| | | |∪ | |∪
భ జ స
దేపు ణ్యాంగన యుభిక్ష యిడద య్యెంగుటా
∪∪ ∪ | | |∪| | |∪ | |∪
గగ భ జ స స

భ-జ-స-గగ అనే గణాలు వచ్చాయి. రెండో పాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లింది. నియామలన్నీ ఉన్నందుకు ఇది కంద పద్యం.

2. **ద్విపద:** ద్విపదలో రెండు పాదాలు ఉంటాయి. ప్రతి పాదంలో 3 ఇంద్ర గణాలు మిగతా ఒకటి సూర్య గణం ఉంటుంది. ప్రతి పాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి మూడో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమంలేని ద్విపదను మంజరీ ద్విపద అంటారు.

ఉదాహరణ:
మకరతో రణములు మణితోర ణములు
| | |∪ | | | | | |∪| | | |
నగ నల సల న
ముకురతో రణములు మునుఁగట్ట బనిచి
| | |∪| | | | | |∪| | | |
నగ నల సల న

ప్రతి పాదంలో 3 ఇంద్ర గణాలు, 1 సూర్యగణం వచ్చింది. మొదటి గణం మొదటి అక్షరానికి 3వ గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లింది. ప్రాస నియమం ఉంది.

ఉపజాతులు

దేశీయమైన ఛందోరీతులు ఉపజాతులు. ఇవి మాత్రా గణాలతో ఏర్పడతాయి. వీటిలో యతికి బదులు ప్రాసయతి చెల్లుతుంది. ప్రాస నియమం ఉండదు. తేటగీతి, ఆటవెలది, సీసం ముఖ్యమైనవి.

1. **తేటగీతి:** ప్రతి పద్య పాదంలో మొదట ఒక సూర్య గణం, తర్వాత 2 ఇంద్ర గణాలు, తర్వాత 2 సూర్య గణాలు ఉంటాయి. ప్రతిపాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం లేదు. ప్రాసయతి చెల్లుతుంది.

ఉదాహరణ:
దమము శమముకూ డనిజప తపము లేల?
| | | | | |∪ | | | | | | | ∪|
న నగ నల న హ

మొదట ఒక సూర్య గణం, తర్వాత 2 ఇంద్రగణాలు, తర్వాత 2 సూర్య గణాలు వచ్చాయి. మొదటి గణం మొదటి అక్షరం 'ద' నాలుగో గణం మొదటి అక్షరం 'త'కు యతిమైత్రి చెల్లింది. కాబట్టి ఇది తేటగీతి పద్యం.

2. **ఆటవెలది:** 1, 3 పాదాల్లో మొదటి 3 సూర్యగణాలు, తర్వాత 2 ఇంద్రగణాలు ఉంటాయి. 2, 4 పాదాల్లో అయిదు సూర్య గణాలు ఉంటాయి. ప్రతి పాదంలో మొదటిగణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం లేదు ప్రాసయతి చెల్లుతుంది.

ఉదాహరణ:
పగయ కలిగె నేని బాముస్న యింటిలో
| | | | | | ∪| ∪∪ | ∪|∪
న న హ త ర
నున్న యట్ల కాక యూఱ డిల్లి
∪ |∪| ∪| ∪ | ∪|
హ హ హ హ హ

పై పాదాల్లో మొదటి పాదంలో 3 సూర్య గణాలు, తర్వాత 2 ఇంద్ర గణాలు వచ్చాయి. రెండో పాదంలో మొత్తం 5 సూర్యగణాలు వచ్చాయి. మొదటి గణం మొదటి అక్షరానికి నాలుగో గణం మొదటి అక్షరానికి యతిమైత్రి. కాబట్టి ఇది ఆటవెలది.

3. **సీస పద్యం:** సీస పద్యంలో ప్రతిపాదానికి మొదట 6 ఇంద్ర గణాలు, తర్వాత 2 సూర్య గణాలు ఉంటాయి. రచన సౌలభ్యం కోసం ప్రతి పాదాన్ని 4 ఇంద్ర గణాల వరకు పూర్వ పాదంగా, మిగిలిన 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలను ఉత్తర పాదంగా విభజించి రాస్తారు. నాలుగు పాదాల తర్వాత తేటగీతిగానీ, ఆటవెలది గానీ అనుబంధంగా ఉంటుంది. ప్రతి పాదంలో మొదటి గణం మొదటి అక్షరానికి (పూర్వ పాదంలో), మూడో గణం మొదటి అక్షరానికి (పూర్వ పాదంలో), అయిదో గణం మొదటి అక్షరానికి, ఏడో గణం మొదటి అక్షరానికి (ఉత్తర పాదంలో) యతిమైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం లేదు. ప్రాసయతి చెల్లుతుంది.

ఉదాహరణ:
గుణమింత కుదరక గుళ్లతి రుగుటేల?
| |∪| | | | | ∪| | | |∪|
సల నల భ సల
సంస్కార మబ్బని చదువు లేల?
∪∪ | ∪| | | | | ∪|
త భ న హ

పూర్వ పాదంలో 4 ఇంద్ర గణాలు, ఉత్తర పాదంలో 2 ఇంద్ర గణాలు, 2 సూర్య గణాలు వచ్చాయి. మొదటి గణం మొదటి అక్షరం 'గు'తో మూడో గణం మొదటి అక్షరం 'గు'తో యతిమైత్రి చెల్లింది. 5వ గణం మొదటి అక్షరం 'సం' 7వ గణం మొదటి అక్షరం 'చ'తో యతిమైత్రి చెల్లింది. కాబట్టి ఇది సీస పద్యం.

మాదిరి ప్రశ్నలు

1. 'కామన శాంతిఁబొందుటయు కర్జము దానది యట్లలుండెశ్రీ'- ఈ పాదంలో ఉన్న ఛందస్సు ఏది?
   1) చంపకమాల 2) ఉత్పలమాల
   3) శార్దూలం 4) మత్తేభం
2. 'పగయడగించు టింతయు శుభంబదిలెస్స యదంగుసేపగం' ఇది ఏ పద్య పాదం?
   1) శార్దూలం 2) తేటగీతి
   3) చంపకమాల 4) మత్తేభం
3. 'మ-స-జ-స-త-త-గ' గణాలున్న పద్య పాదం?
   1) ఉత్పలమాల 2) మధ్యాక్కర
   3) చంపకమాల 4) శార్దూలం
4. 'బ్రోచిన దొరనింద సేయబోకుము కార్యా' ఇది ఏ పద్య పాదమో గుర్తించండి?
   1) ద్విపద 2) తేటగీతి
   3) కందం 4) ఆటవెలది
5. వీటిలో సూర్య గణం ఏది?
   1) గగము 2) గలము
   3) లగము 4) సగణం
6. 13వ అక్షరం యతిమైత్రిగా ఉండే పద్యం?
   1) ఉత్పలమాల 2) మత్తేభం
   3) శార్దూలం 4) చంపకమాల
7. 'రంగదరాతి భంగ, ఖగరాజతురంగ, విపత్పరంపరో' పద్య పాదంలో గణాలు గుర్తించండి?
   1) మ-స-జ-స-త-త-గ
   2) భ-ర-న-భ-భ-ర-వ
   3) న-జ-భ-జ-జ-జ-ర
   4) స-భ-ర-న-మ-య-వ
8. వీటిలో ఇంద్ర గణం కానిది?
   1) భ 2) సల 3) జ 4) నగ
9. 'స్నానంబుల్ నదులందు జేయుట గజ స్నానంబు చందంబుగన్' ఈ పద్య పాదంలో యతి మైత్రి?
   1) జ 2) స్నా
   3) జే 4) చం
10. కింది వాటిలో ప్రాస నియమం లేని పద్యం?
    1) కందం 2) ద్విపద
    3) తేటగీతి 4) మత్తేభం
11. 'పవి పుష్పంబగు నగ్నిమందగునకు పారం బు భూమీ స్థలం'- ఏ పద్య పాదమో గుర్తించండి?
    1) మత్తేభం 2) మధ్యాక్కర
    3) శార్దూలం 4) చంపకమాల
12. 'నిద్రింపుము వెలువనేల నీకిటననినన్' ఇది ఏ పద్యం?
    1) ద్విపద 2) తేటగీతి
    3) కందం 4) సీసం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 2; 6) 3; 7) 2; 8) 3; 9) 2; 10) 3; 11) 1; 12) 3.

తెలంగాణ విధాన సభ, విధాన పరిషత్ సభ్యుల సంఖ్య?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

1. భారతదేశంలో మొదటి భాషాప్రయుక్త రాష్ట్రం ఏది?
ఎ) ఆంధ్రరాష్ట్రం బి) తమిళనాడు
సి) పంజాబ్ డి) గుజరాత్
2. శ్రీబాగ్ ఒప్పందం ఎవరి మధ్య కుదిరింది?
ఎ) ఆంధ్ర-తెలంగాణ నాయకులు
బి) రాయలసీమ-ఆంధ్ర నాయకులు
సి) ఆంధ్ర-మద్రాస్ రాష్ట్ర నాయకులు
డి) పైవారందరి మధ్య
3. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కమిటీ అనేది రాజ్యాంగ పరిషత్ ఉప సంఘం. దీని అధ్యక్షుడిగా ఎవరు పనిచేశారు?
ఎ) ధార్ బి) హెచ్.సి.ముఖర్జీ
సి) నెహ్రూ, పటేల్, రాజేంద్రప్రసాద్
డి) ఫజల్ అలీ
4. రాష్ట్రాల సరిహద్దులను మార్పు చేసే అధికారం పార్లమెంట్‌కు ఏ విధంగా ఉంది?
ఎ) రాష్ట్రాల విన్నపం మేరకు
బి) విదేశీ దురాక్రమణ కారణంగా
సి) రాష్ట్రాల సమ్మతి లేకుండానే
డి) రాష్ట్రాల సమ్మతితో
5. కింద ఇచ్చిన వారిలో పెద్దమనుషుల ఒప్పందంలో పాల్గొనని తెలంగాణ నాయకుడు?
ఎ) మర్రి చెన్నారెడ్డి
బి) పి.వి.నరసింహారావు
సి) జె.వి.నరసింగరావు
డి) కె. వెంకట రంగారెడ్డి
6. ఆంధ్ర, తెలంగాణ నాయకుల మధ్య పెద్దమనుషుల ఒప్పందం ఎప్పుడు కుదిరింది?
ఎ) ఫిబ్రవరి-1955 బి) ఫిబ్రవరి-1956
సి) మార్చి-1955 డి) నవంబర్-1956
7. నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో స్థానిక పాలన (పంచాయతీరాజ్) మంత్రిగా పని చేసి తర్వాత ముఖ్యమంత్రి అయినవారు?
ఎ) పి.వి.నరసింహారావు
బి) బూర్గుల రామకృష్ణరావు
సి) కాసు బ్రహ్మానందరెడ్డి
డి) జలగం వెంగళరావు
8. కింది వాటిలో సరైంది?
ఎ) అక్టోబర్ 1, 1953న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది
బి) ఆంధ్ర రాష్ట్ర శాసన సభ మొదటి స్పీకర్ - వెంకట్రామయ్య
సి) ఆంధ్ర రాష్ట్ర రాజధాని-కర్నూలు
డి) పైవన్నీ
9. ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి?
ఎ) బెజవాడ గోపాల్ రెడ్డి
బి) కె.వి.రంగారెడ్డి
సి) నీలం సంజీవరెడ్డి
డి) టంగుటూరి ప్రకాశం పంతులు
10. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలి ముఖ్యమంత్రి ఎవరు?



ఎ) మర్రి చెన్నారెడ్డి బి) పి.వి.నరసింహారావు
సి) జలగం వెంగళరావు డి) టంగుటూరి అంజయ్య
11. పూర్తికాలం ముఖ్యమంత్రిగా పని చేసిన ఏకైక తెలంగాణ వ్యక్తి ఎవరు?
ఎ) పి.వి.నరసింహారావు బి) మర్రి చెన్నారెడ్డి
సి) టి.అంజయ్య డి) జలగం వెంగళరావు
12. కింది వారిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పని చేయని వారు?
ఎ) కె.వి.రంగారెడ్డి బి) జె.వి.నరసింహారావు
సి) కొనేరు రంగారావు డి) మర్రి చెన్నారెడ్డి
13. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి హోంశాఖ మంత్రి ఎవరు?
ఎ) బెజవాడ గోపాల్‌రెడ్డి బి) కె.వి.రంగారెడ్డి
సి) కళా వెంకట్రావ్ డి) కల్లూరి సుబ్బారావు
14. హైదరాబాద్ రాష్ట్ర ఏకైక స్పీకర్?
ఎ) కాశీనాథరావు వైద్య బి) సాలార్ జంగ్
సి) మాడపాటి హనుమంతరావు
డి) పై ఎవరు కాదు
15. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ ఎవరి మంత్రివర్గం నుంచి తప్పుకున్నారు?
ఎ) నీలం సంజీవరెడ్డి
బి) కాసు బ్రహ్మానందరెడ్డి
సి) దామోదరం సంజీవయ్య
డి) పి.వి.నరసింహారావు
16. కింది వాటిలో సరికాని జత?
ఎ) ప్రాథమిక హక్కులు - అమెరికా
బి) సమాఖ్య ప్రభుత్వం - బ్రిటన్
సి) కాగ్ వ్యవస్థ - బ్రిటన్
డి) ఆదేశిక సూత్రాలు - ఐర్లాండ్
17. తెలంగాణలో నిర్మితమైన మొదటి రైలు మార్గం?
ఎ) సికింద్రాబాద్ - వాడి
బి) సికింద్రాబాద్ - గుల్బర్గా
సి) కాచిగూడ - మహబూబ్‌నగర్
డి) కాచిగూడ - వరంగల్
18. సింగరేణి కాలరీస్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1921 బి) 1890
సి) 1937 డి) 1943
19. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' గ్రంథ రచయిత?
ఎ) మాడపాటి హన్మంతరావు
బి) బూర్గుల రామకృష్ణారావు
సి) సురవరం ప్రతాపరెడ్డి
డి) రావి నారాయణరెడ్డి
20. తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధి కోసం ఆంధ్ర సారస్వత పరిషత్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1923 బి) 1943
సి) 1947 డి) ఏదీకాదు
21. ముస్లిములను ఏకం చేసి వారి అభివృద్ధికి కృషి చేసేందుకు 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్'ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1927 బి) 1944
సి) 1952 డి) 1957
22. తెలంగాణ ప్రాంతంలో దళిత ఉద్యమాలకు ఆద్యుడు?
ఎ) భాగ్యరెడ్డి వర్మ బి) అరిగె రామస్వామి
సి) బి.యస్.వెంకట్రావ్ డి) సంగం లక్ష్మీబాయి
23. నిజాం ప్రభుత్వంపై సర్దార్ పటేల్ చొరవతో భారత సైన్యం జరిపిన సైనిక చర్య?
ఎ) ఆపరేషన్ పోలో బి) ఆపరేషన్ బ్లూస్టార్
సి) ఆపరేషన్ పీస్ డి) ఆపరేషన్ డిజాస్టర్
24. హైదరాబాద్ రాష్ట్ర ఆవిర్భావం?
ఎ) 1-10-1953 బి) 17-9-1948
సి) 17-9-1952 డి) 17-9-1949
25. నిజాం ప్రభుత్వంపై జరిపిన 'ఆపరేషన్ పోలో'కు ఎవరు నాయకత్వం వహించారు?
ఎ) జనరల్ కరియప్ప బి) జనరల్ మెనేక్ష
సి) మేజర్ జనరల్ జె.యస్.చౌదరి
డి) ఎవరూ కాదు
26. ప్రభుత్వ ఉద్యోగాలలో హైదరాబాదీలకు ప్రాధాన్యం కల్పిస్తూ 'ముల్కీ' నిబంధనలను ఎప్పుడు ప్రవేశ పెట్టారు?
ఎ) 1910 బి) 1919
సి) 1927 డి) 1952
27. 1953 డిసెంబర్ 22న ఏర్పాటైన రాష్ట్రాల పునర్విభజన కమిటీ అధ్యక్షుడెవరు?
ఎ) జస్టిస్ సర్కారియా
బి) జస్టిస్ ఫజల్ అలీ
సి) జస్టిస్ శ్రీకృష్ణ డి) జస్టిస్ వర్మ
28. 1958లో ఏర్పాటైన తెలంగాణ ప్రాంతీయ కమిటీ మొదటి అధ్యక్షుడు ఎవరు?
ఎ) మొయినుద్దీన్ బి) అచ్యుతరెడ్డి
సి) జగన్నాథరావు డి) హయగ్రీవాచారి
29. తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1999 బి) 2001
సి) 2003 డి) 2006
30. రాజ్యాంగ ప్రవేశికను ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) కెనడా డి) దక్షిణాఫ్రికా
31. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని లోక్‌సభ స్థానాల్లో తెలంగాణ ప్రజా సమితి ఎన్ని స్థానాలను నెగ్గింది?
ఎ) 8 బి) 9 సి) 11 డి) 13
32. ఉమ్మడి రాష్ట్రంలో మొదటిసారిగా రాష్ట్రపతి పాలనను ఎప్పుడు విధించారు?
ఎ) 1969 బి) 1971
సి) 1973 డి) 1975
33. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1973లో ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా ఆరు సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టారు?
ఎ) 29వ సవరణ బి) 30వ సవరణ
సి) 32వ సవరణ డి) 36వ సవరణ
34. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్‌గా ఎవరు వ్యవహరించారు?
ఎ) స్వామిగౌడ్ బి) శ్రీనివాస్‌గౌడ్
సి) ఆచార్య కోదండరామ్
డి) రసమయి బాలకిషన్
35. శ్రీకృష్ణ కమిటీలో సభ్యుడు కానివారు?
ఎ) ప్రొఫెసర్ రవిందర్ కౌర్
బి) ప్రొఫెసర్ వి.కె.దుగ్గల్
సి) ప్రొఫెసర్ రణబీర్ సింగ్
డి) జస్టిస్ వర్మ
36. తెలంగాణ లోక్‌సభ, రాజ్యసభ స్థానాల సంఖ్య?
ఎ) 10,5 బి) 17,7
సి) 15,8 డి) 20,10
37. తెలంగాణ విధాన సభ, విధాన పరిషత్ సభ్యుల సంఖ్య?
ఎ) 130, 50 బి) 120, 45
సి) 119, 40 డి) 119, 50
38. తెలంగాణ లోక్‌సభ స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎన్ని సీట్లు కేటాయించారు?
ఎ) 6, 3 బి) 7, 3
సి) 3, 2 డి) 3, 3
39. తెలంగాణ విధాన సభలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా కేటాయించిన సీట్లెన్ని?
ఎ) 20, 10 బి) 19, 12
సి) 15, 10 డి) 30, 15
40. తెలంగాణ సాధన కోసం హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 10-3-2011 బి) 10-3-2012
సి) 13-4-2011 డి) 2-5-2011
41. రాజ్యాంగం అంటే?
ఎ) ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యనున్న సంబంధాన్ని తెలియజేసే శాసనం
బి) దేశ పరిపాలన విధానానికి మూల శాసనం
సి) రాజ్యాధికారాన్ని నియంత్రించి వ్యక్తి స్వేచ్ఛను కాపాడే శాసనం
డి) పైవన్నీ
42. ఏ చట్టం ద్వారా విద్య అభివృద్ధి కోసం బడ్జెట్‌లో లక్ష రూపాయలు కేటాయించారు?
ఎ) 1773 రెగ్యులేటింగ్ చట్టం
బి) 1813 చార్టర్ చట్టం
సి) 1833 చార్టర్ చట్టం
డి) 1853 చార్టర్ చట్టం
43. ఏ చట్టం ద్వారా బ్రిటన్‌లో భారత వ్యవహారాల కార్యదర్శి పదవిని ఏర్పాటు చేశారు?
ఎ) 1858 విక్టోరియా మహారాణి ప్రకటన
బి) 1861 కౌన్సిల్స్ చట్టం
సి) 1892 కౌన్సిల్స్ చట్టం
డి) 1909 మింటో-మార్లే సంస్కరణల చట్టం
44. 1919 మాంటెంగ్-చేమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టానికి సంబంధించి సరికానిది?
ఎ) ద్వంద పాలన ప్రవేశపెట్టడం
బి) కేంద్రంలో ద్విసభ విధానం ప్రవేశ పెట్టడం
సి) సీఏజీ(కాగ్) వ్యవస్థను ప్రవేశపెట్టడం
డి) అడ్వకేట్ జనరల్ పదవి ఏర్పాటు
45. షెడ్యూల్డ్ కులాలు అనే పదాన్ని తొలిసారిగా ఎక్కడ ఉపయోగించారు?
ఎ) సైమన్ కమిషన్
బి) రౌండ్ టేబుల్ సమావేశాలు
సి) కమ్యూనల్ అవార్డు
డి) పుణే ఒప్పందం
46. కింది వాటిలో ఏ చట్టాన్ని భారత రాజ్యాంగ 'మాగ్నాకార్టా'గా పేర్కొంటారు?
ఎ) 1909 మింటో-మార్లే చట్టం
బి) 1919 మాంటెంగ్-చేమ్స్‌ఫర్డ్ చట్టం
సి) 1935 భారత ప్రభుత్వ చట్టం
డి) పై ఏవీ కాదు
47. రాజ్యాంగ పరిషత్ ఉపాధ్యక్షుడెవరు?
ఎ) వి.టి.కృష్ణమాచారి బి) టి.టి.కృష్ణమాచారి
సి) కె.ఎం.మున్షీ డి) సర్దార్ పటేల్
48. భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన బ్రిటిష్ ప్రధానమంత్రి?
ఎ) విన్సెంట్ చర్చిల్ బి) రాంసీమెక్ డొనాల్డ్
సి) లార్డ్ క్లెమెట్ అట్లీ డి) పై ఎవరూ కారు
49. కింది వాటిలో సరైంది?
ఎ) సలహా సంఘం-సర్దార్ పటేల్
బి) సారథ్య సంఘం - రాజేంద్రప్రసాద్
సి) ప్రణాళిక, విత్త కమిటీ- రాజేంద్రప్రసాద్
డి) పైవన్నీ
50. రాజ్యాంగ పరిషత్‌లో మహిళల తరపున నాయకత్వం వహించినదెవరు?
ఎ) సరోజినీ నాయుడు
బి) దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
సి) విజయలక్ష్మి పండిట్
డి) హంసా మెహతా

సమాధానాలు

1) ఎ;	2) బి;	3) ఎ;	4) సి;	5) బి;
6) బి;	7) సి;	8) డి;	9) డి;	10) బి;
11) డి;	12) డి;	13) ఎ;	14) ఎ;	15) బి;
16) బి;	17) ఎ;	18) ఎ;	19) సి;	20) బి;
21) ఎ;	22) ఎ;	23) ఎ;	24) బి;	25) సి;
26) బి;	27) బి;	28) బి;	29) బి;	30) బి;
31) సి;	32) సి;	33) సి;	34) సి;	35) డి;
36) బి;	37) సి;	38) సి;	39) బి;	40) ఎ;
41) డి;	42) బి;	43) ఎ;	44) డి;	45) ఎ;
46) సి;	47) ఎ;	48) సి;	49) డి;	50) డి.

This level of connectedness has changed..



Bank Exams

GENERAL ENGLISH

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. To curbing the spread of violence, (1)/ authorities brought under curfew (2)/ more areas in the State, (3)/ here three youths were killed. (4)/ No error (5)
2. Not only was the actress over the moon (1)/ as winning an award, (2)/ but was also deeply touched by the support (3)/ she got from the industry. (4)/ No error (5)
3. Hectic schedules can take a toll (1)/ on anybody and (2)/ the solutions to this is (3)/ a quick holiday to some exotic location. (4)/ No error (5)
4. We have hired (1)/ an advertising agency to prepare (2)/ a campaign to encourage (3)/ people votes. (4)/ No error (5)
5. During the training programme (1)/ the new recruits (2)/ will be briefed about how their role (3)/ in the new organization. (4)/ No error (5)

Directions (Q. No. 6 - 10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given in bold in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Sheela unnecessarily **picked up** a quarrel with him and left the party.
1) picking up 2) picked
3) picked on 4) has picked up
5) No correction required
7. Harish has the guts to **rise from** the occasion and come out successfully.
1) in rising from 2) to raise with
3) to rise against 4) to rise to
5) No correction required
8. I need not offer any explanation, my behaviour **is speaking itself**.
1) speaks about itself
2) has been speaking
3) speaks for itself
4) will speak to itself
5) No correction required
9. The equipment is in such poor condition that we have **no alternative** to buy new ones.
1) many alternative like
2) any alternative except
3) no other alternative
4) no alternative but
5) No correction required
10. Since the deadline has been changed from next week to this Wednesday you should **give this work priority**.
1) priority this work
2) prioritized this work
3) not give priority this work
4) be given this work priority
5) No correction required

Directions (Q. No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. With all the bid information being available and tracked online, corruption has considerably reduced.
B. Today, most, i.e. over ninety-five per cent, households, in the city enjoy broadband connection.
C. All city contracts are now bid for online.
D. Over twenty years ago the city government, Central Government and the private sector made a concerted effort to shift the economy to include IT.
E. As our cities do expand and become more complex, such a system will make governance more manageable.
F. This level of connectedness has changed not only the city's economy but also how it is governed and how business is conducted.

11. What is the FOURTH sentence after rearrangement?
1) C 2) B 3) D 4) E 5) F
12. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) E 4) F 5) C
13. What is the LAST sentence after rearrangement?
1) A 2) C 3) B 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
1) B 2) C 3) D 4) E 5) F
15. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Being a successful businessman demands ____ work, honesty, persuasive skills and sound market ____.
1) light; info 2) smart; expo
3) hard; knowledge
4) nice; experience 5) well; skill
17. ____ to the heavy rains many multi-storey office buildings were badly damaged.
1) Because 2) In spite
3) In addition 4) Since
5) Owing
18. A firm that specializes in the ____ of handwriting claims that it can assess more than three hundred personality ____.
1) analyze; charts
2) analysis; traits
3) study; quality
4) scrutiny; value
5) learn; worth
19. A recent research ____ the election board for, first of all, failing to replace ____ voting machines.
1) praise; latter
2) appreciate; former
3) applaud; outnumbered
4) criticized; outmoded
5) gifted; outdated
20. Acid rain and snow result ____ the chemical reactions ____ industrial emissions of sulfur dioxide and nitrogen oxides.
1) for; because 2) off; among
3) with; because
4) since; between
5) from; between

Directions (Q. No. 21-25): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Steven Spielberg's first films ____ (21) made at a time when directors were the most important people in Hollywood. His more recent ones were made at a time when marketing ____ (22) the industry. That he has remained the most powerful filmmaker in the world during both periods says ____ (23) for his talent and his flexibility. No one else has put together a more popular body of work. Yet, within the entertainer there is ____ (24) an artist. When entertainer and artist came fully together, the result was E.T., a remarkable fusion of mass appeal and stylistic mastery. His most important contributions to modern movies came out of his insight that there was an enormous ____ (25) to be created if old-style B-movie stories could be made with A-level craftsmanship. The story lines were the stuff of Saturday serials, but the filmmaking was cutting edge and delivered what films have always promised: something amazing that we hadn't seen before.

21. 1) were 2) was 3) are
4) is 5) been
22. 1) exercise 2) controlled
3) demanded 4) prospered
5) progressed
23. 1) many 2) much
3) something 4) anything
5) all things
24. 1) almost 2) all way
3) most 4) also 5) among
25. 1) mass 2) cult
3) population 4) people
5) audience

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

In recent times, India has grown fast not only compared to its own past but also in comparison with other nations. But there cannot be any room for **complacency** because it is possible for the Indian economy to develop even faster and also to spread the benefits of this growth more widely than has been done thus far. Before going into details of the kinds of micro-structural changes that we need to conceptualize and then proceed to implement it is worthwhile elaborating on the idea of inclusive growth that constitutes the defining concept behind this government's various economic policies and decisions. A nation interested in inclusive growth views the same growth differently depending on whether the gains of the growth are heaped primarily on a small segment or shared widely by the population. The latter is cause for celebration but not the former. In other words, growth must not be treated as an end in itself but as an instrument for spreading prosperity to all. India's own past experience and experience of other nations suggests that growth is necessary for eradicating poverty but it is not sufficient condition. In other words policies for promoting growth need to be **complimented** with policies to ensure that more and more people join in the growth process and, further, that there are mechanisms in place to redistribute some of the gains to those who are unable to partake in the market process and, hence, get left behind.

A simple way of giving this idea of inclusive growth a sharper form is to measure a nation's progress in terms of the progress of its poorest segment, for instance the bottom 20% of the population. One could measure the per capita income of the bottom quintile of the population and also calculate the growth rate of income; and evaluate our economic success in terms of these measures that pertain to the poorest segment. This approach is attractive because it does not ignore growth like some of the older heterodox criteria did. It simply looks at the growth of income of the poorest sections of the population. It also ensures that those who are outside of the bottom quintile do not get ignored, if that were done, then those people would in all likelihood drop down into the bottom quintile and so would automatically become a direct target of our policies. Hence the criterion being suggested here is a statistical summing up of the idea of inclusive growth, which, in turn leads to two corollaries to wish that India must strive to achieve high growth and that we must work to ensure that the weakest segments benefit from the growth.

26. The author's central focus is on
1) Applauding India's economic growth not only against its own past performance, but against other nations
2) Emphasizing the need for economic growth which is the sole determinant of a country's prosperity
3) Emphasizing inclusive growth where gains of growth are shared widely by the population
4) Emphasizing high growth
5) Least bothered about the policies
27. The author suggests policies which will help
1) Develop economic growth
2) Better distribution of incomes irrespective of rate of growth
3) Develop economic growth and redistribute economic gains to those getting left behind
4) Put an emphasis on the development of the poorest segments of society
5) People who are below poverty line
28. According to the author, India's economy has grown but there is no room for complacency as
a) Growth eradicates poverty
b) Growth has resulted in prosperity for all.
Which of the statements given above is/ are correct?
1) a only 2) b only
3) Both a and b 4) Neither a nor b
29. The synonym of **compliment** is
1) Approve 2) Applaud
3) Administer 4) Admonish
5) Adverting
30. The antonym of **complacency**
1) Smugness 2) Satisfaction
3) Contentment 4) Anxiety
5) Gratification

ANSWERS

1) 1;	2) 2;	3) 3;	4) 4;	5) 3;
6) 5;	7) 4;	8) 3;	9) 4;	10) 5;
11) 5;	12) 3;	13) 1;	14) 3;	15) 2;
16) 3;	17) 5;	18) 2;	19) 4;	20) 5;
21) 1;	22) 2;	23) 3;	24) 4;	25) 5;
26) 3;	27) 3;	28) 4;	29) 2;	30) 4.